

# టీచర్లకు మానసిక రుగ్మతలుంటే...

ఎ.ఎస్. నీల్



అనువాదం

**డాక్టర్ సుంకర రామచంద్రరావు**

ఎం.ఎ., పిహెచ్‌డి

# టీచర్లకు
# మానసిక రుగ్మతలుంటే...

## ఎ.ఎస్. నీల్

అనువాదం: డాక్టర్ సుంకర రామచంద్రరావు
ఎం.ఎ; పిహెచ్‌డి

శివరామయ్య పబ్లికేషన్స్, హైదరాబాద్.
ఫోన్: 040-27407878

**THE PROBLEM TEACHER** (English)

**By A.S. Neill**

Translated by:
**Dr. Sunkara Rama Chandra Rao**
e.mail. ramachandraraos@yahoo.com
Mobile: 9866171256

Cover Design:

February 2012

Price: **Rs.75/-**

For Copies
1. S.Rama Chandra Rao
   H.No.2-2-18/30/B,
   F-102, Mithila Apartments
   D.D.Colony, Hyderabad - 500 013.

2. All Leading Book Shops

Composed at: Vasavi Graphics, Nallkunta, Hyd,
Mobile: 9618411148, 8143440047

Printed at:

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | టీచర్ అంటే ఎవరు? | 1 |
| 2. | టీచర్-రాజ్యాంగ యంత్రం | 10 |
| 3. | టీచర్-అతని అహం (Ego) | 22 |
| 4. | టీచర్-స్కూల్ సబ్జెక్ట్స్ | 28 |
| 5. | టీచర్-సైకాలజీ | 34 |
| 6. | టీచర్-సెక్స్ | 41 |
| 7. | టీచర్-అతని ప్రతిష్ఠ | 55 |
| 8. | ఉపాధ్యాయిని | 64 |
| 9. | టీచర్-మతం | 72 |
| 10. | టీచర్-అతని శిక్షణ | 77 |
| 11. | టీచర్-పరీక్షలు | 85 |
| 12. | స్కూల్లో తలలు, తలపులు (Head and Heart in the School) | 92 |
| 13. | టీచర్-సమాజం | 98 |
| 14. | స్వేచ్ఛ-భావి ప్రపంచం | 116 |


# ముందుమాట

విద్య అంటే కొన్ని మాటలు, వాక్యాలు బట్టీ పెట్టడం కాదు. విద్య అంటే అర్హతలు సంపాదించడం కాదు. విద్యకు ఉద్యోగసాధన లక్ష్యం కాదు. విద్య అంటే వీటన్నిటికీ మించినది. నిజానికి విద్య అనేది ఒక బాధ్యత, ఒక కట్టుబాటు, మనుష్యుల్ని తీర్చిదిద్దడం. వీటన్నిటినీ మించి మానవత్వాన్ని, ప్రకృతిని అర్థం చేసుకోడానికి విద్య సహకరిస్తుంది. విద్య అనేది చాలా సున్నితమైన మాట. దీన్ని లోతుగా అర్థం చేసుకోవలసి ఉంటుంది. విద్య అనేది జీవితాంతం నేర్చుకునే ప్రక్రియ.

ప్రాచీన భారత విద్యా వ్యవస్థ వ్యక్తిత్వ నిర్మాణం, విలువలు, నైతిక జీవనం, నిస్వార్థ జీవనాలను ప్రబోధించింది. నిరంతర సామాజిక అభివృద్ధికి దోహదం చేసింది. ఈ క్రమంలో విద్యావేత్తలకు ప్రత్యేక స్థానం కల్పించింది. ఆ రోజుల్లో విద్యావేత్తలు నాలెడ్జ్ వలంటీర్లుగా పనిచేస్తూ సమాజం, ప్రజల అవసరాలు తీర్చడానికి నిరంతరం సిద్ధంగా ఉండేవారు. అటువంటి విద్యావేత్తలు కూడా నిరంతరం విద్యాభ్యాసం చేసేవారు. వారి జీవితమంతా రోజువారీ భోజనంతోపాటు దాతృత్వంపై ఆధారపడి ఉండేవి. వారికి సొంత ఇల్లు కాని ఆస్తులుగాని ఉండేవికావు. విద్యావేత్తల జీవితం కఠినంగా ఉండేది. ప్రతి ఒక్కరూ వారిని ఎంతగానో గౌరవించేవారు. ప్రతి ఒక్కరూ వారికి ఎంతో మర్యాద ఇచ్చేవారు. వారి సముఖంలో గ్రామీణ సమాజపు బాధలన్నీ తీరేవి. సమస్యలు పరిష్కారమయ్యేవి. ఇటువంటి విద్యావేత్తల సముఖంలో ప్రజలు భద్రంగా ఉండేవారు. నిజానికి వారే ప్రాచీన ఋషులు. వారిని సమాజమంతా గౌరవించేది. వారు సమాజానికంతటికీ మార్గదర్శులుగా ఉండేవారు.

కాని ప్రస్తుత సమాజంలో విద్య ధనార్జనకు మరింత ధనార్జనకు సాధనమైంది. ట్యుటోరియల్ కాలేజీలు, కోచింగ్ సెంటర్లు, సంస్థలు, కాలేజీలు, విశ్వ విద్యాలయాలలో పెట్టుబడులు పెట్టి లాభాల పంట పండించుకుంటున్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఈ విషవలయంలో చిక్కుకుంటున్నాడు. ధనార్జనకు జరిగే కృషిలో టీచర్ పనిముట్టుగా మారిపోయాడు. ఈ క్రమంలో సామాజిక వ్యవస్థ ఏర్పాటు చేసుకున్న నియమాలన్నిటినీ గాలికి వదిలేశారు. ఈ పరిస్థితులు మానవ జీవితానికే ఆటంకంగా తయారయ్యాయి.తత్ఫలితంగా భూగోళం అనుకుంటున్నదానికంటే ముందుగానే ధ్వంసమయ్యే పరిస్థితులు దాపురించాయి.

విద్యా ప్రమాణాలు దిగజారుతున్న ప్రస్తుత తరుణంలో ఎ.ఎస్.నీల్ సుదీర్ఘ అనుభవంలో రూపొందించిన విస్తృత ప్రజాదరణ పొందిన పుస్తకాలలో ఒకటైన 'ది ప్రాబ్లమ్ టీచర్' ను తెలుగులో 'టీచర్లకు మానసిక రుగ్మతలుంటే...' అనే

పేరుతో డాక్టర్ సుంకర రామచంద్రరావు అనువదించారు. ఈ రోజున ఇటువంటి పుస్తకాల అవసరం ఎంతైనా ఉంది. రామచంద్రరావు సులభమైన తెలుగులో దీన్ని అనువదించారు. విజ్ఞానులకు, విద్యావేత్తలకు, విధాన నిర్ణేతలకు విద్యావ్యవస్థను మార్పుచేసి అభివృద్ధి చేసుకోడానికి ఈ పుస్తకం మార్గదర్శకమవుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ పుస్తకం చదువుతున్నపుడు, పశ్చిమ దేశాల ప్రజలు విద్యా వ్యవస్థను మార్చుకోడానికి చేస్తున్న కృషిని చూసి నేను ఆశ్చర్యపోయాను. వారు ఎ.ఎస్.నీల్ తన విస్తృత అధ్యయనంతో ముందుకు తెచ్చిన అభిప్రాయాలు అర్థం చేసుకోడానికి ఆచరణలో పెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. విద్యార్థులను సైన్యంతోను, టీచర్లను సైనికాధికారులతోను ఎ.ఎస్.నీల్ పోల్చారు. ఈ పోలిక ఎంతో ఆసక్తి కలిగించేది. విద్యార్థులు కూడా సైనికుల మాదిరిగా అధికారుల ఆదేశాలను పాటిస్తున్నారని నీల్ చెప్పిన విషయంలో వాస్తవం ఉంది. ప్రస్తుత విద్యా విధానం క్రమశిక్షణ కారుమబ్బుల్లో చిక్కుకుందని, విజ్ఞానం విడి భాగాలుగా మారిపోయిందని నీల్ చెప్పింది అక్షరాలా నిజం. స్వేచ్ఛతో కూడిన అన్వేషణ విస్తృత విజ్ఞానంతో కూడిన ఆలోచన అలవరచుకోవాలని నీల్ చెప్పిన మాటలు అందరు గుర్తుంచుకోవాలి. ప్రస్తుత వాతావరణంలో విద్యావేత్తలు, ప్రమోటర్లు, మేనేజర్లు మేధస్సుకు పదును పెట్టడంలో డాక్టర్ రామచంద్రరావు పుస్తకం సఫలీకృతమవుతుందనడంలో సందేహం లేదు. బాధ్యతా రహితమైన డబ్బు సంపాదించే యంత్రాలను కాకుండా సమాజంపట్ల, తోటి మానవులపట్ల బాధ్యతాయుతమైన మానవులను తయారు చేయడానికి ఈ పుస్తకం ఎంతగానో సహకరిస్తుంది. లేని పక్షంలో ఎవరికీ బద్ధులుకాని అటు సమాజానికి, ఇటు దేశానికి చెందని కిరాయి సైనికులు మాత్రమే విద్యా వ్యవస్థలో పుట్టుకొస్తారు. వారు కేవలం డబ్బుకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తారు.

చివరగా నేను చెప్పదలచుకున్నదేమంటే ఈ రోజున ప్రకృతిని పరిరక్షించుకోవడం, మానవత్వాన్ని ఆచరించడం మానవజాతి అత్యున్నత ధర్మం. ప్రతి పౌరుడు ఈ లక్ష్య సాధనకు నిజమైన విద్య దోహదం చేస్తుంది.

ప్రొఫెసర్ రమేష్ ఆర్ రెడ్డి
ఫార్మర్ డీన్, ఫాకల్టీ ఆఫ్ ఇంజినీరింగ్,
ఫార్మర్ ప్రిన్సిపాల్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్,
ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్.
జనవరి 19, 2012, హైదరాబాద్.

# 1. టీచర్ అంటే ఎవరు?

“నువు పెద్దవాడివైనాక ఏమవుదామనుకుంటున్నావు?” అని వందలసార్లు అనేకమంది పిల్లలను అడిగాను. ఎవరో ఒక విద్యార్థిని మాత్రమే ‘టీచర్‌నవుతా’ అని జవాబిచ్చింది. ఆ తరువాత ఆమెకు మానసిక రుగ్మతలున్నందువల్ల స్కూలునుంచి పంపించవలసి వచ్చింది.

అయినప్పటికీ పిల్లలు-స్కూళ్లు, టీచర్ ఆటలు ఆడుతూనే ఉంటారు. పిల్లల్లో శక్తి ప్రదర్శించుకోడానికి టీచర్ కావాలని కోరుకుంటారు. టీచర్‌గా ఉంటే అనేకమంది పిల్లలపై అధికారం ఉంటుందనేది వారిని ఆకర్షిస్తుంది. అందువల్ల ఆఆటలు ఆడతారు. కాని టీచర్లు కావడానికి వారు ఇష్టపడరు. టీచర్లు కావడానికి పిల్లలు ఎందుకు ఇష్టపడరంటే టీచర్లంటే పాఠాలతో సంబంధం ఉన్నవాడు. పాఠ్య పుస్తకాలనుంచి ఎప్పటికీ దూరంగా ఉండాలని సగటు విద్యార్థులు కోరుకుంటారు. ఇది పైకి కనిపించే కారణం. కానీ లోతుగా ఆలోచించినపుడు-టీచర్ మందబుద్ధి అని బతికినంతకాలం స్కూల్‌లోనే ఉంటాడని పిల్లలు గ్రహించగలుగుతారు. తాము పైకి ఎదగాలని కోరుకుంటున్నందువల్ల టీచర్లుగా కావడానికి ఇష్టపడరు. అంతే కాకుండా పెద్దల జీవితాన్ని ఎదుర్కోడానికి భయపడే పీటర్‌పాన్ వంటి వాడు టీచర్. ప్రతి టీచర్ కూడా జీవితమంతా బాల్యంలోనే ఉండిపోతాడు.

ఎదుగుదలలేని టీచర్లను రెండు రకాలుగా విభజించవచ్చు. ఒక రకం బాల్యంలోనే ఉండిపోటానికి ఎంతగానో ప్రేమిస్తారు. రెండో రకం తాము ఎదగలేక పోయినందుకు ద్వేషం పెంచుకుంటారు. మొదటిరకం వారిని “పుట్టుకతోనే టీచర్లని” మనం అంటుంటాం. రెండో రకం-ద్వేషంతో కూడుకున్న క్రమశిక్షణావాదులు. పుట్టుకతోనే టీచర్లుగా గుర్తింపు పొందిన వారితో సమస్యలేదు. వారు తమ పనిని, పిల్లలను ప్రేమిస్తారు. పిల్లలు వారిని ప్రేమిస్తారు. వీరు 40 సంవత్సరాలు దాటేసరికి నిరాశావాదులుగా తయారై యాంత్రికమైన చిరునవ్వుకు అలవాటు పడిపోతారు. అందువల్ల వీరు ఈ వయసుకు చేరుకోగానే పెన్షన్ ఇప్పించి పంపివేయాలి. క్రమశిక్షణావాదులైన టీచర్లను టీచర్ ట్రైనింగ్ కాలేజి నుంచి రాక మునుపే పెన్షన్ ఇప్పించి పంపివేయాలి. వీరు ప్రమాదకారులు. మానసికంగా వీరు నాలుగో తరగతిలో ఉండే జగడాలమారి స్థాయిలో ఉండిపోతారు. కానీ టీచర్ జగడాలమారి ప్రతిసారీ గెలుపు సాధిస్తూనే ఉంటాడు. పుట్టుకతో టీచర్లైన వారు ప్రేమ పూరితమైన పీటర్‌పాన్. క్రమశిక్షణావాది ఆధిపత్యం చెలాయించే పీటర్‌పాన్. ప్రేమ సూర్యుని వంటిది. పిల్లలకు చేరువగా ఉంటుంది. ఆధిపత్యం చీకటి వంటిది. పిల్లలను భయకంపితులను చేస్తుంది.

ఇప్పుడు మానసిక రుగ్మతలున్న టీచర్‌ను నిర్వచించడానికి ప్రయత్నిద్దాం. అతను తనలోని బాలుడిని, ఇతరులలోని బాలుడిని కూడా ద్వేషిస్తాడు. ఈ కారణంగా వారు తమ ఉద్యోగాన్ని ద్వేషిస్తుంటారు. ప్రస్తుత నాగరిక సమాజంలో టీచర్ వృత్తి నిరుపయోగమైందని వారు ద్వేషం పెంచుకోరు. వారి జగడాలమారి వ్యక్తిత్వం కారణంగా వృత్తిని ద్వేషిస్తుంటారు. పిల్లలను ప్రేమించేవారు పిల్లలను ఇబ్బందిపెట్టి, భయపెట్టే విద్యలోని అలంకారాలన్నిటినీ ద్వేషిస్తారు. విద్యార్థుల స్వేచ్ఛను, సంతోషాన్ని హరించే ద్వేషపూరితమైన క్రమశిక్షణ, శిక్షలు అమలు చేయాలని పిల్లలను ద్వేషించేవారు కోరుకుంటారు.

దాగివున్నదాన్ని రాబట్టడమే విద్య (education) అనే మాటకు అర్థం. పిల్లలకు తెలిసినదాన్ని రాబట్టడంలో విజయం సాధించే టీచర్లే నిజమైన టీచర్లని చెబుతారు. కానీ ఇది పరిమితమైనది. ఒక రకంగా చెప్పాలంటే ఇది తప్పుడు నిర్వచనం. పిల్లల మనసుకు ఎక్కించడానికి టీచర్ కృషి చేయాలనే భావం సరైంది కాదని అందరికీ తెలుసు. పిల్లలకు తెలిసింది రాబట్టాలనుకోడం కూడా సరైందికాదు. మంచి టీచర్ రాబట్టే ప్రయత్నం చెయ్యడు. అతను సమర్పించుకుంటాడు. పిల్లలకు ప్రేమను పంచుతాడు. ప్రేమ అంటే నేను చెప్పే అర్థమేమంటే–ఆమోదం తెలపడం. లేదా స్నేహ స్వభావం, మంచి స్వభావం అనుకోవచ్చు. మంచి టీచర్, పిల్లలను అర్థం చేసుకోవడమేకాదు. పిల్లలకు ఆమోదం తెలుపుతాడు. సబ్జెక్ట్ బోధించడంలో సామర్థ్యం ఎంత అనే అంశం తక్కువ ప్రాధాన్యత కలిగినది. టీచరంటే పిల్లలు భయపడుతున్నారా?...ఇది ఏ టీచర్‌కైనా వర్తించే గీటురాయి. పిల్లలు భయపడు తున్నారంటే–ఆ టీచర్ చెడ్డవాడే. వారు నూటికి నూరుశాతం ఫలితాలు సాధిస్తున్నప్పటికీ ఆ టీచర్లు చెడ్డవారే! టీచర్‌కు పిల్లలు గౌరవం ఇస్తున్నారంటే ఆ టీచర్ విఫలమైనట్టే. ఎందుకంటే గౌరవించడంలో భయం ఇమిడివుంది. పిల్లలు, టీచర్‌ను పిచ్చిగాడిదా! అని సంబోధించని పక్షంలో ఆ టీచర్‌ను ప్రమాదకారిగా పరిగణించాలని నేను పాటికి పదిసార్లు చెబుతున్నాను.

కేవలం ప్రజలకు షాక్ ఇవ్వడానికి నేను అప్పుడప్పుడు అర్థసత్యాలు రాస్తున్నానని కొంతమంది సమీక్షకులు, ఇతర విమర్శకులు ఆరోపిస్తున్నారు. 'పిచ్చిగాడిదా' పరీక్ష కూడా ఇటువంటి అర్థ సత్యాలలో ఒకటని వారంటున్నారు. నాకు సంబంధించినంత వరకు విద్యకు సంబంధించి ఇది ముఖ్యమైన వాస్తవం. పిల్లలతో పిచ్చిగాడిద అని పిలిపించుకోడం టీచర్ నిజాయితీకి, పిల్లల నిజాయితీకి సంబంధించిన ఉన్నతమైన పరీక్ష. పిచ్చిగాడిదా అన్న సంబోధనకు చిరునవ్వుతో స్పందించే వ్యక్తికి ఈ విషయం తెలుసు. పిచ్చిగాడిద సంభోదనకు కోపంతో స్పందించే వ్యక్తి, తాను పిచ్చిగాడిదేనని



ఆమోదించడానికి సాహసించలేకపోతున్నాడనేది సత్యం. ఎవరూ నిజాయితీపరులు కారు. కాని ప్రతిష్ఠతో తనను తాను కాపాడుకోవాలని ప్రయత్నించే వ్యక్తి ఎట్టి పరిస్థితులలోను నిజాయితీపరుడు కాలేడు. అంతేకాదు అతనికి నయం చెయ్యడం కూడా సాధ్యం కాదు. ప్రతిష్ఠతో భయాన్ని కప్పిపుచ్చు కోడానికి ప్రయత్నం జరుగుతున్నందువల్ల నయం చేయడం సాధ్యం కాదు. దొరికిపోతామనేదే ఈ భయం.

చెడ్డ టీచర్‌కన్నా మంచి టీచర్ చైతన్యవంతుడై ఉంటాడు. నేను 27 సంవత్సరాల వయసులో కన్నా ప్రస్తుతం మరింత చైతన్యవంతుడనయ్యాను. అందువల్ల నేను ఇంతకు పూర్వం కన్నా మంచి టీచర్‌ను. స్పెల్లింగ్ పొరపాట్లు చేసిన విద్యార్థులను నేను ఇంతకు పూర్వం దండించేవాడిని. పిల్లలు ఎలా ఉంటారనేది తెలియకపోవడమే దీనికి కారణం. నేను సంప్రదాయికంగా చేసే పనినే (దండించడం) అనాలోచితంగా చేసేవాడిని. టీచర్ ఎల్లప్పుడూ ఆధిపత్యం చెలాయించాలనే సూత్రాన్ని నేను అప్పుడు ఆమోదించాను. ఏదో ఒక రోజున క్లాసు నా అదుపు తప్పిపోతుందని ఆ రోజుల్లో నిరంతరం భయపడేవాడిని.

క్లాసు పూర్తిగా నా అదుపు తప్పిన నాటినుంచి నేను మంచి టీచర్‌నయ్యాను. విద్యార్థులను తన పక్షంలోకి తీసుకోవడానికి ప్రతిష్ఠ కోల్పోడానికి సిద్ధమయినపుడే ఇది సాధ్యమవుతుందని తెలుసు కోగలిగాను. నేను తోలు బెత్తాన్ని శాశ్వతంగా వదిలించుకున్నప్పుడు పిల్లలు నేనంటే భయం పోగొట్టుకున్నారు. వింతగొలిపే విషయం ఏమంటే నేను తోలుబెత్తంతో పిల్లలను కొట్టేటపుడు నన్ను మంచి టీచర్ అని ప్రశంసించేవారు. ఈ పరిస్థితిలో సైన్యంలో సార్జెంట్‌ను కూడా మంచి ఇన్‌స్ట్రక్టర్‌గా భావించవచ్చు. ఈ పోలిక చాలా ఆసక్తి కలిగిస్తుంది. సైన్యంలో సార్జెంట్ లేదా అతని కమాండింగ్ ఆఫీసర్‌కన్నా ఎక్కువ చైతన్యం కలిగి ఉంటాడు.

సైనికాధికారులు జెంటిల్మన్‌లుగా, సైనికులు అనాగరికులుగా పరిగణలోకి వచ్చిన నాటి నుంచి సైనిక క్రమశిక్షణ కొనసాగుతున్నది. సైనికుల బ్యారెక్‌లలో గుచ్చే ఇనుప తీగె, మెరిసే దుస్తులు, ఇతర వస్తువులు కొనసాగడాన్ని బట్టి మామూలు సైనికులకు ఆలోచించే హక్కు లేదనే సంప్రదాయం ఇంకా అమలులో ఉన్నట్టు స్పష్టమవుతున్నది. యుద్ధం ఎందుకు జరుగుతున్నదీ సైనికునికి తెలియకపోతే పెద్ద తేడా ఏమీ ఉండదు. కానీ అతను మురికి బూట్లతో కవాతుకు వస్తే మాత్రం తీవ్రమైన పరిణామాలుంటాయి. ఇదే విధంగా స్కూల్లోకూడా జీవితమంటే ఏమిటో, విద్య ఏమి నేర్పుతున్నదో తెలియకపోయినప్పటికీ ఫ్రాన్స్‌లో ప్రవహించే నదుల గురించి తెలుసుకోవడం ముఖ్యం. సహజంగానే ఇటువంటి స్కూళ్లలో చైతన్యం లేని సార్జెంట్ మాదిరిగా టీచర్‌కు అంతులేని అధికారం ఉంటుంది. స్కూలుకు సంబంధించిన ఇనుప చువ్వలు, మెరుగులు అతను

అమలు చేస్తాడు. మూర్ఖపు వ్యవస్థలో మూర్ఖుడైన వ్యక్తి విజయం సాధించడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. సైన్యంలో సార్జెంట్లు, సైన్యం నుంచి వెలుపలికి వచ్చిన తరువాత ఏమి చేస్తారో నాకు తెలియదు. అయితే వారు సినిమాహాళ్లు, హోటళ్లు, ఆఫీసులగేట్ల దగ్గర మాత్రమే పనిచేయగలుగుతారని, అంతకంటే సృజనాత్మక కృషి చేయలేరని మనం తేలికగా ఊహించుకోవచ్చు. అదృష్టవశాత్తు టీచర్లకు పెన్షన్ వస్తుంది. అందువల్ల టీచర్ల పరిస్థితి సైనికుల పరిస్థితికన్నా మెరుగ్గా ఉంటుంది. లేనిపక్షంలో పైన చెప్పిన గేట్ల దగ్గర పోటీ చాలా ఎక్కువగా ఉండేది.

అల్లరి మూకలకంటే క్రమశిక్షణ కలిగిన సైన్యం పటిమతో పోరాడ గలుగుతుందని సైనిక క్రమశిక్షణను సమర్థించే వారు వాదిస్తారు. వారు క్రమశిక్షణ, క్రమశిక్షణ అని మొత్తుకుంటారు. కానీ ఒక ఆలోచనతో లేదా ఒక ప్రయోజనం కొరకు సాగే పోరాటంలో నెలకొనే క్రమశిక్షణ నిజమైన క్రమశిక్షణ అవుతుందని వీరు గ్రహించలేరు. ఇటలీ సైన్యం మంచిదికాదని చాలామంది చెప్పారు. స్పెయిన్‌లో ఇంటర్నేషనల్ బ్రిగేడ్‌లోని ఇటలీసైన్యం అత్యున్నతమైనదని అందరూ అంగీకరిస్తారు. ఇనుప చువ్వలు, మెరిసే దుస్తులు, బూట్లు వ్యవస్థ కోసమే తాము పోరాటం చేస్తున్నట్టు భావించే సైన్యం కన్నా తాము నమ్మిన దానికోసం పోరాడే సైన్యం ఉన్నతంగా ఉంటుంది. ఎర్రసైన్యం శక్తి వారి సంఖ్యలోను, వారికున్న యాంత్రిక సమర్థతలోను లేదు. కాని ఎర్రసైన్యంలో ప్రతి ఒక్కరికీ రాజకీయాలు బోధిస్తారు. చైతన్యంతో పోరాడేవారికి మూడింతలు సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది. మందబుద్ధి కూడా ఈ విషయం తేలికగా గ్రహించగలుగుతాడు.

మంచిది. మనం సైనిక బ్యారెక్‌లను వదిలిపెట్టి, స్కూల్ బ్యారక్‌ను చూద్దాం. ఇనుప చువ్వలు, మెరుగులకు సమానమైనవి. స్కూల్లో చాలానే ఉంటాయి. దీర్ఘ భాగహారాలు, ఈక్వేషన్లు, రాజులు, యుద్ధాలకు సంబంధించిన తేదీలు, చరిత్రలు, వ్యాకరణం, మృత భాషలు ఇంకా అనేకం ఉంటాయి. వీటిలో శిక్షణ ఇచ్చి యువ సైనికుడిని జీవితంలో పోరాటానికి సిద్ధంచేస్తాం. ఇనుప చువ్వలు, మెరుగులు జీవితానికి ముఖ్యమైనవని మన విద్యా సార్జెంట్లు దురదృష్టవంతులైన పిల్లలకు చెపుతారు. రాజ్యాంగ యంత్రం వారికి మద్దతుగా నిలుస్తుంది.

మా స్కూలు జూనియర్ హాకీటీమ్ గత శీతాకాలంలో ఒక ప్రిపరేటరీ స్కూల్ టీమ్‌తో ఆడింది. ఆ రోజు చలి, గాలి తీవ్రంగా ఉన్నాయి. నా లాంగ్ కోటు వేసుకొని వణుకుతూ నిలుచున్నాను. ప్రిపరేటరీ స్కూలు హెడ్‌మాస్టర్ స్కూల్ విద్యార్థులందరినీ హాకీగ్రౌండ్‌కు తీసుకువచ్చాడు. వారిలో ఐదారు సంవత్సరాల వయసున్న పసివాళ్లు కూడా ఉన్నారు. పిల్లలందరినీ హాకీ గ్రౌండ్‌కు గజందూరంలో నిలబెట్టాడు. ఎవరైనా



కదిలితే ఆ హెడ్మాస్టర్ గద్దించేవాడు. ఏ దేశంలోనైనాసరే క్రీడాకారులు పైకి రావాలంటే ముందుగా పిల్లలు స్కూల్లో ఆడే మ్యాచ్‌లు చూసి తీరాలని ఆరోజు విద్యార్థులకు మధ్యాహ్నం ఇనుప చువ్వలు, మెరుగుల పాఠం.

ఆ హెడ్మాస్టర్ చాలా మంచివాడు. ఆటలు చూడడం ఆయనకు చాలా ఇష్టం. ఆటలుచూడడం తనకు ఇష్టం లేదని ధైర్యంగల పిల్లవాడెవరైనా చెబితే ఆయన ఆశ్చర్యపోవడం తథ్యం. ఆయన లైబ్రరీ చూస్తే బాగా చదువుకున్నవాడని, గౌరవనీయుడని తెలుస్తుంది. కానీ పిల్లల గురించి, విద్య గురించి ఆయనకు సరిగా తెలియదు. సైన్యంలో లాన్స్ కార్పొరల్‌కు చైతన్యం ఉండదు. అదేవిధంగా ఆయనకు కూడా పిల్లల విద్య గురించి చైతన్యం లేదు. ఈ స్కూల్‌లో హాకీ గేమ్ తరువాత మా స్కూల్‌లో ఆడడానికి ఆయన టీమ్‌ను తీసుకు వచ్చాడు. “ఈ దరిద్రం కూల.. టీమ్‌తోపాటు హెడ్మాస్టర్ కూడా వచ్చాడు. ఈ ఆటను గ్రౌండ్‌లో ఎవరూ తిట్టకూడదు” అని 11 సంవత్సరాల మా స్కూలు విద్యార్థి ఒకరు అనడం ఆయన విన్నాడు.

జీవితంపట్ల ఇనుప చువ్వలు, మెరుగులతో కూడిన ధోరణి అలవరచుకోవడం చాలా తేలిక. దీనికోసం ఏమాత్రం ఆలోచించనవసరంలేదు. ఒరిజినాలిటీ కూడా అవసరం లేదు. జీవితంలో స్వల్ప విషయాలను ఇది గొప్పవిగా చూపిస్తుంది. భయం కలుగజేస్తుంది. చలి ఎక్కువగా ఉన్నరోజున స్కూల్ మ్యాచ్ ఆడడం, ప్రపంచంలోని ఆర్ట్స్, సైన్స్ కన్నా కూడా ప్రముఖమైనదిగా తయారవుతుంది. అందువల్ల యూనివర్సిటీ విద్య ముగిసిన తరువాత ఎక్కువ మంది టీచింగ్‌లో చేరుతున్నారు.

ఈ రోజున టీచింగ్‌లో ఇనుపచువ్వలు, మెరుగుల విలువలు పోషించేవారిని ఆకర్షించడం తప్పనిసరి. ఈ వ్యక్తికి పిల్ల చేష్టల స్థాయి విలువలు మాత్రమే తెలుస్తాయి. ఎవరైతే ఏదైనా చేయగలరో వారు టీచింగ్ చెయ్యలేరు అని బెర్నార్డ్ షా అన్నారు. ఇది అక్షరాల నిజం. గొప్పవారెవరూ విద్యాబోధనకు పనికిరారు. యూనివర్సిటీలో రసాయనశాస్త్రం అధ్యయనం చేసినవారు విద్యార్థులకు సల్ఫ్యూరిక్ యాసిడ్‌లో జింక్ ముంచినపుడు ఏమి జరుగుతున్నదో చెబుతుంటారు. ఇది మన విద్యావ్యవస్థకు పట్టిన విషాదం. సైనిక వ్యవస్థ ఎంతో మూర్ఖమైనది. అయినప్పటికీ సైన్యంలో జనరల్స్‌కు కొత్తగా సైన్యంలో చేరుకున్నవారికి కవాతు నేర్పే పని చెప్పరు. కాని విశ్వవిద్యాలయాలలో ప్రొఫెసర్లు చిన్న చిన్న విషయాలు బోధిస్తూ కాలం వెళ్లబుచ్చుతుంటారు.

నా అభిప్రాయం చెప్పాలంటే ప్రపంచంలోని ఉద్యోగాలన్నిటికంటే ఉపాధ్యాయ వృత్తి అనాసక్తి కలిగించేది. నేను ప్రభుత్వ పాఠశాలలో బోధించేటప్పుడు ప్రతిసారి వేసవి సెలవుల తరువాత స్కూలుకు తిరిగి వచ్చినప్పుడు నా ప్రాణాలన్నీ కుంచించుకు పోయినట్టు

అనిపించేది. సంవత్సరమంతా పాత పాఠాలే మళ్లీ చెప్పాల్సి వచ్చేది. అదేస్కూల్, అదే గ్రౌండ్. అర్థమెటిక్స్, ట్యూడర్ వంశీకుల కాలం, బ్రెజిల్‌కు ఎగుమతులు, విసుగు కలిగించే అవే పాఠాలు. సగటు టీచర్ జీవితమంతా ఈ విసుగును భరించవలసిందే! లాన్స్ కార్పొరల్ వంటి వ్యక్తి మాత్రమే ఈ పరిస్థితులకు అనువుగా తన మైండ్ మలుచుకోగలడు. అతను మాత్రమే స్కూలు గది గోడలకు, ఎడ్యుకుషన్ బోర్డు నిబంధనలకు పరిమితమైన ప్రపంచాన్ని భరించగలడు. అయితే లాన్స్ కార్పొరల్ వంటి స్కూల్ టీచర్, ద్వేషిగా ఎలా తయారవు తున్నాడనే ప్రశ్న తలెత్తుతుంది. నేను సైన్యంలో పనిచేసినపుడు కమాండింగ్ ఆఫీసర్ కన్నా కార్పొరల్స్, సార్జెంటు నాకు ఎక్కువ భయం కలిగించేవారు. పెరేడ్‌లో కమాండింగ్ ఆఫీసర్ దూరంగా ఉండడం దీనికి కారణం కావచ్చు.

ద్వేషిస్తూనే విధులు నిర్వహించడమనేది చట్టానికి సంబంధించినది. స్కాట్స్ రెజిమెంట్‌లో శిక్షణ పొందుతున్నప్పుడు నా దగ్గర మంచి రైఫిల్ ఉండేది. నేను దాన్ని చాలా జాగ్రత్తగా చూసుకునేవాడిని. మరొక వ్యక్తి కాల్పులు ప్రాక్టీస్ చేయడానికి అవసరమని ఒక రోజున నా దగ్గర నుంచి రైఫిల్ తీసుకు వెళ్ళారు. నాకు తుప్పుపట్టిన పాత రైఫిల్ ఇచ్చారు. నేను రెండు గంటల పాటు దాన్ని శుభ్రం చేశాను. కాని తరువాత ఇన్‌స్పెక్షన్ రోజున రైఫిల్‌కు తుప్పుపట్టిందని నాకు జరిమానా విధించారు. నేను వివరించడానికి ప్రయత్నం చేశాను. కాని నోరు మూసుకోమని చెప్పారు. రైఫిల్స్ ఇన్‌చార్జ్ సార్జెంట్ నాకు స్నేహితుడు కావడంతో నేను శిక్ష తప్పించుకోగలిగాను. నేరం బయట పడకుండా అతను నన్ను కాపాడాడు. చట్ట ప్రకారం నాది తుప్పుపట్టిన రైఫిల్. అదినేరం. సాకులు, కారణాలకు చోటు లేదు. కారణాలు చూపించే ప్రయత్నం చేయొద్దు. నేరం అంగీకరించు. అని సీనియర్ సైనికులు మాకు సలహా చెప్పేవారు. ఇది ఎల్లప్పుడూ తెలివైన మార్గం. కారణాలు చూపిస్తే సార్జెంట్ ఏదో ఒక రూపంలో దార్ష్టీకం చూపిస్తాడు.

నేను స్కూల్లో కూడా ఇటువంటి పరిస్థితులనే చూశాను. నేనొకసారి క్రూరంగా శిక్షించే హెడ్మాస్టర్ దగ్గర పని చేశాను. డల్‌గా ఉండే ఒక పిల్లవాడు ఒక పాఠం నేర్చుకోలేకపోయేవాడు. అతన్ని ప్రతి ఉదయం బెత్తంతో కొట్టేవారు. అతని కుడి చేయి అతని కళ్ల మాదిరిగా ఎప్పుడూ ఎర్రగానే ఉండేది. ఆ పాఠం నేర్చుకు తీరాలన్నది చట్టం. కారణాలు చూపడం లేదాగడువు కోరడం ఎట్టి పరిస్థితులలోను సాధ్యం కాదు. ఇది దశాబ్దాల క్రితం జరిగింది. కానీ ఇటీవల స్కాట్లండ్‌లో ఒక మహిళ నుంచి నాకు జాబు వచ్చింది. తనపిల్లవాడు డిక్టేషన్‌లో రెండు కన్నా ఎక్కువ స్పెల్లింగ్ పొరపాట్లు చేస్తే టీచర్ బెత్తంతో తీవ్రంగా కొడుతున్నట్టు ఆమె తెలిపింది. అతని టీచర్ ఒక యువతి. ఇది మూర్ఖత్వమా లేదా క్రూరత్వమా?



మనుషులు మాత్రమే క్రూరంగా ఉంటారు. జంతువులు ఎప్పుడూ క్రూరంగా ఉండవు. పిల్లి, ఎలుకతో ఆటలాడడం సహజ స్వభావంతో పిల్లి ఆడే ఆట మాత్రమే. పిల్లి పెద్దదైనప్పటికీ ఈ లక్షణం ఉంటుంది. కొత్తవారంటే భయం లేదా సెక్స్‌పరమైన దాడి జరిగినపుడు మాత్రమే కుక్క కరవడానికి ప్రయత్నం చేస్తుంది. నాజీ సైనికుడు యూదు వృషణాలపై బూటుకాలితో తంతాడు. ముళ్ల పందిని చచ్చేవరకు తొక్కి చంపుతాడు. కానీ జంతు ప్రపంచంలో నాజీలకు సమానమైన క్రూరత్వం ఎక్కడా కనిపించదు. ఎలుకలు గనుక మాట్లాడగలిగితే, కొరడా దెబ్బలు కొట్టాలని కోరుతూ రోడంట్ రివ్యూ పత్రికకు లేఖ రాయదు. ఇటీవల న్యాయమూర్తులు, ఇతర మెజిస్ట్రేట్‌లు కొరడా దెబ్బలు కొట్టాలని ఎక్కువగా శిక్షలు విధిస్తున్నారు. పెద్ద పెద్ద జంతువులు కూడా క్రూరమైనవి కావు.

అంతరాత్మ ఉన్నందువల్ల క్రూరత్వం తలెత్తుతుంది. తీవ్రమైన మత నమ్మకం దైవత్వంతో సంబంధంలేని క్రూరత్వానికి దోహదం చేస్తుంది. దక్షిణాఫ్రికాలోని 'కాల్వినిస్ట్ డచ్ రిఫార్మ్‌డ్ చర్చి' ఆదివాసీలపట్ల అనాగరికంగా ప్రవర్తించడంలో క్రూరత్వం ఏమీలేదని చెబుతున్నది. రోమన్ కాథలిక్ స్కూళ్లలో పిల్లలను కొడతారు. ఇంగ్లాండ్ రాజ్యాంగ యంత్రంలో చట్టబద్ధమైన మతం–ఉరితీయడం, జైళ్లలో కొరడాలతో కొట్టడం, స్కూళ్లలో దెబ్బలు కొట్టడం, నక్కలను వేటాడడాన్ని (fox hunting) ఆమోదిస్తున్నది. స్వీయద్వేషం యొక్క బహిర్గతరూపమే క్రూరత్వం. సహజమైన సత్యం, సంక్రమించిన అవాస్తవాల మధ్య వైరుధ్యం జనించి, అంతరాత్మలో స్వీయద్వేషం పుట్టుకొస్తుంది. అందువల్ల నైతికవాది మనుషులందరి కంటే క్రూరంగా ఉంటాడు. స్వీయద్వేషానికి భాష్యం చెప్పుకొని దాన్ని నైతిక చట్టంగా రూపొందించడం వల్ల ఈ విధంగా జరుగుతుంది. సైనికుడు యుద్ధంలో తోటి మనిషిని ఏమాత్రం వెనుకాడ కుండా చంపేస్తాడు. తన ప్రమేయం లేదని భావించే మామూలు పౌరుడు కూడా క్రూరంగా ప్రవర్తిస్తాడు.

ఎలుకల పట్ల వ్యవహరించే తీరులో మనం ఇది గమనించవచ్చు. గౌరవనీయుడైన వ్యక్తి ఎలుకను మరిగే నీటిలో వేసి చంపడం అవమానంతో కూడినదిగా పరిగణిస్తాడు. కానీ ఎలుకలను విషంపెట్టి చంపడానికి వెనుకాడడు. విషంతిన్న ఎలుక తీవ్రమైన బాధకు గురవుతుంది. ఈ బాధ తరువాత తెలిసినప్పటికీ ఇలాగే జరుగుతుంది. ఎలుకల నిర్మూలన వారోత్సవాలు భారీగా జరుపుతారు.

టీచర్ క్రూరత్వం కూడా ఇదే కోవకు చెందినది. పిల్లలను భయపెట్టి క్రమశిక్షణ అమలు చేయాలనే భావాన్ని సమాజం ఆమోదిస్తుంది. పిల్లలను శిక్షించినపుడు వారి తల్లిదండ్రులు కోర్టుకు వెళితే పదికేసుల్లో తొమ్మిది కేసులకు మెజిస్ట్రేట్ నుంచి తనకే మద్దతు లభిస్తుందని ప్రతి స్కూల్ టీచర్‌కు తెలుసు. అందువల్ల తాను పూర్తిగా అధికారం

చెలాయించవచ్చునని అల్పుడైన స్కూల్ టీచర్ భావిస్తాడు. ఈ పరిస్థితులలో బలహీనుడైన స్కూల్ టీచర్ కూడా తాను బలవంతుడనని భావిస్తాడు. అవసరమైతే పెద్ద శక్తులు తనకే మద్ధతు ఇస్తాయని ఆయనకు తెలుసు. కేవలం బలహీనుడు మాత్రమే బెత్తంతో పాలన సాగించాలని కోరుకుంటాడు.

సమాజంలో, చట్టంలో క్రూరత్వం ఉన్నదని చెప్పినంతమాత్రాన సమస్య పరిష్కారం కాదు. ఇది వ్యక్తి అంతరంగం నుంచి వస్తుంది. అంటే ప్రతి ఒక్కరిలో క్రూరుడుగా మారడానికి అవకాశాలున్నాయని అంగీకరించక తప్పదు. అయితే క్రూరత్వం ప్రయోగించడానికి వృత్తి పరమైన పరిమితులుంటాయి. ఉదాహరణకు ఇటుకలతో గోడకట్టే వ్యక్తి శాడిజం ప్రదర్శించడానికి ఎక్కువ అవకాశం ఉండదు. పోస్ట్‌మాన్ స్వీయదేషాన్ని ఇతరులపై ప్రదర్శించడానికి అవకాశం ఉంటుందని నేననుకోను. అదృష్టవశాత్తు లేదా దురదృష్టవశాత్తూ టీచర్‌కు మాత్రం ఉన్మాదం ప్రదర్శించడానికి, దెబ్బలు తినే పిల్లలు సిద్ధంగా ఉంటారు. గోడలు కట్టే తాపీవాడు తన భార్యపై లేదా తోటివారిపై ఈ విధంగా క్రూరత్వం ప్రదర్శించే అవకాశం ఉండదు. తాపీవాడు భార్యపై లేదా తోటివారిపై క్రూరత్వం ప్రదర్శిస్తే సంఘ వ్యతిరేక శక్తిగా పరిగణిస్తారు. కాని టీచర్ మాత్రం రోజంతా పిల్లందరిపై క్రూరత్వం ప్రదర్శిస్తూనే ఉంటాడు. పైగా అటువంటి టీచర్‌కు మంచి టీచర్ అనే గుర్తింపు కూడా వస్తుంది. టీచర్‌కు తాపీవానికి తేడా ఏమంటే వారికి ఉన్న అవకాశం. టీచర్ తన ద్వేషం వెలిగక్కడానికి ఆ వృత్తి ఎంచుకున్నాడా? అనేది మనం ఊహించుకోవలసిందే!

పిల్లలను భయభ్రాంతులకు గురిచేసే టీచర్ అనే ఊహాజనితభూతాన్ని నేను సృష్టించినట్టు కనిపిస్తుంది. నిజమే నేను చూసిన క్రూరమైన టీచర్లందరి లక్షణాలు కలిపి నేను ఈ విషయాలు చెబుతున్నాను. “ఇటువంటి టీచర్లు ఈ రోజున లేరు. నువ్వు 40 సంవత్సరాలు వెనుకబడి ఉన్నావనే” తిరస్కారం కూడా ఎదురవుతుంది.

మంచిదే. నేనూ ఒప్పుకుంటున్నాను. నేను ఊహించిన టీచర్ ఎక్కడో కాని ఉండరు. అనేది కూడా ఒప్పుకుంటున్నాను. అదే సమయంలో ఈ టీచర్ మరో రూపంలో ఉన్నాడని స్పష్టం చేస్తున్నాను. ఇటువంటి మనస్తత్వం ఉన్న టీచర్ తన జీవితంలో పిల్లలను తాకకపోయినప్పటికీ ప్రమాదకారేనన్నది గుర్తుంచుకోవాలి. నేను కొంతకాలం క్రితం ఒక గ్రామీణ పాఠశాలను సందర్శించాను. తానెప్పుడో కాని బెత్తం ఉపయోగించనని ఆ స్కూల్ హెడ్మాస్టర్ నాకు చెప్పాడు. “ఇంతకు పూర్వం ఉన్న క్రూరమైన క్రమశిక్షణ” పోయిందని ఆయన చెప్పాడు. నాకు ఆయన క్లాసులన్నీ చూపించాడు.

ప్రతి క్లాస్‌రూపమ్‌లోకి మేము ప్రవేశించగానే పిల్లలంతా అదిరిపడి నిల్చున్నారు. వారు నా వంక చూడను కూడా చూడలేదు. హెడ్మాస్టర్‌పైనే వారి చూపులన్నీ



కేంద్రీకృతమయ్యాయి. కొంతమంది పిల్లలతో హెడ్మాస్టర్ మాట్లాడాడు. భయంతో వారంతా జవాబిచ్చారు. భయం కారణంగా వారిలో నిజాయితీలేదు. నేను సైన్యంలో ఉన్న రోజుల్లో సైనికాధికారి ఇన్‌స్పెక్షన్‌కు వచ్చినప్పటి సంగతి నాకు జ్ఞాపకం వచ్చింది. భయంతో అధికారి వంక చూడడం ఎలా ఉంటుందో నాకు తెలుసు. పిల్లల ఇత్తడి బొత్తాలు మెరుస్తుండటానికి హెడ్మాస్టర్ ఆమోదం తెలుపుతాడని నాకు తెలుసు. నేను కోపంతో, బాధతో ఆ స్కూల్ నుంచి తిరిగి వచ్చాను. ఆ హెడ్మాస్టర్ అనే దేవుడు భయంతో స్కూల్‌ను ఏలుతున్నాడు. ఆ విషయం ఆయనకు తెలియదు.

అందువల్ల నేను వాదించేదేమిటంటే స్కూలు పిల్లల మనసులో భయం ప్రవేశపెట్టడానికి వారిని కొట్టనవసంరం లేదు. తాము భయంతో పిల్లలను ఏలుతున్నామనే నిజాన్ని వేలాదిమంది టీచర్లు గమనించరు. వారు ద్వేషాన్ని ఇస్తారు. కాని ప్రేమను ఇవ్వలేరు. ఆ స్కూల్‌లో నేనొక జోక్ చెప్పాను. నవ్వడానికి పిల్లలు భయపడ్డారు. తాము నవ్వడానికి ధైర్యం చెయ్యవచ్చునో లేదో తెలుసుకోడానికి వారు హెడ్మాస్టర్ వంక చూశారు. ఆయన జోక్‌ను పట్టించుకోలేదు. అందువల్ల చిరునవ్వు కూడా నవ్వలేదు. పిల్లలు కూడా ముఖాలు గంభీరంగా పెట్టుకున్నారు.

మానవత్వం ఆధారంగా మిమ్మల్ని నేనొక ప్రశ్న అడగదలచుకున్నాను. పిల్లలు కావాలనుకుంటే రోజంతా ఎందుకు నవ్వుతూ ఉండకూడదు? రోజుకు ఆరు గంటలపాటు చిన్న భూతాల మాదిరిగా ఉండే పిల్లలు జీవితంలో నిజాయితీగా ఉండే అవకాశం, ఆశలు ఏమాత్రం ఉంటాయని నేను మిమ్మల్ని అడుగుతున్నాను.

ఇది మూర్ఖత్వమా లేదా క్రూరత్వమా? మూర్ఖత్వం అంటే అంతర్గతంగా ఉండే ఉసూరుమనే స్వభావం అని నేను చెప్పడం లేదు. మూర్ఖత్వం అంటే అభివృద్ధి లేకపోవడం, చైతన్యం లేకపోవడం అని నేనంటున్నాను. పెద్దవాళ్లు క్రూరత్వం ప్రదర్శించడానికి బదులుగా వేరే కార్యక్రమాలకు తమ దృష్టి మళ్లిస్తారు. వారి పని, ప్రయోజనాలు ప్రపంచంతో ముడిపడి ఉంటాయి గనుక ఇది సాధ్యమవుతుంది. చిన్న పిల్లలకు ఈ అవకాశం ఉండదు. వారు జీవితంలోని చిన్న అంశాలను మాత్రమే చూడగలరు. వారికి బెత్తం దెబ్బలు, అలవాట్లు ఇవి మాత్రమే తెలుస్తాయి. నిజాయితీ రాహిత్యం వెనుక ఇవి దాగి ఉంటాయి. వ్యక్తి ఎంత ఎత్తు పెరిగినపపటికీ చిన్న మనిషిగా మాత్రమే జగడాలమారిగా మాత్రమే మిగులుతాడు.

# 2. టీచర్ - రాజ్యాంగ యంత్రం

మాస్కోలో ఒక స్కూల్‌టీచర్–విద్యార్థులను ఒక చిన్న ప్రశ్న అడిగాడు. అదేమంటే! “ఒక వ్యక్తి ఒక వస్తువును 50 రూబుల్స్‌తో కొని 10 శాతం లాభానికి అమ్మాడు. అతనికి ఎంత లాభం వస్తుంది?” క్లాసులో హుషారైన విద్యార్థి వెంటనే జవాబిచ్చాడు. “మూడు సంవత్సరాల కఠిన కారాగారశిక్ష”. రష్యాలో ఈ జవాబు కరెక్ట్. రష్యాలో కమ్యూనిజం కోసం విద్యాబోధన సాగుతుంది. జర్మనీ, ఇటలీలలో ఫాసిజం కోసం స్కూళ్లలో విద్యాబోధన జరుగుతుంది. యథాతథ పరిస్థితులు కొనసాగించడానికి రాజ్యాంగ యంత్రం విద్యలో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి.

బ్రిటన్‌లో పెట్టుబడిదారీ విధానం ఉంది. స్వేచ్ఛామార్కెట్, లాభాలు చేసుకోడం–పెట్టుబడిదారీ విధానం పునాదులు. యథాతథ పరిస్థితులు కొనసాగడానికి నూతన తరం పిల్లలను తయారు చేయడం ప్రభుత్వ పాఠశాలల లక్ష్యం. నిజమైన విద్యాబోధన జరిగితే, వ్యవస్థ నుంచి దూరమయ్యే ధోరణి అలవడుతుంది. రాజ్యాంగ యంత్రం నిజమైన విద్యకు బదులు స్కూలు విద్యను అమలు చేస్తుంది. అందువల్ల పిల్లలు పది లేదా అంతకన్నా ఎక్కువసంవత్సరాలపాటు తమకు ప్రయోజనం లేని విషయాలు నేర్చుకుంటూ గడపాలి. ఇది వ్యవస్థకు ప్రమాదకరమైన విజ్ఞానం సంపాదించకుండా నిరోధిస్తుంది.

మనమొక ఉదాహరణ చూద్దాం. హృదయాలతో విప్లవాలు వస్తాయి. ఆలోచనలతో కాదు. ముందుగా హృదయాలు ఉప్పొంగిన తరువాత ఆలోచనలు మార్గదర్శకమవుతాయి. హృదయం అంటే భావావేశం. రాజ్యాంగ యంత్రం కొనసాగించే విద్య భావావేశాలను నిరోధిస్తుంది. సామ్రాజ్య దినోత్సవంలో మాత్రం భావావేశాలు వ్యక్తం చెయ్యడానికి వీలుంటుంది. ప్రతి రోజూ చెప్పే పాఠాల ద్వారా భావావేశాలను నిరోధించడం అత్యుత్తమమైన పద్ధతి. అందువల్ల క్లాసులో ఎటువంటి ఉత్సాహం చోటు చేసుకున్నా కోపంతో టీచర్ కనుబొమలు ముడిపడతాయి. అందువల్లనే భావావేశాలు విడుదలకు దోహదం చేసే పెయింటింగ్, కుండలు చేయడం, సంగీతం వంటి వాటిని కొంతమంది ప్రముఖ విద్యావేత్తలు తిరస్కారంతో చూస్తారు.

రాజ్యాంగయంత్రం నిర్వహించే స్కూల్‌లో ఒరిజినాలిటీ, మానవత్వం ఉన్నవారి కన్నా యాంత్రికంగా పనిచేసే టీచర్లే ఎక్కువగా అక్కరకు వస్తారు. సృజనాత్మకత కలిగిన వానికన్నా, కళాకారుని కన్నా సైనిక బ్యారక్‌లలో పనికివచ్చేవారే ఈ స్కూళ్లలో బాగా పనికొస్తారు. సాధారణంగా టీచర్లు దిగువ మధ్య తరగతి నుంచి వస్తారు. వీరు కార్మిక



వర్గానికి సన్నిహితంగా ఉంటారు. కానీ సంపన్న వర్గాలకు చేరువలో ఉండాలని కోరుకుంటారు. కార్మికవర్గం నుంచి కూడా చాలా మంది టీచర్లు వస్తారు. అయితే తెల్ల కాలర్ చూసుకోగానే తామెక్కడి నుంచి వచ్చిందీ మరచిపోతారు. కార్పొరల్‌కు ఎన్.సి.ఒ. (నాన్ కమిషన్ ఆఫీసర్) ప్రమోషన్ రాగానే పనికిమాలిన సైనికులతో కలవకుండా దూరంగా ఉంటాడు. స్కూళ్లకు సంబంధించిన వారిలో మామూలు సైనికులు ఎన్.సి.ఒ.లుగా ప్రమోషన్ పొందుతారు.ఎన్.సి.ఒ. లక్షణాలన్నిటినీ సంతరించుకుంటారు. క్రింది నుంచి పైకి ఎదిగిన సైన్యాధికారి నీచంగా ఉంటాడని ఏ సీనియర్ సైనికుడిని అడిగినా చెబుతాడు.

సైన్యం–స్కూలు మధ్య విశ్లేషణను నేను చాలా ఎక్కువగా చేస్తున్నట్టు కనబడుతుంది. కాని కవాతు గ్రౌండ్‌కు క్లాస్‌రూమ్‌కు సన్నిహితమైన పోలికలున్నాయని నేను స్పష్టం చేస్తున్నాను. ఎన్.సి.ఒ. తన పరిమితమైన పనిని చాలా జాగ్రత్తగా చేసినప్పటికీ మూర్ఖుడైన జనరల్ యుద్ధం ప్రారంభించడంలో ఈ పనిని వమ్ము చేస్తాడు. ప్రాథమిక, మాధ్యమిక స్థాయిలో టీచర్లు బాగా కృషి చేసినప్పటికీ మూర్ఖుడైన జనరల్‌గా వ్యవహరించే పెట్టుబడిదారీ వ్యవస్థ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడి వారిని యంత్రాల స్థాయికి దిగజార్చుతుంది. శాంతి సమయాలలో ఎన్.సి.ఒ.కు పెద్ద పెద్ద విషయాలపై ఏ మాత్రం అధికారం ఉంటుందో టీచర్‌కు కూడా అంతే అధికారం ఉంటుంది. ఇద్దరూ తక్కువ స్థాయివారే. ఇద్దరూ బంట్రోతులే. ఇద్దరూ నమ్రత కలిగిన సేవకులే. వీరిద్దరి సామాజిక స్థాయి కూడా దాదాపు సమానంగానే ఉంటుంది. టీచర్‌కు గ్రామర్ బాగా తెలిసినట్లైతే, అతన్ని కొంత గౌరవ ప్రదంగా చూస్తారు. శిక్షణ ఇవ్వడంలో ఇద్దరూ నిష్ణాతులే. అది వారి వృత్తి. పెరేడ్ గ్రౌండ్‌లో సైనిక శిక్షణ ఇచ్చి మరణించడానికి తయారు చేస్తాడు అక్కడి ఇన్‌స్ట్రక్టర్. పిల్లలు జీవించడానికి శిక్షణ ఇచ్చిన వ్యక్తిని ఇన్‌స్ట్రక్టర్ అని పిలవరు. టీచర్ అని పిలుస్తారు. కాని ఈ టీచర్ శిక్షణ కూడా ధ్వంసం చేసేదిగానే ఉంటుంది. యువజనుల వ్యక్తిత్వంలో విలువగల వాటన్నిటినీ టీచర్ ధ్వంసం చేస్తాడు.

సైన్యానికి ఎన్.సి.ఒ.లు వెన్నెముక వంటి వారని అందరూ చెపుతున్నప్పటికీ సైన్యం విధానరూప కల్పనలోనూ, యుద్ధ వ్యూహంలోనూ వారికి నియంత్రణ ఉండదు. టీచర్‌కూడా అదే పడవలో ప్రయాణిస్తున్నాడు. వ్యవస్థ టీచర్ కాళ్లు, చేతులు కట్టివేస్తున్నది. అతను వ్యవస్థలో ఇమిడిపోవాలి లేదా (నా మాదిరిగా) పారిపోవాలి. విషాదభరితమైన ప్రభుత్వ విద్యలో ఇమిడిపోయే సాహసులకు లేదా మందగొడులకు నేను సలాం చేస్తున్నాను.

స్కూళ్లలో ఎక్కువభాగం అసహ్యంగా ఉంటాయి. రద్దీ ఎక్కువ. చాలా స్కూళ్లలో గాలి, వెలుతురు కూడా సరిగా ఉండవు. వాసన వస్తుంటాయి. తగినంత ఆట స్థలం

కూడా ఉండదు. వాటిని చూడగానే జైళ్లు, సైనిక బ్యారక్‌లు గుర్తుకొస్తుంటాయి. ఇవి దేశానికి తలవంపులు తెస్తాయి. యథాతథ పరిస్థితులను గౌరవిస్తూ, వాటికి తలవంచుతున్న వయోజనులైన పౌరుల కారణంగా స్కూళ్లు ఈ విధంగా ఉన్నాయి. ఈ స్కూళ్లను రద్దు చేయాలని లేదా సంస్కరించాలని డిమాండ్ చేయవలసిన వీరు పాత డెస్క్‌లు, పాత పుస్తకాలు పట్టుకొని వేలాడుతుండడమే దీనికి కారణం. స్కూల్‌డెస్క్ వద్ద కూర్చున్న వ్యక్తి ఎవరైనాగాని విద్యపట్ల పూర్తి లక్ష్యశుద్ధితో కూడిన ధోరణి అలవరచుకోడం సాధ్యం కాదు. కఠినమైన వ్యవస్థ కారణంగా వారు తొలి రోజుల్లోనే జీవితసారం కోల్పోతారు. వారు వ్యవస్థ గురించి ఆలోచించే పరిస్థితి కూడా లేకుండా పోతుంది. భావావేశపరమైన విద్య అతనికి ఉండదు. ఫలితంగా తన చిన్ననాటి స్కూలు రోజులనే గుర్తు చేసుకుంటూ ఆ రోజులే సంతోషభరితమైనవని అనుకుంటుంటాడు. ఇది మూర్ఖత్వం మినహా మరేమీ కాదు. స్కూల్ రూమ్‌లో నిత్యం నిర్వహించే ఒకేమాదిరి కార్యకలాపాల కారణంగా అతనొక ఆదర్శవంతమైన సైనికుడిగా తయారవుతాడు. అతనికి ఉత్తర్వులు స్వీకరించడం మాత్రమే తెలుస్తుంది. ఈ పరిస్థితులకు మూల కారణమేమంటే: మన స్కూళ్లు సేవకులను, బలహీనమైన వారిని తయారు చేయడంలో విజయం సాధిస్తాయి. అధికారిక కార్మిక ఉద్యమం బలహీనంగా ఉండడానికి కూడా ఇదే కారణం.

అధికారులు, నాయకత్వం వహించడంలో విఫలమవుతుంటారు. వీరిని చూస్తే ప్రత్యర్థులను చూసినట్టుగా ఉంటుంది. ప్రభుత్వ విద్య నుంచి వచ్చే ఆదర్శవంతమైన వ్యక్తులు వీరు. ఈటన్, హారో వంటి పెద్ద పెద్ద స్కూళ్ల నుంచి వచ్చేవారు తమ వర్గ ప్రయోజనాలనే కాపాడుకుంటారు. వారు ఎదురు తిరిగే ప్రశ్నే తలెత్తదు. వారి విద్యా విధానమే భిన్నమైనది. వారికి తగ్గి ఉండడంలో కాకుండా అధికారం చెలాయించడంలో శిక్షణ ఇస్తారు. వీరు తమ వర్గానికి ఎప్పుడూ ఆమోదం తెలుపుతుంటారు. కానీ కార్మిక నాయకులు కూడా తమ శత్రువర్గానికి తరచుగా ఆమోదం తెలుపుతుండడం గమనించవలసిన విషయం. ప్రభుత్వ స్కూళ్లు బానిస మనస్తత్వాన్ని తయారు చేయాలి. బానిస మనస్తత్వం మాత్రమే వ్యవస్థను యథాతథంగా ఉంచగలుగుతుంది.

తరచుగా నాకు ఆశ్చర్యం గొలిపే ప్రశ్న వినిపిస్తుంటుంది. హిట్లర్ వంటి వ్యక్తి కోట్లాది మంది జర్మన్లకు ఆదేశాలిస్తూ, కంట్రోల్ చెయ్యడం ఎలా సాధ్యం? తమను కంట్రోల్ చెయ్యాలని ప్రజలు కోరుకుంటున్నందువల్ల హిట్లర్ వారిని కంట్రోల్ చెయ్యగలుగుతున్నాడు. పెద్ద ఎత్తున శిక్షణ కొనసాగుతున్న దేశంలో విద్యావ్యవస్థ ఉత్తర్వులు స్వీకరించే వారిని తయారు చేయడంలో విజయం సాధిస్తుంది. ప్రజాస్వామ్యానికి వ్యతిరేక యుద్ధం (ఇది రెండో ప్రపంచ యుద్ధానికి పూర్వం రాసినది) సంపన్నులు, పేదలపై



సాగించే ప్రపంచ యుద్ధం. విశాలమైన భూములు, వలస దేశంగురించి నేను మాట్లాడడం లేదు. దాదాపుగా ప్రపంచ యుద్ధం ప్రారంభమైనట్టే. కార్మికులను నిర్వీర్యం చేయడానికి ప్రారంభం కానున్న యుద్ధం విజయం సాధిస్తుందా? లేదా? అనేది చూడాలి. రిపబ్లికన్ స్పెయిన్‌కు ఆయుధాలు ఇవ్వడానికి బ్రిటన్ నిరాకరించింది. ప్రపంచ యుద్ధం ప్రారంభం కావచ్చుననే సాకుతో ఈ విధంగా నిరాకరించింది. కానీ అసలు కారణమేమంటే బ్రిటిష్ పాలకవర్గం ఫ్రాంకో పక్షాన కొమ్ము కాస్తున్నది. ఫ్రాంకో కూడా పాతస్కూలు, టై వర్గానికి చెందినవాడు.

ఫాసిస్టు దాడిని నిరోధించడానికి రష్యాతో పొత్తుపెట్టుకోడానికి పశ్చిమ ప్రజాస్వామ్య దేశాలు తీవ్రమైన విముఖత చూపుతున్నాయి. ఈ దేశాల పాలక వర్గాలు, వర్గ శత్రుత్వంతో ఈ విధంగా చేస్తున్నాయి. వారికి ఫాసిజం కన్నా బోల్సివిజం ఎక్కువ ప్రమాదకారిగా కనపడుతున్నది. ఫాసిజమంటే పెట్టుబడిదారీ విధానం. ఇంగ్లాండ్‌లోను పెట్టుబడి దారీ వర్గమే అధికారంలో ఉంది. బ్రిటిష్ సైనికాధికారులు చావడానికైనా సిద్ధపడతారు. కాని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని రష్యా సహకారంతో రక్షించుకునే ప్రయత్నం మాత్రం చెయ్యరు. అదృష్టవశాత్తు మ్యూనిక్ ఒప్పందం తరువాత సామ్రాజ్యవాద తత్త్వం కొంత వెనకడుగువేసింది.

కొద్దిగా పక్కకు వెళ్ళి రాజకీయాలను పరిశీలించవలసి వచ్చింది. విద్యకు సంబంధించి చర్చించేటప్పుడు ఈ విధంగా చేయడం తప్పనిసరి. నియంతల గురించి మాట్లాడితే ప్రజాస్వామ్య వాదులైన ఇంగ్లీషువారు తీవ్రమైన ఆగ్రహం వ్యక్తం చేస్తారు. "జర్మనీ, రష్యాల వంక చూడండి. అక్కడ స్వేచ్ఛ లేనేలేదు. అక్కడ వ్యక్తులకు ప్రాముఖ్యం లేదు. రాజ్యాంగ యంత్రాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకుంటారు. ఇంగ్లాండు ఇంకా ప్రజాస్వామ్యంలోనే ఉండడం అదృష్టం" అంటారు. ఇంగ్లాండ్‌లో కేవలం వాక్ స్వాతంత్ర్యం మాత్రమే ఉంది. ఒక్కొక్కప్పుడు అది కూడా ఉండదు. మనకు ఇష్టమైన విషయాలు చెప్పవచ్చు. కాని చెప్పేది చెయ్యడానికి ప్రయత్నిస్తే మందలకొద్దీ పోలీసులు వస్తారు. తాను ఆలోచించే విషయం చెప్పడానికి కూడా టీచర్‌కు స్వేచ్ఛ ఉండదు. లండన్‌లో ఒక పాఠశాలలో టీచర్ తన విద్యార్థులకు క్రింది విధంగా చెబితే ఏమవుతుందంటే:

"విధేయులైన వేతన కార్మికులను తయారు చేయడమే స్కూలు ప్రధానమైన బాధ్యత. ఏమాత్రం విలువలేని అంశాలు మీకు బోధిస్తూ నేను కాలం వెళ్ల బుచ్చుతున్నాను. డబ్బుకు సంబంధించి సుదీర్ఘమైన భాగహారం మీకు నేర్పుతాను. కేవలం కాగితాలమీద రాసుకోడానికి కూడా మీ దగ్గర అంత డబ్బు ఉండదని మీకు తెలుసు. నాకూ తెలుసు. మీకు చదవడం, రాయడం నేర్పించడమే నా విధి. ఆ తరువాత మిమ్మల్ని పెద్ద టీచర్లకు

అప్పగిస్తారు. వారు పత్రికలో రాసినది మీరు చదివి, వారి విలువలను ఆమోదించాలి. భారతదేశంలో కార్మిక వర్గాల పరిస్థితి కన్నా లండన్‌లో మారుమూల జరిగే చిన్న సంఘటన ప్రాముఖ్యం వహిస్తుందని తెలుసుకొని దాన్ని ఆమోదించాలి. నేను మిమ్మల్ని క్రమశిక్షణలో పెట్టి, నన్ను గౌరవించే విధంగా చేస్తాను. నేను అధికారానికి ప్రతినిధిని కనుక ఈ విధంగా చేస్తాను. ఆ తరువాత జీవితమంతా అధికారానికి లొంగి బతుకుతుంటారు. మీరు నన్ను "సర్" అని సంబోధించినపుడు లొంగి బతకడానికి, సేవలు చేయడానికి మీరు తయారవు తున్నారన్నమాట. నేను బ్రిటిష్ సామ్రాజ్యం గురించి చెబుతున్నపుడు మీరు మంచి దేశభక్తులుగా తయారవుతారని ఆశ. నిరంతరం నువ్వు చూసే మురికివాడల గోడలకు వెనుక దూరంగా ఉండే బ్రిటిష్ సామ్రాజ్య రక్షణకు సంతోషంగా ప్రాణాలు అర్పించుకుంటారని ఆశ. ఒక్క ముక్కలో చెప్పాలంటే, పేదలు, ధనికులు; దోపిడి చేసేవారు, దోచుకోబడేవారు ఉన్న పెట్టుబడిదారీ విధానాన్ని కాపాడడం మీ విధి. హెయిల్ సైన్యాధికారి."

న్యాయశాస్త్ర పరిభాషలో చెప్పాలంటే, 'ఇది ఉచితమైన వ్యాఖ్య'. కేవలం మాటలు చెబుతాడు కనుక టీచర్ ఇబ్బంది లేకుండా తప్పించుకోవచ్చు. అధికారం మాటలకు భయపడదు. విధేయులైన బానిసలను చూసుకుంటూ అధికారులు సుఖంగా నిద్రపోతారు. కానీ ఈ మాటలు కార్యరూపం దాల్చితే మాత్రం వర్గపాలన ప్రతాపం రుచిచూడవలసి వస్తుంది. వర్గ స్వభావం కోల్పోయిన పోలీసులు ప్రదర్శకులపై విరుచుకుపడతారు. టీచర్ల వర్గం మొత్తం ఎన్.సి.ఓ.లలాగా పనిచేసి నంతకాలం పాలకులకు ఎటువంటి భయం ఉండదు.

కమ్యూనిస్టులు ఇటీవల ఒక బహిరంగ సభలో మాట్లాడడం నేను విన్నాను. కార్మికులు దాదాపు నిరుత్సాహంగా చుట్టూ నిలబడి ఉన్నారు. కాని గుంపులో తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. గుమస్తా తరగతికి చెందిన స్త్రీ పురుషుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. కార్మిక వర్గం నుంచే వీరు వచ్చారు. కొంతమంది కార్మికవర్గానికే చెందినవారు ఇటువంటి యువజనులు తేలికగా ఫాసిస్టులవుతారు. వారు కలిగినవారు కాదు. కొంతమంది రోజువారి వేతనాలు, కొంతమంది జీతాలు పుచ్చుకుంటున్నారు. ఉపన్యాసాలకు వారు ఆటంకం కల్పిస్తూ వచ్చారు. అయినప్పటికీ వారిని నోరుమూసుకోమని చెప్పడానికి చుట్టూ ఉన్న కార్మికులకు ధైర్యం లేకపోయింది.

ఈ సంఘటన ఇంగ్లాండ్‌లో పరిస్థితులన్నిటినీ అద్దంపట్టి చూపుతున్నది. ఒకవైపు నిరక్షరాస్యులు, నిరాశకులోనైన కార్మికులు, మరోవైపు చిత్త చాంచల్యానికిలోనై యజమానులైన టోరీ వర్గానికి మద్ధతు ఇస్తున్న దిగువ మధ్య తరగతి వర్గం ఉన్నారు.



ప్రభుత్వ విద్య తన లక్ష్యాలను బాగానే సాధిస్తున్నట్టు దీన్ని బట్టి తెలుస్తున్నది.

తిరుగుబాటు దారులమైన మేము ప్రతిఘాతుక శక్తులను తక్కువ అంచనా వేసే అవకాశం ఉంది. కల్నల్ బ్లింప్‌ను జోక్‌గా తీసి పారెయ్యవచ్చు. కాని అతను కొమ్ముకాస్తున్న వర్గంతో మాత్రం తమాషాలు కుదరవు. ఒక్కొక్కప్పుడు చైతన్యం లేకుండా వ్యవహరిస్తున్నప్పటికీ చాలా తెలివిగా వ్యవహరించే వర్గం ఇది. ఈ వర్గం ప్రవేశపెట్టిన విద్యా విధానంలో సెకండరీ స్కూలు ప్రధానమైనది. కార్మిక వర్గానికి చెందిన పిల్లలను క్లర్క్‌లుగా, టీచర్లుగా, డాక్టర్లుగా ఇతర వృత్తులలో చేరడానికి వీలుగా శిక్షణ ఇవ్వడం సెకండరీ స్కూల్ విద్య లక్ష్యంగా నిర్ణయించారు. ఈ విధంగా కార్మిక వర్గం నుంచి శక్తివంతులను, స్త్రీ, పురుషులను విడదీశారు. వారికొక సామాజిక స్థాయి కల్పించి, పెట్టుబడిదారీ వ్యవస్థలో వాటా ఇచ్చి, యజమానుల ప్రయోజనాలతో వారి ప్రయోజనాలను ముడిపెట్టారు. జీవితంలో ఉన్నత ప్రయోజనాలు సాధించాలని జంతుప్రాయమైన ఆలోచనలను వారికి అంటగట్టారు. మన టీచర్లు సెకండరీ స్కూల్ చదివారన్నది పరిగణలోకి తీసుకున్నప్పుడు, సెకండరీ విద్యా లక్ష్యాలను ఆమోదించారని తెలుసుకున్నప్పుడు వారు అధికార శక్తులకోసం వినాశకరమైన పనులకు తెగిస్తారన్నది మనం తేలికగా అర్థం చేసుకోవచ్చు.

వేలాదిమంది టీచర్లు ఈ వ్యవహారమంతా అర్థం చేసుకోగలుగుతున్నారు. వారు సేవలు చేస్తున్న వ్యవస్థను మనస్ఫూర్తిగా ద్వేషిస్తున్నారు. ఈ పరిస్థితిని లేబర్ పార్టీతో మనం పోల్చి చూసినపుడు పార్టీలోని యువజనులు బ్రిటన్‌ను సోషలిస్టు దేశంగా మార్చే కృషి చేయాలని కోరుకుంటున్నారు. అయితే వయసు కారణంగా పిరికి వాళ్లుగా, మిత వాదులుగా తయారైన నాయకులు ఈ ప్రయత్నాలను సాగనివ్వకుండా అడ్డుపడుతున్నారు.

విద్యలో కూడా ఇటువంటి పరిస్థితే ఎదురవుతున్నది. యువతరం మార్పులు కోరుతున్నారు. వృద్ధులు పాత పద్ధతిలోనే కొనసాగాలని కోరుకుంటున్నారు. ఇంగ్లాండ్ ఉత్తర ప్రాంతంలో నేను ఒక ఉపన్యాసం ఇచ్చినపుడు ఒక టీచర్ నాతో ఏమన్నాడంటే! "నువ్వు చెప్పేది వినవలసిన అవసరం ఉన్నవారు ఉపన్యాసాలకు రావడంలేదు. వయసు మళ్లిన స్త్రీ, పురుషులంతా ఇళ్లలోనే ఉండిపోతున్నారు. వారు నేర్చుకోవలసిందేమీ లేదు. విద్య గురించి వారికంతా తెలుసు".

చాలాసార్లు నా కిటువంటి ఉత్తరాలు వస్తుంటాయి. "మాకు కఠినంగా వ్యవహరించే హెడ్మాస్టర్ ఉన్నాడు. స్కూల్లో మాకు ఎటువంటి స్వేచ్ఛ ఇవ్వడు. నేనేమి చేయాలి?" నేనందుకున్న చివరి లేఖకు నేనిచ్చిన జవాబేమంటే, "బయటకు వచ్చి చిల్లర కొట్టు పెట్టుకొని నిజాయితీగా జీవన భృతి సంపాదించుకో."

ఎల్లప్పుడూ మానవజాతి ముసలివాళ్ల పాలనలోనే ఎందుకుండాలి? సంవత్సరం, సంవత్సరం వయసు మీదపడుతున్న కొద్దీ మనం మితవాదులుగా తయారవుతాం. మార్పంటే భయపడుతుంటాం. మనం యవ్వనంలో ఉన్నప్పుడు మనల్ని మనం జీవితంతో మమేకం చేసుకుంటాం. మన ముందు అనేక సంవత్సరాల భవిష్యత్తును చూడగలుగుతాం. ప్రపంచాన్ని మార్చడానికి మనకు సమయం ఉంటుంది. వయసు మీదపడుతున్నప్పటికీ మనం జీవితంతో మమేకం అయ్యే ప్రయత్నం చేస్తాం. కానీ ఇది చాలా తక్కువ కాలం. యువజనులకున్నంత యుగాలకాలం వృద్ధులకు ఉండదు.

యువతకు వృద్ధులకు మధ్య ఉన్న తేడాలే సంపన్నులకు, పేదలకు మధ్య ఉంటాయి. యువతకు ఏమీ వుండదు. వృద్ధులకు ఇళ్లు, డబ్బు ఉంటాయి. వయసు, యువజనులను నియంత్రించే ప్రయత్నం చేస్తుంది. సంపదలు, అధికారం కోసం యువతచేసే డిమాండ్ల నుంచి రక్షణకు వయసు మీరినవారి మితవాదం దోహదం చేస్తుంది.

యువతకు వయసుమీరిన వారికి మధ్య నిరంతరం అతశ్చేతనమైన మౌన పోరాటం కొనసాగుతూనే ఉంటుంది. కానీ ఎక్కువ మంది యువజనులు, వృద్ధులకే మద్దతు ఇవ్వడంతో వృద్ధులే విజయం సాధిస్తుంటారు. ఇది విపరీతమైనదిగా కనపడుతుంది. కాని ఇది విషాదభరితమైన వాస్తవం. ఈ విషయంలో యువతకు రెండే మార్గాలుంటాయి. తండ్రిని ఆమోదించి మితవాదిగా మారడం. లేదా తండ్రిని తిరస్కరించి తిరుగుబాటు బావుటా ఎగరేయడం. 70 సంవత్సరాల వయసున్న నెవిల్లీ బాంబర్లిన్‌కు జాతీయ వ్యవహారాల నియంత్రణను అప్పగించడమనేది యువతలో అధిక భాగం వృద్ధుడైన తండ్రికి మద్దతు ఇస్తున్నారన్నది రుజువు చేస్తున్నది.

ఇది రాజ్యాంగ యంత్రానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు. ఇది ఇంటిలో సమస్యకు చాలా దగ్గరగా ఉంటుంది. నిజం చెప్పాలంటే ఇది ఇంటిలోని సమస్యే. ప్రతి రాజ్యాంగ యంత్రం ఇంటి ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. ఇల్లు అనేది సూక్ష్మరూపంలోని రాజ్యాంగయంత్రం. ఇంట్లో పాలకుడు ఉంటాడు. ఇంటిలో క్రమశిక్షణ, విధేయత కొనసాగుతాయి. ఇంట్లోని పౌరుల(యువత) స్వేచ్ఛలో జోక్యం చేసుకునే చట్టాలుంటాయి. ప్రతిష్ఠ, నిబద్ధత, సెక్స్‌పరమైన పవిత్రత ఇంట్లో లక్ష్యాలుగా ఉంటాయి. సంతోషభరితమైన ఇల్లు కూడా జైలు వాతావరణం కలిగి ఉంటుంది. స్కూలు మాదిరిగానే ఇల్లు కూడా తేలికగా ఆమోదం తెలిపే పౌరులనే తయారుచేస్తుంది. పెరటితోట గోడలు దాటి ప్రవహించవలసిన భావావేశాలకు ఇల్లు అడ్డుకట్ట వేస్తుంది. అందువల్ల ఇల్లు ప్రమాదకరమైనది. తల్లిదండ్రులు విస్తృతమైన అధికారంతో స్వేచ్ఛకోరే పిల్లలను అణగదొక్కుతున్నందువల్ల ఇల్లు ప్రమాదకరమైనది. సెక్స్ నియంత్రణలు, నీతి సూత్రాల



కారణంగా ఇల్లు ప్రమాదభరితమైనది. సెక్స్, వ్యక్తమయ్యే మార్గాలకోసం వెతుకుతుంది. కానీ ఇంట్లో అంతశ్చేతనంగా అది కుటుంబ సభ్యులచుట్టూ అల్లుకుపోతుంది. ఫలితంగా తల్లిదండ్రులు (లేదా సోదరీ సోదరులు) పట్ల ప్రేమపూరితమైన ఆవేశం, ద్వేషపూరితమైన ఆవేశంగా మారిపోతుంది. ఈడిపస్ కాంప్లెక్స్ ఏర్పడి అన్ని రకాల అనర్థాలకు దారితీస్తుంది.

బాలుడు తన భావావేశాలను తండ్రిపై చాలా ఎక్కువగా కేంద్రీకరించడానికి ఇంటి వాతావరణం ప్రోత్సహిస్తుంది. అది ప్రేమ, భయం, ద్వేషాలతో కూడుకొని ఉంటుంది. ఈ ఆవేశాల మధ్య నిరంతరం సంఘర్షణ జరుగుతుంది. ఈ సంఘర్షణలో ప్రేమపాత్ర ఎక్కువగా ఉంటే పిల్లవాడు తనను తండ్రితో పోల్చుకొని ఆయనకు చేరువవుతాడు. వీధి చివర జరిగే సమావేశాలకు వెళ్లి కమ్యూనిస్టులను కేకలువేసి గేలిచేస్తాడు. తండ్రిపట్ల ద్వేషం ఎక్కువగాఉంటే తిరుగుబాటుదారుగా తయారవుతాడు. ఇటువంటి యువకుని లక్ష్యం వేరుగా ఉన్నందువల్ల అతను మంచి కమ్యూనిస్టు కాలేడు.

బాలికకు కూడా తండ్రితో ఇదేవిధమైన వైరుధ్యం ఉంటుంది. కానీ బాలిక విషయంలో తండ్రిపట్ల ప్రేమ విజయం సాధించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. బాలికలో ద్వేషంతో కూడిన అంశాలు ప్రత్యర్థియైన తల్లిపై కేంద్రీకృతమవుతాయి. కాని తల్లి అధికారం చెలాయించడం లేదు కనుక, రాజకీయ ధోరణిని ప్రేమను పొందే తండ్రి సర్దుబాటు చేస్తాడు. ఆ బాలిక ప్రతిఘాతక శక్తులకు ఓటువేస్తుంది.

ఇల్లు ఎలా ఉందనేది, రాజ్యాంగ యంత్రానికి చాలా విలువైనదని స్పష్టంగా తెలుస్తూనే ఉంటుంది. రాజ్యాంగ యంత్రం విడాకుల చట్టాలు రూపొందించడంలో జాప్యం చేయడానికి మతంకన్నా ఆర్థికపరమైన కారణాలే ముఖ్యమైనవి. కుటుంబ బంధాలను సడలిస్తే ఇంటికి ఉన్న విలువ తగ్గి పోతుంది. విధేయులైన వారిని తయారుచేసే కార్యక్రమం వెనుకబడుతుంది. సోవియట్ యూనియన్ ఏర్పాటైన తొలిరోజుల్లో "కుటుంబాన్ని రద్దు చేస్తారా!" అని మితవాదులు భయంతో కేకలు పెట్టేవారు. కానీ రష్యాలో కుటుంబాన్ని రద్దు చేయలేదు. రాజ్యాంగ యంత్రం భద్రత కోసం కుటుంబాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలనే పెట్టుబడిదారీ విధానం పాఠాన్ని సోవియట్ యూనియన్ కూడా నేర్చుకోవడమే దీనికి కారణం. అందువల్ల ఫాసిస్టు దాడిని ఎదుర్కోడానికి రష్యాను కలుపుకుపోవాలని కాంటర్‌బరీ ఆర్చ్‌బిషప్ డిమాండ్ చేయడానికి మార్గం సుగమమైంది.

కుటుంబం ప్రభావానికి స్కూల్ విద్య విరుగుడని సైద్ధాంతికంగా చెబుతారు. కానీ ఇది నిజం కాదు. నిజానికి కుటుంబంలో జీవనాన్ని స్కూల్ విద్య మరింతగా ప్రమోట్ చేస్తుంది. ఇంట్లో ఉండే తండ్రి, తల్లి, సోదరులు, సోదరీమణులు, క్రమశిక్షణ, విధేయతలకు

ప్రత్యామ్నాయాలు స్కూల్లో కూడా ఉంటాయి. ఫలితంగా టీచర్ సైకాలజీ భయంకరంగా తయారవుతుంది. 40 లేదా అంతకంటే ఎక్కువ మంది ఉన్న (క్లాసులో) టీచర్ తండ్రివంటివాడు. ఆయనమాటే చట్టం. ప్రతి తండ్రి పిల్లలపట్ల చూపే ప్రేమను పట్టించుకోడు. ద్వేషాన్ని మాత్రం ఒంటబట్టించుకొని ఉంటాడు. క్రమశిక్షణా వాది విషయంలో ఇది వాస్తవం. అతనికి ఇవ్వడానికి ద్వేషం మినహా వేరేదీ ఉండదు. ఇంట్లోని చెడు అంశాలను సరిదిద్దే కృషి ఎట్టి పరిస్థితిలోనూ స్కూల్లో జరగదు.

బోర్డింగ్ స్కూల్‌లో కొద్దిగా తేడా ఉంటుంది. ఏ విధంగా చూసినప్పటికీ ఈ స్కూలు మరింత ప్రమాదకారి. ఆడపిల్లలకు మగ పిల్లలకు వేరు వేరుగా బోర్డింగ్ స్కూళ్లుంటే అది మరీ ప్రమాదం. మగ పిల్లలు టీచర్లలో, తోటివారిలో అంతా మగవారినే చూస్తుంటారు. ఆడపిల్లల స్కూల్లో బ్రహ్మచారిణులు గొర్రె కాపలా కాస్తుంటారు. ఇటువంటి స్కూళ్లలో స్వలింగ సంపర్కం అభివృద్ధి చెందడానికి అవకాశం ఎక్కువ. పద్దెనిమిది సంవత్సరాల కాలంలో మా కోఎడ్యుకేషన్ స్కూల్లో ఒక్కరు కూడా స్వలింగ సంపర్కులు కాలేదు.

అయితే ఇంటిని రద్దు చేయాలంటారా? లేదు. చిన్న పిల్లలకు ఇల్లు చాలా అవసరం. తల్లిదండ్రుల సమక్షంలో భద్రంగా ఉన్నామన్న భావనపిల్లలకు అవసరం. పిల్లలకు మూడు లేదా నాలుగు సంవత్సరాల వయసు వచ్చే వరకు ఇంటి అవసరం ఉంటుంది. కుటుంబానికి భావావేశపరంగా అతుక్కుపోకుండా ఆ వయసులో పిల్లలను బోర్డింగ్ స్కూల్‌కు పంపాలి. ఆ స్కూల్లో వారు కోరుకున్నంత సంతోషం లభించాలి. నా స్కూలు వంటి స్కూళ్లు ఇంకా అనేకం ఏర్పాటుచేయాలని నేను కోరుకుంటున్నానని ఈ సందర్భంగా నేను అంగీకరిస్తాను. మూడు సంవత్సరాలు ఆపై వయసున్న పిల్లలు మా స్కూల్లో చేరతారు. ఇంటి ధ్యాస లేకుండా రోజంతా సంతోషంగా గడుపుతారు. కానీ సెలవులు వచ్చినపుడు ఇంటికి వెళ్లాలని వారు కోరుకుంటారు. ఎక్కువకాలం ఇంటి దగ్గరే ఉండాలని వారు కోరుకోరు. మహా అయితే రెండు వారాలపాటు సెలవులు వస్తాయి. ఇంటి దగ్గర చాలా డల్‌గా ఉంటుందని వారు ఫిర్యాదు చేస్తారు. తోటివారికి దూరంగా ఉండడమే దీని కారణం. "పిల్లలకు తక్కువ రోజులు సెలవులు ఇస్తే బాగుంటుందని" అప్పుడప్పుడు తల్లిదండ్రులు అంటుంటారు.

పిల్లలతో వ్యవహరించడం స్పెషలిస్టుపని అవుతుంది. చాలామంది తల్లిదండ్రులకు ఈ పని ఎలా చేయాలో తెలియదు. పిల్లవాడికి జ్వరం వస్తేనో, లేదా కడుపునొప్పి వస్తేనో తమచేతకాని తనాన్ని గుర్తించి వెంటనే డాక్టర్ దగ్గరకు పరుగెత్తుతారు. కాని పిల్లవాడు ఏడ్చినపుడు లేదా దొంగతనం చేసినపుడు లేదా కోపంతో చిందులు వేసినపుడు పిల్లల సైకాలజీ తమకు తెలియదని ఎన్నడూ అనుకోరు. తమంత తామే పిల్లలను



సరిదిద్దుతారు. చాకచక్యంతో దొంగతనం చేసే ఏడు సంవత్సరాల వయసున్న బాలుడిని నేను సరిదిద్దవలసి వచ్చింది.

నేనొక రోజున అతనితో "నా ముఠాలో చేరతావా! విల్లీ" అన్నాను.

"ఏ ముఠా" అన్నాడు.

"నువ్వు నా ముఠాలో చేరితే దొంగతనాలు చేయాల్సి ఉంటుంది. నేను దొంగతనం చేసిన వాటిలో సగం నీకిస్తాను. నువ్వు దొంగతనం చేసిన వాటిలో సగం నాకివ్వాలి" అని వివరించాను.

అతను "ఒ.కె" అన్నాడు. మరునాడు నాకు అతను ఆరు పెన్నీలు బహుమతి ఇచ్చాడు.

అతనికి నయం చెయ్యాలంటే అన్ని విధాల అతని పక్షమే ఉండాలి. నేనిది చేయగలను. ఆ విధానం నాకు తెలుసు. ఆ పిల్లవాడి పక్షం వహిస్తే ఎటువంటి అవకాశం ఉంటుందో నాకుస్పష్టంగా తెలుసు. కాని తండ్రి ఇటువంటి పని చేయలేడు. ఇటువంటి పని చేయడం తెలిసినప్పటికీ తండ్రీ కొడుకుల మధ్య సంబంధం కారణంగా ఇది సాధ్యపడదు.

కొద్దిరోజుల తరువాత నేను నా పాత్ర నిర్వహించవలసిన సమయం వచ్చిందని నేననుకున్నాను. అతనికి నేనొక పెన్నీ ఇచ్చాను.

"ఇదెందుకు?" అనడిగాడు.

"అదా" అన్నాను."ఒక సందర్శకుని దగ్గరనుంచి రెండు పెన్నీలు కొట్టేశాను. ఇది నీకు రావలసిన సగం వాటా" అన్నాను.

నేను దూరంగా వెళ్లిపోతున్నప్పుడు, "నీల్ రెండు పెన్నీలు దొంగతనం చేయలేదు. అతను అబద్దాలకోరు" అని విల్లీ స్టాఫ్‌లో ఒకరితో అనడం నా చెవిలోపడింది.

ఇది నాకు శుభవార్త. నేను అబద్దాలకోరునని అతనివంటి వాడినేనని అతను గుర్తించడం అవసరం. అప్పుడు ఇద్దరం సమానులమవుతాం. కానీ తండ్రి ఇటువంటి ప్రయత్నం చేస్తే తండ్రి అబద్దాల కోరు అనేది అర్థం చేసుకోడానికి పిల్లవాడు భయపడతాడు. ఈ ఆలోచనను తప్పించుకోడానికి అతను ప్రయత్నించేస్తాడు. ఇప్పటికే ఎన్నో అణిచివేతలను ఎదుర్కొంటున్న ఆ బాలుడు మరో అణచివేతను జోడించుకోవలసి వస్తుంది.

ప్రతి స్కూల్‌లో ఇటువంటి సమస్యలను పరిష్కరించే వీలుండాలి. కానీ ఏ స్కూల్‌లోను ఇటువంటి అవకాశం ఉండదు. ఎన్.సి.ఓ.లకు ఇటువంటి వ్యూహం నేర్పకపోవడమే దీనికి కారణం. స్కూల్ టీచర్ పోస్టుకు దరఖాస్తు చేసిన వారిని, పిల్లల గురించి ఏమి తెలుసని స్కూల్ అధికారులు అడగరు. సబ్జెక్ట్ బాగా తెలిస్తే చాలు. కాని

ఒక ప్రశ్న తప్పకుండా అడుగుతారు. "నీ క్రమ శిక్షణ ఎలా ఉంటుంది?"

స్కూలు కూడా రాజ్యాంగ యంత్రానికి సైనిక బ్యారెక్. క్రమశిక్షణ లేకుండా ఎలా ఉంటుంది? రాజ్యాంగ యంత్రం చాలా నెమ్మదిగా కార్యకలాపాలు సాగిస్తుంది. అది కొరడా దెబ్బలు నిషేధిస్తుంది. కాని ఉరితీయడం కొనసాగిస్తుంది. రాజ్యాంగ యంత్రానికి ప్రేమ ఉండదు. అది అమలు చేసే న్యాయానికి దయాగుణం అసలు ఉండదు. దాని సిద్ధాంత మేమంటే విధేయత చూపు లేదా శిక్ష అనుభవించు. దాని శిక్షల్లో మానసికపరమైన పరిజ్ఞానానికి తావులేదు. దాని జైళ్లు భయంకరంగా ఉంటాయి. నైతికవాద క్రూరత్వంతో కూడుకొని ఉంటాయి. అది విధించే శిక్షలు ప్రతీకారంతో కూడుకొని ఉంటాయి.

తీవ్రమైన శిక్షలు విధించినందువల్ల తిరుగుబాట్లు ఆగిపోవని అతి మూర్ఖుడైన న్యాయమూర్తికి కూడా తెలుసు. తాము దేశభక్తితో వ్యవహరిస్తున్నట్టు నిజాయితీగా నమ్మేవారిని ఎటువంటి శిక్షలు నిరోధించలేవని తెలివితక్కువ వాళ్లుకూడా అర్థం చేసుకోగలుగుతారు. బాంబులు వేసేవారు నిర్దోషులని నేను చెప్పడం లేదు. దేశభక్తులమనే వారిలో ఉన్న న్యూరోసిస్ గురించి నేను మాట్లాడుతున్నాను. పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించినప్పటికీ న్యూరోసిస్‌ను నయం చేయలేరని నేను స్పష్టం చేస్తున్నాను.

పాత కాల్వినిస్టుల మాదిరిగానే రాజ్యాంగయంత్రం శిక్షలు విధిస్తుంది. పాపం చేసిన వ్యక్తి పశ్చాత్తాపం పొందాలి. లేని పక్షంలో శిక్షలెందుకు అన్న ధోరణి కొనసాగుతుంది. ప్రభుత్వ విద్యా విధానంలో కూడా ఇదే ధోరణి కొనసాగుతున్నది. పిల్లలు స్కూలు చట్టాలను అతిక్రమిస్తే వారు శిక్ష అనుభవించవలసిందే. నేరం వెనుక ఉన్న కారణమేమిటనే కొత్త విధానాన్ని పట్టించుకోడంలేదు. అది కష్టతరమైనందున ఈ విధంగా జరగడం లేదు. ఈ విధానంలో ద్వేషం వెలిగక్కే అవకాశం లేదు. అందువల్ల దీన్ని పట్టించుకోడం లేదు. ఇంగ్లాండ్‌లో టీచర్లను చట్టాలు ఆమోదించవలసిందిగా ఒత్తిడి చేయడానికి, జర్మనీలో పిల్లలు, పెద్దలు కూడా హిట్లర్‌ను ఆమోదించాలని చేస్తున్న ఒత్తిడికి మధ్య ఎటువంటి తేడా లేదని నేను స్పష్టం చేస్తున్నాను. రెండూ అధికారానికి సంబంధించిన రాజకీయాలే. అల్పుడైన వ్యక్తి అంతరాత్మ ప్రమేయం లేకుండా వ్యవహరించడానికి రెండు వ్యవస్థలు అవకాశం కల్పిస్తున్నాయి.

స్కూల్‌ను రాజకీయాలకు దూరంగా ఉంచుతున్నామని ఇంగ్లాండ్ చాలా గొప్పగా చెప్పుకుంటుంది. కానీ ఈ స్కూళ్లన్నీ రాజకీయాలమయం. అవి తప్పుడు రాజకీయాలు. పెట్టుబడిదారీ వ్యవస్థలోని స్కూళ్లను సంస్కరించడం సాధ్యం కాదు. అందువల్ల ప్రతి జీవితంలో రాజకీయాలు ప్రధాన లక్ష్యంగా ఉండడం అవసరం. టీచర్ల పత్రికలలో



బోధనా పద్ధతులు, వేతనాలు, టైమ్‌టేబుల్స్ గురించి కాకుండా కూకటి వేళ్లపై దాడి చేయాలి. పిల్లలను బానిసలుగా చేసే విద్యా విధానాన్ని తిరస్కరించడంపై దృష్టి కేంద్రీకరించాలి. ఇటీవల నేను సౌత్ వేల్స్‌లో ఉపన్యసించి నపుడు, టీచర్లు అతివాదులుగా తయారు కావడం చూసి నేను ఎంతగానో ఆనందించాను. స్కూళ్ల గురించి వారికి ఎటువంటి భ్రమలు లేవు. సామాజిక సమస్యలో విద్యా సమస్య స్వల్పమైనదని వారు గ్రహించారు. వారు బానిసత్వానికి విధేయులు కారు. వారికి ఏమి కావాలో స్పష్టంగా తెలుసు. ఇంగ్లాండ్‌లోని టీచర్లంతా ఇదే విధమైన వర్గ చైతన్యంతో వ్యవహరిస్తే పిల్లల భవిష్యత్తు ప్రస్తుత పరిస్థితులకన్నా ఎంతో మెరుగ్గా తయారవుతుంది. టీచర్ వృత్తిప్రయోజనాలు, కార్మిక వర్గ ప్రయోజనాలు ఒకటే. ఈ రోజున కార్మికుల పిల్లలకు పాలకవర్గానికి ఏ విధంగా విధేయులుగా ఉండాలనేది బోధిస్తున్నారు. ఈ విద్యకు భవిష్యత్తు లేదు. దేశంలోని స్వేచ్ఛలేని కార్మికులు, దోపిడికి గురయ్యే వారితో టీచర్ల సంబంధాలపై భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.

# 3. టీచర్-అతని అహం (Ego)

ప్రజల ముందుకువచ్చే స్త్రీ, పురుషులలో విచిత్రమైన సైకాలజీ వ్యక్తమవుతుంది. నాటకరంగం సభ్యులలో ఇది స్పష్టంగా వ్యక్తమవుతుంది. నటుడు మామూలు వ్యక్తులతో మాట్లాడేటపుడు అతని ముఖంలో బోర్‌కొట్టిన లక్షణాలు కనిపిస్తాయి. శ్రోతలు తాను చెప్పేది వినాలని నటుడు కోరుకుంటాడు. ప్రజల ముందుకు వచ్చే ఉపన్యాసకులుగాని నటుడు గాని ఇదే విధంగా కోరుకుంటారు. నేను రెండు గంటలపాటు శ్రోతలముందు ఉపన్యసించి, స్టేజ్ దిగుతున్నపుడు, తన క్లాస్‌లో బాలుడు లేదా బాలిక దొంగతనం చేస్తున్నారని, ఏమిచేయాలి? అని ఎవరైనా అడిగితే నేను అంతగా ఆసక్తి చూపలేను. బాగా అలసిపోయినందువల్ల కూడా ఇలా జరగదు. అదే ప్రశ్న వేదిక మీద అడిగితే ప్రజల ముందు చాలా సంతోషంగా జవాబిచ్చి ఉండేవాడిని. అంతేకాదు రెండు గంటలపాటు ప్రజలముందు మాట్లాడినపుడు నా అహం పెరుగుతుంది. అప్పుడు ఒక వ్యక్తికి జవాబివ్వడమంటే విసుగు పుడుతుంది. ఒక వ్యక్తికి నా సామర్థ్యం అంతా వినియోగించడంపై మనసురాదు. గ్లాడ్‌స్టోన్ తనతో పబ్లిక్ మీటింగ్‌లో మాట్లాడినట్టు మాట్లాడాడని విక్టోరియారాణి చేసిన ఫిర్యాదు వాస్తవమే కావచ్చు. రాణీ కూడా ఒక వ్యక్తి మాత్రమే. వాగ్నర్ రాసిన సంగీతం తానొక్కడినే వినాలని లడ్విగ్ ఆఫ్ బవేరియా పట్టుబట్టినపుడు నటులు సంగీతకారులకు ఎంతవరకు ఆగ్రహం వచ్చిందోనని నేను ఆలోచిస్తుంటాను.

టీచర్ ప్రతిరోజూ అనేకమంది శ్రోతలముందు ఉపన్యసిస్తుంటాడు. ఆ శ్రోతలు ఎలాంటి వారంటే అవకాశం దొరికితే క్లాస్‌రూమ్ నుంచి వెళ్లి పోయి వేరే ఏదైనా చెయ్యాలని కోరుకునేవారు. టీచర్ తనకు అర్థంకానివి విద్యార్థులకు బోధిస్తుంటాడని, వాటిని అర్థం చేసుకోడానికి విద్యార్థులకు ఆసక్తి ఉండదని ఒక పాత నిర్వచనం ఉంది. ఇది వాస్తవం.

శ్రోతలను బలవంతంగా కూర్చోబెట్టి విద్యాబోధన చెయ్యడం వల్ల టీచర్‌కు ఎటువంటి సంతృప్తి మిగలదు. అతని అహం సంతృప్తి పొందలేదు. నా సొంత స్కూల్‌లో పిల్లలకు ఇష్టం లేకపోతే క్లాస్ నుంచి వెళ్లిపోవచ్చు. కావాలనుకుంటే పది సంవత్సరాలైనా సరే క్లాసులకు హాజరు కానవసరం లేదు. టీచర్ తన అహం విస్తృతపరచుకోడానికి కొంత పరిమితి ఏర్పడుతుంది. ఇటువంటి పరిస్థితులలో విద్యాబోధన చేయాలంటే టీచర్ తన శక్తినంతా కూడగట్టుకోవలసి ఉంటుంది. తాను అసమర్థంగా బోధిస్తే క్లాసునుంచి వెళ్లిపోయేవారి సంఖ్య పెరిగిపోతుందని, అది తన అసమర్థతను రుజువు చేస్తుందని



టీచర్‌కు తెలుసు. టీచర్ల సమర్థత తెలుసుకోడానికి పిల్లలే అసలైన న్యాయమూర్తులు.

ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్‌కు తన ప్రాముఖ్యత గురించికాని, తన సమర్థత గురించికాని స్పష్టమైన అవగాహన ఉండదు. అందువల్ల తనను తాను అపర దేవుడిగా చిత్రించుకునే సైకాలజీకి తేలికగా అవకాశం చిక్కుతుంది. అతను ఎల్లప్పుడు కరక్టే. నేనొక విశ్వవిద్యాలయంలో ఉపన్యసించినపుడు ఒక ప్రశ్నకు జవాబుగా "నాకు ఏమాత్రం ఈ విషయం తెలియదు", అని చెప్పాను. విద్యార్థులు ఆశ్చర్యపోయారు. ఎందుకు ఆశ్చర్యపోతున్నారని వారిని అడిగాను. వారేమి జవాబిచ్చారంటే: "మీరొక ప్రశ్నకు జవాబు తెలియదని అన్నారు. అందువల్ల ఆశ్చర్యపోతున్నాం. ఒక ప్రొఫెసర్‌ను లేదా లెక్చరర్‌ను ఏదైనా ప్రశ్న అడిగితే వారికి తెలియనిదంటూ ఏదీ ఉండదు. వారెన్నడూ తమకు జవాబు తెలియదని చస్తే చెప్పరు".

టీచర్‌కు అన్ని విషయాలు తెలుస్తాయి. లేని పక్షంలో సర్వశక్తి సమన్వితమైన దైవత్వాన్ని కోల్పోతాడు. అతను చిన్నపిల్లవాడైపోతాడు. అలా జరిగితే క్రమశిక్షణ దెబ్బతింటుంది. సమ్మర్ హిల్ స్కూల్లో టీచర్లకు అన్ని జవాబులు తెలియకపోవడం అది విజయవంతం కావడానికి సగం కారణం. వయసులో మాత్రమే పిల్లలకన్నా టీచర్లు సీనియర్లు. తెలివితేటల్లో, ఒరిజినాలిటీలో మాత్రం కాదు. మా స్కూల్లో కెమిస్ట్రీ టీచర్ కార్క్‌హిల్‌కు కుండలు చేయడం తెలియదు. అతను పిల్లలతో కలిసి నేర్చుకున్నాడు. ఫలితంగా నైపుణ్యం కలిగిన కుండలు తయారయ్యాయి. సంవత్సరం తరువాత సంవత్సరం అతని ప్రాముఖ్యం తగ్గుతుంటుంది. తాను కేవలం కుమ్మరి సారె తిప్పే నిమిత్త మాత్రుడనని విశ్వసించడం ప్రారంభిస్తాడు. ఈ కారణం వల్ల టీచర్లంతా తమకు తెలిసిన సబ్జెక్ట్ గురించి గోరంతలు కొండంతలుగా చెప్పుకుంటుంటారు. ఆ విధంగా చెప్పుకోకపోతే నేను పెద్ద ప్రమాదంలో పడతాను. గణితం అంటే ఎక్కువమందికి ఇష్టం ఉండదనేది అంగీకరించవలసి వస్తుంది. కానీ గణితం ప్రాముఖ్యం గురించి నొక్కి చెప్పడం వల్ల నాకూ ప్రాముఖ్యం ఉందని చెప్పుకోవచ్చు.

సబ్జెక్ట్ గొప్పదైతే టీచర్ కూడా గొప్పవాడే కదా!

ఇతర వృత్తుల వారితో పోల్చినపుడు టీచర్లకు ఇతరుల నుంచి నేర్చుకోవడం ఇష్టం ఉండదు.ముదుసలి టీచర్‌కైతే నేర్చుకోవలసిన అగత్యమే లేదు. లేడీ టీచర్లు కొంత మేరకు ఇతరుల నుంచి నేర్చుకోడానికి ప్రయత్నిస్తారు. కాని మగ టీచర్లు దీనికి ససేమిరా ఇష్టపడరు.

ఇక్కడ కూడా అహం యొక్క అంతులేని శక్తిని మనం చూడవచ్చు. ఒక వ్యక్తిగత ఉదాహరణతో ఇది వివరిస్తాను. కొద్ది సంవత్సరాల క్రితం ఓస్లోలో ఉపన్యసిస్తున్నప్పుడు

నేనొక వ్యక్తిని కలుసుకున్నాను. అతనిపట్ల నాకు ఆసక్తి బాగా పెరిగింది. ఆయన సైకాలజిస్టు, ఆయన పేరు విల్‌హెల్మ్ రైక్. ఆయనకు గొప్ప ఆలోచనలున్నాయి. ఆయన ఫ్రాయిడ్ కంటే ముందుకు పోగలిగాడు. ఆయన పరిశోధనల గురించి ఇంకాఎక్కువ తెలుసుకోవాలని కోరుకున్నాను. చివరకు ఆయన వద్దకు విద్యార్థిగా వెళ్లాలని నిర్ణయించుకున్నాను.

మానసికపరమైన అణచివేత కండరాలలో కనపడుతుందన్నది ఆయన కనుగొన్న విషయాలలో ఒకటి. మెడ, పొట్ట తదితర చోట్ల కండరాలు అణచివేత కారణంగా బిగుసుకుపోతాయి. ఈ పద్ధతి గురించి తెలుసుకోవాలంటే ప్రతి ఒక్కరూ దాన్ని అనుభవంలో తెలుసుకోవలసిందే. గత రెండు సంవత్సరాలుగా సెలవులు వచ్చినప్పుడల్లా నేను ఓస్లో వెళుతూనే ఉన్నాను. (ఓస్లోలోనే నేను ఈ పుస్తకం రాశాను). రైక్ పద్ధతిని అనుభవంలో చూశాను. నా మెడ కండరాలు బిగిసిపోయి ఉన్నట్టు రైక్ కనుగొన్నాడు. ఆయన నా మెడ వెనుక చేతితో తాకినపుడల్లా కొద్దిగా నొప్పి పుట్టేది. రోజుల తరబడి ఆయన నా మెడపైనే దృష్టి కేంద్రీకరించాడు. నేను ఇబ్బంది పడడం ప్రారంభమైంది. చివరకు నేను లేచి కూర్చొని కళ్లలోకి చూస్తూ ఈ విధంగా చెప్పాను.

"రైక్ నేనిప్పుడే ఒక విషయం కనుగొన్నాను. నువ్వు చెప్పే ఏ మాట నేను నమ్మడం లేదని కనుగొన్నాను. నీ కండరాల సిద్ధాంతంలో నాకు నమ్మకం లేదు. నువ్వు మోసగాడివి." అన్నాను.

నేను మళ్లీ సోఫామీద పడుకున్నాను. రైక్ నా మెడ వెనుక చేతితో తడిమాడు.

"నిజంగా నా నొప్పి తగ్గిపోయిందని" కేక పెట్టాను.

"అవును" అని రైక్ అన్నాడు. "బిగువు కూడా తగ్గిపోయింది" అన్నాడు.

మెడ కండరాలు బిగుసుకు పోయిన వారిలో అసూయ, ద్వేషం ఎక్కువగా ఉంటాయనేది రైక్ అభిప్రాయం.

ఇతరుల నుంచి నేర్చుకోడానికి నా మెడ కండరాల నుంచి ప్రతిఘటన ఎదురవుతుందన్నది దీనికి వివరణగా చెప్పుకోవచ్చు. ఆ తరువాత ఇతరుల నుంచి నేర్చుకోవడం నాకు తేలికగా సాధ్యమైంది. వింతగొలిపే విధంగా రైక్ పుస్తకాలు కూడా నేను తేలికగా చదవగలిగాను. రైక్ జర్మన్ పుస్తకాలు బిగువుగా ఉంటాయని అంతకు ముందు ఫిర్యాదు చేస్తుండేవాడిని.

నేను రైక్‌తో మాట్లాడడం కొనసాగించాను.

''అతని నుంచి నేర్చుకోడానికి నేను చైతన్యంతో ప్రతిఘటించినట్టు అంగీకరిస్తున్నాను. నాకు 55 సంవత్సరాలు, నీకు 45 సంవత్సరాలు. నేను పేరు ప్రఖ్యాతలున్న చైల్డ్ సైకాలజిస్టును. నీ దగ్గరకు వచ్చి కొత్త విషయాలు నేర్చుకోవడం నేను



అవమానంగా భావించాను".

నేను అతి ముఖ్యమైన విషయం ఒకటి తెలుసుకున్నాను. నాలో అభివృద్ధి జరగకుండా నా అహాన్ని అడ్డం పెట్టుకుంటున్నట్టు తెలుసుకోగలిగాను. ఈ విధంగా తెలుసుకోవడం లేదా కనుగొనడం నా జీవితంలో అతి ముఖ్యమైనది. రైక్ ప్రతిభతో నేనిది తెలుసుకోగలిగాను. లేకపోతే ఏమి జరిగేదో చెప్పడం కష్టం.

దైవత్వంతో పోల్చుకునే టీచర్ల గురించి రాసేటప్పుడు, నాకు బాగా తెలుసుననే అభిప్రాయంతో ఉన్నాను. మన అహాలు-మన అభివృద్ధికి ఆటంకాలు కల్పించే పద్ధతులను తెలుసుకోవడం ఎంతైనా అవసరం. వర్తమానాన్ని అనుకరించే ప్రయత్నం చేస్తూనే గతాన్ని పట్టుకు వేలాడడం అహం ప్రదర్శించే ప్రమాదకరమైన లక్షణం. బాల్య చాపల్యపు అహం స్థాయికి అణచివేసుకోవడం చాలా తేలిక. పిల్లలతో నివసించడం వల్ల ఇది మరీ తేలికవుతుంది. పెద్దల అహం మధ్య ఘర్షణ నెలకొన్నప్పుడు ఇచ్చి పుచ్చుకోవడం జరుగుతుంది. కోర్టులలో వాదనల సందర్భంగా జరిగినట్టే ఇది కూడా జరుగుతుంది. స్కూల్ రూమ్‌లో పెద్దల అహం, బాల్యపు అహం స్థాయికి దిగజారుతుంది. పిల్లలతో వాదన సాగడమే దీనికి కారణం. క్లాసు రూమ్‌లో అల్పంగా వ్యవహరించడం, అల్ప విషయాలకు ప్రాధాన్యత ఇవ్వడం తేలిక. దీనికితోడు స్కూల్‌లో పిల్లల అహాలను తక్కువగా చూడడం సర్వసాధారణం. పిల్లలకు ప్రధానంగా ఆటలలో ఆసక్తి ఉంటుంది. క్లాస్‌లో ఆటలాడడం నిషేధం. టీచర్‌కు కూడా ఇది వర్తిస్తుంది. ప్రతిష్ట కోసం టీచర్ ఆటలలో ఆసక్తిని అణుచుకుంటాడు. అందువల్ల ఒక విద్యార్థిపై వేసిన జోక్‌కు అందరూ నవ్వుతుంటారు. నవ్వడం కూడా ఆటే. క్లాస్ రూమ్‌లో నవ్వడం ద్వేషంతో కూడుకున్నది. అయినప్పటికీ ఇది భావావేశాలు వెలికిరావడానికి దోహదం చేస్తుంది. టీచర్ అహం రక్షణకు క్రమశిక్షణ ఉపయోగపడుతుంది.

ఈ పరిస్థితిలో టీచర్ పిల్లలకు ఆదర్శంగా ఉండాలా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. వృద్ధుడైన స్కూల్ టీచర్ ఈ విషయంగురించి ఎక్కువగా ఆలోచిస్తాడు. వీధి మలుపులో విద్యార్థులెవరైనా కనపడితే వెంటనే తను పీల్చే పొగాకు పైప్ దాచేస్తాడు. కొంతమంది టీచర్లు బార్‌కు వెళ్లి మద్యపానం చెయ్యాలంటే ఆ బార్ తమ పట్టణానికి లేదా గ్రామానికి బాగా దూరంగా ఉంటేనే వెళతారు. టీచర్లను ఒక వర్గంగా పరిగణిస్తే వారు ప్రవర్తనలో, ఔన్నత్యంలో ఆరధ్యంగా ఉండాలని కోరుకుంటారు. 1921 ప్రాంతంలో జర్మనీలో ఈ ఆదర్శం చాలా ఎక్కువగా ఉన్నట్టు నేను చూశాను.

విద్యపట్ల ధోరణి చాలా శోచనీయంగా ఉంది. ఈ రోజున విద్యావ్యవస్థ చిన్న మోసగాళ్లను తయారు చేస్తున్నది. టీచర్ నిజాయితీ రాహిత్యం దీనికి తోడవుతున్నది. ఏ

వ్యక్తి అయినా సరే యువకుడు కావచ్చు లేదా వృద్ధుడు కావచ్చు, మరొక వ్యక్తికి ఆదర్శం (model)గా ఉండడం సాధ్యం కాదు. ఎవరూ కూడా నిజాయితీ రాహిత్యంగా జీవించనవసరం లేదు. మానవత్వం లేని టీచర్ నుంచి పిల్లలు మానవత్వం నేర్చుకోలేరు. పూర్తి నిజాయితీ ఉన్నప్పుడే ఇది సాధ్యం. నిజాయితీ గురించి కొద్దిగా చర్చిస్తాను. నిజాయితీ జీవితానికి ప్రమాణం. క్రమశిక్షణ అమలు చేసే స్కూళ్ల నుంచి పిల్లలు నా దగ్గరకు వస్తుంటారని నేను చాలాసార్లు చెప్పాను. వారు నిజాయితీ రాహిత్యంతో తప్పుడు అలవాట్లకులోనై ఉంటారు. మా స్కూలుకు వచ్చిన కొద్ది వారాలలో అవన్నీ మరచిపోతారు. క్రమశిక్షణ, భయం కారణంగా ఇటువంటి అలవాట్లు వస్తాయి. ఇవి పిల్లల స్వభావానికి విరుద్ధం. పిల్లలు సహజంగా నిజాయితీగా ఉంటారు. పిల్లలు స్వభావరీత్యా పిల్ల రాక్షసుల మాదిరిగా వ్యవహరిస్తారు. మంచితనం, నిజాయితీ రెండు ఒకటేనని నేను భావిస్తాను. దొంగతనం అలవాటు పడిన పిల్లవాడికి ఆ స్వభావం నయం చెయ్యాలంటే అతనితో నిజాయితీగా వ్యవహరించడం మౌలికమైన పద్ధతి. ఆ విధంగా పిల్లవాడిలోని నిజాయితీ బయటకు వస్తుంది. నిజాయితీకి, ప్రేమకు దగ్గర సంబంధం ఉంది. నేను పైన చెప్పిన విల్లీ ఉదాహరణను తీసుకున్నట్లైతే నేను అతని విషయంలో నిజాయితీ లేకుండా వ్యవహరించాను. నేను సందర్శకుడినుంచి రెండు పెన్నీలు దొంగతనం చేశానని చెప్పి, నేను నిజాయితీ లేకుండా వ్యవహరించాను. నేనొక లక్ష్యంతో ఆ విధంగా చేశాను. అతను నిజాయితీని ప్రతిఘటిస్తున్నాడు. అధికారం, దాని ప్రతిష్ట అర్థం లేనివని తెలియజెప్పడానికి నేనా విధంగా చేశాను. నేను అబద్ధం చెబుతున్నట్టు అతను గ్రహించే విధంగా నేను వ్యవహరించాను. అతను గ్రహించే వరకు నేను అలాగే చేస్తూ ఉంటాను. తను మామూలుగా ఉంటే ఈ విధంగా చేయవలసిన అవసరం ఉండదు. పిల్లలకు అబద్ధం చెప్పవలసిన అవసరం లేదు. ఒకవేళ అబద్ధం చెపితే చాలా నష్టం జరుగుతుంది. పిల్లలు తమ నిజాయితీ పట్ల టీచర్ నిజాయితీ పట్ల విశ్వాసం కోల్పోకుండా టీచర్ జాగ్రత్త వహించాలి.

అదే సమయంలో అధిక శాతం మనుషులు తెలిసే మోసపూరితంగా వ్యవహరిస్తారని నేను అర్థం చేసుకోగలిగాను. ఒక టీచర్ తప్పతాగితే ఉద్యోగం కోల్పోవలసి వస్తుంది. అందువల్ల అతను తాగినప్పటికీ ప్రమాదం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటాడు. తప్పతాగడాన్ని తప్పుపట్టడం లేదు. లేదా నైతిక సమస్యగా పరిగణించడం లేదు. కాలం వెళ్లబుచ్చడానికి తాగడం సరైందికాదు. అందువల్ల నా జాగ్రత్తలో నేనుంటాను. వాస్తవంనుంచి తప్పించుకోడానికి నేను ఇతర పలాయన మార్గాలను ఎంచుకుంటాను. ఒక టీచర్ తాగుతున్నట్లైతే అతను మామూలు జీవితం నుంచి పలాయన మంత్రం



పఠిస్తున్నాడన్నమాట. టీచర్ చేసే పనిని దృష్టిలో పెట్టుకున్నప్పుడు వారంతా తాగుతూ తమ ఇబ్బందులు మరచి పోడానికి ఎందుకు ప్రయత్నం చేయడం లేదనేది నాకు ఆశ్చర్యం కలిగిస్తుంది. నేను ఎల్లప్పుడూ తెలిసి మోసం చేస్తుంటాను. నేను ఎదుటి వ్యక్తితో మాట్లాడుతున్నప్పుడు ప్రతిమాటకు అర్థం చెబుతూ మాట్లాడతాను. ఒక సైనికాధికారితో నేను గంటసేపు మాట్లాడినట్లైతే అతనికి ఏమాత్రం ఇబ్బంది రాకుండా మాట్లాడగలను. నేర్పు అనేది సమాజం నుంచి నేర్చుకునే విలువైన అంశం.

కాని పిల్లలతో వేరే విధంగా వ్యవహరించవలసి ఉంటుంది. ఈ క్రమంలో పిల్లలు కూడా నేర్పు అలవరచుకుంటారు. అయితే ఈ నేర్పు అంతశ్చేతనం కాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ క్రమంలోనే టీచర్ ఆదర్శవంతమైన వాడాలేదా అనేది నిగ్గు తేలుతుంది.

నాలో దాగివున్న నిజాయితీ రాహిత్యాన్ని నేను సవాలు చేసుకోవలసిన పరిస్థితి ఉంది. అయినప్పటికీ మన స్కూళ్లలో నిజాయితీ ఉండాలని కోరుకుంటున్నాను. నేను తగినంత నిజాయితీగా లేననేది నాకుతెలుసు. ఆరోగ్యంగా ఉన్న పిల్లవాడితో నేనెప్పుడూ అబద్ధం చెప్పను. కాని నా జీవితం అనేక రకాల అబద్ధాల పుట్ట. అన్ని విషయాలు వెల్లడిస్తూ స్వీయ జీవిత చరిత్ర రాయాలని దానికి తగిన ధైర్యం తెచ్చుకోవాలని నేను కోరుకుంటున్నాను. గత వేసవిలో నేను స్వీయ జీవిత చరిత్ర రాశాను. కాని అందులో సగమే వాస్తవం ఉంది. అందువల్ల అది ప్రచురించలేదు. పూర్తి నిజాయితీగా బతికే వాళ్లను జైలుకు లేదా పిచ్చాసుపత్రికిపంపుతారని నాకు నేను సర్ది చెప్పుకుంటుంటాను.

మానసిక రుగ్మతలున్న టీచర్ గురించి నేను చాలా సులువుగా రాయగలుగు తున్నాను. నాలోనే రుగ్మతలున్న టీచర్ ఉన్నాడు. అందువల్ల ఇది సులువవుతున్నది. కాని నాలో పిల్లవాడు కూడా ఉన్నాడు. పిల్లవాడికే నేను పూర్తి సానుభూతి తెలుపుతాను. సామాజికస్థాయి, సరైన శిక్షణ లేకపోవడం, స్వేచ్ఛ లేకపోవడం వల్ల ఇతర పరిస్థితుల కారణంగా టీచర్ ఏ విధంగా ఇబ్బందులు పడతాడనేది నాకుతెలుసు. తన చుట్టూ పరిస్థితులనే కాకుండా తన అహాన్ని దాని నుంచి వచ్చే ప్రమాదాలను టీచర్ అర్థం చేసుకోడానికి వీలుగా నేను అతని గురించి రాస్తున్నాను. నేను వేరే వారికంటే పండితుడినైనందువల్ల ఇది రాయడం లేదు. 18 సంవత్సరాలుగా నేను ఫ్రీ స్కూలు నడుపుతున్నందువల్ల మామూలు క్లాసు టీచర్లకు అంతుబట్టని విషయాలు నేను తెలుసుకోగలిగాను. పెద్దల క్రమశిక్షణ ప్రభావం లేనపుడు పిల్లలు ఎలా ఉంటారో నేను చూశాను. పిల్లల నుంచి నేను నేర్చుకున్న విషయాలు చాలా ముఖ్యమైనవి. భూమిమీద ప్రతి పిల్లవాడు, ప్రతి టీచర్ నిజాయితీ, సంతోషాలతో కూడిన స్వేచ్ఛ పొందే వరకు నాకుసంతోషం ఉండదు. కాని దురదృష్టవశాత్తు నేను వెయ్యి సంవత్సరాలు జీవించలేను.

# 4. టీచర్-స్కూల్ సబ్జెక్ట్

పిల్లలు విద్యావంతులు కాకుండా నిరోధించడానికి రాజ్యాంగయంత్రం స్కూల్ సబ్జెక్టను వినియోగించుకుంటుందని నేను ఇంతకు ముందే చెప్పాను. ఇదొక సేఫ్టీ వాల్యు. హిస్టరీ ఒక్కటే ప్రమాదకరమైన సబ్జెక్ట్. హిస్టరీ నుంచి ప్రమాదం లేకుండా పాఠ్య పుస్తకాలు తయారు చేస్తారు. అదృష్టవశాత్తు టీచర్ ఈ పాఠాలకు తోడు తను ఎంచుకునే అంశాలు కూడా బోధించే అవకాశం ఉంది. అయితే పూర్తి నియంతృత్వ పోకడలతో భయాకనకంగా సాగే ప్రభుత్వాలున్నచోట ఇది కూడా కుదరదు.

హిస్టరీ మినహాయించి మిగిలిన సబ్జెక్ట్స్ అంతగా ఉపయోగం లేనివి. పక్కదారి పట్టించేవి. సెకండరీ పాఠశాలలో విద్యార్థులు థియరీ ఆఫ్ క్వాడ్రాటిక్స్ నేర్చుకోవడం ఈ కోవకే చెందుతుంది. ఇవి నేర్చుకున్నప్పటికీ న్యూస్ పేపర్ బాయ్‌స్‌గా తయారయ్యే పిల్లలకు వీటివల్ల ఏమాత్రం ప్రయోజనం ఉండదు. పిల్లలు బలవంతంగా ఫ్రెంచ్ భాష నేర్చుకుంటారు. స్కూలు విడిచిపెట్టే నాటికి మరచిపోతారు. వారు ఏనాడూ ఫ్రాన్స్ వెళ్లలేరు. కేవలం వ్యాకరణం మాత్రమే నేర్చుకున్నందువల్ల వారు ఫ్రెంచి పుస్తకాలు చదవడం అంత తేలిక కాదు. వారు నేర్చుకునే కొద్దిపాటి కెమిస్ట్రీ, ఫిజిక్స్ జీవితంలో వారికి ఏ విధంగానూ తోడ్పడవు. క్లర్కులుగా లేదా ఇతర ఉద్యోగాలలో చేరే వారికి వీటితో ప్రయోజనం ఉండదు. యువతకు మృతప్రాయమైన ఉద్యోగాలు ఇవ్వకూడదని మనం గట్టిగా పోరాడుతున్నాం. కాని మన విద్యా వ్యవస్థలో శిక్షణ ఈ ఉద్యోగాలు చేసుకోడానికే ఉపయోగపడుతున్నది. వారు నేర్చుకునే సబ్జెక్ట్స్ అన్నీ ఈ ఉద్యోగాల కోసమే ఉపయోగపడతాయి.

సెకండరీ స్కూలు కన్నా ఎలిమెంటరీ స్కూలు తక్కువ ప్రమాదకరమైనది. ఎలిమెంటరీ స్కూలు లక్ష్యం చాలా తక్కువ. తరువాత విద్య కొనసాగించడానికి ఉపయోగపడే మూడు 'ఆర్' లు (రీడింగ్, రైటింగ్, అర్థమెటిక్స్) ఎలిమెంటరీ స్కూల్‌లో నేర్పుతారు. ఒకే సబ్జెక్ట్ బోధించే టీచర్‌లో చోటుచేసుకునే సంకుచిత ధోరణి ఎలిమెంటరీ స్కూల్ టీచర్‌కు రాదు. అయితే ఎలిమెంటరీ స్కూల్లో కూడా సుదీర్ఘ భాగహారం, హెచ్చవేతలు, డిస్మల్ పాయింట్లు వంటి మృత ప్రాయపు సబ్జెక్ట్స్ ఉంటాయి. సాధారణంగా ఎలిమెంటరీ స్కూల్ టీచర్ మంచి కృషి చేస్తాడు.కాని ఆయన్ని మెచ్చుకునే వారుండరు. ఎడ్యుకేషన్ కోడ్ అమలులో ఉన్నందువల్ల పిల్లలకు 14 సంవత్సరాల వయసు వచ్చే వరకు స్వేచ్ఛాయుతమైన విద్య అందజేయడానికి ఎలిమెంటరీ స్కూల్ టీచర్‌కు అవకాశం ఉంటుంది. అయితే ఆయన ఈ అవకాశం ఉపయోగించగలగాలి. ఈ సందర్భంగా



నేను చాలా కాలం క్రితం చూసిన స్కాట్లండ్ గ్రామీణ స్కూళ్లు గుర్తుకు వస్తున్నాయి. గ్రామంలోని టీచర్ విద్యార్థులకు అవసరమైన విద్యమాత్రమే బోధించేవాడు. ఆయన రోజుకు నాలుగు లేదా ఆరు క్లాసులు తీసుకోవడం మిగిలిన విద్యార్థులను ఎక్కువ కాలం స్వేచ్ఛగా వదిలి పెట్టడమే దీనికి కారణం. అంతేకాకుండా ఆసక్తి కలిగించే విధంగా టీచర్‌కు బోధించే సమర్థత కూడా ఉండేది.

పిల్లలు స్కూలు వదిలిపెట్టే వయసుపై నిత్యం వివాదం సాగుతూనే ఉంటుంది. నేను ఈ వివాదాన్ని అంతగా పట్టించుకోను. కాని ఈ రోజున స్కూళ్ల మాదిరిగా ఎక్కువ సంవత్సరాల పాటు విద్యార్థులను స్కూళ్లలో ఉంచడంలో అర్థం లేదు. విద్యార్థులు 15 సంవత్సరాల వయస్సులో స్కూలు వదిలి వెళ్లడం మంచిది. అలా కాకుండా 17 సంవత్సరాలు వచ్చే వరకు స్కూల్లో ఉంటే మృతప్రాయమైన సబ్జెక్ట్స్ ఇంకా ఎక్కువగా నేర్చుకోవలసి ఉంటుంది. సముచితమైన న్యాయమైన నాగరికత ఏర్పడినపుడు 19 సంవత్సరాలు వచ్చేవరకు వారిని స్కూల్లో ఉంచవచ్చు. కాని ఆ స్కూలు-పిల్లల మానసిక అవసరాలకు అనుగుణంగా ఉండాలి. సబ్జెక్ట్‌కు తక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి.

ఎలిమెంటరీ, సెకండరీ స్కూళ్లు రెండూ కూడా విద్యాబోధనలో విఫలమవు తున్నాయి. ఈ స్కూళ్లు మేథస్సు, జ్ఞాపకశక్తి బోధించడానికి మాత్రమే కృషి చేస్తున్నందువల్ల ఇవి విఫలమవుతున్నాయి. విద్య అన్ని వేళలా సృజనాత్మకంగా ఉండాలి. కాని తను చేసే పనిలో సృజనాత్మకత లేదని ప్రతి స్కూల్ టీచర్‌కు తెలుసు. విద్యలో సృజనాత్మకత ఉండాలని గుర్తించినపుడే మన స్కూళ్లలో నిజమైన విద్యాబోధన జరుగుతుంది. కవిత్వం రాయడంకంటే చదవడమే ముఖ్యమని, నాటకం రచించడం కంటే షేక్స్‌ఫియర్ నాటకాలు ఆడడమే ముఖ్యమని, చెక్క, లోహాలతో సృజనాత్మకత ఉట్టిపడేలా బొమ్మలు ఇతర వస్తువులు చేయడంకంటే లెక్కలు చేయడమే ముఖ్యమని మన స్కూళ్లు పట్టుబడుతున్నాయి. అందువల్ల విద్యాబోధన చేయడంలో అవి విఫలమవుతున్నాయి.

తాము చేసే పని వృథా అవుతున్నదని ఎక్కువమంది టీచర్లకు ఊహామాత్రంగా నైనా తెలుస్తుంది. చైతన్యంలేని టీచర్ తాను బోధించే సబ్జెక్ట్ తనకు దొరికినందుకు అదృష్టంగా భావిస్తుంటాడు. తన శక్తి నంతా ప్రయోజనం లేని లక్ష్యం కోసం వినియోగిస్తున్నట్టు భావించే టీచర్ విషాదభరితంగా ఉంటాడు. తాను గౌరవించని జెండా కోసం పోరాటం సాగిస్తున్నట్టు భావిస్తాడు. టీచర్ వృత్తిలో తక్కువ గంటలు పనిచేస్తారని, ఎక్కువ సెలవులు ఉంటాయని ఇతర వృత్తులు వారు అసూయ పడుతుంటారు. కాని పిల్లలకన్నా ఎక్కువగా టీచర్‌కు విశ్రాంతి, సెలవలు అవసరం. లాయర్ లేదా డాక్టర్ కన్నా టీచర్ ఎక్కువ ప్రయాసకు లోనవుతాడు. అన్నివేళలా పిల్లవాడి స్థాయికి దిగి చదువు చెప్పవలసి ఉంటుంది. అంతే కాకుండా ఆయన చేసే పనికి ముగింపు ఉండదు.

విచారణ ముగిసిన తరువాత న్యాయవాది నిట్టూర్పు విడిచి ఏదో ఒకటి సాధించానన్న తృప్తి మిగుల్చుకుంటాడు. రోగి కోలుకున్న తరువాత లేదా అంత్యక్రియల తరువాత తన పని ముగిసిందని డాక్టర్ అనుకుంటాడు. ఈ విధంగా అనుకోడానికి టీచర్‌కు ఎప్పటికీ అవకాశం రాదు. టీచర్ అరణ్యరోదన నిరంతరం సాగుతూనే ఉంటుంది. ఎంతమంది కొత్త పిల్లలు చేరతారో అతనికి తెలియదు. కన్వేయర్ బెల్ట్‌పై ఒక స్క్రూ బిగిస్తున్న వ్యక్తి నిరంతరం ఆ పని చేస్తూనే ఉంటాడు. ఆ తరువాత తయారయ్యే కారు పూర్తి స్వరూపం అతను ఎన్నడూ చూడలేడు. ఈ పోలికతో మనకు అర్థమయ్యేదేమంటే టీచర్ కూడా ఒక స్క్రూ బిగిస్తుంటాడు. విద్యార్థి పూర్తిగా రూపుదిద్దుకునే కార్యక్రమం అనుభవానికి వదిలిపెడతాడు. మన స్కూళ్లు కూడా ఫోర్డ్, మోరిస్ కార్ల కంపెనీల మాదిరిగా పెద్ద ఎత్తున ఉత్పత్తి సాగిస్తాయి.

ఈ పోలికను ఎక్కువ సాగదీయాలని నేను కోరుకోవడం లేదు. ఎటువంటి కారు ఉత్పత్తి చేయాలనేది ఫోర్డ్ సంస్థకు తెలుసు. కాని తన ఫ్యాక్టరీ (స్కూల్)లో ఎటువంటి స్త్రీ లేదా పురుషుడు ఉత్పత్తి అవుతారో ఏ టీచర్‌కూ తెలియదు. తెలుసుకోకూడదు. తన కృషి ఫలితాలను చివరికంటా చూసుకోకపోవడమే టీచర్‌కు మంచిది.

ఏది ఏమైనప్పటికీ టీచర్‌కు తన పని పట్ల ప్రారంభంలో విశ్వాసం ఉన్నట్లైతే, తను సరైన మార్గంలో ఉన్నట్లు భావిస్తే అతను మరింత విలువైన కృషి చేయగలుగుతాడు. అతను మనస్ఫూర్తిగా పనిచేస్తాడు. అందువల్ల సమ్మర్ హిల్‌లో సిబ్బంది నియామకంలో నేను జాగ్రత్తలు తీసుకుంటాను. ప్రభుత్వ పాఠశాలల్లో కన్నా నేను చాలా తక్కువ వేతనం ఇస్తానని వారికి తెలుసు. అయినప్పటికీ వారు నా స్కూల్‌లోనే పనిచేయడానికి సిద్ధపడతారు. ఆశావాదంతో తాము పని చేసుకుంటూ పోవచ్చునని, మాస్ ప్రొడక్షన్‌లో మాదిరిగా కాకుండా స్వేచ్ఛగా విద్యార్థులను ఎదగనివ్వడానికి వీలవుతుందని వారికి తెలుసు.

తన పని చివరికంటా చూసుకునే సామర్థ్యం లేనందువల్ల టీచర్ మనసులో రాజకీయాలు చోటు చేసుకుంటాయి. పరిస్థితులను మించి ముందుచూపు అలవాటు చేసుకుంటాడు. అతని సబ్జెక్టే అతనికి చాలా ముఖ్యం. కానీ స్కూలు వెలుపల ఇంకా ఉన్నతమైన దాని కోసం ప్రయత్నం చేస్తాడు. ఇది దొరకకపోతే అతను బిగుసుకుపోయి మిగతా టీచర్ల మాదిరిగా యంత్రప్రాయంగా గడియారం వంక చూస్తుంటాడు.

మానసిక రుగ్మతలున్న టీచర్ తన సబ్జెక్ట్‌కు అతుక్కుపోతాడు. అందువల్ల టీచర్లకు తరచూ సబ్జెక్ట్ మార్పు చేస్తుండాలి. గణితం బోధించే టీచర్‌కు కొంతకాలం చరిత్రకు మార్చాలి. జర్మన్‌భాష బోధించే టీచర్‌ను చిత్రకళకు మార్చాలి. అన్ని సబ్జెక్ట్‌లు తెలుస్తాయి. దేనిలోను ప్రతిభ ఉండదు. ఇలా జరిగితే నష్టమేమిటి? స్పెషలిస్టు తన సబ్జెక్ట్‌లో మాత్రమే



ప్రావీణ్యం సంపాదించగలుగుతాడు. కాని మిలిగిన విషయాలు అతనికి తెలియవు. లేత్‌మిషన్‌పై పనిచేసే నిపుణుడిని, దుస్తులు తయారు చేయడానికి మార్చాలని నేను చెప్పడం లేదు. కానీ ఆ విధంగా జరిగితే మానసికంగా అతనికి మేలు జరుగుతుంది. అదేవిధంగా లాటిన్ భాష బోధించే టీచర్‌కు స్కూల్ పోర్టర్ బాధ్యతలు అప్పగించాలని నేననడం లేదు. స్పెషలైజేషన్ కారణంగా ఎదురయ్యే ఉపద్రవం నుంచి ఆయన్ని రక్షించడానికి వేరేమార్గం లేకపోతే పోర్టర్ బాధ్యతలు అప్పగించడానికి ఏమాత్రం వెనకాడను.

ఏ స్పెషలిస్టు ఎక్కువకాలం విశాల దృక్పథాన్ని నిలుపుకోలేడు. బూట్లు కుట్టే వ్యక్తికి తోలే సర్వస్వం అవుతుంది. నిజాయితీపరుడైన సర్జన్‌కు కూడా పొట్టలో నొప్పికి ఎపిండెక్స్ కారణమేమోనన్న అనుమానం తప్పకుండా ఉంటుంది. తాను వైద్యం చేసే వ్యక్తి నొప్పికి వెన్నుపూసతో సంబంధం ఉందేమోనన్న అనుమానం ఆర్థోపెడిక్ సర్జన్‌కు వస్తూనే ఉంటుంది. ఉచితాహారం ఆ నొప్పినయం చేయవచ్చునని డైటీషియన్ అభిప్రాయపడతాడు. పిల్లల దొంగతనం చేసే లక్షణాన్ని నయం చెయ్యడానికి వేయించిన చిక్కుడు గింజలు తినిపిస్తున్నారని చెబితే నేను చిరునవ్వు నవ్వి కొట్టిపారేస్తాను. పిల్లల దొంగతనం నయం చెయ్యడంలో నేనొక్కడినే స్పెషలిస్టునని పూర్తిగా విశ్వసించడమే దీనికి కారణం. గొప్ప సైంటిస్ట్‌లకు కూడా ఇదే విధమైన పరిమితులుంటాయి. కొత్త పరిశోధనను సరిగ్గా పరిశీలించకమునుపే దాన్ని వారు తిరస్కరిస్తుంటారు.

స్పెషలిస్టు తన సబ్జెక్ట్‌ను ఎంచుకోగానే తప్పనిసరిగా అతని అహం దానితో ముడిపడుతుంది. స్కూల్లో సంవత్సరం ప్రారంభంలో జరిగే స్టాఫ్ మీటింగ్‌కు హాజరైతే ఈ విషయం స్పష్టంగా తెలుస్తుంది. టైమ్‌టేబుల్ తయారు చేస్తున్నప్పుడు ప్రతి అనుభవజ్ఞుడు తన సబ్జెక్ట్‌కు ప్రాధాన్యం ఇవ్వాలంటూ చేసే గోల అంతా ఇంతా కాదు. "బీటాస్‌కు నాకు వారినికి రెండు క్లాసులే ఇచ్చారు. కనీసం దానికి నాలుగు క్లాసులు అవసరం" అంటాడొకాయన. ఇది అద్భుతమైన స్ఫూర్తి. టీచింగ్ వృత్తి ఎంతో ఉన్నతమైనదని, ఉత్సాహపూరితమైనదని చెప్పుకోడానికి ఇది పనికి వస్తుంది. కాని పిల్లవాడికన్నా సబ్జెక్ట్ చాలా ముఖ్యమైనదనే పొరపాటు అభిప్రాయం స్పెషలిస్టులో చోటు చేసుకుంటుంది. కొత్త విద్యార్థులు తమ పాత స్కూళ్ల నుంచి సుదీర్ఘమైన రిపోర్ట్‌లు తీసుకువస్తారు.

గణితం – ఫెయిర్

ఇంగ్లీష్ – గత టర్మ్ కంటే కొంత మెరుగు

డ్రాయింగ్ – వెరీగుడ్, వివరాలకు సంబంధించి కొంత జాగ్రత్త అవసరం.

ప్రవర్తన – క్లాసులో తననుతాను ప్రదర్శించుకునే ప్రయత్నం జరుగుతున్నది. కాని పరిస్థితి మెరుగవుతున్నది.

టర్మ్ చివరలో నేను గనుక రిపోర్ట్ రాయదలచుకుంటే ఈ విధంగా ఉంటుంది:-

గణితం – మూర్ఖత్వం. అయినా ఫరవాలేదు

ఇంగ్లీష్ – గత టర్మ్ కంటే వొకాబులరీ పెరిగింది. కాని ఇది ఆంటీ మేరీ ముందు ప్రదర్శించకుండా హెచ్చరించాలి.

చరిత్ర – కనీస అవగాహన కూడా లేదు తెలుసుకోవాలన్న ఆలోచన కూడా లేదు.

ప్రవర్తన – అతను గంటసేపు ఇంట్లో ఉన్న తరువాత అతని ప్రవర్తనలో తేడా తల్లిదండ్రులకు తెలుస్తుంది.

నేను పరిహాసానికి దిగాను, కాని ఎవరైనా సరే హాస్యధోరణి పట్టక వేరే ఏం చేస్తారు. సబ్జెక్ట్ గందరగోళం మొత్తం ఒక జోక్‌లాగా ఉంటుంది. స్పెషలిస్ట్‌కు ఇది అర్థం కాదు. ఇది తెలుసుకోడానికి పిల్లలు సాహసించకూడదు. ఒక వ్యక్తి 50 సంవత్సరాల వయసు వాడైనపుడు, ఆయన 12 సంవత్సరాల వయసులో ఇంగ్లీష్ టీచర్ చెప్పిన అభిప్రాయం గురించి పట్టించుకునేదెవరు? కాని లక్షలాది పిల్లలకు సంబంధించి వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలు ప్రతికూల ఫలితాలిస్తాయి. లక్షలాదిమంది పిల్లల ఆత్మవిశ్వాసాన్ని ఈ రిపోర్ట్‌లు అణచివేస్తాయి. లక్షలాదిమంది పిల్లల మనసులో అనవసరమైన భయాలు ప్రవేశపెడతాయి. ఈ రిపోర్ట్‌లు తల్లిదండ్రులకు చూపిన ప్రతి ఒక్కరికి ఈ భయం తెలుసు. వారు తీవ్రంగా కోపగించుకోవడం సర్వ సాధారణం. ఎంతోమంది పిల్లలు తమ రిపోర్ట్‌లు పారేసుకొని ఇంటికి వెళతారు.

నిజానికి రిపోర్ట్‌లో దోషమేమీలేదు. కాని సబ్జెక్ట్ పట్ల టీచర్ అనుసరించే ధోరణిలో చెడు జరుగుతుంది. రిపోర్ట్‌లు అవసరం అనుకుంటే, అవి పిల్లలే రాసుకోవాలని తమ గురించి ప్రతి టీచర్‌కు అనుబంధంతో పిల్లలే ఈ రిపోర్ట్‌లు రాయాలని నేను ప్రతిపాదిస్తున్నాను. ఇటువంటి రిపోర్ట్ ఈ విధంగా ఉంటుంది:

"గణితాన్ని నేను ద్వేషిస్తాను. గణితం టీచర్ ఒక అడవి జంతువు. నేను ఇంగ్లీష్‌ను ఇష్టపడతాను. ఇంగ్లీష్ టీచర్ మా ముత్తాల కథలు ఇంకా ఇతర విషయాలు రాయడానికి అవకాశం ఇస్తారు. నాకు హిస్టరీ అంటే ఇష్టమే కాని హిస్టరీ టీచర్ రోమన్ నాగరికత గురించి బోరు కొట్టిస్తుంది. చేతి పని బాగానే ఉంటుంది. కానీ మా ఇష్టం వచ్చినవి చెయ్యడానికి అవకాశం ఉండదు. పెన్‌ట్రే తయారు చెయ్యాలని ఎవరు కోరుకుంటారు? నేను తుపాకులు, విమానాలు తయారు చెయ్యాలని కోరుకుంటాను. డ్రాయింగ్ అంటే నా కిష్టం లేదు. డ్రాయింగ్ టీచర్ నా వెనకాలే ఉండి, నా మెడమీదే గాలి వదులుతుంటుంది. దీనికి తోడు ఆమె వెల్లుల్లి నములు తుంటుంది."



పిల్లలే తమ రిపోర్ట్‌లు తయారు చేయడానికి అనుమతిస్తే స్కూళ్లలో అద్భుతాలు జరుగుతాయి. ఇల్లు శుభ్రంగా ఊడ్చినట్టు ఉంటుంది. ఈ రిపోర్ట్‌లు మానవతా వాదంతో కూడుకొని ఉంటాయి. అయితే ఈ రిపోర్ట్‌లన్నీ అబద్ధాలతో నిండి ఉంటాయి. పేరు లేకుండా స్కూల్ మేగజైన్‌లో ప్రచురించినప్పటికీ వాటిలో అబద్ధాలుంటాయి. పేరు లేకుండా ప్రచురించినప్పటికీ ప్రతీకారం కోసం ప్రయత్నంచేసే సిబ్బంది నుంచి రక్షణ లభించదని పిల్లలు భావిస్తారు. ఈ సబ్జెక్ట్ నెక్స్ట్ చాప్టర్‌కు దారి తీస్తుంది. అది టీచర్-సైకాలజీ.

# 5. టీచర్-సైకాలజీ

వైద్య విద్యలో విద్యార్థులకు ఆరోగ్యం కంటే కూడా జబ్బుల గురించే ఎక్కువగా బోధిస్తారు. అది ఇప్పుడు ఎలా ఉందో నాకు తెలియదు. కాని గతంలో మెడికల్ కోర్సులో ఆహారం గురించి పాఠాలుండేవి కావు. లండన్‌లోని పెద్ద పెద్ద ఆస్పత్రులలో రోగులకు ఇంకా వైట్‌బ్రెడ్‌నే ఆహారంగా ఇస్తున్నారు. రోగులకు తగిన ఆహారం ఇవ్వాలన్న పరిజ్ఞానం వైద్య వృత్తినుంచి రాలేదు. విటమిన్ సి కనుగొనడానికి ముందు రోగులకు లెట్యూస్, నిమ్మకాయలు, నారింజకాయలు ఆహారంగా ఇచ్చేవారు. జబ్బులకు మూలకారణం తెలుసుకోవాలన్న ఆలోచన చాలా తక్కువమంది వైద్యులకు ఉంటుంది. నాకు చర్మవ్యాధి వచ్చినట్లైతే అదిఎందుకు వచ్చిందనేది ఆలోచించకుండా చర్మానికి వైద్యం చేస్తారు. నాకు మెటిమలు ఎక్కువగా వస్తున్నాయంటే నా జీవన పరిస్థితిలో కారణాలుంటాయనే విషయం వారు పట్టించుకోరు. వారు కేవలం రోగ లక్షణాలకు మాత్రమే చికిత్స చేస్తారు. అందువల్ల అనేకమంది రోగులు ప్రకృతి వైద్యం వైపుకు పరుగులు తీస్తున్నారు. ప్రకృతి వైద్యులు లక్షణాలకు రెండోస్థానం ఇచ్చి ఆరోగ్యం అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తారు. మౌలికమైన పద్ధతి అనుసరిస్తున్నందువల్ల ప్రకృతివైద్యులు విజయం సాధిస్తున్నారు.

టీచర్‌కు శిక్షణ ఇవ్వడంలో కూడా వైద్య వృత్తి శిక్షణలో ఉన్న పరిమితులే ఎదురవుతాయి. స్పెషలిస్టు డాక్టర్లకు ఇచ్చే శిక్షణతో మనం టీచర్‌కు ఇచ్చే శిక్షణను పోల్చవచ్చు. ఎపిండెక్స్ వ్యాధి నయం చెయ్యడానికి మనం చెవి, ముక్కు, గొంతు స్పెషలిస్టు దగ్గరకు వెళ్లం. ఆస్పత్రులలో వ్యాధి నిర్ణయం చేసి, వైద్యం చెయ్యడంలో శిక్షణ ఇస్తారు. అయితే వైద్యవృత్తికి అంతగా తెలియని శరీరాలకు ఈ శిక్షణ పొందినవారు వైద్యం చేస్తారు. యూనివర్సిటీలలో, ట్రైనింగ్ కాలేజీలలో యువ టీచర్‌కు శిక్షణ ఇస్తారు. అయితే అతనికి ఏమాత్రం తెలియని మానవుల వ్యక్తిత్వాలను తీర్చిదిద్దడానికి కృషి చేయాలి. నేను ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో మృత భాషలలో బి.ఎ. డిగ్రీ తీసుకున్నందువల్ల నేను లాటిన్, గ్రీక్ భాషలు బోధించడానికి నాకు ఆటోమేటిక్‌గా అర్హత లభిస్తుంది.రెండు సంవత్సరాల పాటు ట్రెయినింగ్ కాలేజీలో శిక్షణ పొందితే ఒక గ్రూపు విద్యార్థులను గైడ్ చేయడానికి కంట్రోల్ చేయడానికి అర్హత లభిస్తుంది. ఈ శిక్షణలో పిల్లల స్వభావం గురించి ఏమీ చెప్పరు. అయినప్పటికీ గైడ్ చేయడానికి, కంట్రోల్ చేయడానికి అర్హత లభిస్తుంది.

టీచర్ ప్రధానమైన బాధ్యత పిల్లల సైకాలజీకి సంబంధించినది. స్కూల్ సబ్జెక్ట్స్‌కు అధమస్థానం ఇవ్వాలి. ఈ సమస్యను తేలిక మార్గంలో క్రమశిక్షణ అమలు చేయడం



ద్వారా తప్పించుకుంటారు. పిల్లలకు విజ్ఞానం బోధించడానికి బదులు క్రమశిక్షణ అమలు చేస్తారు. పిల్లల స్వభావానికి విరుద్ధంగా వ్యవహరించినంతకాలం, పిల్లలను బలవంతంగా డెస్క్ దగ్గర కూర్చోబెట్టి నేర్పించినంతకాలం, స్కూలు క్రమశిక్షణ తప్పనిసరిగా అవసరమవుతుంది. ప్రస్తుత వ్యవస్థలో ఇది తప్పదు. ఈ రోజున స్కూలు కోసం పిల్లలను తయారు చేస్తున్నారు. కాని భవిష్యత్తులో పిల్లలకోసం స్కూళ్లు తయారు చేస్తారని విశ్వసించడానికి తగిన ఆధారాలున్నాయి. టీచర్లు సహకరిస్తే ఈ నూతన యుగం త్వరలోనే వస్తుంది. అయితే వారు పిల్లల స్వభావాన్ని అర్థం చేసుకోలేకపోయినపుడు, పాత క్రమశిక్షణనే పాటిస్తున్నపుడు, నూతన యుగం ఆవిర్భవించేందుకు సహకరించలేరు.

నువ్వు విధేయుడవై ఉండు–అన్నదే ఈనాటి స్కూళ్లు అనుసరిస్తున్న ప్రధాన సూత్రం. కాని జీవితానికి కావలసిన ప్రధాన సూత్రమేమంటే–విధేయుడవై ఉండేందుకు నిరాకరించు. విలువగలిగిన విధేయత ఒక్కటే– మనిషి తనఅంతరాత్మకు విధేయుడుగా ఉండడం. వెలుపలి విధేయతలన్నీ మనిషి ఎదుగుదలకు శాపం వంటివి. మానసిక పరిస్థితి పరంగా చెప్పాలంటే ఇది ఫాసిజానికి ప్రజాస్వామ్యానికి మధ్య వైరుధ్యం. ప్రజాస్వామ్యమంతా మోసం అనుకుంటే ప్రజాస్వామ్య దేశంలోని కార్మికులంతా పెట్టుబడిదారీ యజమానులకు బానిసలు. బ్రిటన్ ప్రజానీకం అంతరాంతరాలలో విధేయతనుంచి స్వేచ్ఛ కోరుకుంటున్నారు. విధేయులుగా ఉండే అవమానాన్ని నిరాకరిస్తున్నారు. ఇంటర్నేషనల్ బ్రిగేడ్‌లోని కార్మికులు నిజమైన ప్రజాస్వామికవాదులు. వారు తమ నాయకులకు విధేయులై ఉంటారు. నాయకులకు కార్మికులకు ఒకే లక్ష్యం ఉంటుంది. విధేయత తప్పనిసరి. స్కూల్‌లో విధేయత కార్మికుల విధేయతకు భిన్నమైనది. అది హెయిల్! హిట్లర్ తరహాకు, సైనిక విధేయత తరహాకు చెందినది. ఇదేమిటని వారు ప్రశ్నించకూడదు.

విధేయత క్రియాశీలకంగా ఉండాలి. విధేయులుగా ఉండేవారి లక్ష్యం, ఆధిపత్యం వహించేవారి లక్ష్యం ఒకటిగా ఉండాలి. ఆర్కెస్ట్రా మాస్టర్, వాయిద్యాలు వాయించేవారు, ఈ సందర్భంగా నాకు గుర్తుకు వస్తున్నారు. విధేయత ఉభయులు స్పందించే విధంగా ఉండాలి. పిల్లవాడు టీచర్‌కు విధేయుడిగా ఉంటే, టీచర్ కూడా పిల్లవాడికి విధేయుడుగా ఉండాలి. పాత పద్దతులు అనుసరించే టీచర్‌కు ఇది అర్థం లేనిదిగా కనిపించవచ్చు. కాని నా స్కూల్లో సంవత్సరాల తరబడి పరస్పర విధేయత అమలు జరుగుతున్నది. పైగా ఇది విజయవంతమైంది. మా స్కూల్లో చట్టాలను మెజారిటీ ఓటుతో రూపొందిస్తారు. ఈ చట్టాలకు ఐదు సంవత్సరాల బాలుడు ఎంత విధేయుడుగా ఉంటాడో నేను కూడా అంతే విధేయుడిగా ఉంటాను. పిల్లవాడికి నేను అతని రూంలో ఉండడం ఇష్టంలేకపోతే నన్ను బయటకు వెళ్లమని ఆదేశించవచ్చు. అతను నా రూంలో ఉండడం ఇష్టం లేకపోతే

బయటకు వెళ్లవలసిందిగా ఆదేశిస్తాను. ఇద్దరం విధేయులుగా ఉంటాం.

క్రమశిక్షణతో కూడిన డెస్క్ స్కూల్లో ఈ విధానం అనుసరించడం సాధ్యం కాదనేది స్పష్టం. కేవలం పిల్లల స్వభావాన్ని అధ్యయనం చేయడమే కాకుండా పిల్లలపై అంతులేని విశ్వాసం ఉండాలి. అంతేకాకుండా పిల్లలపట్ల అనుసరించే ధోరణికి సంబంధించి తమపై తమకు నిరుపమానమైన విశ్వాసం ఉండాలి. అప్పుడు మాత్రమే ఈ విధానం అనుసరించడం సాధ్యమవుతుంది. పిల్లవాడికి ఏమి తెలుసు అనే దానికంటే పిల్లవాడే ముఖ్యమనే ప్రపంచ దృక్పథం నుంచి విజ్ఞానానికి ఇవ్వవలసిన స్థానం ఇవ్వడం సాధ్యపడుతుంది. ఈ విధానంలో మానవుని ప్రవర్తన, విద్యకు మూలాధారం అవుతుంది.

టీచర్లకు పిల్లల సైకాలజీలో పది సంవత్సరాలపాటు శిక్షణ ఇచ్చినప్పటికీ వారు తమ పునాదిరాయివంటి ధోరణి వదులుకుంటారా? ఇప్పటికే కొంతమంది ఈ ధోరణి వదలి పెడుతున్నారు. శిక్షణతో చాలామంది ఈ ధోరణి వదులుకునే అవకాశం ఉంది. టీచింగ్ అనేది సైన్స్ కాదు. ఇది ఒక ప్రత్యేకమైన ఆర్ట్. అందువల్ల ఆర్టిస్ట్ మాత్రమే సరిగా విద్యాబోధన చేయగలడని చెప్పవచ్చు. టీచింగ్ అంటే పాఠాలు చెప్పడం కాదు. టీచింగ్ అంటే పిల్లలతో పాటు కలిసి జీవించడం, వారిని అర్థం చేసుకోవడం, వారిలో ఒకరుగా మెలగడం. ప్రముఖ టీచర్ హోమర్‌లేన్ చెప్పినట్టు పిల్లల ముఠాలతో కలిసి పోవడం. హృదయంలేని టీచర్ మాదిరిగా గ్రామ్‌ఫోన్ కూడా పాఠం చెప్పగలుగుతుంది. కాని హృదయం లేని గ్రామ్‌ఫోన్ వంటి టీచర్ మాత్రం పిల్లవాడితో మౌలికమైన బాంధవ్యాన్ని ఏర్పరచుకోలేడు.

పిల్లలతో మౌలికమైన బాంధవ్యం నెలకొల్పుకోవడం అసలైన ప్రశ్న. స్కూలును, జీవితాన్ని పిల్లవాడి దృష్టినుంచి చూడగలగడం. పిల్లవాడికి మార్గదర్శకత్వం వహించాలనేది పాతసూత్రం. తప్పుడు సూత్రం. మూర్ఖమైనది.

పిల్లలంటే ఎవరు? పిల్లలు ఎక్కువగా అతశ్చేతన (unconscious) ప్రభావంలో ఉంటారు. పిల్లలు ఎక్కువగా ఊహాలోకంలో ఉంటారు. వారు ఆడుకునే ఆటలు ఊహా జీవితాన్ని ప్రదర్శిస్తాయి. ఆడుకోవడమే బాల్యం. పిల్లలు సహజంగా చురుకుగా ఉండి, గోలచేస్తుంటారు. చుట్టుపక్కల పరిస్థితుల గురించి వారు అంతగా పట్టించుకోరు. నా స్కూల్లో ఫర్నిచర్ చూస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. బాల్యం అనేది ఏదైనా చేసుకుంటూ పోవడమే కానీ ఆలోచన ఉండదు. ఊహాజనితమైన ఆలోచన ఉంటుంది. కాని వాస్తవమైన ఆలోచన ఉండదు. ఇదితరువాత వస్తుంది.

క్లాస్‌రూమ్‌లో పిల్లల ఊహాజనిత స్వభావానికి తావుండదు. దీనిని ప్రమాదకరమైన పగటి కలలు కంటూ పాఠాలను విస్మరించడం అంటారు. పిల్లలను చేతులు ముడుచుకు



కూర్చున్న మూర్ఖుడైన టీచర్ ఎదురుగా కదలకుండా కూర్చోబెడతారు. వారిలో చురుకుతనాన్ని మట్టి కరిపిస్తారు. ఆటలసమయం వచ్చే వరకు వారి గోలచేసే స్వభావాన్ని అణచివేస్తారు. డెస్క్ స్కూల్లో సృజనాత్మకత వ్యక్తం చేయడానికి అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి.

తలతో పనిచేయడం స్కూల్లో అనుసరించే మౌలిక సూత్రం. ఇది పవిత్రమైన పిల్లల స్వభావ సూత్రానికి విరుద్ధం. తలతో పని చేయడం చాలా కాలం తరువాత కాని అలవడదు. బహుశా మనం అనుకునే దానికంటే ఎక్కువ కాలం అవసరం కావచ్చు. పెద్దవాళ్ళకు కూడా వర్తింప చేయడానికి వీలుకాని సూత్రాలను మనం పిల్లలకు వర్తింపచేస్తున్నాం. వారిని చార్లీ చాప్లిన్, గ్రేట్ గార్బో వంటి మేధావులుగా తయారు చేయాలని మనం కోరుకోవడం లేదు. గోల్ఫ్ ఆడే అనేకమంది టీచర్లు, హెన్రీ కాటన్ నేర్పు చూసి ఆశ్చర్యపోతారు. వంద సంవత్సరాల యుద్ధ చరిత్రను వదిలిపెట్టి తమ గోల్ఫ్ ఆటను అభివృద్ధి చేసుకుందామని ఒక్క టీచర్‌కూడా అనుకోడు. ఈ రోజు క్లాసులో చివర ఉన్న బాలుడు భవిష్యత్తులో గోల్ఫ్ ఛాంపియన్ కావచ్చునేమో! కాని మనం అతను ప్రొఫెసర్ కావలసిందేనన్నట్టు బోధించే ప్రయత్నం చేస్తాం.

డెస్క్ ముందు కూర్చున్న పిల్లవాడి వెనుక ఏముందో ఒక్కసారి ఆలోచించండి. అతని అర్థమెటిక్స్ పరిజ్ఞానం ఎంతో మనకు తెలుసు. అయితే రోజంతా అమలు చేస్తున్న క్రమశిక్షణతో అతను ప్రదర్శించే ముసుగు వెనుక ఏముందో ఎవరికీ తెలియదు. ఈ ముసుగు వెనుక ఏముందో ఊహించడానికి నేను ప్రయత్నిస్తాను. అతను తన పుట్టుక గురించి, తన పుట్టుకపై పెద్దలు చెపప్పిన అబద్ధాల గురించి ఆలోచిస్తుంటాడు. అతని సెక్స్ గురించి ఆలోచిస్తాడు. తన మర్మావయవాలను తాకితే చచ్చిపోతానని లేదా నరకానికి పోతానని అనుకుంటుంటాడు. ఇంటిలోని అన్ని సమస్యల గురించి ఆలోచిస్తుంటాడు. తండ్రి గొంతు పెద్దది చేస్తే భయపడడం గురించి; అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లపై అసూయ గురించి ఆలోచిస్తుంటాడు. ఏదైనా దొంగతనం చేసినపుడు లేదా పెద్ద అబద్ధం చెప్పినపుడు నేరస్తుడినన్న భావనలో మునిగి తేలుతుంటాడు. చావు గురించి కలత చెందుతుంటాడు. అతనిలో ఎన్నో భయాలు చోటుచేసుకుంటాయి. చీకటిలో బయటకు వెళ్లాలంటే భయం. ఆ తరువాత మతం ఒకటి. దేవుడంటే ఎవరు? అసలు దేవుడున్నాడా? ఈ ఆలోచన అతన్ని మరింత భయానికి లోనుచేస్తుంది. వీటితోపాటు ఇతరమైన వేలాది భయాలు, సందేహాలు.

అతని టీచర్‌కు పై ముసుగు మాత్రమే కావాలి. ఆ టీచర్‌కు తన పని పైనే ధ్యాసంతా. దాగివున్న భయాలు, సందేహాలు, ఆశలు–పనిపై కేంద్రీకరించకుండా

దెబ్బతీస్తాయని టీచర్‌కు అర్థం కాదు. స్కూలు పిల్లలకు తరచుగా వచ్చే మానసిక రుగ్మతలు, పిల్లల వ్యక్తిత్వంలో లోతుల్లో దాగివున్న పరిస్థితిని పట్టించుకోనందువల్ల వస్తుంటాయి. ఇంతకు ముందు స్కూల్లో మా పిల్లవాడితో ఎక్కువ పని చేయించారని తరచుగా తల్లిదండ్రులు నాకు చెబుతుంటారు. నార్వేలో పిల్లలతో పని చేయించడం మరీ ఎక్కువ. అందువల్ల నార్వేలో పిల్లలకు ఎక్కువ మానసిక రుగ్మతలు వస్తుంటాయి.

పిల్లల ఆంతరంగిక జీవితం గురించి పట్టించుకోవడం తన ఉద్యోగం కాదని క్లాస్ టీచర్ జవాబు చెప్పవచ్చు. పిల్లలకు అర్థమెటిక్స్ నేర్పడానికే నాకు జీతం ఇస్తున్నారు. అవును పిల్లల ఆంతరంగిక జీవితం గురించి ఎవరు పట్టించుకోవాలి. పిల్లలకు భయాలు ఉంటే ఏం చేయాలి? చావు గురించి భయం లేదా చావు కోరికలతో అతను సంతోషరహితంగా ఉంటే టీచరే అతనికి సహాయం చెయ్యాలి. అతని తల్లిదండ్రులు, పురోహితుడు, స్థానిక డాక్టర్ అతనికి సహాయం చెయ్యలేరు. అతను దొంగతనం చేసినపుడు శిక్షిస్తే సమస్య మరింత తీవ్రమవుతుంది. అతను ప్రేమను కోరుతుంటే నువ్వు ద్వేషాన్ని అందిస్తావు. జగడాలమారితనం ప్రదర్శించినపుడు నువ్వు అతన్ని శిక్షిస్తే అది ఇంకా ఎక్కువకాలం ఉంటుంది. నువ్వు కూడా జగడాల మారివేనని తెలియడంతో ఈ విధంగా జరుగుతుంది.

క్లాసులోని పిల్లలందరికీ మనస్సు డాక్టర్‌గా వ్యవహరించవలసిన బాధ్యత టీచర్‌దే. క్లాస్ టీచర్ దేవుడిని, ధనలక్ష్మిని కొలుస్తున్నట్టయితే ఇది సాధ్యంకాదు. ఒకే సమయంలో మనసుకు డాక్టర్‌గా పనిచేయడం, సార్జంట్ మేజర్‌గా వ్యవహరించడం సాధ్యంకాదు. నా పనిలో కూడా ఈ ఇబ్బంది ఎదుర్కొంటున్నాను. కొత్త పిల్లలు నన్ను తమ పాత టీచర్‌తో సమానంగా గుర్తించుతారు. అందువల్ల వారికి సన్నిహితం కావడం కష్టమయ్యేది. కొన్ని సందర్భాలలో వారాలు, నెలలు వేచి చూడాల్సి వచ్చేది. వారి పాత టీచర్లు క్రమశిక్షణా వాదులైనపుడు ఈ ఇబ్బంది ఎక్కువగా ఉండేది. నేను అధికారిని కాదని గుర్తించినపుడే పిల్లలు తమ మానసిక ఇబ్బందులు చెప్పుకోడానికి నా దగ్గరకు వచ్చేవారు. పిల్లలు మూడు నుంచి ఏడు సంవత్సరాల చిన్న వయసులో నా దగ్గరకు వస్తే అధికారం పట్ల ప్రేమ, ద్వేషం వ్యక్తం చేసే వారు కాదు. వారు మరీ చిన్న వయసులో వస్తే మానసిక వైద్యం అంతగా అవసరమే ఉండదు.

తరచుగా టీచర్లు నాతో ఏమనేవారంటే "ఇది నీకు బాగానేఉంది. నువ్వు సంవత్సరాల తరబడి ఈ పని చేస్తున్నావు. నేను పిల్లలకు సహాయం చెయ్యాలని కోరుకుంటున్నప్పటికీ ఏ విధంగా ప్రారంభించాలో నాకు తెలియదు. నాకు సైకాలజీలో అవసరమైనంత పరిజ్ఞానం లేదు" అనేవారు.నాకు కూడా అంత ఎక్కువ సైకాలజీ



తెలియదు. చాలా సంవత్సరాలుగా ఇదే అంశంపై కేంద్రీకరిస్తున్నందువల్ల ఇతర టీచర్ల కంటే నాకు కొంచెం ఎక్కువ తెలిసే అవకాశం ఉంది. కాని ఒక పిల్లవాడు రాత్రి పూట భయపడుతున్నాడంటే నేను మళ్లీ ప్రారంభం నుంచే మొదలుపెట్టి, నెమ్మదిగా అతని భయానికి కారణమేమిటో తెలుసుకుంటాను. కొన్ని సందర్భాలలో నేను విజయం సాధిస్తాను. మరికొన్ని సందర్భాలలో విఫలమవుతుంటాను. నేను విఫలమైనపుడు మూలకారణం తెలుసుకోకుండానే సమస్య దానంతటదే పరిష్కార మవుతుంటుంది. పెద్దవాడుగా నేను పిల్లలకు సన్నిహితమై ఓదార్చడమే సమస్య పరిష్కారానికి కారణం.

సానుభూతితో కూడిన ధోరణి అనుసరించడానికి సైకాలజీలో శిక్షణ అవసరమని నేను అనుకోను. ఈ ధోరణి నైతికమైనది కాకూడదు. ఒక పిల్లవాడు తన బొమ్మను హత్య చేసినట్టు చెబితే, అతనికి కొత్త బొమ్మ కొనిచ్చినట్టు చెప్పినట్టుగా భావించాలి. అయితే నువ్వు నీ బొమ్మపట్ల ఎటువంటి ధోరణి అనుసరిస్తావనే దానిపై ఇది ఆధారపడి ఉంటుంది.

నైతికపరమైన ధోరణి తీర్పు చెప్పి శిక్ష విధిస్తుంది. టీచర్‌లో ఇటువంటి ధోరణి ఉంటే అది చాలా ప్రమాదకరమైనది. టీచర్ చిరునవ్వు చాటున దాక్కోవాలనుకున్నా ఏమీ పట్టనట్టు వ్యవహరించినా అది పిల్లలు గ్రహించ గలుగుతారు. పెద్దలు ముసుగులో దాచుకునే విషయాలను పిల్లలు అతి తేలికగా పసిగట్టగలుగుతారు.

తిరుగుబాటు చేసిన వారితో ప్లేట్లు, సాసర్లు పగలగొట్టించి ఆ లక్షణం నయంచేసిన హోమర్‌లేన్ గురించి చాలా మంది టీచర్లకు తెలుసు. లేని పక్షంలో తెలుసుకోవాలి. నేను 1920 ప్రాంతంలో టిప్‌ట్రీహాల్‌లోని నార్మన్ మాక్‌మాన్ స్కూల్ సందర్శించాను. ఆ తరువాత నేను లేన్‌ను కలుసుకున్నాను. అప్పుడు ఆయనకు నేనొక కథ చెప్పాను:

"మాక్-మన్ మా పద్ధతి అనుసరించే ప్రయత్నం చేసి విఫలమయ్యాడు. స్కూలు పిల్లలు క్లాస్‌రూమ్ ధ్వంసం చేయడం ప్రారంభించారు. లేన్ పద్ధతిలో ఆలోచించి నార్మన్ కూడా విద్యార్థులతో చేతులు కలిపాడు. కొద్దిసేపట్లో క్లాసురూమ్ ధ్వంసమైంది. ఆ తరువాత పిల్లలంతా ఏడుపు ప్రారంభించడంతో నరకం చూడవలసి వచ్చింది."

"నార్మన్ చైతన్యంతో వ్యవహరించడం వల్ల ఈ విధంగా జరిగిందని" లేన్ వ్యాఖ్యానించాడు. "నార్మన్ తమను మోసం చేస్తున్నట్టు పిల్లలు భావించారు. అందువల్ల వారు ఏడ్చారని" లేన్ విశ్లేషించాడు.

ఈ కథలో మనకొక హెచ్చరిక కనిపిస్తుంది. ఎవరైనా సరే నిజాయితీగా వ్యవహరించినపుడు మాత్రమే పిల్లలకు సహాయం చెయ్యగలుగుతారు. లేనిపక్షంలో

టీచర్‌ను నీతి నియమాలు అనుసరించే వాడుగా పిల్లలు పరిగణిస్తారు.

పిల్లలను వారి మానానికి వారిని వదిలిపెట్టడం ఒక కళ. టీచింగ్ కళ అంటే ఇదే. ఎవరైనా సరే స్వేచ్ఛ కోరుకునే వాతావరణంలో జన్మించకపోతే ఈ కళ నేర్చుకోవడం చాలా కష్టమవుతుంది. పెద్దల సహజ ప్రవృత్తితోపాటు స్వేచ్ఛను కలిపి పిల్లవాడికి దారి చూపించాలి. ఈ మార్గం సరళ రేఖలో ఉండదు. మన జీవన విధానంతో పోల్చుకున్నప్పుడు, సరళరేఖ వంటి మార్గం అనుసరించడం కష్టం. అనవసరమైన విషయాల జోక్యం లేకుండా ఉండాలంటే అంతులేని ఓర్పు అవసరం. ఏడు నుంచి 18 సంవత్సరాల వరకు ఎల్లప్పుడూ పొరపాట్లు చేస్తున్న బాలుడిని నిరంతరం భయంతో కూడిన సందేహంతో చూస్తుండేవాడిని. కాని అతను ప్రస్తుతం కష్టమైన ఉద్యోగం సులువుగా చేసుకోగలుగుతున్నాడు.

కాని దురదృష్టవశాత్తు స్కూలు టీచర్ వేచి చూడలేడు. మిల్లు పిండి చేయడం కొనసాగిస్తూనే ఉంటుంది. టీచర్ దానికి ముడి పశుగ్రాసాన్ని అందజేస్తూనే ఉండాలి. సంవత్సరాలు గడిచిన తరువాత అతను ఊక వస్తుందని చూస్తుంటాడు, మినహా బంగారు గింజలు వస్తాయని ఆలోచించడు. ప్రపంచంలోని పట్టుదలనంతా సొంతం చేసుకొని పుట్టినప్పటికీ 40 లేదా 50 లేదా 60 మంది పిల్లల మనసులకు టీచర్ చేరువ కాలేడు. అవసరమైతే నేనొక విద్యార్థిని ప్రత్యేక క్లాసు తీసుకునే చిన్న రూమ్‌కు తీసుకువెళతాను. కాని బ్యారక్ స్కూల్లో ఇదిసాధ్యం కాదు. హస్త ప్రయోగం వల్ల నష్టం లేదని పిల్లలకు నేను చెప్పగలను. కాని ప్రభుత్వ టీచర్ ఈ విధంగా చెబితే ఉద్యోగం కోల్పోవలసి వస్తుంది. మతం లేకుండా నేను స్కూలు నడుపుతాను. పిల్లలంతా స్వర్గానికి వెళతారని అక్కడ ఎంతోమంచివాడైన వృద్ధుడు దేవుడుగా ఉంటాడని అతను తేనెటీగలను పెంచుతాడని నేను చెబుతాను. మతాన్ని తిరస్కరించడానికి లేదా దానికి మానవత్వం జోడించడానికి ప్రభుత్వ టీచర్‌కు స్వేచ్ఛ ఉండదు.

నేనిపుడు విషాదభరితమైన వాస్తవాన్ని చెప్పక తప్పదు. మన స్కూళ్లలో మానవత్వం చోటుచేసుకోపోతే, టీచర్ మానవత్వంతో వ్యవహరించలేడు. కనీసం నిజాయితీగా వ్యవహరించలేడు. బానిసలైన టీచర్లకు తమ బానిసత్వం వదిలే వరకు పిల్లల కాళ్లకు గొలుసులు వేయడం తప్పదు. బహుశా మన పెట్టుబడిదారీ విధానం కనుమరుగైతే తప్ప ఇదిసాధ్యం కాదు. కాని సోషలిజంలో జైళ్ల వంటి స్కూళ్లను వదిలించుకుంటుందనేది నాకు సందేహంగానే ఉంది. కేవలం లాభాలు లేకుండా చేసినంత మాత్రాన మానవజాతి తృటిలో పరిణామం చెందుతుందని, నైతికవాదం స్థానంలో మానవత్వం చోటుచేసుకుంటుందని చెప్పడం కష్టం.



# 6. టీచర్-సెక్స్

ప్రాయం వచ్చిన వారంతా సెక్స్ జీవనం గడపడం మానవహక్కు. ఈ రోజున ఇది వైవాహిక జీవితంలోనే సాధ్యపడుతుంది. వివాహేతర సంబంధాలను చట్టం, నైతికవాదం గర్హిస్తాయి. వివాహ చట్టాలకు కట్టుబడి అనేకమంది టీచర్లకు సెక్స్ జీవితం లేకుండా పోయింది. ఏదో ఒక కారణంగా వేలాదిమంది స్త్రీలకు భర్తే దొరకడు లేదా వారు పెళ్లి చేసుకోరు. వీరిలో అనేకమంది మన స్కూళ్లలో టీచర్లుగా పని చేస్తుంటారు. బాలికల బోర్డింగ్ స్కూలు సిబ్బందిలో ఎంత ఎక్కువగా బ్రహ్మచారిణులుంటే అంతగా ప్రతిష్ట ఉంటుంది. కొన్ని సందర్భాలలో మగ టీచర్లు పెళ్లి చేసుకొని ఇల్లు ఏర్పరచుకోవాలంటే ఎన్నో ఏళ్లు శ్రమపడాల్సి ఉంటుంది. టీచర్ వృత్తి గౌరవప్రదమైనందువల్ల, నైతిక విరుద్ధంగా వారు వ్యవహరించలేరు. అందువల్ల సంవత్సరాల తరబడి సెక్స్ జీవితానికి దూరంగా ఉండవలసి వస్తుంది. పెద్ద సిటీలలో నివసించే టీచర్లు సెక్స్ జీవితం గడపడానికి కొంత వెసులుబాటు ఉంటుంది. కాని చిన్న సిటీలలో టీచర్లు ఎవరి కళ్లూ కప్పలేరు. వారికి సెక్స్ జీవితం కరవే.

ఈ పరిస్థితి వల్ల ఎదురయ్యే పరిణామాలను పరిశీలిద్దాం. సెక్స్ నియమాలకు ధరల సమాజం తగిన మూల్యం చెల్లిస్తుంది. అణచివేతకు గురైన సెక్స్ మరొక రూపంలో బహిర్గతమవుతుంది. తరచుగా ఆందోళన (anxiety) రూపంలోనూ, కొన్ని సందర్భాలలో మానసిక రుగ్మతగానూ, మరికొన్ని సందర్భాలలో శారీరక రుగ్మతగానూ ఇది బహిర్గతమవుతుంది. ఎక్కువ సందర్భాలలో ఇది జీవితం పట్ల ఆగ్రహం, ద్వేషం రూపంలో వ్యక్తమవుతుంది. అణచివేతకు గురైన సెక్స్ సాధారణంగా ఆందోళన రూపంలో బయట పడుతుంది. దీనివల్ల పనిచేసే సామర్థ్యం తగ్గిపోతుంది.

సెక్స్ జీవితం గడపడానికి అవకాశంలేని స్త్రీ, పురుషులు సాధారణంగా హస్తప్రయోగంతో తృప్తి చెందడానికి ప్రయత్నిస్తారు. పసితనంలో భయం ఏర్పడిన కారణంగా హస్త ప్రయోగం చేసుకునేవారు నేరం చేస్తున్నామన్న భావనలో ఉంటారు. ఈ భావన–ఆందోళన, మరింత ఆందోళనకు కారణమవుతుంది. సెక్స్ జీవితం గడపలేని పెద్దలకు హస్తప్రయోగం ప్రత్యామ్నాయం కాదు.

మన నైతిక సమాజంలో పాఠాలు చెప్పేటపుడు పగటికలలు కనే పిల్లవాడితో పాటు, సెక్స్ పరంగా ఊహలలో బతికే టీచర్ కూడా ఉంటాడు. దీనివల్ల అధికారిపట్ల టీచర్‌లో భయంకూడా చోటుచేసుకుంటుంది. తాము ఊహలలో విహరించేటపుడు హెడ్‌మాస్టర్ వచ్చి పట్టుకుంటాడని వారు భయపడుతుంటారు. సెక్స్ జీవితం కేవలం

భయాన్ని మాత్రమే కాకుండా ఆందోళనతో కూడిన భయాన్ని ఫోబియాను తొలగిస్తుంది. బాంబులంటే భయం సహజం. కాని ఎలుకలంటే సాలెపురుగులంటే భయంపడడం ఆందోళనలతో కూడిన భయం. టీచర్ జీతంపై అధికారం ఉన్న స్కూల్ ఇన్‌స్పెక్టర్ తనిఖీకి వస్తే భయపడడం సహజం. కానీ ఈ రోజున ఆ భయం లేదు. ఇంకా ఇటువంటి భయం ఉంటే అది అకారణమైనది. ఆందోళనతో కూడినది. లైంగిక అణచివేత కారణంగా తలెత్తే మరొక చెడు ఫలితం ఇది. సెక్స్‌పరమైన భావావేశాలు స్థానభ్రంశం చెంది, అనువుగాని చోట, అనువుకాని విధంగా రూపొందుతాయి. సహజ విరుద్ధంగా ఇతర వస్తువులు లేదా పిల్లలపై ఈ భావావేశాలు అతుక్కుపోతాయి. పిల్లలెవరైనా గోడలపై సెక్స్ సంబంధమైన మాటలు రాస్తే సెక్స్ జీవితంలేని టీచర్ మాత్రమే ఉగ్రుడవుతాడు.

వివాహంలేని మహిళలు టీచర్లుగా పనిచేయాలనే అభిప్రాయం మన విద్యావిధానానికి పట్టిన దరిద్రం. వివాహం ఒక గీటురాయికాదు. మహిళలకు లేదా వారి భర్తలకు సెక్స్ పొరపాటనే భావం ఉన్నందువల్ల అనేకమంది వివాహితలు సెక్స్ సంతృప్తికి నోచుకోవడం లేదు. అయితే వివాహితకు సెక్స్ జీవనం గడిపే అవకాశం ఉంది. కాని అవివాహితైన సిస్టర్‌కు ఇటువంటి అవకాశం కూడా ఉండదు.

ఈ పరిస్థితులలో బాలురకు, మహిళలు విద్యాబోధన చేయడమన్న ఇబ్బందికరమైన ప్రశ్న తలెత్తుతున్నది. మహిళలు కంట్రోల్ చేయలేరనేది సాధారణమైన అభిప్రాయం. కంట్రోల్ విషయం మట్టిగొట్టుకు పోనీయండి. పిల్లలకు మగవారు ఆడవారూ కూడా విద్యాబోధన చేయాలి. బాలురకు తల్లికి ప్రత్యామ్నాయం కావాలి. అలాగే బాలికలకు తండ్రికి ప్రత్యామ్నాయం కావాలి. కానీ ఇబ్బందేమంటే ఈ ప్రత్యామ్నాయాలకు సెక్స్ జీవితం లేకుండా పోతున్నది. ఫలితంగా పిల్లలపట్ల టీచర్లు అంతశ్చేతన (unconscious) పరమైన సెక్స్ ధోరణి అలవరచుకుంటారు. పిల్లలపై అభిమానంలో ఈ ధోరణి వ్యక్తమవుతుంది. కొన్ని సందర్భాలలో అవివాహితుడైన మగ టీచర్ క్లాసులోని అందమైన ఆడపిల్ల పట్ల ఆకర్షణ పెంచుకోవచ్చు. కొన్ని సందర్భాలలో ఆడ టీచర్లు కూడా బాలునిపట్ల ఇదే ధోరణి ప్రదర్శించే అవకాశం ఉంది. కొన్ని సందర్భాలలో ఈ ధోరణి ఎంత గట్టిగా ఉంటుందంటే–అభిమానం పొందే విద్యార్థి క్లాసుకు రాకపోతే ఆ రోజంతా పనిలో నీరసంగానూ, అలసటగానూ ఉంటుంది. ఈ భావావేశం, ఎన్నడూ చైతన్యం (conscious) తో జరగదని స్పష్టం చేస్తున్నాను. అణిగిఉండే సెక్స్ భావావేశం చైతన్యం (conscious) తో ఉండదు. ఈ భావావేశానికి వయసుతో సంబంధం ఉండదు. 40 సంవత్సరాల వయసున్న మగ టీచర్ పది సంవత్సరాల వయసున్న బాలికపై ఇటువంటి ధోరణి పెంచుకునే అవకాశంఉంది. ఈ టీచర్‌కు సెక్స్ జీవితం లేనందువల్ల చిన్ననాటి భావావేశాలకు అతను లోనయ్యే అవకాశం ఉంది. ఇది చాలా తేలికగా జరుగుతుంది.



బాల్యంలో సెక్స్, ప్రేమపై సమాజంలో పూర్తి వ్యతిరేకత ఉన్నందువల్ల ఈ దశలోనే నిశ్చల నిశ్చితాలు చోటు చేసుకుంటాయి. అవి జీవితాంతం అలాగే ఉంటాయి. చాలామంది ప్రజలు బాల్యంలో తమను ఆకర్షించిన బాలికలనే తమ మనసులో నిలుపుకుంటారు. చాలాకాలం క్రితం తమను సమ్మోహితులను చేసిన బాలికనే వారు కోరుకుంటుంటారు. నాగరికత అభివృద్ధి చెంది సెక్స్‌పై గట్టి అణచివేత సాగిస్తున్న తెల్లజాతివారిలోనే ఈ విధంగా జరుగుతుందని నేను ఇటీవలి వరకు భావించాను. కాని సైకో ఎనలిస్ట్ ఊల్ఫ్ సాచెస్ రాసిన రోడిషియాకు చెందిన నల్లజాతి యువకునికి సంబంధించి 'బ్లాక్ హామ్లెట్' అనే కథనం చదివిన తరువాత నా అభిప్రాయం మార్చుకున్నాను. రోడీషియాకు చెందిన నల్లజాతి వ్యక్తి బాల్యంలో రెండున్నర గంటలపాటు ఒక అందమైన బాలికతో గడిపి, జీవితాంతం ఆ బాలిక పోలికలనే పట్టుకు వేలాడుతున్నాడు. దీన్ని బట్టి నల్లజాతి వారిలోనూ ఇదే విధమైన అణచివేత సాగుతుందన్నది స్పష్టం.

తరచుగా బాలుర ఊహలలో ఉన్న బాలికపట్ల ప్రేమ తన సోదరి పట్ల ప్రేమతో ముడిపడి ఉంటుంది. అదే విధంగా బాలికల ఊహలలో సోదరుడిపట్ల ప్రేమ నిలదొక్కుకుపోతుంది. తొలిదశలో నిలదొక్కుకు పోయిన ఈ ఊహలు క్రమంగా పక్కకు తొలిగినపుడు వ్యక్తి అభివృద్ధి సాధ్యమవుతుంది. మరొక మాటలో చెప్పాలంటే కుటుంబం నుంచి వేరుపడినపుడే స్వేచ్ఛ లభిస్తుంది. అయితే సెక్స్ పరమైన అణచివేతకు గురైన టీచర్‌లో వేరుపడే క్రమం బలహీనంగా ఉంటుంది. నిరంతరం చిన్న చిన్న సోదరులు, చిన్న చిన్న సోదరిల మధ్య బతకడమే దీనికి కారణం.

సెక్స్ పరమైన అణచివేతకు గురైన టీచర్‌లో సెక్స్‌పరమైన శక్తి, అసూయగా మారుతుంది. ఇది ప్రమాదకరమైన పరిణామం. ఇద్దరు యువజనులు కలిసి పడుకుంటే నాలో వ్యాకులత (anxiety) చోటు చేసుకుంటుంది. బాల్యంలో ఏర్పడిన అసూయ దీనికి మూలకారణం. ఆడపిల్లల స్కూళ్లలో ఎదిగిన బాలికలకు స్తనాలు ఎత్తుగా ఉండడంపట్ల వ్యతిరేకత చూపుతారు. బాలికలు కూడా తమ ఛాతి బాలుర మాదిరిగా లేనందుకు సిగ్గుపడుతుంటారు. ఇది కేవలం సెక్స్ కరవుకు గురైన వ్యక్తులు చూపే అసూయ మాత్రమే కాదు. సెక్స్‌పట్ల విముఖత అభివృద్ధి చేసుకుంటున్న వ్యక్తులు చూపే వ్యతిరేకత కూడా ఈ ధోరణిలో వ్యక్తమవుతుంది. "ఏదైతేనేం సెక్స్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. దాని అస్తిత్వం పట్టించుకోకుండా ఉండడానికి చేయగలిగినదంతా చేయాలి."

సెక్స్ జీవితంలేని మగటీచర్ల కన్నా, సెక్స్ జీవితం లేని ఆడ టీచర్లు ప్రమాదకారులని నేను చెప్పడంలో పురుషాధిక్యతతో కూడిన స్వరం కనిపించవచ్చు. కాని పురుషునికన్నా స్త్రీలు త్వరగా వృద్ధులవుతారనేది విషాదభరితమైన వాస్తవం.

అంతేకాదు మగవారు 60 సంవత్సరాల పైబడినప్పటికీ సెక్స్ జీవితం కోసం చూస్తుంటారు. అయితే ఒక మహిళ సెక్స్ జీవితం లేకుండా యవ్వనం గడిపేస్తే ఆ తరువాత తిరిగి సెక్స్ జీవితం గడిపే అవకాశం పోతుంది. అందువల్ల వయసుమళ్లిన మహిళలు సెక్స్ జీవితం సాధ్యంకాదని, దాన్ని త్యజిస్తారు. కాని వయసుమళ్లిన మగవాడుమాత్రం ఇంకా కన్నె పిల్లలవైపు చూస్తూనే ఉంటాడు. సెక్స్ జీవితం లేనపుడు మగవారిలోకన్నాఆడవారిలో కోపం ఎక్కువగా ఉంటుంది. సెక్స్ జీవితం లేకపోవడం వల్ల మహిళలకు తల్లులయ్యే అవకాశం కూడా పోతుంది. అందువల్ల వారిపై ప్రభావం ఎక్కువగా ఉంటుంది. మహిళలకు మాతృత్వం ముఖ్యమైనది. కాని మగవారికి పితృత్వం అంత ప్రధానమైనదికాదు. పిల్లలపట్ల మగ జంతువుకు అంతగా ఆసక్తి ఉండదు. తల్లితో తొలి బంధాలు విడిపోయిన తరువాత పిల్లలపట్ల మగ జంతువుకు ఆసక్తి జనిస్తుంది.

అయితే పరిష్కార మేమిటి? వివాహితులైన టీచర్లనే స్కూళ్లలో నియమించాలా? వివాహితులైన వారుకూడా అవివాహితుల మాదిరిగా అధమంగా లేరా? క్రూరంగా వ్యవహరించే హెడ్మాస్టర్లు, ఆడటీచర్లు మనకు తెలియదా?

ఈ ప్రశ్నలను దృష్టిలో ఉంచుకుంటే డాక్టర్ విల్మ్‌హెల్మ్‌రైక్ సిద్ధాంతాలను మనం మళ్లీ పరిశీలించవలసి ఉంటుంది. సెక్స్ పరమైన అణచివేత కండరాలపై ప్రభావం చూపుతుందని కండరాలు బిగుసుకుపోతాయని, అవి తిమ్మిరెక్కుతుంటాయని రైక్ విశ్వసించాడు. శరీరంలోని కండరాలన్నీ సెక్స్ అవయవాల రక్షణకు వీలుగా ఈ విధంగా తయారవుతాయి. నైతికపరంగా పిల్లలను సరిదిద్దడానికి ప్రయత్నించినపుడు వారి కడుపులు బిగుసుకుపోతాయి. మొదట నాకు రైక్ ఈ విషయం చెప్పినపుడు ఆషామాషీగా తీసుకున్నాను. కానీ సమ్మర్‌హిల్‌లో చిన్నపిల్లల పొట్టలు పరిశీలించినపుడు నేను ఆశ్చర్యపోయాను. నైతికపరమైన శిక్షణలో పెరిగిన పిల్లల పొట్టలు బిగుసుకుపోయి ఉన్నాయి. నైతికశిక్షణలేని పిల్లల పొట్టలు మృదువుగా ఉన్నాయి. సెక్స్ నిషేధాల కారణంగా నాగరిక సమాజంలోని ఏ దేశంలోనూ స్త్రీ, పురుషులు ఏనాడు సెక్స్‌లో పూర్తిగా సంతృప్తి పొందలేకపోతున్నారని రైక్ స్పష్టం చేశాడు. కండరాలు బిగుసుకుపోయినందువల్ల భావప్రాప్తి లేకుండా పోతున్నదని ఆయన తెలిపాడు. ఫలితంగా రతిలో పాల్గొంటున్న మహిళలకు భావప్రాప్తి లభించడం లేదు. (ఈ విషయం డాక్టర్లకు, సైకాలజిస్టులకు చాలాకాలంగా తెలుసు). ఎక్కువమంది మగవారు తాము కోరుకునే సంతృప్తి లేకుండానే సెక్స్‌లో పాల్గొంటున్నారు. ఇది ఇబ్బంది గలిగించే కాలయాపన మాత్రమేనని కొంతమంది స్త్రీ, పురుషులు వ్యాఖ్యానించడం కూడా మనం వింటుంటాం.

వైవాహిక జీవితం అసంతృప్తిగా సాగడానికి సరైన కారణాలను రైక్ సిద్ధాంతం మాత్రమే వివరించగలిగింది. రోజంతా ఇబ్బంది పెడుతూ గయ్యాళిగా ఉండే భార్య



ఎందుకు అలా ఉంటుందనేది రైక్ వివరించాడు. భర్త ఎల్లపుడు బయట సుఖం కోరుకోడానికి కారణాలను కూడా ఆయన తెలిపాడు. ఈ సుఖం సెక్స్ సుఖమే కానక్కరలేదు. అతనిక్లబ్, హాబీలు తదితర సుఖాలు కూడా కావచ్చు. వైవాహిక జీవితం, ప్రేమ జీవితం రెండూ ఒకటి కాదు. నిజానికి ప్రేమకు వివాహం పెద్ద ఆటంకం. వివాహమంటే శాశ్వత బంధం ఏర్పడుతుంది. చట్టం ద్వారా ప్రేమను శాశ్వత బంధంగా మార్చలేం. ప్రేమ స్వేచ్ఛగా ఉండాలి.

అప్పుడు, ప్రేమంటే ఏమిటి? ప్రేమకు, శారీరక పరమైన ప్రేమకు తేడా ఏమిటి? అనే ప్రశ్నలు తలెత్తుతాయి.

అణకువ పేరుతో తప్పించుకోకుండా ఈ ప్రశ్నను ఎదుర్కోవాలి. స్త్రీ పురుషుల మధ్య భౌతికమైన ప్రేమ జననేంద్రియాలపై ఆధారపడి ఉంటుంది. ఇది లేకుండా సెక్స్ పరమైన ప్రేమలో పడడం సాధ్యంకాదు. ప్రేమ లేకుందా కూడా సెక్స్ పరమైన ప్రేమ జనిస్తుంది. యవ్వనంలో ఉన్నపుడు ఇటువంటి ప్రేమ సహజం. ఈ కోరికను శారీరకపరమైన ప్రేమగా వర్ణించవచ్చు. అయితే సెక్స్ కోరికలను నైతికవాదం వ్యతిరేకిస్తుంది. కాని జంతువులలో ఈ కోరికను సర్వ సాధారణమైనదిగా పరిగణిస్తారు. సీజన్‌లో ఆడ కుక్క, మగ కుక్కను ఆకర్షించడానికి ప్రయత్నించినపుడు ఎవరూ నైతిక ఆలోచనలను పరిగణలోకి తీసుకోరు.

జంతువుల ప్రవర్తన తక్కువస్థాయికి చెందినది, అది సెక్స్‌కు పరిమిత మవుతుందని నైతికవాదం భావిస్తుంది. అయితే ఉన్నతుడైన మానవుడనే జంతువు యుద్ధాలు చేస్తాడని, మహిళలు, పిల్లలపై బాంబులు వేస్తాడని, ద్వేషం వెలిగక్కుతాడని, కుంభకోణాలు చేస్తుంటాడని నైతికవాదం మరచిపోతుంది. ఇదే తీరులో కన్యాత్వం కోల్పోవడం, చావుకన్నా భయంకరమైనదనే కృత్రిమమైన నమ్మకం కూడా చోటు చేసుకున్నది.

జంతుప్రాయపు కోరికలకు వివాహమహోత్సవాల ద్వారా ఉన్నతస్థాయి కల్పించడమనేది నిజాయితీపరులకు అర్థం కావడం అంత తేలికకాదు. కొన్ని వివాహాలలో ప్రేమ చిరకాలం కొనసాగుతుంది. కాని లెక్కలేనన్ని వివాహాలలో కొద్దిగా ముందు లేదా వెనుక ప్రేమ అంతరించిపోతుంది. ఇటువంటి వివాహాలు వ్యభిచారం కన్నా అధమ స్థాయికి దిగజారిపోతాయి. ప్రేమకు స్వేచ్ఛ లేని వివాహాన్ని మాత్రమే ప్రేమ జీవితానికి గౌరవప్రదమైన మార్గంగా ఆమోదిస్తున్నారు. వివాహమనేది ప్రేమకు ప్రధానమైన శత్రువనేది మాత్రం వాస్తవం. వివాహం ద్వారా లబ్ధి, వివాహబంధం, భార్య ఆర్థికపరంగా భర్తపై ఆధారపడడం ఇవి ప్రేమకు ప్రమాదం కలిగిస్తాయి. వివాహం నిశ్చలమైనదేతే, ప్రేమ చురుకుగా ఉండడమే దీనికి కారణం. భావావేశాన్ని అణచివేయవచ్చుగాని దాన్ని

తుడిచివేయడం సాధ్యంకాదు. వివాహిత ఎవరితోనైనా ప్రేమలో పడితే సామాజిక నిషేధాల కారణంగా ఆ ప్రేమ ఫలించదు. దానికి చెల్లించే మూల్యం చాలా ఎక్కువ. ఆమె వైవాహిక జీవితం ఒక అబద్ధం అవుతుంది. భర్తతో సెక్స్ జీవితం సంతోషరహితమైన వ్యభిచార జీవనంగా తయారవుతుంది. ఆమెకు సంతోషం లేకపోవడంతో అది పిల్లలపై ప్రభావం చూపుతుంది. పిల్లలు ఇబ్బందికి లోనై సంతోషం లేనివారుగా రూపొందుతారు. అన్నిటికంటే మించి నేరం చేస్తున్నానన్న భావన ఆమెను వెంటాడుతుంది. ఆమె ప్రేమిస్తున్న వ్యక్తిని ఏనాడూ ముద్దు కూడా పెట్టుకోక పోయినప్పటికీ ఈ భావన చోటు చేసుకుంటుంది. లక్షలాది మంది వివాహితలు ఈ పరిస్థితిలోనే బతుకుతున్నారు. లక్షలాది మంది మహిళలు సెక్స్ బాధాకరమైనదిగా ఎందుకు భావిస్తున్నారో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. అదేవిధంగా లక్షలాది మంది పురుషులకు సెక్స్ సంతృప్తి ఇవ్వడంలేదు. ప్రేమను కేవలం సెక్స్ పరమైనదిగా దిగజార్చడానికి వివాహమనేది రాచబాట.

శారీరకమైన కోర్కెలకు మృదుత్వంతోడైతే అదిప్రేమ అవుతుంది. సెక్స్‌లో పాల్గొనే ఇద్దరికీ అంతకుముందు, ఆ తరువాత కూడ మృదుత్వమనేది ఉంటే ప్రేమకు స్థానం ఏర్పడుతుంది. ప్రేమ లేకపోతే సెక్స్ కార్యక్రమం ముగియగానే పురుషుడు లేచి వెళ్లిపోతాడు. ఆరోగ్యవంతమైన సెక్స్‌లో ప్రేమ ఒక్కటే గీటురాయి అవుతుంది. అప్పుడు స్త్రీ పురుషులు ప్రేమలో ఉన్నందువల్ల కలిసి నిద్రిస్తారు. వారు పరస్పరం ఒకరినొకరు కోరుకుంటారు. వారి ప్రేమను అడ్డుకోడానికి లేదా నిషేధించడానికి మూడో వ్యక్తికి ఎటువంటి హక్కు ఉండదు.

ఏది ఏమైనప్పటికీ మనం ఊహాలోకాలలో జీవించడం లేదు. అందువల్ల ఈ రోజున పరిస్థితులు ఎలా ఉన్నాయనేది అర్థం చేసుకోవాలి. ఈ రోజున మన స్కూళ్లలో వేలాదిమంది టీచర్లు నైతిక వాదాన్ని ఆమోదిస్తున్నారు. లేదా నైతిక వాదాన్ని ఆమోదించవలసిన తప్పనిసరి పరిస్థితిలో ఉన్నారు. ఈ ధోరణి పిల్లలను ఏ విధంగా ప్రభావితం చేస్తుంది? ఇది చెప్పడం అంత తేలికకాదు. పిల్లలు అంతశ్చేతనంగా (unconscious) ఏమి అందుకుంటారన్నది అంతుబట్టని రహస్యమే. కాని కొంత మనం ఊహించుకోవచ్చు. అయితే ఒకటి మాత్రం నిజం. టీచర్ అంతశ్చేతనం తెలియకుండానే పిల్లల అంతశ్చేతనను ప్రభావితం చేస్తుంది. సెక్స్ అణచివేతకు గురైన ప్రధానోపాధ్యాయురాలు అంతశ్చేతనంగా స్కూల్లోని బాలికలకు సెక్స్ నేరమన్న భావన కలుగజేస్తుంది. సూళ్లలో సెక్స్ గురించి మాట్లాడమే తప్పుగా భావిస్తున్న తరుణంలో సెక్స్‌పై ఎటువంటి అవగాహనలేని కొత్తతరం ప్రస్తుతం కొనసాగుతున్న సెక్స్ నీతి నియమాలు ఆమోదించవలసిన తప్పనిసరి పరిస్థితి ఎదురవుతున్నది. కొంతమంది టీచర్లు తేనెటీగలు, పుప్పొడిని ఉదాహరిస్తూ సెక్స్ పరిజ్ఞానం అందజేయడానికి ప్రయత్నిస్తారు.



సంభాషణలో పుప్పొడి అన్నమాట దొర్లితే తాను సిగ్గుపడి పోతున్నట్టు ఒక యువకుడు నాకు చెప్పాడు. పుప్పొడి అనే మాట ఆతని విషయంలో అశ్లీలంగా తయారైంది. కాని సెక్స్‌లో ప్రధానమైనది సంతోషం పొందడమేనని, అందువల్లనే సెక్స్ గురించి మాట్లాడకూడదన్నభావన ఏర్పడిందని మనం పిల్లలకు బోధించేవరకు సెక్స్ విద్యకు న్యాయం జరగదు.

సెక్స్ అణచివేతపై రైక్ వ్యక్తం చేసిన అభిప్రాయాలకు విస్తృతమైన సామాజిక ప్రాముఖ్యత ఉంది. సెక్స్ అణచివేత వెనుక భయానకమైన లక్షణం దాగి ఉందని రైక్ తెలిపాడు. రాజ్యాంగ యంత్రం (పెట్టుబడిదారీ విధానం) కార్మిక వర్గాన్ని అదుపు చేయడానికి సెక్స్ అణచివేతను శక్తివంతమైన ఆయుధంగా ఉపయోగిస్తుంది. సెక్స్ అణచివేత కారణంగా, కార్మికులు విత్తుకొట్టిన ఎడ్ల మాదిరిగా ఆవేశం, శక్తి లేకుండా పడి ఉంటారు. తమ హక్కులకోసం పోరాడే ధైర్యం వారికి లేకుండా పోతుంది. జీవితంలో ఆకలి, సెక్స్ ప్రధానమైన సహజాతాలని రైక్ స్పష్టం చేశాడు. మార్క్సిజం ఆకలికి అంటే ఆర్థిక సహజాతానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి, ఉత్పత్తి సాధనాలపై కార్మికులకు అధికారం కల్పించి నూతన ప్రపంచాన్ని నిర్మాణం చేయవచ్చునని ఆశించింది. జీవితంలో ఆకలి కొంత భాగం మాత్రమేనని సెక్స్ అణచివేత నుంచి స్వేచ్ఛ లభించకపోతే మార్క్సిజం విఫలమవుతుందని రైక్ నిర్ద్వందంగా చెప్పాడు. ఈ సందర్భంగా ఆయన రష్యా పరిణామాలను ఉదాహరించాడు. రష్యాలో విప్లవం విజయం సాధించిన తొలి రోజుల్లో సెక్స్ పరమైన స్వేచ్ఛ కల్పించారు. కాని స్వలింగ సంపర్కం, గర్భస్రావాలకు వ్యతిరేకంగా రష్యాలో రూపొందించిన చట్టాలు, బూర్జువా రాజ్యాంగ యంత్రంలో ఎలా ఉన్నాయో కచ్చితంగా అలాగే ఉన్నాయి. పైపెచ్చు యవ్వనంలో సెక్స్‌ను రష్యా తిరస్కరిస్తున్నది. ఆర్థిక విప్లవంతో పాటు సెక్స్ విప్లవం వచ్చినపుడే కొత్త నాగరికత నిలదొక్కుకో గలుగుతుందని రైక్ స్పష్టం చేశాడు. జర్మనీ విప్లవోద్యమంలో పనిచేసినంత కాలం ఆయన యువత, సెక్స్‌లపై తన దృష్టి కేంద్రీకరించాడు. యువతకు రాజకీయ విద్యతోపాటు సెక్స్ విద్య కూడా బోధించడానికి ఆయన ప్రయత్నం చేశాడు. టీచర్లకు అందునా కార్మిక వర్గం పిల్లలకు బోధించే టీచర్లకు రైక్ చేసిన కృషి అత్యంత ఆసక్తి గొలిపే విషయం. ఆయన జర్మన్ బాషలో రాసిన "సెక్స్ పరంగా యువత సాగిస్తున్న పోరాటం" అనే పుస్తకం త్వరలో ఇంగ్లీష్‌లో కూడా ప్రచురితమవుతుందని నేను ఆశిస్తున్నాను. సెక్స్‌పరంగా యువజనులైన కార్మికులు అనుభవిస్తున్న దయనీయమైన పరిస్థితిని ఆయన పుస్తకంలో వివరించాడు. ప్రేమించుకోడానికి వారికి కనీసం స్థలం లేకపోవడం, గర్భనిరోధకాలపై వారి అజ్ఞానం, గర్భ నిరోధకాలకు డబ్బులు లేకపోవడం తదితర పరిస్థితులను ఆయన వెల్లడించాడు. స్వేచ్ఛ కోసం అలుపులేని పోరాటం సాగిస్తున్న యోధుడు రాసిన గొప్ప

పుస్తకమది. పేదలు ఏ విధంగా నైతికవాదానికి బలవతున్నదీ అందులో వివరించారు. నాకు తెలిసినంతవరకు సోషలిస్టులు, కమ్యూనిస్టులలో ఇంత పెద్ద ఎత్తున ద్వేషం, ఆగ్రహాన్ని తెచ్చిపెట్టిన పుస్తకం మరొకటి లేదు. పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా పోరాటం గౌరవప్రదమైనదే. కాని పెట్టుబడిదారీ విధానానికి మూలస్తంభమైన చర్చి, సెక్స్ నైతిక వాదానికి అది ఇచ్చే మద్ధతుపై పోరాటం సాగించడమంటే, నిన్ను నువ్వు ప్రస్తుత నాగరికతకు వెలుపలకు నెట్టుకోవడమే అవుతుంది. స్వార్థపూరితమైన నీతి నియామాలను తిరస్కరించి, ప్రేమ పునాదులపై రూపొందిన కొత్త నీతి నియమాలు రావాలని రైక్ కోరుకున్నాడు.

రైక్ సామాజిక విశ్లేషణ సరైనదైతే, (అది సరైనదేనని నేను విశ్వసిస్తున్నాను) సంప్రదాయక సెక్స్ నీతి నియమాలను ఆమోదిస్తున్న టీచర్లు చేస్తున్న హాని ఏమిటి? వేతనానికి బానిసలనే కాకుండా సెక్స్ బానిసలను కూడా స్కూళ్లు తయారు చేస్తున్నాయి. హారీపోలిట్, విల్లీ గల్లా చెర్ వంటి వారిని నేను ఎంతగానో అభిమానిస్తాను. కాని వారి ఉద్వేగపూరితమైన ఉపన్యాసాలు, వ్యాసాలలో ఎన్నడూ సెక్స్ గురించి ప్రస్తావించరు. మనం ఒక వైపున పెట్టుబడిదారీ నీతి నియమాలను కాపాడుకుంటూ మరోవైపున పెట్టుబడిదారీ విధానాన్ని నాశనం చేయడం ఎలా సాధ్యం? జీవితంలో సెక్స్ సృజనాత్మకమైన శక్తి. మన విప్లవకారులు దాన్ని అశ్రద్ధ చేసి ప్రపంచాన్ని పునర్ నిర్మించాలని కోరుకుంటున్నారు. వారు కేవలం ఆలోచనలను మార్పు చేయాలని ఆశిస్తున్నారు. తిరుగుబాటుదారులు నేరం చేస్తున్నామన్న భావనలో ఉన్నందున వారు ముందుకు సాగలేరు. అందువల్ల ఎక్కువమంది తిరుగుబాటుదారులు దోషులుగా మిగిలిపోతున్నారు. వారు పేదలను ప్రేమించడం కంటే ధనికులపై ఎక్కువ ద్వేషం వెలిగక్కుతున్నారు. వారు స్వేచ్ఛా జీవులుగా కాకుండా బంధనాలలో ఇరుక్కున్న వారుగా-ద్వేషులుగా మిగిలిపోతున్నారు. వారు తమ బంధనాలన్నీ పెట్టుబడిదారీ విధానం నుంచి వస్తున్నాయని భావిస్తున్నారు. కానీ తమలో అణచివేతకు గురైన భావాలు అతిశక్తివంతమైన బంధనాలని గుర్తించలేకపోతున్నారు. సెక్స్‌తోపాటు, ఆత్మ సంబంధమైన భావాలు కూడా ఇందులో ఉంటాయి.

ఆత్మ సంబంధమైన భావాలు (spiritual) సహజంగానే మతానికి సంబంధించి ఉంటాయి. నాకు చైతన్యంతో కూడిన మతం లేదు. అందువల్ల మతం గురించి రాయడానికి నాకు అర్హత లేకపోవచ్చు. నేను మతం లేకుండానే జీవిస్తాను. మా స్కూలు పిల్లలు కూడా అంతే. నిజాయితీపరులైన క్రైస్తవులమాదిరిగా మేమంతా ఎంతో నిజాయితీగానూ, మానవతా వాదులుగానూ జీవిస్తాం. మాకు మతంతో అవసరమే ఉండదు. పిల్లలు స్వతహాగా మతాన్ని కోరుకోరు. వారు స్వతహాగా దేవుడిని పూజించాలని లేదా దేవుడంటే



భయపడాలని కోరుకోరు.

కాని స్కాంట్లండ్‌లో నేను మతం ప్రభావంలోనే పుట్టి పెరిగాను. నేను ఇప్పుడు వెనక్కు తిరిగి నిష్పక్షపాతంగా పరిశీలిస్తున్నాను. నాకీ మతం తలకిందులుగా కనపడుతుంది. దేవుడిని దయ్యమని, దయ్యాన్ని దేవుడని తలుస్తుంది. యవ్వనంలో ఉన్నపుడు నేను విశ్వసించిన దేవుడు ఎవరిలోనూ ప్రేమ భావన ప్రేరేపించలేదు. ఆ దేవుడు భయపెట్టే దేవుడు. నిషేధాలు, ద్వేషం, పగలతో కూడిన దేవుడు జీవితం వద్దని చెప్పక తప్పనిసరి పరిస్థితి కల్పించాడు.

అయితే దేవుడికన్నా దయ్యం భిన్నమైనది. దయ్యానికి అన్నీ మంచి లక్షణాలే ఉన్నాయి. మంచి సంతోషాలన్నీ దయ్యానికి చేరువగా ఉంటాయి. సంతోషాలను దయ్యం తిరస్కరించదు. నిజం చెప్పాలంటే దయ్యం భయానికి బదులు ప్రేమను ప్రోత్సహిస్తుంది. దయ్యం అన్నివేళలా జీవితాన్ని ప్రోత్సహిస్తుంది. దీనికి విరుద్ధంగా దేవుడుఅన్ని వేళలా చావు గురించి ఆలోచిస్తాడు. దయ్యం శరీరాన్ని ప్రేమిస్తుంది. దేవుడు ఆత్మను స్తుతిస్తాడు. దయ్యం ఏమి చెబుతుందంటే: సెక్స్‌లో పాపభూయిష్టమైనది లేదు. దీనికి బదులు దేవుడు ఏమని అరుస్తాడంటే:శారీరక వాంఛల నుంచి దూరంగా ఉండు, రానున్న ఉపద్రవం నుంచి కాపాడుకో. వెనక్కు తిరిగి చూసినపుడు బాల్యంలో నేను స్వర్గాన్ని చాలా చిన్న ప్రదేశంగానూ, నరకాన్ని జన సమ్మర్ధమైనదిగానూ చిత్రించిన విషయం గుర్తుకు వస్తున్నది. “స్వర్గం అనేది పవిత్రత కోసం. నరకమనేది సాన్నిహిత్యం కోసం ఏర్పడ్డాయి.”

ఆ విధంగా మతమనేది జీవితానికి విరుద్ధమైనదని నా అభిప్రాయం. అయితే నేను చెప్పేది క్రీస్తు బోధించిన మతం గురించి కాదు. ఏసుక్రీస్తు ప్రేమ మతాన్ని బోధించాడు. శత్రువుని కూడా ప్రేమించాలని ఆయన తెలిపాడు. కానీ ఈ మతం మాటలకు మాత్రమే పరిమితమైంది.

మత ప్రాతిపదికపై సెక్స్‌ను కూడా వ్యతిరేకించారు. ఏ మత ప్రాతిపదికపై సెక్స్‌ను వ్యతిరేకించారని నేను ప్రశ్నిస్తున్నాను? కాంటర్‌బరీ ఆర్చ్‌బిషప్ మతమా? లేక క్రీస్తు ప్రతిపాదించినదా? ప్రేమతో కూడిన మతమా? లేక పెట్టుబడిదారీ విధానానికి మద్ధతు ఇచ్చే మతమా? ఈ ప్రశ్నకు జవాబు చెప్పి తీరాలి. సంఘటితమైన మతం ఇతర సంఘటిత శక్తుల మాదిరిగా మానసికంగా చచ్చిపోతుంది. అయినప్పటికీ ఈ మృతదేహం మానవ జీవితానికి ప్రతికూలశక్తిగా పనిచేస్తుంది. ఇది జీవితమంటే భయపడుతుంది. అందువల్ల తరాల తరబడి ప్రజానీకం జీవితానికి ప్రతికూలంగా వ్యవహరించేటట్టు చేస్తుంది. ఈ పరిస్థితిలో మతం సెక్స్ భావావేశాలను దొంగిలించి తన ప్రయోజనాలకు వినియోగించడం తేలిక. సెక్స్‌పరంగా కరవుకు గురైన ఎంతమంది

మహిళలు మతంలో తమ భావావేశాలను కుదుటపరచుకోడానికి ప్రయత్నం చేస్తున్నారు? చాలామందిలో సెక్స్ భావావేశాలు సెక్స్ వ్యతిరేక భావావేశాలుగా మారిపోతాయి. నిజానికి అవి మృత్యు భావావేశాలుగా మారిపోతాయి. మతాన్ని అనుసరించేవారు అంతశ్చేతనంగా మృత్యువును కోరుకుంటారు. కాని విచిత్రంగా వారు జీవించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటారు.

సెక్స్ అణచివేత, ఆర్థికపరమైన అణచివేతల కారణంగా భావావేశాలు విత్తనాల మాదిరిగా తయారవుతాయి. హిట్లర్ వంటి వారు వచ్చినపుడు వారిపై ఈ భావావేశాలను గుమ్మరిస్తారు. హిట్లర్ పట్ల వ్యక్తమయ్యే భావావేశానికి, మతంపట్ల వ్యక్తమయ్యే భావావేశానికి తేడాలేదు. హిట్లర్ అనుయాయులలో కొంతమంది ఆయనకు పూజలు చేసేవారు. జర్మనీ దక్షిణ ప్రాంతంలో శుభోదయమని అభివాదం చేసుకోడానికి బదులు "హెయిల్ హిట్లర్" అని అభివాదం చేసుకోవడం ప్రారంభించారు. ఈ విధంగా చేయడంలో ఉన్న ప్రాధాన్యతను మనం గుర్తించాలి. జరుగనున్న యుద్ధం చాలా మందికి పవిత్ర మత యుద్ధంగా తయారైంది. వ్యక్తులకు సంబంధంలేని సెక్స్ భావావేశాలు కొనసాగినంతకాలం, మనకు హిట్లర్లు వస్తారు. యుద్ధాలు, పేదరికం, దోపిడి కొనసాగుతూనే ఉంటాయి.

నేను స్కూలు, టీచర్‌ను వదిలిపెట్టి చాలాదూరం వెళ్లాను. ఇంతకూ నేను చెప్పదలచుకున్న దేమంటే: టీచర్ ఉద్యోగంలో ఉన్నపుడు పాక్షికంగా స్కూల్లో పనిచేస్తాడు. టీచర్ సమాజంలో భాగం. మానవ నైజానికి, మానవుని సంతోషానికి వ్యతిరేకంగా అణచివేతతో సాగుతున్న కుట్రలో కూడా టీచర్‌కు భాగస్వామ్యం ఉంది. స్కూలు సబ్జెక్ట్స్‌కు మాత్రమే పరిమితమైన టీచర్లు యధాతథ పరిస్థితులు కొనసాగడానికి సహకరిస్తుంటారు. మనుషులకు ఆర్థిక, సెక్స్ స్వేచ్ఛలను తిరస్కరించే నాగరికత అభివృద్ధి చెందడానికి టీచర్లు దోహదం చేస్తున్నారు. టీచర్ హఠాత్తుగా ఎడ్యుకేషన్ బోర్డులో మహిళలతో తానొక అంతఃపురం ప్రారంభిస్తున్నట్టు ప్రకటించాలని నేను సూచించడం లేదు. టీచర్ వృత్తిలో జరుగుతున్న దాని పట్ల టీచర్‌ను మరికొద్దిగా చైతన్యవంతుడిని చేయాలన్నదే నా లక్ష్యం. పిల్లలకు విద్యాబోధన చేసినందుకు జీతం చెల్లిస్తున్న సమాజం వెనుక శక్తుల గురించి మరి కొంచెం తెలియజెప్పడమే నా లక్ష్యం. ఈ శక్తులన్నీ పెట్టుబడిదారీ స్వర్గం కోసమే పని చేస్తున్నాయి.

సెక్స్‌పట్ల టీచర్ అనుసరించే ధోరణి పరిమితమైనదైతే, సెక్స్‌పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పిల్లలను అర్థం చేసుకొని, వారికి సహకరించే అవకాశం టీచర్‌కుఉండదు. హస్త ప్రయోగం పట్ల అపరాధభావం ఏర్పడిన టీచర్ అదే పరిస్థితిలో ఉన్న పిల్లలకు సహకరించలేడు. క్లాసులో పగటికలలు కంటూ కాలం గడిపే మందగొడి విద్యార్థి సాధారణంగా సెక్స్ పాపమా?కాదా? అన్న దుర్భరమైన సమస్యను



పరిష్కరించుకోలేక బాధపడుతుంటాడు. ప్రపంచంలోని క్రమశిక్షణ నంతా అమలు చేసినప్పటికీ, ఎన్నిమాటలు చెప్పినప్పటికీ అటువంటి పిల్లవాడికి సహకరించడం సాధ్యంకాదు. కాని సానుభూతితో కూడిన అవగాహనతో టీచర్ ఈ సమస్యను పరిష్కరించవచ్చు. సెక్స్‌కు సంబంధించిన ఇబ్బందులే పిల్లల జీవశక్తి (libido)లో అధిక భాగం ఆక్రమిస్తాయి. ప్రపంచంలోని స్కూల్ సబ్జెక్ట్స్ అన్నీ దీనికి సరికావు. సెక్స్ పరమైన ప్రశ్నలు ఎదుర్కోడానికి భయపడే టీచర్ అర్థమెటిక్స్‌లో పిల్లవాడి సామర్థ్యాన్ని పట్టించుకుంటాడు. క్రమశిక్షణ అమలు చేస్తాడు. పిల్లవాడిలో చోటుచేసుకున్న కవచపు ఉపరితలాన్ని మాత్రమే చూడగలుగుతాడు.

సెక్స్ సమస్యకు అనవసరమైన ప్రాధాన్యం ఇస్తున్నట్టు చాలామంది కోపగించుకుంటారు. సెక్స్‌కు పిల్లలు అంత ప్రాధాన్యం ఇవ్వరని వారు స్పష్టంగా ప్రకటిస్తారు. నేను ఒకప్పుడు లండన్‌లో కొంతకాలం ఒక కోఎడ్యుకేషన్ స్కూల్‌లో పనిచేశాను. స్కూల్‌లో విద్యార్థులంతా మధ్య తరగతికి చెందినవారు. రెండు సంవత్సరాల కాలంలో సెక్స్‌పరమైన మాట ఒక్కటి కూడా నేను వినలేదు. మలం, సెక్స్ అవయవాలకు సంబంధించి బూతుమాటలు 15 సంవత్సరాల పిల్లలకు కూడా తెలియవని నేను కనుగొన్నాను. ముందుగా నాకు ఆశ్చర్యమేసింది. తొమ్మిది సంవత్సరాల పిల్లవాడు ఆఫీసులో ఎనిమిది సంవత్సరాల బాలికను ముద్దాడడం ఎటువంటి నేరమనేది స్కూల్ హెడ్మాస్టర్ ఇచ్చిన సుదీర్ఘమైన ఉపన్యాసం విన్న తరువాత నాకు జ్ఞానోదయమైంది. అయితే సెక్స్ రాహిత్యమనే మధ్య తరగతి భావన కట్టుకథ మాత్రమేనని నేను సొంత స్కూలు ఏర్పాటు చేసే వరకు నాకు అర్థం కాలేదు.

మధ్య తరగతికి చెందిన ఐదు సంవత్సరాల పిల్లలకు స్వేచ్ఛ లభించినప్పుడు సెక్స్‌పరమైన, మల విసర్జన పరమైన విషయం పట్ల ఎక్కువ ఆసక్తి చూపేవారు. వారు ఉపయోగించే మాటలు ఒక్కోసారి సందర్శకులను ఇబ్బందికి గురిచేసేవి.

సందర్శకుల వ్యక్తిత్వాన్ని పిల్లలు చాలా తేలికగా గ్రహించగలిగేవారు. వీరి భాషను వినడానికి ఎవరైనా ఆధునికులు వస్తే పిల్లలు మౌనం పాటించేవారు. కాని వారి భాషను ఆమోదించలేని ఆంటీ మేరీలాంటి వాళ్లు వస్తేమాత్రం పిల్లలు అశ్లీల పదజాలం ఎక్కువగా ఉపయోగించేవారు. నా భార్యకు చిన్నపుడు మతపరమైన శిక్షణ లేదు. అందువల్ల పిల్లల భాష విని ఆంటీమేరీ దిగ్భ్రాంతి చెందితే నా భార్య చిరునవ్వు నవ్వి ఊరుకునేది. నేను నా చిన్ననాటి కాల్వినిజం శిక్షణను గుర్తుకు తెచ్చుకుని, ఆంటీమేరీకి స్కూలంతా తిప్పి చూపించేవాడిని. ఈ వాక్యానికి చాలా ప్రాముఖ్యం ఉంది. సుదీర్ఘమైన సైకోఎనాలిసిస్ తరువాత కూడా చిన్ననాటి అణచివేతతో ఏర్పడిన భావాలు ఏదో ఒక రూపంలో కొనసాగుతూనే ఉంటాయి. నాలోని ఆంటీమేరీ గురించి నాకు తెలుసు. అందువల్ల

పిల్లలకు స్వేచ్ఛ కల్పించి ఆంటీమేరీ ఇజంను వారికి దూరంగా ఉంచాలని నేను తాపత్రయపడుతుంటాను. ఆంటీమేరీ ఇజం జీవితాన్ని వ్యతిరేకిస్తుంది.

ఈ సమస్య సహజంగానే టీచర్లు తరచుగా అడిగే ప్రశ్నవైపు నడిపిస్తుంది. "టీచర్ సైకోఎనాలిసిస్ చేయించుకోవడం తప్పనిసరా?" అన్నదే ఆ ప్రశ్న. "అవును, నీ అంతశ్చేతన గురించి తెలియకపోతే ఇతరుల అంతశ్చేతనతో వ్యవహరించడం సాధ్యంకాదని" నేను ఇప్పటి వరకు జవాబు చెబుతూ వచ్చాను. కాని నేనిప్పుడు అలా చెప్పడం లేదు. అయితే సైకోఎనాలిసిస్ మంచిదనే నా అభిప్రాయంలో మార్పులేదు. శరీర నిర్మాణ శాస్త్రం తగినంతగా అభివృద్ధి చెందకుండా సైకాలజీ అభివృద్ధి చెందడం సాధ్యం కాదని, నేను చాలా సంవత్సరాలుగా చెబుతున్నాను. మనస్సును, శరీరాన్ని ఒక్కటిగా చూడగలగాలి. అందువల్ల రైక్ అంటే నాకు ఆసక్తి ఏర్పడింది. మనసును, శరీరాన్ని ఒకటిగా చూడాలని చెప్పిన మొట్టమొదటి సైకాలజిస్ట్ విల్‌హెల్మ్ రైక్.

సైకోథెరపీలో రుగ్మత నయం కావడానికి అణచివేతకు గురైన భావావేశాలు వెలికిరావలసిన అవసరం ఉందనేది అందరికీ తెలిసిన వాస్తవం. కలలను విశ్లేషించినపుడు దానికి రోగిలో ఎటువంటి భావావేశపరమైన స్పందన లేకపోతే ఆ విశ్లేషణతో ఎటువంటి ప్రయోజనం ఉండదు. "నీ కల సాధారణమైనది. నీ సోదరుడి భార్యతో నువ్వు ప్రేమలో పడ్డావు. నీ సోదరుడిని హత్యచేసి అతని భార్యను వివాహం చేసుకోవాలన్న కోరిక అణచివేతకు గురైంది" అని ఒక పేషెంట్‌కు చెబితే ఈ విశ్లేషణను ఆ పేషెంట్ వాస్తవమేనని ఆమోదించే అవకాశం ఉంది. కాని అతను ఎటువంటి భావావేశం లేకుండా ఈ వాస్తవాన్ని ఆమోదించినపుడు అతను యధాలాపంగా మరో అణచివేతను తోడు చేసుకుంటాడు. అది మానసిక విశ్లేషణలో మరో అడ్డుగోడగా తయారవుతుంది. మానసిక విశ్లేషణకు సంబంధించిన అనేక ప్రక్రియలు అతని ఆలోచనలకు తోడవుతాయి. అతని మనసు మరింత బిగుసుకు పోతుంది. అతనిలో భావావేశాలు విడుదల కావడం అసాధ్యమై కూర్చుంటుంది.

ఫ్రాయిడియన్ మానసిక విశ్లేషణ కేవలం దాగివున్న క్లిష్టతలకు (complexes) వివరణ ఇవ్వడంతో సరిపెట్టుకోదు. రోగి ఈ భావావేశాలతో ఊగిపోయే వరకు వేచి ఉంటుంది. ఈ విశ్లేషణకు చాలాకాలం పడుతుంది. డబ్బు వ్యయమవుతుంది. విశ్లేషణ కోసం నాలుగు సంవత్సరాల కాలం, వెయ్యి పౌండ్లు వ్యయం చెయ్యడానికి మనలో కొద్దిమంది మాత్రమే సన్నద్ధమవుతారు.

టీచర్‌కు వచ్చే జీతంలో ఇటువంటి సుదీర్ఘమైన విశ్లేషణకు డబ్బు వ్యయం చెయ్యడం సాధ్యంకాదు. ఏది ఏమైనప్పటికీ గతంలో ప్రభావాలపై ప్రతిచర్య (counteract) ఏర్పాటుచేసే ప్రయత్నం మాత్రమే ఈ విశ్లేషణ. పిల్లలకు ఇటువంటి విశ్లేషణ అవసరం



లేకుండా వారిని తయారు చెయ్యడమే టీచర్‌కు ఆదర్శం కావాలి. అతను ఏనాడు విశ్లేషణకు ప్రయత్నం చెయ్యకపోయినప్పటికీ బాల్యంలోజరిగే ఎటువంటి సంఘటనలు జీవితాంతం ప్రభావం చూపుతాయో టీచర్‌కు తెలిసి ఉండాలి. పుస్తకాలు చదవడం ద్వారా ఈ విషయాలు కొంతవరకు తెలుసుకునే అవకాశం ఉంది. కొంతవరకు అని ఎందుకంటున్నానంటే మనలోని క్లిష్టతలను అవగాహనచేసుకోలేని పరిస్థితిలో పిల్లల్లో క్లిష్టతలను అర్థం చేసుకోవడం కష్టం.ప్రతి స్కూల్లో ఒక సైకాలజిస్ట్ ఉన్నట్టయితే ఈ ఇబ్బందులను అధిగమించవచ్చు. కాని ఆ సైకాలజిస్ట్ చురుకుగా పనిచేసే వాడై ఉండాలి. కేవలం ఇంటెలిజెన్స్ టెస్ట్‌లు, రియాక్షన్ స్టిములస్‌కు పరిమితం కాకూడదు.

సెక్స్ ఆసక్తిని అణచివేయడం, భయపెట్టడం, పిల్లలను నిజాయితీలేని వారుగా తయారు చెయ్యడం వల్ల ఎదురయ్యే ప్రమాదాల గురించి ప్రతి టీచర్‌కు తెలిసి ఉండాలి. మనసు సాధారణంగా ఉపయోగించే ప్రక్రియలైన ప్రదర్శన (projection), పోలికతో గుర్తించుకోవడం (identification), భావావేశాల బదిలీ (transference) ల గురించి టీచర్‌కు తెలిసి ఉండాలి. ఈ మూడు ప్రక్రియలలో ప్రదర్శన ముఖ్యమైనది. టీచర్‌కు పిల్లవాడిపై కోపం వచ్చినప్పుడు, "నాలో కోపం ఉన్నది. అది నాకే వ్యతిరేకమైనది. నేను కోపాన్ని పిల్లవాడిపై ప్రదర్శిస్తున్నాను" అని అనుకోగలగాలి.

పిల్లల మనస్తత్వాన్ని అర్థం చేసుకోడానికి టీచర్‌కు ఉపయోగపడే పుస్తకాలు అంతగాలేవు. ఇది ఇబ్బందికరమైన పరిస్థితి. సైకోఎనాలిస్‌పై వెలువడే పుస్తకాలలో ఎక్కువ భాగం రుగ్మతలకు సంబంధించిన కేసులే ఉంటాయి పైగా ఈ పుస్తకాలతో ఇబ్బందులు కూడా ఉన్నాయి. కొన్ని పుస్తకాలు మల విసర్జనపై ఆసక్తి పిల్లల స్వభావానికిచాలా ముఖ్యమైనదనే అభిప్రాయం కలుగజేస్తాయి. మరికొన్ని 'తల్లి పురుష జననాంగం (mother's penis) పై ఆసక్తి పిల్లలకు ప్రధానమైనదని చెబుతాయి. మగ పిల్లల మాదిరిగా మూత్ర విసర్జన చేయడమనేది ఆడపిల్లల్లో ప్రముఖ స్థానం ఆక్రమిస్తుందని మరికొన్ని పుస్తకాలు రాస్తాయి. ఈ అభిప్రాయాలు తప్పని నేను అనడం లేదు. వీటిలో యధార్థం పాలు కూడా ఎక్కువే. కాని సైకాలజీ పట్ల ఈ పుస్తకాలలో వ్యక్తమయ్యే భావాలు ఒంటెత్తుపోకడతో ఉంటాయి. ఆడ్లర్ అనుయాయురాలైన ఒక మహిళ ప్రాముఖ్యం పొందిన ఆరోగ్య పత్రికలో జవాబులు ఇస్తుంటుంది. ఆమె బాగానే జవాబులు రాస్తుంది. కాని సెక్స్‌కు అసలు ప్రాముఖ్యమే ఇవ్వదు. సెక్స్ ప్రధానమైన కారణంగా చూపవలసిన చోట ఆధిపత్యం పేరుతో వివరణలు ఇస్తుంది.

సైకోఎనాలిసిస్‌లో ప్రధానమైన ధోరణులన్నిటినీ టీచర్ అధ్యయనం చేయాలి. ఏ సైకాలజిస్టు చెప్పేది వేదం కాదనేది దృష్టిలో ఉంచుకొని వారితో తాను ఏకీభవించే

అంశాలను గుర్తుంచుకోవాలి. సైకోఎనాలిసిస్ ఇంకా ప్రాథమిక దశలోనే ఉందనేది కూడా గుర్తుంచుకోవాలి. టీచర్ అణచివేతకు గురైన కారణంగా డాక్టర్ ఆల్ఫ్రెడ్ ఆడ్లర్ సైకాలజీకి లేనిపోని ప్రాధాన్యత ఇచ్చే ప్రమాదం ఉంది. ఫ్రాయిడ్ సెక్స్ సిద్ధాంతం పట్ల భయం వ్యక్తం చేసే పిరికివాళ్లు ఆడ్లర్ సిద్ధాంతాలకు ఆకర్షితులయ్యే అవకాశంఉంది. ప్రస్తుతం ఫ్రాయిడ్ సిద్ధాంతాలకు ఆదరణ లభిస్తున్నది. ఆడ్లర్ సిద్ధాంతాల పునాదులు కదిలిపోతున్నాయి. అయితే ఫ్రాయిడ్ సిద్ధాంతాలు కేవలం కారణాలను మాత్రమే చూపుతున్నాయి. కాని ఆచరణకు దిగడం లేదు.

ఈ పరిస్థితిని ప్రస్తావిస్తూ విల్‌హెల్మ్‌రైక్ ఏమంటాడంటే: "మనం సెక్స్ అణచివేతను వదిలించగలిగితే ఏమి జరుగుతుంది? అప్పుడు సెక్స్ రుగ్మతలను వదిలించుకున్న రోగి సెక్స్‌పరంగా ఎలా చురుకుగా ఉండాలి? సెక్స్ అణచివేతను వదిలించుకున్న తరువాత కార్మిక వర్గానికి చెందిన యువజనులు ఏ విధంగా సెక్స్ జీవితం సాగిస్తారు? వారికి సౌకర్యాలు లేవు. అందువల్ల సెక్స్ సమస్య రాజకీయ సమస్యగా తయారవుతున్నది. స్వేచ్ఛతో కూడిన సెక్స్ జీవనం కోసం సమాజాన్ని మార్పు చేయడమే లక్ష్యం కావాలి." అయితే ఫ్రాయిడ్‌ను సమర్థించే వారేమంటారంటే: "ఇది మన వ్యవహారం కాదు. నేను వ్యక్తుల సమస్యను పరిష్కరిస్తాను. కానీ అతని సెక్స్ జీవితానికి సహకరించవలసిన పనిలేదు. అతనికి సెక్స్ సంతృప్తి లేకపోవడానికి గల కారణాలను వివరిస్తాను. ఆ తరువాత అతని ఇష్టం వచ్చినట్టు చేసుకోవచ్చు. ఏ విధంగాను అతనికి సలహా ఇవ్వవలసిన అవసరం లేదు. అంతేకాకుండా సెక్స్ అణచివేతను రద్దు చేసే విధంగా సమాజాన్ని సంస్కరించడంతో కూడా నాకు సంబంధం లేదు."

ఈ విధంగా ఫ్రాయిడ్‌ను సమర్థించే వ్యక్తి ఏమి చెబుతాడంటే: "నువ్వు నీ కిష్టం వచ్చినట్టు ఏదైనా చెప్పవచ్చు. నీ మానసిక క్లిష్టతలను నీ మాటలలో చెప్పుకోవచ్చు. కానీ నీకు ఇష్టమైనది చెయ్యడానికి నేను ఎన్నడూ సహకరించను" అందువల్ల ఫ్రాయిడ్ సిద్ధాంతాలను సమర్థించేవారు పిల్లలను సమ్మర్‌హిల్ స్కూల్లో చేర్చాలని ఏనాడూ సలహా ఇవ్వరు. ఎందుకంటే పిల్లలు స్కూల్లో రోజంతా తమ ఇష్టం వచ్చినట్టు చేసుకోడానికి అవకాశం ఉంటుంది. ఇతరులకు ఇబ్బంది కలిగించనంతకాలం వారి స్వేచ్ఛకు ఎటువంటి అవరోధం ఉండదు. కాల్వినిస్టు క్రైస్తవుడు స్వేచ్ఛ అనగానే భయపడతాడు. అదే విధంగా ఫ్రాయిడ్‌ను సమర్థించేవారు కూడా స్వేచ్ఛపట్ల భయం వ్యక్తం చేస్తున్నారని నాకు సందేహంగా ఉంది. ఫ్రాయిడ్‌ను గౌరవ ప్రదమైన ప్రవాసిగా పరిగణిస్తూ ఇంగ్లాండ్ స్వాగతం పలికింది. కానీ విల్‌హెల్మ్‌రైక్‌ను ఒకదేశం నుంచి మరో దేశానికి, అక్కడి నుంచి ఇంకో దేశానికి తరిమివేశారు. నిజమైన స్వేచ్ఛ కోసం ప్రచారం చేయడం ఎప్పుడైనా సరే ప్రమాదానికి దారితీస్తుంది.



# 7. టీచర్-అతని ప్రతిష్ఠ

టీచర్‌కు అతని విద్యార్థులకు మధ్య ఉండే అగాధం–సైన్యంలో ఆఫీసర్లకు సైనికులకు మధ్య ఉండే అగాధం మాదిరిగా ఉంటుంది. రెండింటికీ ఒకటే పునాది. ఈ సారూప్యంలో ద్వేషం, క్రమశిక్షణ, విధేయత జనిస్తాయి. ఇది మౌలికంగా గుర్తుంచుకోవలసి విషయం. సైన్యంలోను క్లాస్‌రూమ్‌లోను ఒకే విధంగా బానిసత్వాన్ని తలపించే 'సర్' అనే మాట వినపడుతుంది. రెండుచోట్ల ఒకే విధమైన ఆదేశా లుంటాయి. నేను సైన్యంలో పనిచేసేటప్పుడు ఒకరోజు రోడ్డుమీద కాలేజీ రోజులనాటి పాత స్నేహితుడొకరు కలిశారు. ఆయనకు నేను సెల్యూట్ చేశాను. ఆయన వెంటనే సెల్యూట్‌చేసి, మాట్లాడకుండా వెళ్లిపోయాడు. సైన్యంలో వివిధ ర్యాంక్‌ల మధ్య మానవ సంబంధాలను నిరోధిస్తారు. స్కూల్‌లో కూడా అదే విధంగా జరుగుతుంది. టీచర్‌ను ఎల్లప్పుడూ "సర్" అని సంభోదించవలసిందే. కాని పబ్లిక్ స్కూల్లో పిల్లలు తమ టీచర్లను పేరుతో సంభోదించడం ఎందుకనేది నా ఊహకు అందని విషయం.

జీవితంలో నిజాయితీ అనేది మర్యాదకు శత్రువు. మర్యాద అనే పదాన్ని నిఘంటువు నుంచి తొలగించితే దాని ప్రాధాన్యత తొలగి పోతుందంటే ఆ విధంగా చేయాలని వ్యక్తిగతంగా నేను కోరుకుంటాను. మర్యాద అంటే భయం మినహా మరేమీ కాదు. మర్యాద అనే పదాన్ని ప్రేమతో జోడించడం ఎట్టి పరిస్థితులలోను సాధ్యంకాదు. ప్రేమ అనేది సమాన స్థాయి వారిమధ్య ఉంటుంది. ప్రతిష్ఠ ద్వారా టీచర్ మర్యాదను డిమాండ్ చేస్తాడు.

ప్రతిష్ఠ గురించి బోధించే బదులు–ఒక స్కూల్లో టీచర్లకు ప్రతిష్ఠ లేకున్నా విద్యార్థుల నుంచి ఏమాత్రం మర్యాద లేకున్నా ఏ విధంగా ఉంటుందో వివరిస్తాను. సమ్మర్‌హిల్ స్కూల్లో టీచర్లను పిల్లలు పేర్లతో పిలుస్తారు. క్రమశిక్షణ అమలు చేసే స్కూళ్లలో కొంటెపేర్లు తేలికగా పుట్టుకొస్తాయి. వాటిని దొంగచాటుగా ఉపయోగిస్తారు. కానీ సమ్మర్ హిల్‌లో ఇటువంటి పిచ్చి ఏనాడూ లేదు. చేతిపని నేర్పే పార్సన్స్ అనే టీచర్‌ను చిన్న పిల్లలు స్నిప్స్ అని నిప్పర్స్ అని పిలుస్తారు. పెద్ద పిల్లలు జార్జ్ అని సంభోదిస్తారు. కోర్కిల్ అనే కెమిస్ట్రీ టీచర్‌ను కార్బ్ అని లేదా జార్జ్ అని పిలుస్తారు. పిల్లలు, పనివాళ్లు కూడా నన్ను నీల్ అని పిలుస్తారు. పేరులో ఏముందని రాసినపుడు షేక్స్‌ఫియర్‌కు ఏమి రాసిందీ తెలిసి ఉండదు. కాని పేరులోనే అంతా ఉంది. జార్జ్ అనే పిలుపుకు లేదా మిస్టర్ అనే పిలుపుకు మధ్య చాలా తేడా ఉంటుంది.

టీచర్‌ను జార్జ్ అని పిలిచినపుడు పిల్లవాడికి టీచర్ అంటే భయం లేదని

అర్థం. టీచర్ ఆ పిలుపును ఆమోదించినపుడు అతనికి ప్రతిష్ఠతో పని ఉండదు. అప్పుడు విద్యార్థికి అతని పనికి మధ్య టీచర్ వ్యక్తిత్వం అడ్డుగోడగా నిలవదు.

ఇది ముఖ్యమైనది. అన్ని సందర్భాలలోను పనికి లక్ష్యం ఒక్కటే ఉండాలి. జ్ఞానం సంపాదించడం లేదా నైపుణ్యం లేదారెండు సంపాదించడమనేదే ఈ లక్ష్యం. కానీ 'గౌరవప్రదమైన' వ్యక్తిత్వం పిల్లవాడికిఅతని పనికిమధ్య అడ్డుగా నిలిచినపుడు, ఆ పనికి లక్ష్యం ఒక్కటే ఉండదు. టీచర్ ప్లస్ పని లక్ష్యం కూడా తోడవుతుంది. కొన్ని సబ్జెక్ట్‌ల పట్ల పిల్లలకు ఏర్పడే కాంప్లెక్స్‌లను బట్టి ఈ విషయం స్పష్టంగా చెప్పవచ్చు. టీచర్ అంటే ఎక్కువగా భయపడే పిల్లలు ఆ టీచర్ బోధించే సబ్జెక్ట్ అంటే కూడా భయపడతారు. ఒక వ్యక్తితో ముడిపడిన నైతికత వల్ల ఉత్పన్నమయ్యే మానసిక పరిస్థితే ఈ సందర్భంగా ఏర్పడుతుంది. తరచుగా చెప్పే ఉదాహరణను బట్టి అది స్పష్టమవుతుంది. ఒక పిల్లవాడు నిప్పంటే విపరీతంగా భయపడతాడు. అతిగా భయపడడం అనవసరం. కానీ తల్లి వ్యాకులత కారణంగా ఇటువంటి భయం పిల్లవాడికి సంక్రమిస్తుంది. నిప్పు ప్లస్ తల్లి అనే పరిస్థితి చోటు చేసుకుంటుంది. నిప్పు కాలుతుందని పిల్లవాడు విశ్వసించడు. కానీ నిప్పు కాలుతుందని తల్లి చెప్పినట్టు పిల్లవాడు విశ్వసిస్తాడు. తల్లిపట్ల పిల్లవాడికి అప్పటికే భయం ఏర్పడితే, ఈ భయంతో నిప్పు అంటే భయం కూడా ముడిపడుతుంది.

ఎక్స్+వై అనే గణిత పాఠం ఆ సబ్జెక్ట్ చెప్పే టీచర్‌తో ముడిపడుతుంది. తరచుగా భయం కారణంగా ఈ విధంగా జరుగుతుంది. పిల్లవాడు టీచర్‌ను ఆదర్శంగా తీసుకొని వారి మెప్పు పొందడానికి ప్రయత్నిస్తున్నపుడు కూడా ఇదే విధంగా జరుగుతుంది. అమ్మ కోసం ఇదంతా చెయ్యాలి అనే తీరులో ఇదంతా జరుగుతుంది. మామూలు స్కూళ్లన్నీ ఇలాగే ఉంటాయి. విద్యార్థి పని చేయడం అనేది పనికోసమే జరగాలి. కాని విద్యార్థికి అతని పనికి మధ్య మరో వ్యక్తిత్వం అడ్డురాకూడదు. సమ్మర్‌హిల్‌లో టీచర్ వ్యక్తిత్వం కారణంగా ఏ పనీ జరగదు. టీచర్‌ను సంతృప్తి పరచాలన్న కోరిక ఉండదు. అంటే టీచర్ ఏదీ పట్టనట్టు ఉండాలని పిల్లలు కోరుకోరు. అదే సమయంలో టీచర్ పొగిడినంతమాత్రాన పిల్లలు సంతృప్తి చెందరు. పిల్లల మనస్తత్వానికి ప్రాధాన్యత ఇచ్చే స్కూళ్లలో పొగడడం అనేది సమతూకంలోను, పరిమితంగానూ ఉండాలి. ఒక పిల్లవాడిని అసంబద్ధంగా పొగిడితే ఇతర పిల్లల్లో న్యూనతా భావం, అసూయ చోటు చేసుకుంటాయి. ఈ పరిస్థితి మంచి పని జరగకుండా నిరోధిస్తుంది. పిల్లల ప్రవర్తనలోకూడా తేడాలొస్తాయి. నా బాల్యంలో నా తండ్రి ఎంతో ఆదర్శవంతులని పొగిడిన నాతోటి వారు ప్రస్తుతం రైల్వే పోర్టర్లు, పొలం దున్నేవారుగా స్థిరపడ్డారు. పిల్లలకు తప్పుడు విలువలు అంటగట్టడం చాలా తేలిక. వారిని నిరాశకులోను చేయడం ఇంకా తేలిక. ప్రతిష్ఠ గలిగినవారి స్వరం పిల్లవాడికి దేవుడి స్వరం వంటిది.



నిజమైన ప్రతిష్ఠ కలిగిన వారు ఎన్నడూ ప్రతిష్ఠాత్మకంగా ప్రవర్తించరనేది గుర్తుంచుకోవలసిన విషయం. రాణీ కన్నా లాభాలు కూడబెట్టే వ్యక్తి భార్య ఎక్కువ ప్రతిష్ఠతో ప్రవర్తిస్తుంది. తన గురించి తనకు నమ్మకం లేనందువల్ల ఈ పరిస్థితి వస్తుంది. ఒక జమిందారు అప్పుడప్పుడు సమ్మర్‌హిల్‌కు వచ్చి కొద్దిరోజులుండేవాడు. ఆయనకు ప్రతిష్ఠ అంటే పట్టేదికాదు. తనపట్ల మర్యాద చూపాలన్న కోరిక ఆయనకున్నట్టు అనిపించేదికాదు. పిల్లలు వెంటనే ఇదిగ్రహించారు. పిల్లలు ఆయనని ఎక్స్ అని సంభోదించడం ప్రారంభించారు. స్కూలు చుట్టూ దర్పంతో తిరిగే హెడ్‌మాస్టర్‌ను కూడా పిల్లలు చూడగానే గ్రహిస్తారు. అయితే ఇటువంటి హెడ్‌మాస్టర్ ఎవరూ మా స్కూల్ సందర్శించాలని కోరుకోరు.

కొంతమంది కులీనులు ఏ మాత్రం ప్రతిష్ఠ లేకుండా ఉంటారనే విషయం పక్కకు పెట్టి ప్రతిష్ఠ అనేది వర్గ విభజనను తెలుపుతుందనే విషయం గుర్తుంచుకోవాలి. అది అధికారంతో ముడిపడి ఉంటుంది. ఒక వ్యాపార సంస్థ డైరెక్టర్, కార్మికుల ముందు ప్రతిష్ఠాత్మకంగా ప్రవర్తిస్తాడు. ఆయనకు తమ జీవితాలపై పెత్తనం చేసే శక్తి ఉంటుందనే వాస్తవం వారికి తెలుసు. వాణిజ్య సంస్థ అధిపతి ఆఫీసులోకి ప్రవేశించగానే అక్కడ కౌంటర్‌లో ఉన్న మహిళ 'గుడ్ మార్నింగ్ గోర్డన్' అని అభివాదం చేయడం అమానుషం కాదు. వ్యక్తిగతంగా ఆలోచించినపుడు అధిపతి ఆ సంస్థ మానవత్వపు సారం. కాని సంస్థకు అధిపతిగా ఆలోచించినపుడు కార్మికులపై అతనికి పెత్తనం చేసే అధికారం ఉంటుంది. కార్మికులను ఉద్యోగంలో పెట్టుకుంటాడు లేదా తొలగిస్తాడు. నిన్ను పేరుతో సంభోదించే వ్యక్తిని ఉద్యోగం నుంచి తొలగించడం కొంచెం కష్టం. కాని "సర్" అని సంభోదించే వ్యక్తిని తొలగించడం తేలిక.

సమాజంలో కూడా ఇదే విధమైన పరిస్థితి కొనసాగుతుంది. పేదలనుంచి ధనికులు దూరంగా ఉంటూ తమ ప్రత్యేకతను చాటుకుంటారు. ధనికులకు దూరంగా ఉండడం అనేది చాలా తేలిక. పేదలు ప్రయాణించే రైలు పెట్టెలో ధనికులు ప్రయాణించరు. సినిమాహాళ్లలో కూడా వారిసీట్లు వేరు. పేదలు నివసించే వీధులలో ధనికులు ఉండరు. భారీ పరిశ్రమలు ధనికులకు పేదలకు మధ్య అగాధాన్ని పెంచాయి. ధనికులు ప్రతిష్ఠను తమకు రక్షణగా ఉపయోగించుకుంటారు.

స్కూల్ టీచర్ ప్రతిష్ఠ కూడా ఆయన సేవలు చేసే వర్గ ప్రతిష్ఠకు దగ్గరగా ఉంటుంది. అతను పెద్ద వాణిజ్య సంస్థకు అధిపతి లేదా బ్రాంచ్ మేనేజర్. పేదలను అదుపులో పెట్టినట్టు పిల్లలను కూడా అదుపులో పెట్టాలి. దేవుడు తమకు ఇచ్చిన గ్రేడ్‌తో పిల్లలు లేదా పేదలు సంతృప్తి చెందాలి. తమ యజమానులు తమ బాగు కోరేవారని

వారు విశ్వసించాలి. వర్గరహిత సమాజంలో మాత్రమే ప్రతిష్ఠను వదిలించుకోగలం.

ఈ క్షణంలో నేను రష్యా గురించి ఆలోచించడం లేదు. వర్గానికి ఎటువంటి చోటులేని సమ్మర్‌హిల్ గురించి ఆలోచిస్తున్నాను. సమ్మర్‌హిల్‌లో నీకున్న సహజ విలువలను బట్టి గుర్తింపు ఉంటుంది. పేదవారి పిల్లలు మంచి వారైతే వారికి తగిన గుర్తింపు ఉంటుంది. ధనికుల పిల్లలు మంచివారు కాకపోతే వారికి ఎటువంటి గుర్తింపు ఉండదు. సమ్మర్‌హిల్‌లో చదివే పెద్ద పిల్లలు స్కూల్ వెలుపల స్నేహాలు చేస్తే మెకానిక్‌లు, క్లర్క్‌లు, హాకీ ఆటగాళ్లను ఎంచుకునేవారు. అనుకరించడం అనేది సమ్మర్‌హిల్‌లో కనిపించదు. అయితే కొత్తగా వచ్చి స్కూలు వాతావరణానికి ఇంకా అలవాటుపడని వారు కొద్దిసార్లు అనుకరించే ప్రయత్నం చేస్తారు.

గ్రూపులుగా ఏర్పడకుండా స్కూల్‌లో పెద్ద సమూహం జీవిస్తున్నందువల్ల అనుకరించడం అనేది స్కూల్‌లో లేదు. స్థానిక పట్టణంలో ఇతర చిన్న పట్టణాలలో మాదిరిగా సమాజంలో వివిధ వర్గాలు ఉన్నాయి. ఇటువంటి వర్గాలను స్కూల్‌లో ప్రవేశపెట్టాలని ఎటువంటి కోరికాలేదు. స్వయం సమృద్ధితో స్కూల్ సమాజం ఏర్పడినందువల్ల ఈ విధంగా జరగడం లేదు. ప్రతిష్ఠ ఆధారంగా విభజన లేకపోవడమే దీనికి కారణం. షాపులో గుమస్తాగా పనిచేసే వ్యక్తి మధ్య తరగతిలో చేరాలని కోరుకోవచ్చు. కాని పిల్లవాడు తాను కూడా టీచర్‌తో సమానస్థాయిలో ఉన్నట్టు గుర్తించినపుడు క్లాస్ అంటే నూతన దృక్పథం ఏర్పడుతుంది. అతనికి క్లాస్ గురించి ఆలోచన ఉండదు. అయితే పిల్లలకు పుట్టుకతోనే క్లాస్‌లు (వర్గాలు) అబ్బుతాయి. చిన్నప్పుడు రాకుమారుడు కూడా సేవకుడి కొడుకుతో మరో రాజ కుమారుడితో ఆడుకున్నట్టు ఆడుకుంటాడు. పెద్దల విలువలతో పోల్చినపుడు పిల్లల విలువలు స్వచ్ఛంగా ఉంటాయి. పిల్లవాడు తప్పనిసరి అంశాలను గుర్తిస్తాడు. బయటకు కనిపించే ముసుగులను పట్టించుకోడు.

గతరాత్రి పది సంవత్సరాల వయసున్న నార్వే బాలిక పుట్టినరోజు పార్టీకి వెళ్లాను. ఆ పిల్లలు చెప్పేది ఒక్క విషయం కూడా నాకు అర్థం కాలేదు. నేను చెప్పేది వారికి అర్థం కాలేదు. కాని ఐదు నిముషాలలో పరిస్థితి ఉత్సాహభరితంగా తయారైంది. వారు నన్ను కింద కూర్చోబెట్టి నాపైకి ఎక్కారు. భాషా సమస్య ఉన్నప్పటికీ నాకు ప్రతిష్ఠ లేదనేది వారికి స్పష్టంగా అర్థమైంది. నన్ను వారితో సమానంగా పరిగణించారు. నేను గొప్పలు చెప్పుకోవడం లేదు. పెద్దవాళ్ళు ఎటువంటి వారనేది పిల్లలు చాలా తేలికగా గ్రహించగలరనేది చెప్పడానికి నేను ప్రయత్నిస్తున్నాను. నేను ప్రతిష్ఠ వదిలించుకున్నానని చెప్పుకుంటే అది అసత్యమే అవుతుంది. పెద్దల నుంచి అప్పుడప్పుడు మూర్ఖత్వంతో కూడిన ప్రతిష్ఠతో నన్ను నేను కాపాడుకుంటాను. మా పనివాళ్లు నన్ను 'నీల్' అని



సంభోదించినపుడు నేను పట్టించుకోను. షాప్‌లో సేల్స్‌గర్ల్ నన్ను ఆ విధంగా సంభోదిస్తే నేను ప్రతిష్ఠాత్మకంగా కనిపించనా? అని సందేహానికి లోనుకావలసి వస్తుంది.

వర్గానికి ప్రతిష్ఠ ఉంటుందని వివరిస్తే కథ పూర్తిగా చెప్పినట్టు కాదు. దీనికి మానసిక వివరణ కూడా ఉంది. మానసిక పరంగా మనలో ప్రతి ఒక్కరూ ఉన్నతులమేనని ఊహించుకునే పరిస్థితిఉంది. తాను ఉన్నతమైన ఉద్యోగం చేస్తున్నాననే పరిస్థితి కారణంగా టీచర్‌లో ప్రతిష్ఠ చోటు చేసుకుంటుంది. టీచర్ ప్రతిష్ఠకు ప్రతీకగా నిలుస్తాడు.

స్త్రీ, పురుషులెవరూ ఎదగవలసినంతగా ఎదగరు. దీనికి ప్రధానమైన కారణమేమంటే బాల్యంలో తాము కోరుకున్నట్టు ఆడుకోకుండా నిరోధిస్తారు. దీనికి మరో కారణమేమంటే జీవితంపట్ల పిల్లలకు ఉన్న ఆసక్తిని సంతృప్తి పరచరు. ఫలితంగా పెద్దలలో సెక్స్ కథలపట్ల ఆసక్తి పెరుగుతుంది. కార్టూన్ సినిమాలలో విధ్వంసం, మామూలు సినిమాలలో అసంబద్ధమైన హాస్యంపట్ల కూడా పెద్దలకు ఆసక్తి పెరుగుతుంది. చార్లీచాప్లిన్ శాశ్వతంగా పిల్లవాడి మాదిరిగా ప్రవర్తిస్తాడు. అందుకే అతనంటే అందరికీ ప్రేమ. పైపెచ్చు అతనిలో ప్రతిష్ఠ ఏమాత్రం కనిపించదు. సమ్మర్‌హిల్ పిల్లలు చార్లీచాప్లిన్ పట్ల ఏమాత్రం ఆసక్తి చూపరు. ప్రతిష్ఠపట్ల వారికి ఏర్పడిన నూతన ధోరణి వల్ల ఈ విధంగా జరుగుతున్నదా, అనేది తేల్చి చెప్పడం కష్టం.

తనలో సహజంగా ఉన్న పిల్లల స్వభావాన్ని దాచిపెట్టుకోడానికి ప్రతిష్ఠను టీచర్ రక్షణగా ఉపయోగించుకుంటాడు. తన క్లాసులో పిల్లలు స్కూలు పుస్తకాల పట్ల ఎటువంటి ధోరణి కలిగిఉంటారో–టీచర్ కూడా అదే ధోరణి వ్యక్తం చేస్తాడు. స్వేచ్ఛ కోసం పిల్లలు అర్రులు చాచినట్టుగానే అతను కూడా అర్రులు చాస్తాడు. కొద్దిపాటి మానవత్వం కూడా విద్యావ్యవస్థను బద్ధలు చేస్తుందని అతనికి ఏదో ఒక మూల తొలుస్తూనే ఉంటుంది. అందువల్ల అతనికి విద్యార్థులపై, తనపై పూర్తి నియంత్రణ ఉండాలి. అందువల్ల తన భాషలో వ్యవహారిక భాష రాకుండా, అశ్లీలం లేకుండా అతి జాగ్రత్త తీసుకోవాలి. తనను, తన విద్యార్థులను ఉన్నతస్థాయికి తీసుకువెళ్లడమే అతని లక్ష్యం. సమ్మర్‌హిల్‌లో పిల్లవాడికి పుస్తకం తేవలసిందిగా కోరితే అతను ఒ.కె. అని జవాబిస్తాడు. కాని ప్రభుత్వ పాఠశాలలో ఒ.కె. అనడం ఏమాత్రం వీలుపడదు. ఈ విధంగా అనడం భాష పతనానికి, తద్వారా ప్రవర్తన పతనానికి దారితీస్తుంది.

ఇటీవల ఒక పబ్లిక్ స్కూల్ హెడ్‌మాస్టర్‌ను గవర్నర్లు బహిరంగంగా విమర్శించారు. దీని కారణ మేమంటే ఆ స్కూల్లో చదువుకున్న విద్యార్థి ఒకరు ఉద్యోగానికి దరఖాస్తు చేశాడు. ఐదు నిముషాలు వేచి ఉండాలని ఆ సంస్థ అధిపతి అతన్ని కోరాడు. అతను ఒ.కె. అని జవాబిచ్చాడు.

నీటుగా ఉండాలనడం కూడా ఒక రకమైన ప్రతిష్ఠే. ఇది ఎదిగినట్టు చూపించుకునే ప్రయత్నం. తాము నిర్వహించే ప్రయోగాలు రికార్డు పుస్తకంలో నీట్‌గా రాయాలని మూర్ఖంగా ఒత్తిడి చేయడంవల్ల వేలాది మంది పిల్లలలో సైన్స్‌పట్ల ఆసక్తి నులిమివేయబడుతున్నది. ప్రపంచంలోని గొప్ప పనులు నీట్‌గా లేవనేది తెలిసికూడా టీచర్లు నీట్‌గా ఉండాలని అసాధారణమైన రీతిలో ఒత్తిడి చేస్తారు. కొత్తగా యంత్రాన్ని నిర్మిస్తున్న వ్యక్తి తన వర్క్‌షాప్‌లో నేలమీద నీట్‌గా ఉన్నదీ లేనిదీ పట్టించుకోడు.

నీట్‌గా ఉండాలనడానికి–ఉపయోగానికి వీలుగా ఉండాలనేది సాకు. మెకానిక్ వర్క్‌షాప్‌లో నట్‌లు, బోల్ట్‌లు, సైజుల వారీగా విడివిడిగా ఉంటే ఉపయోగించుకోవడం తేలిక. కానీ అన్నీ కలిసి ఉంటే కొంచెం కష్టం అవుతుంది. పెన్సిళ్లకు, పెన్నులకు టీచర్ విడివిడిగా బాక్సులు ఏర్పాటు చేయవచ్చు. కాని ఒక బాక్సులో సైన్స్, మరొక బాక్సులో సైన్స్‌కు సంబంధించిన వివరణ ఉన్నట్టు విద్యార్థులు భావించేలా చేయకూడదు. ప్రతిష్ఠతో నేర్చుకోవడం గురించి మనం ఎక్కువగా వింటుంటాం. కాని మన స్కూళ్ళు ఎక్కువగా తప్పుడు ప్రతిష్ఠపై దృష్టి కేంద్రీకరిస్తున్నట్టు కనపడుతుంది. ఒక విషయం ఎలా చెప్పారనేదానికన్నా, ఏమి చెప్పారనేదానికి ప్రాముఖ్యం ఎక్కువ. సాహిత్యానికన్నా వ్యాకరణానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. కాని వ్యాకరణం సాహిత్యంలో భాగంగా ఉండాలి.

నీట్‌గా ఉండడానికి వ్యాకరణానికి ఒక పోలిక ఉంది. లక్ష్యాన్ని వదిలిపెట్టి మార్గాన్ని పెద్దదిగా చేసి చూపుతారు. నీట్‌గా ఉండడమనేది, ప్రతిష్ఠను వస్తువులకు వర్తింపజేసినపుడు జనిస్తుంది. పిల్లలను వాళ్లంతటికి వాళ్లను వదిలిపెడితే నీట్‌గా ఉండడమనే దానికి స్థానమే ఉండదు. ఈ విధంగా ఎందుకు జరుగుతుందంటే పిల్లలు వస్తువులను లక్ష్య సాధనకు సాధనాలుగా మాత్రమే చూస్తారు. పెద్దలు విలువలు, అతి విలువలతో పరిగణించే వస్తువులను పిల్లలు సాధనాలుగా మాత్రమే పరిగణిస్తారు. ఫలితంగా పెద్దలను పిల్లలు ఇబ్బందికి గురి చేస్తారు.

దుస్తులకు ఇచ్చే విలువను బట్టి ప్రతిష్ఠకు నీట్‌గా ఉండడానికి సంబంధం ఉన్నట్టు స్పష్టమవుతుంది. సమ్మర్ హిల్‌లో టీచర్లు యధాలాపంగా పాత దుస్తులు ధరిస్తారు. కాని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు చాలా నీట్‌గా దుస్తులు వేసుకొని విధులకు హాజరు కావలసిందే. ప్రతిష్ఠ, దుస్తులు అనేవి బాహ్యమైనవని, నగ్న స్వభావాన్ని కప్పిపుచ్చుతాయనే వాస్తవాన్ని గుర్తుంచుకోవాలి. మానసిక రోగులు మాత్రమే పిల్లలు ఎల్లప్పుడూ పూర్తిగా దుస్తులు వేసుకోవాలని పట్టుపడతారు. మామూలు పిల్లలు సగం దుస్తులు ధరిస్తున్నప్పుడు పూర్తిగా దుస్తులు ధరించి వచ్చే పిల్లలు తీవ్రమైన మానసిక రుగ్మతలకు గురికావడం



నేను చూశాను.ప్రస్తుతం సమ్మర్ హిల్‌లో పగలు ధరించే దుస్తులే రాత్రిపూట కూడా వేసుకోవాలని పట్టుబట్టే ఏడు సంవత్సరాల బాలుడొకడున్నాడు. అతని భయాల కారణంగా ఈ విధంగా చేస్తుంటాడు. ఏ క్షణంలోనైనా పారిపోవడానికి సిద్ధంగా ఉండాలని అతని కోరిక. నీట్‌గా దుస్తులు ధరించే టీచర్ కూడా పారిపోడానికి సన్నద్ధంగా ఉంటాడేమోనని నా అనుమానం.

దుస్తుల వ్యవహారానికి మనం అనుకునే దానికన్నా ఎక్కువ ప్రాముఖ్యత ఉంది. నగ్నంగా ఉండడమంటే నిజాయితీగా ఉండడమే. నిన్ను నువ్వు ముసుగు లేకుండా చూసుకోవడమే. నేను సాయంకాలం దుస్తులు ధరించినపుడల్లా నేనొక ఉన్నతమైన వ్యక్తినని భావిస్తుంటాను. దుస్తులు వ్యక్తిత్వాన్ని మార్చివేస్తాయని పిల్లలకు అంతశ్చేతన (unconscious) పరమైన జ్ఞానం ఉంటుంది. ఫ్యాన్సీ డ్రస్‌లు వేసుకోవడం వారికి ఇష్టం.

ఒకే రీతిగా ఉండడానికి దుస్తులు గీటురాయిగా ఉపయోగిస్తాయి. గుంపులో భిన్నమైన దుస్తులు ధరించడం అహంకార మవుతుంది. సమ్మర్‌హిల్‌లో యూనిఫారం లేదని చెప్పినపుడు చాలామంది తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేసేవారు. స్కూల్ యూనిఫారంలో ఏదో ఒక బందీ స్వభావం, స్వేచ్ఛను వ్యతిరేకించే లక్షణం ఉన్నాయని వారు గ్రహించారు. ఆగస్టు నెలలో తీవ్రమైన వేడిమి ఉన్న రోజుల్లో కూడా 'గర్ల్‌ఫ్రెండ్స్' నల్లని స్టాకింగ్స్ వేసుకోవడం చూస్తే, తల్లిదండ్రుల అభిప్రాయం వాస్తవమేనని చెప్పవచ్చు. దుస్తులు ధరించడమనేది సామాజికపరమైనది. దుస్తులు సరిగా ధరించని సాక్షులను చూసినపుడు అనేకమంది న్యాయమూర్తులు సుదీర్ఘ ఉపన్యాసాలు ఇవ్వడం ఈ విషయం రుజువు చేస్తున్నది.

టీచింగ్ వృత్తికి దుస్తులు అధికమయ్యాయని, లేదా దుస్తులకు సంబంధించి చైతన్యపూరితమైన ఆసక్తి ఉందని అనడంలో వాస్తవం లేదు. దుస్తులు ధరించక పోవడంలో ఈ వృత్తికి ఆసక్తి లేదని నేను వాదిస్తున్నాను. స్కూళ్లలో టీచర్లు మామూలు చొక్కాలు, షార్ట్‌లు వేసుకుంటే, వృత్తిలో ప్రతిష్ఠ దానంతట అదే తగ్గిపోతుంది. క్లాస్‌రూమ్‌లో టీచర్లు స్వేచ్ఛగా వ్యవహరించడానికి అవకాశం చిక్కుతుంది.

దుస్తుల వ్యవహారం ఫాసిజం, కమ్యూనిజాల మధ్య ఉన్న వ్యతిరేకతను కూడా సూచిస్తుంది. స్టాలిన్ అంత నీట్‌గా దుస్తులు ధరించే వాడు కాదు. అతను పనివాడుగా జన్మించినందువల్ల ఈ విధంగా జరుగుతుంది. హిట్లర్, గోరింగ్ ఎల్లప్పుడూ చాలా నీట్‌గా దుస్తులు ధరించేవారు. కమ్యూనిజంలో కూడా దుస్తులు నీట్‌గా ఉండాలని పొడవు టోపీలు ఉండాలని నిర్ణయిస్తే అది పతనమైనట్టే లెక్క. తాము భయపడుతున్న అంశాన్ని దాచుకోడానికి ప్రతిష్ఠను ఉపయోగించుకుంటారని ఇంతకు ముందు తెలిపాను. తాను

దొరికిపోతాననే భయంతో టీచర్ ప్రతిష్ఠను పట్టుకొని వేలాడతాడు. ప్రతి మనిషి ఇదేవిధంగా వ్యవహరిస్తాడనేది వాస్తవం. దొరికిపోతామని మనమందరం భయపడతాం. అయితే టీచర్ ఇబ్బందికరమైన పరిస్థితిలో ఉంటాడు. పిల్లలంతా నిరంతరం టీచర్‌ను కనిపెట్టుకొని ఉంటారు. ఇటుకలతో గోడలు కట్టే వ్యక్తి తనను తాను మరచిపోడానికి అవకాశం ఉంది. కాని టీచర్‌కు అటువంటి అవకాశమే ఉండదు. టీచర్ వ్యక్తిత్వంతో సాన్నిహిత్యం పెంచుకోవాలని పిల్లవాడు కోరుకుంటాడు. కాని అతి దగ్గరగా వస్తాడేమోనని టీచర్ భయపడుతుంటాడు. కొద్ది గొప్ప తేడాలతో మనందరం యూజిని అరామ్ పరిస్థితులలోనే ఉంటాం. అరామ్ ఒక వ్యక్తిని హత్య చేసిన మరునాడే క్లాసు తీసుకోవలసి వచ్చింది. అతని రక్షణ ప్రవర్తన (defences) విఫలమై ఒక పిల్లవాడికి తాను కలలో హత్య చేసినట్టు చెబుతాడు. కాని ఆ పిల్లవాడు వాస్తవం గ్రహించి బహిర్గతం చేస్తాడు.

నాలోనే పిల్లలపట్ల భయం ఉన్నట్టు నేను కనుగొన్నాను. వారు నా గురించి చాలా ఎక్కువ తెలుసుకుంటారని నా భయం. గతంలో నేను చేసిన పిరికిపనుల గురించి పిల్లలకు చెప్పడానికి వెనకాడతాను. ప్రస్తుతం చేస్తున్న పిరికిపనుల గురించి చెప్పాలంటే మరింత వెనకాడతాను. పిల్లలకు నేనొక హీరోగా ఉండాలనే బాల్య చాపల్యపు కోరికను నేను అధిగమించలేకపోయాను. నా చెవులు బయటకు పొడుచుకొని ఉన్నందువల్ల బాల్యంలో నన్ను సాసర్స్ అని పిలిచేవారని పిల్లలకు చెప్పడానికి నాకు చాలా కాలం పట్టింది. ఆక్స్‌ఫర్డ్ గ్రూప్ సమావేశాలలో లేచి నిలబడి గతంలో తాము చేసిన పాపాలను వెల్లడించినట్టు నేను కూడా చేయాలని కోరుకుంటున్నాను. ఈ సమావేశంలో ఒక వ్యక్తి సంవత్సరాల తరబడి తాను అవమానంగా భావిస్తున్న సంఘటన గురించి చెబుతాడు. “12 సంవత్సరాల వయసులో తాను పరీక్షలలో కాపీ కొట్టానని” వెల్లడిస్తాడు. ఇది కొంత ఆసక్తి కలిగిస్తుంది. కాని దీన్నిబట్టి ఒప్పుకోలు (confession) పట్ల మన ధోరణి స్పష్టమవుతున్నది.

రోగి తన గురించి ఎవరేమి తెలుసుకున్నా ఇబ్బంది లేకుండా వ్యవహరించి నపుడు పూర్తిస్థాయిలో సైకోఎనాలిసిస్ జరిగినట్టు భావించాలని సైకో ఎనలిస్టు ఒకరు నాతో ఒకసారి చెప్పారు. ఇది నిజం కావచ్చు. మనం నిజాయితీ లేకుండా జీవిస్తున్నందువల్ల ఇటువంటి రక్షణలు ఏర్పాటు చేసుకుంటాం. మన ప్రయోజనాలను కప్పిపుచ్చుకునే విధంగా, మన సమాజం ఆమోదించిన విషయాలను కప్పిపెట్టుకునే విధంగా మనం పెరిగాం. పిల్లలు తమ కాలకృత్యాలను మర్మంగా పరిగణించే విధంగా శిక్షణ ఇస్తారు. అందువల్ల వారు తమకు ఇష్టంలేని వాటికి మర్మావయవాలకు సంబంధించిన పేర్లు పెడతారు. కాని విపత్కర పరిస్థితులలో మర్మంగా చేసే పనులు



బహిరంగంగా చేయడం తప్పనిసరవుతుంది. ఇంటికి నిప్పంటుకున్నప్పుడు వంటిపై దుస్తులు లేకపోయినప్పటికీ బయటకు పరుగులు తీస్తాం.

మనం జీవితాన్ని నిజరూపంలో ఎదుర్కొనప్పుడే అభివృద్ధి చెందిన మనుషులం కాగలుగుతామని చెప్పడానికి నేను ప్రయత్నిస్తున్నాను. జీవితపు ముసుగులు వదిలిపెట్టి మౌలికమైన అంశాలను తెలుసుకోవాలని నేను కోరుతున్నాను. ప్రస్తుతం ఈ విధంగా చేయడానికి బాంబులు వేయడం, విషవాయువులు ప్రయోగించడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందదనేది వాస్తవం. విపరీతమైన బాధలు, నరకం కారణంగా చైనా నైరాశ్యాన్ని వదిలిపెట్టింది. స్పెయిన్‌లో పెద్ద ఎత్తున త్యాగాలు చేసి ఉన్నత స్థాయికి ఎదిగారు. యుద్ధం వచ్చినపుడు మనం వాస్తవాలను గుర్తించవలసిన తప్పని సరి పరిస్థితి ఏర్పడుతుంది. సంప్రదాయాలు, నీతి నియమాలు యుద్ధంవల్ల చిన్నాభిన్నమవుతాయి. విద్య చేయాల్సిన పని యుద్ధం చేస్తుంది. టీచర్లు మన స్కూళ్లపై బాంబులు వేయాలి. మన విద్యా విధానం నిజంగా చురుకుగా ఉంటే, సంప్రదాయ జీవనాన్ని ముక్కలు చేయడానికి యుద్ధంలో నిజమైన బాంబులు వేయవలసిన అవసరం రాదు.

టీచర్లు మానవత్వంతో వ్యవహరించవలసిన తక్షణ అవసరం ఉంది. వారు తమ విద్యార్థులతోపాటు ముఠాలుకట్టి విద్యార్థులతో సమాన స్థాయిలో ఉండాలి. తాము ఏ విధంగానూ అధికులం కామని ఆధిక్యతను వదులుకోవాలి. రానున్న తరానికి జీవితాన్ని ఎదుర్కోడానికి అవకాశం ఉండాలంటే ప్రస్తుత తరం ధైర్యంగా, నిజాయితీగా వ్యవహరించాలి. ప్రతిష్ఠ వల్ల ఏర్పడుతున్న ఆటంకాలను అధిగమించాలి. ప్రతిష్ఠను బద్దలు కొట్టాలి.

# 8. ఉపాధ్యాయిని

నేను ఇప్పటి వరకు టీచర్లంతా పురుషులేనన్న ధోరణిలో రాసుకుంటూ వచ్చాను. వ్యాకరణ సంబంధమైన ఇబ్బందులు తప్పించడానికి నేను ఆ విధంగా చేశాను. లేనిపక్షంలో ఇటువంటి వ్యాక్యాలు రాయవలసి వచ్చేది...

"ఉపాధ్యాయిని లేదా ఉపాధ్యాయుడు ఆమె లేక అతని విద్యార్థులతో మానవత్వంతో వ్యవహరించాలని, ఆమె లేదా అతను క్లాసుతో సంబంధం కలిగి ఉండాలంటే ఆమెకు లేదా అతనికి ఇది తప్పనిసరి". విమర్శనాత్మక వ్యాఖ్యలు కాని, ఇతర వ్యాఖ్యలు కాని ఉపాధ్యాయులకు వర్తించినట్టుగానే ఉపాధ్యాయినులకూ వర్తిస్తాయి. అయితే ఉపాధ్యాయినిల గురించి ప్రత్యేకంగా చర్చించవలసిన అవసరం ఉంది.

ఉపాధ్యాయులకన్నా ఉపాధ్యాయినిలకు పిల్లలంటే ఎక్కువ ఆసక్తి ఉంటుంది. తమ ఉద్యోగం గురించి పిల్లల మనస్తత్వం గురించి ఎక్కువనేర్చుకోవాలని వారు కోరుకుంటారు. ఉపాధ్యాయుల కన్నా ఉపాధ్యాయినులు తమ వృత్తిని సీరియస్‌గా తీసుకుంటారు. పితృత్వం కన్నా మాతృత్వం ప్రత్యక్షంగా ఉంటుంది. అందువల్ల ఇది నిర్వివాదాంశం. బాలికలకు ప్రధానంగా ప్రజలపట్ల ఆసక్తి ఉంటుంది. బాలురు వస్తువుల పట్ల ఆసక్తి చూపుతారు. బాలికలు బొమ్మలతో ఆడుకుంటారు. బొమ్మలే వారికి మనుషులు. బాలికలు బొమ్మలతో ఆడుకోవడం మాతృత్వపు సహజాతాన్ని తెలుపుతుంది. బాలికలు బొమ్మలతో సమానంగా తమను గుర్తించుకుంటారు. ప్రతి బాలిక బొమ్మ కుటుంబంలో ఒక కొంటె బొమ్మ ఉంటుంది. తరచుగా ఇది మగ బొమ్మ అయి ఉంటుంది. నలుపు రంగులో ఉంటుంది. ఆమోదం నిరాకరించవలసిందిగా ఆమెకు బోధించిన భాగానికి ప్రతీకగా ఈ బొమ్మ ఉంటుంది.

ఒక విధంగా చెప్పాలంటే ఉపాధ్యాయిని ఆమెక్లాసు, చిన్న బాలిక తన బొమ్మలతో ఆడుకుంటున్న విధంగా ఉంటుంది. కొన్ని మంచి బొమ్మలుంటాయి. మరికొన్ని కొంటె బొమ్మలుంటాయి. గడియారంలాగా పనిచేసే పిల్లలన్నా పొట్ట నొక్కినపుడుకీచుమనే బొమ్మలన్నా ఉపాధ్యాయిని ఇష్టపడుతుంది. చిరిగిపోయిన దుస్తులున్న బొమ్మలు, రంపపుపొట్టు బయటకు వస్తున్న బొమ్మలను ఉపాధ్యాయిని ఇష్టపడుతుంది.

మంచి ఉపాధ్యాయిని వెలకట్టలేని ముత్యం వంటిది. కాని చెడు ఉపాధ్యాయిని చాలా అసహ్యభరితంగా ఉంటుంది. చెడు ఉపాధ్యాయిని గురించి స్పష్టమైన చిత్రం నా మనసులో ఉంది. ఆమె స్వరం కీచుమంటూ చుట్టూ వ్యాపించి ఉంటుంది. ఆమె తీక్షణమైన కళ్లు నిరంతరం క్లాసును పర్యవేక్షిస్తుంటాయి. చిన్న చిన్న విషయాలకు కూడా గందరగోళం



చేస్తుంటుంది. ఆమెకు అవకాశం ఉంటే పిల్లలను విపరీతంగా కొడుతుంది. చెవులు పిండివేస్తుంది. రూళ్లకర్రతో వేళ్లు చితక్కొడుతుంది. చిన్న చిన్నగా లొంగదీసుకుంటుంది. ఈ విధంగా ఏకరువు పెట్టనవసరం లేదు. పదిమందిలో తొమ్మిదిమంది ఉపాధ్యాయినులు సెక్స్ ఆకలికి గురైన స్త్రీలు ఎలా ప్రవర్తిస్తారో అలాగే ప్రవర్తిస్తారు. సెక్స్ అనుభవం వారి చెడులక్షణాలను నయంచేస్తుంది. గందరగోళం, పట్టరాని కోపం వెనుక ప్రేమించదగిన వ్యక్తిత్వం దాగి ఉంటుంది. సానుభూతి, ప్రేమలతో అది మృదువుగా తయారవుతుంది.

గయ్యాళి ఉపాధ్యాయిని కన్నా మౌనంగా అధికారం చెలాయించే ఉపాధ్యాయిని చాలా ప్రమాదకారి. ఆమె ఏమాత్రం కలత చెందదు. ఎన్నడూ స్వరం పెంచదు. ఆమె ఉనికి విద్యార్థులందరి నుంచి తిరుగులేని నిజాయితీ, తిరుగులేని విధేయత, తిరుగులేని శ్రద్ధ డిమాండ్ చేస్తుంది. తరచుగా బాలికలు ఆమెను పూజిస్తారు. బాలికల బోర్డింగ్ స్కూల్‌లోని హాస్టల్‌లో ఆమె తన ప్రతిభ ప్రదర్శిస్తుంది. ఒక్క భాష మినహా మిగతా అన్ని విషయాలలో కల్నల్ బ్లింప్‌కుఉండే లక్షణాలన్నీ ఆమెకుఉంటాయి. మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతికి చెందిన అనేక మంది బాలికలు జీవితం గురించి ఎటువంటి అవగాహన లేకుండా బయటకు వెళ్లడానికి ఇటువంటి ఉపాధ్యాయినులే కారణం. కులీన వంశపు స్త్రీలను తయారు చేయడంలో ఆమెది అందెవేసిన చేయి. చాలా సందర్భాలలో కన్యలే ఇటువంటి ఉపాధ్యాయిను లవుతారు.

ఆమె నిజాయితీపరురాలని అనడంలో ఎటువంటి సందేహం లేదు. కాని ఆ నిజాయితీకి ఉన్న పరిమితులు చాలా ప్రమాదకరమైనవి. బాలికలకు నిజమైన సంస్కృతి తెలియకుండా తప్పుడు సంస్కృతి అంటగట్టడంలో ఈ ప్రమాదం ఉంది. అందువల్ల బాలికల హాస్టల్ నుంచి ఎవరైన గడ్డి టోపీ ధరించి బయటకు వస్తుంటే, ఆ టోపీ కింద ఎటువంటి వ్యక్తిత్వం దాగి ఉందా? అనే ప్రశ్న నా మనసులో మెదులుతుంది. పుట్టుక, సెక్స్, చావు గురించి వారికేమి తెలుసు? కుటుంబం, స్కూల్ గురించి వారి నిజమైన ఆలోచనలేమిటి? తమ గురించి, ప్రపంచం గురించి వారికెంత చైతన్యం ఉంది? వారి టీచర్ల విశ్వాసాలకు భిన్నంగా వారికి ఎటువంటి విశ్వాసాలున్నాయి? సమ్మర్ హిల్ నుంచి ఒక బాలికను తీసుకువెళ్లి మామూలు బాలికల పాఠశాలలో చేర్చారు.

"అక్కడ ఎలా ఉంది?" అని నేనడిగాను.

"ఆహా నాకు కాలం బాగానే గడిచి పోతున్నది. పిల్లలు ఎక్కడినుంచి వస్తారు? ఎలా తయారవుతారనేది నా ఒక్కదానికే తెలుసు. నేనీ విషయాలన్నీ వారికి చెబుతూ అండర్‌గ్రౌండ్ టీచర్‌లాగా వ్యవహరిస్తున్నాను. వారంతా మూర్ఖులైన మూక!" అని ఆ బాలిక వివరించింది.

"అంటే ఆ పిల్లల మనసులు కలుషితం చేశావన్న మాట" అని నేనన్నాను.

"నేను కాదు. నేను వారి ప్రశ్నలతో విసిగిపోయాను. కానీ వారు నన్ను వదిలిపెట్టడం లేదు. కేవలం సెక్స్ అంటే వారికి ఆసక్తి ఎక్కువగా ఉంది".

ఇటువంటి టీచర్లు గయ్యాళికన్నా ఎక్కువ విషపూరితులు. గయ్యాళి వినియోగ స్వభావం కలిగి ఉంటుంది. విషం కక్కే టీచర్ ధోరణి నైతికమైనది. స్పెలింగ్ తప్పు చెప్పినందుకు ఒక బాలికను కొట్టడం ప్రమాదకరమైనది. కాని మౌలికమైన జీవ శక్తుల విజ్ఞానం బాలికలకు అందకుండా చేయడం ఇంకా ప్రమాదకరమైనది.

ఇటువంటి టీచర్లు బోధించే స్కూళ్లలో కన్యాత్వం పవిత్రమైనదనే నమ్మకం ఉంటుంది. కన్యాత్వం పోకుండా కాపాడడానికి ఈ బాలికల పాఠశాలలు ఏర్పాటు చేస్తారు. ఈ పాఠశాలలకు వేరే లక్ష్యం లేదు. జీవితమే కో-ఎడ్యుకేషన్ అనేది ఈ స్కూళ్లలో మరచిపోతారు. బాలికల పాఠశాల తన లక్ష్యం సాధిస్తుంది. కానీ పెద్ద ఎత్తున మూల్యం చెల్లిస్తుంది. కన్యాత్వం కాపాడుకోవలసిందిగా చెప్పడమంటే-చైతన్య పూరితంగా లేదా అంతశ్చేతనంగా బాలికలలో స్వలింగ సంపర్కం చోటు చేసుకోడానికి అవకాశం ఏర్పడుతుంది. స్కూల్ విడదీయడం వల్ల ఇటువంటి దుష్పరిణామం చోటుచేసుకుంటుంది. కాని చెడు టీచర్‌కు ఈ విషయం తెలయక పోవచ్చు. బాలికలలో సహజంగా మగవారిపట్ల పెరగవలసిన భావావేశాలను ఈ టీచర్ తనవైపు మరల్చుకుంటుంది. స్త్రీలలో జడత్వం అనేది స్కూల్‌లో సెక్స్ నిరోధక ధోరణివల్ల చోటు చేసుకుంటుంది. బాలికల విద్యాభ్యాసాన్ని సెక్స్ జీవితంలేని ఉపాధ్యాయిని చేతిలో పెట్టడం చాలా విపరీతమైనది. ఇటువంటి విద్యా అసూయను పెంచుతుంది. అంతశ్చేతనంగా స్వలింగ సంపర్క ధోరణి ఉన్న ఉపాధ్యాయిని, బాలికలు మగవారిపట్ల ఆకర్షితులు కావడానికి అంగీకరించదు. సెక్స్‌కు సంబంధించి ఆమెకు ఉండే మార్గం వేరు. ఉపాధ్యాయిని అంతశ్చేతనంగా స్వలింగ సంపర్క ధోరణి కలిగి ఉంటే మరింత ప్రమాదం. కేవలం సెక్స్ అనే మాట ప్రస్తావిస్తేనే ఆమె తీవ్రమైన దిగ్భ్రాంతికి లోనవుతుంది.

సెక్స్ జీవితం లేని మామూలు ఉపాధ్యాయిని బాలికలపట్ల అసూయ పెంచుకుంటుంది. చాలామంది తల్లులు తమ కూతుళ్ల పట్ల అసూయ పడుతుంటారు. కొంతమంది తల్లులకు ఇది అర్థమవుతుంది కూడా.

ఉపాధ్యాయిని పట్ల బాలిక ధోరణి ఆమె తల్లిపట్ల అనుసరించే ధోరణిలాగా ఉంటుందని నొక్కి చెప్పడం సాధ్యంకాదు. ఈ ధోరణి కలగా పులగంగా ఉంటుంది. ప్రేమ, ద్వేషాల మధ్య అటూ ఇటూ మారుతుంటుంది. బాలికకు తండ్రి ప్రేమ ఆదరువు. బాలికల స్కూళ్లలో తండ్రి ప్రస్తావన ఉండదు. ఫలితంగా స్కూల్‌లో మగవారిలాగా ఉండే



ఉపాధ్యాయిని చుట్టూ బాలిక ప్రేమ అల్లుకుంటుంది. ఇది జీవితాంతం బాలిక భావావేశపరమైన అనుభూతులను ప్రభావితం చేస్తుంది. బాలికల స్కూళ్లలో పురుషులే ఉపాధ్యాయులుగా ఉండాలని నేను చెప్పబోవడం లేదు. ఈ విధంగా చెబితే మరోవైపు పొరపాటు చేసినట్టవుతుంది. అంతేకాకుండా తల్లిపట్ల భావావేశాలను విస్మరించి నట్లవుతుంది. దీనికి నిజమైన పరిష్కారం ఏమంటే సిబ్బంది, విద్యార్థులతో కలిపి కో-ఎడ్యుకేషన్ స్కూళ్లు ఏర్పాటు చేయాలి. అంటే నిజమైన కోఎడ్యుకేషన్ అవసరం. కొన్ని స్కూళ్లలో బాలురు, బాలికలు విడివిడిగా జీవితం గడుపుతూ క్లాసుల్లోను, గేమ్స్‌లోను కలుస్తుంటారు. కోఎడ్యుకేషన్‌కు వ్యతిరేకంగా వచ్చే వాదనలు కేవలం సాకులుగా కనిపిస్తాయి. బాలికలకు, బాలురకు ఆసక్తులు వేరుగా ఉంటాయని, అధ్యయనంలో వారికి తేడాలుంటాయని ఇటువంటి అభిప్రాయాలు వ్యక్తమవుతాయి. కాని కోఎడ్యుకేషన్ వల్ల బాలురు, బాలికలు కలిసి పడుకుంటారనేది అసలు భయం. ఈ భయం మాత్రం వారు ఎన్నడూ వ్యక్తం చేయరు. యువజనులు అన్నిటికన్న ఉన్నతమైన సంతృప్తి పొందడానికి పాత తరం అంగీకరించదు. ఇక్కడ కూడా వాస్తవం చూడడానికి నిరాకరిస్తారు. వారికి పిల్లలు పుట్టవచ్చు. అది నైతిక గందరగోళానికి దారితీస్తుంది. పాఠాలు చదివేశక్తి, సెక్స్ జీవితం కారణంగా హరించుకుపోతుంది. వృద్ధతరం తమకు లేకుండా పోయిన సెక్స్ జీవితాన్ని యువజనులు పొందుతారనే భయంతో ఈ సాకులన్నీ చెబుతారు. నేరం చేస్తున్నామన్న భావం లేకుండా యువజనులు సెక్స్ అనుభవిస్తారని భయం. అందువల్ల బాలికల పాఠశాల మొత్తం సెక్స్‌పట్ల ఆసక్తి చూపుతున్నారని మా స్కూలు మాజీ విద్యార్థిని చెప్పిన మాటలలో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు.

మానసిక రుగ్మతలున్న ఉపాధ్యాయినికి కూడా సెక్స్‌పట్ల తీవ్రమైన ఆసక్తి ఉంటుంది. కానీ అది తరచుగా ప్రతికూలమైన రీతిలో వ్యక్తమవుతుంది. సెక్స్‌పట్ల భయం, ద్వేషం రూపంలో వ్యక్తమవుతుంది. బాలికల ఉత్తరాలు తెరిచి చెడు బాలురకు ఉత్తరాలు రాస్తున్నదీ, లేనిదీ తనిఖీ చెయ్యడంలో ఇది కనబడుతుంది. ఒక బాలికల పాఠశాలలో మహిళా పర్యవేక్షకురాలు లేకుండా బాలికలు పురుషులతో మాట్లాడకూడదని నియమం అమలు చేస్తున్నట్టు నేను విన్నాను. తండ్రి సందర్శనకు వచ్చినప్పటికీ ఆ స్కూల్లో ఈ నియమం వర్తింపజేసేవారు.

సెక్స్ సర్వస్వమని, అదొక్కటే పట్టించుకోవాలని చెప్పేందుకు నేను ప్రయత్నం చేయడంలేదు. కాని దాన్ని నిర్లక్ష్యం చేసినంతకాలం, అణచివేసినంత కాలం మనం విద్యలో మౌలిక ప్రవృత్తిని విస్మరిస్తున్నామనేది గ్రహించాలని నేను స్పష్టం చేస్తున్నాను. బాలికల సుఖసంతోషాలు దోచుకొని, వారు అసహజంగా పెరగడానికి దోహదం చేసే

నైతిక విద్యకు బదులు స్వేచ్ఛతో కూడిన విద్యావిధానం ప్రవేశపెట్టాలని నేను వాదిస్తున్నాను. ప్రతి మహిళకు ప్రేమ జీవితం గడిపే హక్కు ఉంది. అదే విధంగా ప్రతి బాలికకు సెక్స్ భావావేశాలను సహజంగా తీర్చుకోడానికి హక్కుంది.ప్రభుత్వ పాఠశాలలోపనిచేసే ఉపాధ్యాయిని కూడా బాలికల బోర్డింగ్ స్కూల్‌లో పనిచేసే ఉపాధ్యాయినిలాగే ఉంటుంది. ఇక్కడ ప్రభుత్వ పాఠశాల అంటే ప్రభుత్వ బాలికల పాఠశాల. వీరు ఎల్లప్పుడు ఆడవారితోనే ఉంటారు. కోఎడ్యుకేషన్ స్కూల్లో ఉపాధ్యాయిని సిబ్బందిలోను విద్యార్థుల్లోను మగవారిని చూస్తున్నందువల్ల కొంత మెరుగైన స్థితిలో ఉంటుంది.

ఎటువంటి స్కూల్లోనైనా సరే ప్రభుత్వ ఉపాధ్యాయినికి స్కూలు వెలుపల సామాజిక జీవనం ఉంటుంది. వారాంతాలలో స్వేచ్ఛగాతన జీవితం గడుపుతుంది. బోర్డింగ్ స్కూల్‌లో పనిచేసే ఉపాధ్యాయినికి ఈ అవకాశం ఉండదు. స్వేచ్ఛగా తన జీవితం గడిపే ఉపాధ్యాయిని యువజనులకు హానిచేసే అవకాశం తక్కువ. స్కూలు సబ్జెక్ట్ గురించి పని చేయడానికే ఆమెకు సమయం సరిపోదు. పిల్లలకు ఉన్నత విషయాలు బోధించడానికి ఆమెకు అవకాశమే ఉండదు.

ఎక్కాల గురించి పట్టించుకున్నందువల్ల అంతగా ప్రమాదం ఉండదు. కులీన వంశస్తురాలిగా (Lady) తయారు చేయాలన్న భావన చాలా ప్రమాదకరమైనది. మన ప్రభుత్వ పాఠశాలలు అవసరమైన అనేక అంశాలను అశ్రద్ధ చేస్తున్నాయనే విమర్శలో వాస్తవం ఉంది. బోర్డింగ్ స్కూళ్లు ఈ అంశాలన్నింటినీ పట్టించుకుంటాయి. పట్టించుకొని వాటిని ఎందుకూ పనికిరానివిగా తయారు చేస్తాయి. అవి మతాన్ని అలవాటుగా, ప్రవర్తనను సంప్రదాయకంగా, సెక్స్ అంటే భయపడే విధంగా మార్పు చేస్తాయి.

ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయినికి పరిమితులుంటాయి. కాని విద్యార్థులను సంప్రదాయ సంస్కృతిలో భాగంగా తయారు చేయాలన్న లక్షణం ఉపాధ్యాయినికి ఉండదు. ఆమె అసత్యం చెప్పవచ్చు. కాని అసత్య జీవితమే ప్రామాణికమైనదని ఆమె విద్యార్థులకు ప్రభోదించదు. ఆమె నేర్పే మూడు 'ఆర్' (writing, reading, arthametics) లు బోర్డింగ్ స్కూల్‌లో అమలు చేసే ఏడు నీతి సూత్రాల మాదిరిగా ప్రమాదకరమైనవి కావు.

ఆర్థికపరంగా ఆలోచించినపుడు ఉపాధ్యాయినుల పరిస్థితి అంత బాగాలేదు. స్త్రీలకు కూడా పురుషులతోపాటు సమానంగా వేతనాలు చెల్లించాలని న్యాయం కోరుతున్నది. రష్యాలో ఈ విధంగా జరుగుతున్నది. ఇంగ్లాండ్‌లో స్త్రీలకు సమాన వేతనాలు చెల్లించడంలేదు. పురుషులు వివాహం చేసుకొని కుటుంబాన్ని పోషించవలసి ఉంటుందని అందువల్ల సమాన వేతనాలు చెల్లించడంలేదని సాకు చెబుతున్నారు. అసలు కారణమేమంటే–చట్టాలు పురుషులే చేస్తున్నారు. మగ దేవుడిని కూడా పురుషులే తయారు



చేశారు. స్త్రీలను చిన్నచూపు చూస్తున్నారు. అవసరం లేని విషయాలలో మాత్రం ఆమెకు ఔన్నత్యం అంటగడుతున్నారు. స్త్రీ కనిపించినపుడు పురుషుడు టోపీ తీసి అభివాదం చేస్తాడు. రైలులో సీటు ఖాళీచేసి స్త్రీలకు ఇస్తాడు. ఆమెలోనికి వస్తున్నపుడు ఆమెకోసం తలుపు తెరుస్తాడు. కాని తనతోపాటు సమానంగా స్త్రీకి వేతనాలు చెల్లించాలని మాత్రం డిమాండ్ చేయడు.

కొన్ని ఉద్యోగాలలో పురుషులకు ఎక్కువ వేతనం చెల్లించవలసిన అవసరం ఉంటుంది. భవన నిర్మాణంలో పురుషులు చేసినంత బలమైన పనులు స్త్రీలు చేయలేరు. అదేవిధంగా మెకానిజం పనులు కూడా. కాని ఈ వాదన విద్యాబోధనకు వర్తించదు. ఉపాధ్యాయిని కూడా ఉపాధ్యాయునితో సమానంగా కష్టపడుతుంది. ఉపాధ్యాయునులలో పురుషులకు వ్యతిరేకంగా నిరసన తెలపడం, తమను చిన్నచూపు చూస్తున్నారన్న భావం ఉండడం సహజం. దీనికి విరుద్ధంగా పురుష ఉపాధ్యాయుల నుంచి తీవ్రమైన నిరసన వ్యక్తమవుతుంటుంది. నేరం చేస్తున్నామన్న భావనతో బహుశా ఉపాధ్యాయులు ఈ నిరసన వ్యక్తం చేస్తుండవచ్చు. అది నాకు తెలియదు. బాలురకు ఉపాధ్యాయినులు బోధించడమేమిటనే ప్రశ్న చిరకాలంగా వ్యక్తమవుతున్నది. ఇది వార్షిక సమావేశాలలో తీవ్రమైన చర్చగా ముందుకు వస్తున్నది.

క్రమశిక్షణ కేవలం క్రమ శిక్షణ గురించి ఆలోచించే పాతతరం ఉపాధ్యాయుల నుంచి ఈ ఆందోళన వస్తుంది. మనస్తత్వం దృష్ట్యా ఈ వాదనకు ఆస్కారమేలేదు. కాని వీరు మనస్తత్వాన్ని పరిగణలోకి తీసుకోరు. వారికి మనస్తత్వం అనేది పనికిమాలినది. పిల్లవాడు, అతని భావావేశాల గురించి వారికేమీ తెలియదు. వారికి తెలిసిందేమంటే కార్యాచరణను అణచివేసే శక్తి. అదే విద్యలో ప్రాధాన్యత వహిస్తుంది. క్రమశిక్షణ అమలు చేయడమే విద్య. మహిళల బలహీనతను ప్రస్తావిస్తూ వారు క్రమశిక్షణ అమలు చేయలేరని నిరసన వ్యక్తం చేస్తారు. ఏది ఏమైనప్పటికీ బలహీనమైన ఉపాధ్యాయిని కన్నా బలవంతుడైన ఉపాధ్యాయుని కన్నా నేను పిల్లవాడిపైనే ఎక్కువ నమ్మకం ఉంచుతాను.

సెక్స్ అనేది కేవలం మర్మావయవాలకు సంబంధించినది కాదని ఆధునిక మనస్తత్వ సూత్రాలు చెబుతున్నాయి. మనలో ప్రతి ఒక్కరికీ ఆడ లక్షణాలు, మగ లక్షణాలు కూడాఉంటాయి. పురుషునిలో స్త్రీ లక్షణాలు, స్త్రీలో పురుష లక్షణాలు ఉంటాయి. తనలో ఉన్న స్త్రీపట్ల పురుషుడు అవమానంగా భావిస్తాడు. ఆమెను నొక్కిపెట్టే ప్రయత్నం చేస్తాడు. ఆమెకు అస్తిత్వమేలేదని నచ్చజెప్పుకోడానికి ప్రయత్నిస్తాడు. ఆడతనమంటే బలహీనమైనదని, నిస్సహాయమైనదని పురుషుడు భావిస్తాడు. అనాది కాలం నుంచి స్త్రీ లక్షణాలున్న పురుషులను ఆడంగివారని అంటూనే ఉన్నారు.

పురుషునిలో స్త్రీ సంబంధమైన భాగం ప్రధానమైనదని తెలుసుకోడానికి నమ్మకం ఆసరా అవుతున్నది. ఈ భాగాన్ని పురుషుడు అణచివేస్తూనే ఉన్నాడు. స్త్రీగా ఉండడమంటే సమర్పించుకోవడం. పట్టు విడవడం. బిగుసుకుపోవడమంటే స్వేచ్ఛా జీవనానికి వ్యతిరేకమని రైక్ ప్రకటించాడు. సైనిక శిక్షణలోను, ఫాసిస్టు శిక్షణలోను శరీరాన్ని, చేతులను బిగుసుకుపోయేటట్టు చేయడాన్ని రైక్ ఈ సందర్భంగా ఉదాహరించాడు. మగతనం ప్రదర్శించడానికి వీలుగా ఈ శిక్షణ ఇస్తారని ఆయన తెలిపాడు. వ్యభిచారిణి బిగువులు లేకుండా తేలికగా నడవడాన్ని కూడా రైక్ ఉదాహరించాడు. అందువల్లనే వ్యభిచారిణిని తేలికరకం స్త్రీ (loose women) అని అంటారు. ఈ ఉదాహరణలతో ఆసక్తిభరితమైన ఒక ప్రశ్న తలెత్తుతుంది. నీ పిల్లవాడు సైనికదళంలో నాయకుడి చేతిలో ఉండాలా? అనే ప్రశ్న ముందుకు వస్తుంది. ఈ విషయంలో నాకు ఎటువంటి సందేహాలు లేవు. వీరిద్దరూ ప్రతీకలు మాత్రమే. కాని వారు మగతనానికి, ఆడతనానికి అంటే మృత్యువుకు, జీవనానికి ప్రతీకలు.

సైనికాధికారి మాదిరిగా స్త్రీ క్రమశిక్షణ అమలు చేయలేనందువల్ల ఉపాధ్యాయినిగా పనికిరాదని కొంతమంది ఉపాధ్యాయులు వాదిస్తారు. వారు తమలోని బలహీనమైన స్త్రీ భాగాన్ని గుర్తించలేరు. వీరి లక్ష్యం అధికారమే తప్ప ప్రేమ కాదు. వీరందరికి పొట్ట బిగుసుకుపోయి ఉంటుందని రైక్ చెబుతాడు. బిగుసుకుపోవడమంటే జీవితానికి వ్యతిరేకం. ఈ పరిస్థితి జీవితాన్ని తిరస్కరిస్తుంది. ఈ సందర్భంగా స్వచ్ఛమైన బ్రహ్మచారి పరిస్థితి గుర్తుకు వస్తున్నది. అతని భుజాలు చదరంగా బిగుసుకుపోయి ఉంటాయి. అతను అధికారం, క్రమశిక్షణలను నమ్మే పురుషుడు. ఇటువంటి బ్రహ్మచారి మగతనానికి ప్రతీక.

స్త్రీ సారవంతమైన భూమి. అయితే మగ విత్తనం లేకుండా స్త్రీ ప్రత్యుత్పత్తి చేయలేదు. పురుషుడు విత్తనం చల్లి వెళ్లిపోతాడు. స్త్రీ విత్తనాన్ని పోషించి తరువాత మొక్కగా పెంచుతుంది. ఆమె జీవితాన్నిస్తుంది. జీవనాన్ని సృజించడంలో ఆమె ప్రధాన భూమిక నిర్వహిస్తుంది. భూమి మాదిరిగానే ఆమె కూడా పూర్తిగా స్వీకరిస్తుంది. పురుషునికి స్త్రీపట్ల అసూయ. ఆమె పిల్లలను అతను దొంగిలిస్తాడు. తనలోని స్త్రీపట్ల కూడా అతనికి ద్వేషం. పిల్లలను తల్లినుంచి లాక్కొని, వారిని కఠినమైన శిక్షణ ఇచ్చి అతను భావిస్తున్న వాస్తవికతకు అనుగుణంగా తీర్చిదిద్దుతాడు. కన్నీళ్లు కార్చడం అవమానమని అనేకమంది పురుషులు భావిస్తారు. ఏడవడం స్త్రీ లక్షణమని వారి భావన.

పబ్లిక్ స్కూల్‌లో అధికారి ఏమాత్రం విచారం వ్యక్తం చేసినా, కన్నీళ్ళు పెట్టుకున్నా అధికారం కోల్పోవలసి వస్తుంది. పబ్లిక్ స్కూల్ వ్యవస్థ మొత్తం బాలురను



పురుషులుగా తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకుంటుంది. అందువల్ల బాలురను, స్త్రీలకు, వారి ప్రభావానికి దూరంగా పెంచుతారు. తమ తల్లి తమను చూడటానికి వచ్చినపుడు అందరి ముందూ తమను ముద్దు పెట్టుకుంటుందేమోనని భయపడిపోయేవారమని పబ్లిక్ స్కూల్‌నుంచి వచ్చిన అనేకమంది బాలురు నాకు చెప్పారు. ఇటువంటి వ్యవస్థలో సామ్రాజ్యవాద దాడులకు పనికివచ్చే పురుషులు తయారవుతారు. వారు సామ్రాజ్య నిర్మాతలుగా కఠినులైన దౌత్యవేత్తలుగా తయారవుతారు. ఇటువంటి వ్యవస్థలో బలహీనత, ధృఢత్వం సమంగా ఉన్న మనుషులు రూపుదిద్దుకోరు. మహిళలను దూరంగా ఉంచే ఈ పద్ధతిలో ఫాసిస్టు శిక్షణాంశాలు బలంగా ఉన్నాయి. మానవత్వం మతి చాంచల్యం లేనిదిగా రూపుదిద్దుకోవాలంటే స్త్రీ, పురుష లక్షణాలు రెండూ ఉన్న మానవులకు ఉభయ లక్షణాలున్న విద్య అవసరం. కాని నేటి వెర్రి ప్రపంచంలో స్త్రీలు గర్వంగా తమ పిల్లలను ఫిరంగులకు సమిధలుగా అర్పిస్తున్నారు. గర్వంగా అని ఎందుకంటున్నానంటే పురుషులు ఆధిపత్యం వహించడానికి స్త్రీలు అంగీకరిస్తున్నారు. అంతే కాకుండా పురుషుల ఆదర్శాలను, పాలనను విద్యుక్త ధర్మంగా భావిస్తున్నారు. స్పెయిన్‌లోను, అబిసీనియాలోను యుద్ధంలో మరణించిన తమ పిల్లల పతకాలు ధరించిన ఇటలీకి చెందిన తల్లులు పెరేడ్ చేస్తున్నారు. పురుషాధిక్యతకు, కఠినత్వం, లాభాలకోసం జరిగిన యుద్ధంలో ఈ సైనికులు హతమయ్యారు.

మన స్కూళ్లలో ఉపాధ్యాయినులను నియమించవలసిన అవసరం ఎంతైనా ఉంది. కాని సరైన వారినే ఉపాధ్యాయినులుగా నియమించాలి. పురుషులతో సమానంగా గుర్తించుకునేవారిని, పురుష ఆదర్శాలను, లక్ష్యాలను అనుసరించే మహిళలను ఉపాధ్యాయినులుగా నియమించకూడదు.

# 9. టీచర్-మతం

మత బోధనను టీచర్ నిర్ద్వందంగా తిరస్కరించాలి. అది అతని పనికాదు. అనేక సందర్భాలలో మత బోధన క్లాసులు అతనికి విసుగు తెప్పిస్తుంటాయి. ఇతరులు చేయవలసిన పని తాను చేయవలసి వస్తున్నట్టుగా టీచర్ భావిస్తాడు. తన వృత్తికి మత బోధనకు సంబంధం లేదని అనుకుంటాడు. అనేక సందర్భాలలో తాను మతస్తుడను కానని టీచర్ భావిస్తాడు. కారణాలేవైనా మతాన్ని విశ్వసించేవారు ఈ రోజున చాలా తక్కువ మంది ఉన్నారు. చిన్న చిన్న టౌన్‌లలో, గ్రామాలలో చర్చికి వెళ్లేవారు ఇంకా ఉన్నారు. అటువంటి చోట్ల టీచర్ చర్చికి హాజరవుతాడు. లేకపోతే ప్రజాభిప్రాయం తనకు వ్యతిరేకంగా ఉంటుందని భయపడతాడు.

నేను చాలా సంవత్సరాల క్రితమే మత విశ్వాసం వదులుకున్నాను. గతంలో నేనొక గ్రామంలో హెడ్మాస్టర్‌గా పనిచేశాను. ఆ గ్రామం చర్చి అధికారి స్కూల్‌బోర్డ్‌లో సభ్యుడు. నేను ఆ గ్రామానికి వెళ్లినపుడు ఆయన నా పట్ల ఎంతో మర్యాదగా వ్యవహరించాడు. నన్ను డిన్నర్‌కు ఆహ్వానించాడు. నా బసకు ఏర్పాట్లు చేశాడు. ఆదివారం రాగానే నేను చికాకు కలిగించే పరిస్థితిలో చిక్కుకున్నాను. ఆయన నన్ను ఎంతో మర్యాదగా చూసినపుడు ఆదివారం నాడు నేను చర్చికి వెళ్లకపోతే బాగుండదు కదా? నేను చర్చికి వెళ్లాలని నిర్ణయించుకున్నాను. వెళ్లిన వెంటనే నేను కూడా పాటల్లో మునిగి పోయాను. కాని మనస్ఫూర్తిగా పాల్గొనలేకపోయాను.

గ్రామాలలో పనిచేసే టీచర్లంతా నేను భావించినట్టుగానే భావిస్తారు. మా చర్చి అధికారి చాలామంది అధికారుల మాదిరి కాదు. చాలా మంచివాడు. ఆదివారంనాడు క్లాసులు తీసుకోవాలని టీచర్లను అడగకూడదని ఆయన ఒక నియమం రూపొందించుకున్నాడు. ఈ విధంగా క్లాసులు తీసుకోడాన్ని టీచర్లంతా గర్హిస్తారు.

మతం గురించి ఏదైనా మాట్లాడాలన్నా లేదా రాయాలన్నా ప్రాణాంతకమైన పరిమితి ఒకటి ఉంది. తొలి రోజుల్లో మా కిచ్చిన శిక్షణతో క్లిష్టమైన పరిస్థితి చోటు చేసుకుంది. తార్కిక వివేచన, విమర్శ లేని భావావేశపరమైన ధోరణి ఈ శిక్షణతో అలవడుతుంది. తన జీవితకాలమంతా చర్చి గంటలు వినే మనిషి ఎవరైనా సరే మతంనుంచి స్వేచ్ఛ పొందలేడు. మేధాపరంగా నేను స్వేచ్ఛ పొందాను. కాని భావావేశపరంగా పొందలేదు. నేను చర్చిగంటలు విన్నపుడు విషాదంతో కూడిన కోపం నాలో చోటు చేసుకుంటుందని నాకు తెలుసు. మత బోధన లేకుండా పెరుగుతున్న నూతన తరానికి ఇటువంటి క్లిష్టమైన పరిస్థితి ఎదురు కాదు. చర్చిలు, మత బోధకులు,



ప్రార్థనల పట్ల సమ్మర్‌హిల్ పిల్లల్లో ఎటువంటి స్పందనా లేదు. బైబిల్ బోధించనందుకు పెద్దపిల్లవాడొకడు నిరసన వ్యక్తం చేసాడు. బైబిల్ బోధిస్తే క్రాస్‌వర్డ్ పజిల్ (పద వినోదం) పూరించడానికి ఎక్కువ సామర్థ్యం ఉంటుందని అతని అభిప్రాయం. మ్యూనిక్ ద్రోహం తరువాత హిట్లర్ జెక్ ప్రజలను కొల్లగొడుతున్నపుడు స్థానిక జెక్ నిధికి నేను కొంత మొత్తం విరాళంగా ఇచ్చాను. శ్రీ, శ్రీమతి నీల్ పేరుతో విరాళం ఇస్తున్నట్టు తెలిపాను. క్రీస్తుకు ద్రోహం చేసిన జుడాస్ ఇస్కారియట్ మాదిరిగా నేను ఈ విరాళం పంపాను. కాని సమ్మర్‌హిల్ పిల్లలకు ఇదేమి అర్థం కాలేదు. స్థానిక పెద్దలకు కూడా జుడాస్ ప్రస్తావన అర్థం కాలేదు.

సగటు నాస్తికుడు-టీచర్ లేదా డాక్టర్ లేదా వ్యాపారస్తుడు కావచ్చు, వారి దృష్టి, మతం పట్ల అవగాహన ఎలా ఉంటుందో చూద్దాం.

జీవితం, మరణానంతర జీవితం గురించి మతం వివరిస్తుంది. మరణానంతర జీవితం అనేది కేవలం ఊహలకు మాత్రమే సంబంధించినది. ఒకసారి అది స్వర్గంలో సంతోషభరితంగా ఉంటుంది. మరొకసారి మంటలు మండే నరకంలో ఉంటుంది. ఆధ్యాత్మిక వాదుల కారణంగా పాక్షికంగా నరకం గురించిన ఆలోచనలు వెనుకబడ్డాయి. స్వర్గంలో ప్రజలు ఏదో ఒక పని చేస్తుంటారు. సంగీత వాద్యం (harp) వాయించుకుంటూ జీవితమంతా గడపడం అనేది ఊహలకు అంత సంతృప్తి కలిగించదు.

మరణానంత జీవితం గురించి ఆలోచించుకోవడానికి, ఆశించడానికి మనందరకు స్వేచ్ఛ ఉంది. నా ఆలోచనలు చెప్పవలసి వస్తే వ్యక్తిత్వానికి సంబంధించినంత వరకు మరణించగానే తెరపడిపోతుంది. మనం ప్రభావితం చేసిన అంశాలు మాత్రమే మిగులుతాయి. మరణించిన వ్యక్తి కుక్క మాదిరిగా అంతరించిపోయినట్టే. మనిషి శాశ్వతంగా జీవించగలడు అనుకుంటే కుక్కకు కూడా అటువంటి అవకాశమే ఉంటుందని నా అభిప్రాయం. చాలామంది తమ స్నేహితులకు శాశ్వతత్వం ఆపాదించడానికి చాలా సంతోషంగా అంగీకరిస్తారు. అటువంటప్పుడు బ్రెజిల్ మధ్య ప్రాంతంలోని ఆటవికునికి లేదా గ్రామంలో తిరిగే మూర్ఖునికి లేదా యూదులను హింసించే వారికి శాశ్వతత్వం ఆపాదిస్తే మాత్రం వచ్చే తేడా ఏమిటి? నా వరకు నేను శాశ్వతంగా జీవించాలని కోరుకోవడం లేదు. నాకు అందులో ఆసక్తి లేదు. ప్రస్తుత జీవితంపట్ల నా శక్తి, ఆసక్తి అంతా ముడిపడి ఉంటాయి.

విద్యాపరంగా ఆలోచించినపుడు-పిల్లల ప్రవర్తనలో ఆదర్శాలు అంటగట్టే ప్రయత్నంలో భాగంగా మరణానంతర జీవిత సిద్ధాంతాన్ని ఉపయోగించడం ప్రమాదభరితమైనది. ఆ సిద్ధాంతం గత మూడు దశాబ్దాల కంటే ప్రస్తుతం చాలా శక్తి

కోల్పోయింది. తన ప్రవర్తన సరిగా లేకపోతే నరకానికి పోవలసి వస్తుందని ఈ రోజున సగటు పిల్లవాడెవరూ భయపడడంలేదు. శాశ్వత శిక్ష అనుభవించివలసి వస్తుందన్న భయం కూడా ఈ రోజున లేదు. నిజానికి శాశ్వతత్వ సిద్ధాంతమే వెనక్కు తగ్గింది. మతం కూడా ఈ రోజున జీవనం గురించి ఎక్కువ శ్రద్ధ తీసుకుంటున్నది. మరణం గురించి మరచిపోతున్నది. శాశ్వతత్వం కన్నా నైతిక విలువలకు పెద్దపీట వేస్తున్నారు.

అందువల్ల మతం గురించి ఎక్కువగా పట్టించుకోవలసిన అవసరం ఏర్పడుతున్నది. మతం నైతికతను ప్రతిపాదిస్తూ మనుషులు ఏ విధంగా జీవించాలనేది నిర్దేశించడానికి ప్రయత్నిస్తున్నది. మనకు తెలిసి మానవ నైజానికి మతం ప్రతిపాదిస్తున్న నైతిక విలువలు ఏ విధంగా వర్తిస్తాయనేది అధ్యయనం చేయవలసిన తప్పనిసరి అవసరం ఏర్పడుతున్నది. మంచి–చెడు, తప్పు–రైటు అనే భావనలను అన్ని మతాలు ప్రతిపాదిస్తాయి. పాపం అనే భావనపై ఆధారపడి క్రైస్తవ మతం స్థాపించారు. మానవుడు పాపంలో జన్మించాడు. అందువల్ల అతను విముక్తి పొందాలి. మానవుడు బలహీనుడు, అందువల్ల వెలుపల శక్తి, సర్వశక్తివంతమైన అన్నిటిని ప్రేమించే తండ్రి (Father) సహాయం అతనికి అవసరం.

కాని ఈ భావం ఏమాత్రం పసలేనిదని ఆధునిక మనోవిజ్ఞాన శాస్త్రం (Modern Psychology) రుజువు చేసింది. పాపమనే భావానికి ఆధారంలేదని తెలిపింది. ‘చెడు’ పిల్లలతో శాస్త్రీయ పద్ధతిలో వ్యవహరించిన వారందరికీ ‘పాపం’ అనేది మామూలు విషయమని తెలుసు. తల్లిదండ్రుల నుంచి ప్రేమ లభించని పిల్లవాడు ప్రేమకు ప్రతీకగా డబ్బు దొంగిలిస్తాడు. ప్రేమ లభించనందువల్ల అతను ‘పాపం’ చేస్తాడు. ‘పాపాలు’ అనేవి అన్నీ ఇదే విధంగా ఉంటాయి. సహజంగా మంచిదయిన లక్షణం ఈ విధంగా దారి తప్పుతుంది.

మాలినోవ్స్కీ రాసిన ‘సెక్స్ అండ్ రిప్రెసన్ ఇన్ శావేజ్ సొసైటీ’ అనే పుస్తకంలో ‘పాపం’ అంటే ఏమిటనేదానికి అద్భుతమైన ఉదాహరణ లభిస్తుంది. మెలనీసియాలోని ట్రోబ్రియాండ్ జాతివారికి స్వలింగ సంపర్కమంటే ఏమిటో తెలియదు. “కాని తెల్లజాతివారు ఇంకా చెప్పాలంటే తెల్లజాతివారి నైతిక విలువలు అక్కడ ప్రవేశించడంతో స్వలింగ సంపర్కం కూడా ప్రారంభమైంది. బాల బాలికలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గుడిసెలో స్వేచ్ఛగా రతిలో పాల్గొంటారు. ఈ విధంగా చేయడం తమ విధి అని, తమ హక్కని ట్రోబ్రియాండ్ జాతివారు భావిస్తారు. కాని ఈ హక్కు వారికి తిరస్కరించారు. క్రైస్తవం తీసుకున్న వారి నుంచి, తీసుకోని వారి నుంచి జాగ్రత్తగా రాబట్టిన సమాచారం ప్రకారం అశాస్త్రీయంగా, హేతువిరుద్ధంగా బలవంతంగా తెల్లజాతివారి నైతిక విలువలు



రుద్దినందువల్ల స్వలింగ సంపర్కం నియమంగా మారింది.”

ట్రోబ్రియాండ్ జాతివారు బాల్యం నుంచి ఆడ, మగ మధ్య సెక్స్ సంబంధాలు కలిగి ఉంటారు. ఇది తప్పు అనే అభిప్రాయం వారికి లేదు. మాలినోవ్స్కీ చెబుతున్నదాని ప్రకారం ట్రోబ్రియాండ్ జాతివారిలో సెక్స్ నేరాలు లేవు. పిల్లలపై మగవాళ్ళు సెక్స్ పరంగా దాడి చేసినట్టు ఎటువంటి రికార్డులు లేవు.

మానవ నైజానికి నైతిక విలువలకు మధ్య తలెత్తే వైరుధ్యం ఫలితంగా పాపం ఏర్పడుతుంది. కానీ నైతికత అంటే ఏమిటి? నైతికత అంటే పాలక వర్గాల చట్టం. పాలిత వర్గాలలోనే క్రైస్తవ మతం ఆవిర్భవించింది. ఏసుక్రీస్తు అట్టడుగు వర్గాల పక్షాన నిలిచాడు. సహజంగానే ఆయనకు శిలువ శిక్ష వేశారు. ఆయన స్థాపించిన క్రైస్తవ మతాన్ని పాలకవర్గాలు సొంతం చేసుకున్నాయి. పాలితులను ఉన్నచోటే ఉంచడానికి ఈ మతాన్ని ఉపయోగించుకున్నారు. అపారమైన భూమి సంబంధమైన ఆస్తులను తన అధీనంలో ఉంచుకున్న చర్చి స్పెయిన్ అంతర్యుద్ధంలో సహజంగానే ఫ్రాంకో పక్షం వహించింది. పేద ప్రజలకు వ్యతిరేకంగా నిలిచింది. బ్రిటన్‌లో ఆంగ్లికన్ చర్చి కూడా సంపన్నులకే కొమ్ము కాస్తుంటుంది. తరతరాలుగా ప్రజలను అణచివేయడానికి వీలుగా పాలక వర్గాలు మతాన్ని సాధనంగా ఉపయోగించు కుంటున్నాయి. నాగరికత అభివృద్ధి చెందక పూర్వం శాశ్వతానందంలో మునిగి పోతారంటూ శ్రామిక వర్గాలను మోసం చేయడం కొంత తేలికగా ఉండేది. రష్యా విప్లవంలో మత వ్యతిరేకత వ్యక్తమైంది. దీన్నిబట్టి బోల్షివిక్‌లకు చర్చి, పెట్టుబడిదారులు ఒకటేననే విషయం స్పష్టంగా తెలుసనేది స్పష్టమవుతున్నది.

ఆటంకాలు లేకుండా ధనికుల పాలన సాగడానికి వీలుగా క్రైస్తవ మతం నైతిక చట్టాలను కాపాడుతుంది. కుటుంబం, వైవాహిక జీవితాలకు క్రైస్తవ మతం మద్దతు ఇస్తుంది. పాలక వర్గాలకు ఇవి అపారమైన శక్తిని సమకూర్చుతాయి. నమ్రత, విధేయత గొప్ప గుణాలని క్రైస్తవమతం బోధించింది. మన శిక్షాస్మృతి వంటి అనాగరికమైనవాటిని మతం సమర్థిస్తుంది. ఈ అనాగరిక చట్టాలు పేదలకు వ్యతిరేకంగా ధనికులకు రక్షణ కల్పించడమే దీనికి కారణం. క్రూరమైన శిక్షలు విధించాలని ఏసుక్రీస్తు ఏనాడూ చెప్పలేదు. క్రైస్తవ మతాన్ని పక్కదారి పట్టించి ధనికుల ప్రయోజనాలు కాపాడుతున్నారని మనందరికీ తెలుసు.

ఈ పరిస్థితులలో మన స్కూళ్లలో విద్యార్థులకు మతం బోధించవలసి వస్తున్నది. ఇటువంటి మత బోధన చేయవలసిందిగా టీచర్‌కు చెబితే తన మేధాశక్తిని, తన మనస్సును వ్యభిచారానికి అప్పగించవలసిందిగా కోరినట్టే. ఇటువంటి మతాన్ని పిల్లలపై రుద్దడం నేరం. మంచిని చెడుగా, దాతృత్వాన్ని ద్వేషంగా, ప్రేమను నేరంగా మార్చడానికి మత

బోధన ఉన్నతమైన విధానం. ప్రారంభంలో పిల్లవాడు మంచిగానే ఉంటాడు. ఎదుగుతున్న క్రమంలో మతాన్ని ఎంచుకోడానికి అతనికి స్వేచ్ఛ ఉండాలి.

పిల్లలకు మత బోధన చేయకపోతే బైబిల్ భాషలోని ఔన్నత్యాన్ని పొందడంలో విఫలమవుతాడనే విమర్శ ఉంది. కానీ వారు షేక్స్‌ఫియర్, మిల్టన్, కీట్స్ రాసినవి చదవకపోతే చాలా పోగొట్టుకుంటారన్నది ఎవరూ ఫిర్యాదు చేయడం లేదు. ప్రముఖ సంగీతకారులు సృష్టించిన సంగీతం సగటు పిల్లవాడికి అందడమే లేదు. నిజానికి ప్రస్తుత విద్యా వ్యవస్థలో పిల్లవాడు అందమనేదాన్ని అందుకోలేక పోతున్నాడు. బైబిల్ నుంచి కొన్ని భాగాలను ఎంపిక చేస్తే అది విద్యార్థులకు సరిపోతుంది. నిజంగా మతం పట్ల ఆసక్తి ఉన్న టీచర్‌కు ఇక్కడ వ్యక్తం చేసిన అభిప్రాయాలు క్రైస్తవ వ్యతిరేకమైనవిగా కనిపించవచ్చు. పిల్లలను రుజుమార్గంలో నడిపించడానికి తనకు హక్కుందని ఆయన భావించవచ్చు. కాని ఇతర వృత్తులలో పెద్దలెవరికీ మతం పుచ్చుకోవలసిందిగా చెప్పే హక్కు ఉండదు. దేవుడు ప్రేమించమని చెప్పాడని, శత్రువులను ప్రేమించవలసిందిగా చెప్పాడనే అభిప్రాయాలు చోటు చేసుకోకుండా చేయడానికి సైన్యంలో మాత్రం చర్చికి హాజరు కావాలన్న నియమం అమలులో ఉంటుంది. సైనికుడు యుద్ధ దేవతలను మాత్రమే తలచుకోవాలి. కాని మామూలు జీవనంలో మతాన్ని బోధించే హక్కు ఎవరికీ లేదు. ఫ్యాక్టరీలలో అనేకమంది పాపులు పని చేస్తుంటారు. కానీ ఫోర్మన్ పనిరోజున మతబోధన చేస్తానంటే అనుమతి లభించదు.

పిల్లలను పిరికితనంతో దోపిడి చేయడాన్ని నేను పూర్తిగా వ్యతిరేకిస్తాను. మనం ద్వేషించే తప్పుడు విలువలను మతబోధన ద్వారా పిల్లలకు అంటగడతాం. ఇంగ్లాండ్ క్రైస్తవ దేశం. రష్యాలో విగ్రహారాధన సాగుతుంది. రష్యాలో వ్యభిచారాన్ని రద్దు చేశారు. పోప్ సమర్థించారు. విగ్రహారాధన సాగే రష్యాలో నిరుద్యోగం లేదు. కాని ఇంగ్లాండ్‌లో నిరుద్యోగం పెరిగి పోతున్నది. క్రైస్తవ మతం గురించి వినని జాతులు కూడా బ్రిటిష్‌వారి మాదిరిగానే నిజాయితీతో ప్రేమతో జీవిస్తున్నాయి. మెలిసీనియాలో పితృహత్యలేదు. రెడ్ ఇండియన్ల భాషలో 'దొంగతనం' అనే పదమే లేదు. వారెంతో నైతిక విలువలతో జీవనం గడుపుతున్నారు. దొంగతనం అనేది వారికి తెలియదు. క్రైస్తవ నైతిక స్మృతి బోధించే స్కూళ్లలో కన్నా సమ్మర్‌హిల్‌లో పిల్లలు ఎంతో నిజాయితీగా ఉంటారు. పిల్లలు మంచిగా ఉండాలంటే వారికి క్రైస్తవబోధన చేయాలన్నది కేవలం మూఢనమ్మకం మాత్రమే. దీనికి విరుద్ధంగా క్రైస్తవ బోధన వారిలో మంచిని చెడుగా మార్పు చేస్తుంది. వారిలో సహజమైన ప్రేమను భయం, ద్వేషంగా మార్చుతుంది. వీటన్నిటినీ మించి వారిని వంచకులుగా తయారు చేస్తుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే క్రైస్తవ మతమే దయ్యం.



# 10. టీచర్-అతని శిక్షణ

ఈ విషయం నాకు అంతగా తెలియదని అంగీకరిస్తున్నాను. నేనెప్పుడు ట్రెయినింగ్ కాలేజీకి వెళ్లలేదు. ఈ కాలేజీ సిలబస్ నేనెన్నడూ చూడలేదు. అయితే ట్రెయినింగ్ కాలేజీ నుంచివచ్చే వారిని చూశాను. వారి విద్యాతత్వం గురించి నాకు తెలియదు. అయితే ఈ కాలేజీల గురించి లోపల ఉండి తెలుసుకోలేదనేది కేవలం ఒక అభిప్రాయమే అవుతుంది. నా ఆలోచనల ప్రకారం టీచర్ ట్రెయినింగ్ కాలేజీ ఎలా ఉండాలనేది నేనిప్పుడు వివరిస్తాను.

ట్రెయినింగ్‌లో పిల్లల మనస్తత్వ శాస్త్రం ప్రధానమైన సబ్జెక్ట్‌గా ఉండాలి. బోధనా పద్ధతులు, క్రమశిక్షణా పద్ధతులకు తదితర సబ్జెక్టులకు సిలబస్‌లో చాలా తక్కువ స్థానం కల్పించాలి. మనస్తత్వ శాస్త్రంలో ట్రెయినింగ్ అనగానే క్రమశిక్షణ, శిక్షలు వంటి అంశాలు ఆటోమాటిక్‌గా తొలగిపోతాయి. "పిల్లవాడిని అర్థం చేసుకో" అన్నది ట్రెయినింగ్ లక్ష్యం కావాలి. ఈ లక్ష్యం "నిన్ను నువ్వు తెలుసుకో" అనే లక్ష్యంతో ముడిపడి ఉండాలి. మనస్తత్వశాస్త్రం సిలబస్‌లో సగభాగం పెద్దల ప్రవర్తన గురించే ఉంటుంది. నిరంతరం పిల్లలతో కలిసి ఉండడం ప్రధానమైనది. ఉపన్యాసాలకు అంత ప్రాముఖ్యం ఉండదు. మంచి ట్రెయినింగ్ కాలేజీలో ఒక్కొక్క విద్యార్థికి ఐదుగురు పిల్లల వంతున కేటాయించాలి. ప్రతి విద్యార్థి చిన్న బృందంగా ఉన్న పిల్లలను అధ్యయనం చేయాలి. పిల్లల పనిలో, ఆటల్లో, వారు కూర్చునే గదులలో, నిద్రపోయే గదులలో వారి ప్రవర్తన ఎలా ఉంటుందో విద్యార్థులు అధ్యయనం చేయాలి. విద్యార్థులు పిల్లలు కలిసి పనిచేస్తున్నప్పుడు క్రమశిక్షణ ఇద్దరికీ సంబంధించినదైతే ఈ అధ్యయనం సమర్థవంతంగా సాగుతుంది. తామే అధికులమన్న భావం, మర్యాద లేదా విధేయత, నైతిక బోధన లేకుండా ఉన్నపుడే కలిసి పని చేయడం సాధ్యమవుతుంది. పిల్లలపట్ల విద్యార్థులు స్నేహితులుగా వ్యవహరించాలి.

పిల్లలు నిద్రపోయిన తరువాత విద్యార్థులు ఆరోజు తాము పరిశీలించిన అంశాలను తమ టీచర్లతో చర్చించాలి. ఈ పరిశీలనాంశాలు ప్రవర్తనకు సంబంధించినవై ఉండాలి. గణితంలో చురుకుగా ఉన్నారని లేదా భూగోళశాస్త్రంలో మందగొడిగా ఉన్నారనే చర్చలు ఎప్పుడోకాని ముందుకురావు. పిల్లలంటే ఏమిటి? జీవితంలో వారేమి కోరుకుంటున్నారు? అనేవి తెలుసుకోవడం ప్రధాన లక్ష్యంగా ఉండాలి.

సహజంగానే ఇటువంటి కాలేజీకి గరిష్ఠస్థాయిలో పరికరాలు అవసరమవుతాయి. ప్రతి సృజనాత్మక కార్యకలాపానికి ఆచరణలో చాలా పరికరాలు అవసరమవుతాయి. ఆ విధంగా చిత్రలేఖనం, సంగీతం, నృత్యం, చేతివృత్తులలో నిరంతరం

కార్యకలాపాలు సాగాలి. పిల్లలకే కాకుండా ప్రత్యేకించి టీచర్ ట్రెయినింగ్ విద్యార్థులకు ఇవన్నీ అవసరమవుతాయి. వారు పిల్లలతో పాటు కలిసి పనిచేయాలి. వారితో కలిసిపోయి నేర్చుకోవాలి. అందువల్ల టీచర్లకు ఈనాడున్న దానికంటే ఎక్కువ విశాల దృక్పథం ఏర్పడుతుంది.

ఇవన్నీ మనస్తత్వశాస్త్ర అధ్యయనంతో మరింత బలపడతాయి. ఇదలా ఉంచి ట్రెయినింగ్‌లో స్కూల్‌కు సంబంధించని అనేక అంశాలు బోధిస్తారు. మానవజాతి గురించి అధ్యయనానికి ట్రెయినింగ్‌లో ఎక్కువ అవకాశం కల్పించాలి. మానవశాస్త్రం (Anthropology) సామాజిక, ఆర్థిక చరిత్ర, రాజనీతిశాస్త్రం, ఆచరణ వంటి సబ్జెక్ట్‌లను వారికి సమగ్రంగా బోధించాలి. తత్వశాస్త్రం కూడా అవసరమే. కాని టీచర్ ప్రతిభావంతుడు కాని పక్షంలో విద్యార్థులు హెగెల్, కాంట్‌ల భావవాదంలో చిక్కుకుపోతారు. విశాల ప్రపంచ దృక్పథం ఉన్న టీచర్లను తయారు చేయడమే లక్ష్యంగా ఉండాలి. ప్రయాణాలు చేయకుండా ఇటువంటి దృక్పథం అలవడడం కష్టం. ఈ రోజున ఒక వ్యక్తి స్థానిక యూనివర్సిటీలో డిగ్రీ సంపాదించి రెండు సంవత్సరాలు టీచర్ ట్రెయినింగ్‌చేసి స్థానిక స్కూల్లో బోధించడానికి బయలుదేరతాడు. అతను తాను పుట్టిన ప్రదేశం నుంచి కనీసం పది మైళ్ల దూరమైనా ప్రయాణం చేసి ఉండడు. విదేశస్తులను కలుసుకొని మాట్లాడి ఉండడు.

ఈనాడు ప్రపంచవ్యాప్త ప్రయాణాలు చేయడానికి అవకాశం ఉంది. కాని చాలా మంది బయలుదేరినపుడున్న పరిస్థితిలోనే మళ్లీ తిరిగి వస్తారు. వారి అవగాహన ఏమాత్రం పెరగదు. నావికులు ప్రపంచమంతా తిరుగుతున్నప్పటికీ, కొంతమంది ప్రపంచమంతా తిరుగుతున్నప్పటికీ వారందరికీ విశాల దృక్పథం ఏర్పడిన దాఖలాలేమీ లేవు. అదే విధంగా ఆర్ట్ గ్యాలరీకి వచ్చే వేలాది మందిలో చైతన్యం పాలు పెరిగిందని కూడా చెప్పలేం. ఎవరికైనా సరే సంస్కృతిని అందజేయలేం. కాని సాంస్కృతిక విషయాలు వారి ముందుంచగలం. ఆమోదించడం లేదా తిరస్కరించడం వారిష్టం. ప్రయాణాలు చేస్తున్నపుడు మందగొడి వ్యక్తి ఏమాత్రం కొత్త విషయాలు గ్రహించలేకపోవచ్చు. కాని మెలకువగా ఉండేవారు ఎన్నో విషయాలు గ్రహించగలరు. ప్రయాణంచేసే వ్యక్తి భూమికి ఇంగ్లాండ్ కేంద్రం కాదని గ్రహించగలుగుతాడు. స్విట్జర్లాండ్‌లోని పర్వతాలనుంచి చూస్తే ఇంగ్లాండ్ గ్రామంలోని స్కూలు చాలా చిన్నదని, ప్రాముఖ్యంలేనిదని తెలుసుకోగలడు. జీవితంపట్ల విశాల దృక్పథం ఏర్పడడానికి ప్రయాణం దోహదం చేస్తుంది. అహంపై అది ఖచ్చితమైన ప్రభావం చూపుతుంది.

ప్రయాణం వల్ల సమకూడే ప్రయోజనాలను వివరించడానికి నేను ప్రయత్నం



చేస్తున్నాను. నేను 1921 నుంచి 1924 మధ్యకాలంలో జర్మనీ ఆస్ట్రియాలలో నివసించాను. ఈ కాలంలో కళలు, సాంస్కృతిక రంగాలకు చెందిన అనేకమంది స్త్రీ, పురుషులను నేను కలుసుకున్నాను. వారి సమక్షంలో నేను ఆత్మన్యూనతా భావానికి లోనయ్యాను. దీన్ని అధిగమించడానికి నాకున్న ఎం.ఎ. డిగ్రీ ఏ మాత్రం ఉపయోగపడలేదు. ప్రయాణాలలో నేను ప్రముఖులైన సైకాలజిస్టులను, ఇతరులను కలుసుకున్నాను. అందువల్ల పనిచేయడంలో నా సామర్థ్యం పెరిగింది. అందువల్ల నేను అంతర్జాతీయ స్థాయిలో ఆలోచించడం నేర్చుకున్నాను. జాత్యహంకార భావనలను నేను వదిలించుకోగలిగాను. దేశభక్తిపట్ల నాకున్న ఆలోచనలు మరింత బలపడ్డాయి. కాని హోటళ్లు, కస్టమ్స్ తనిఖీలు, నార్త్ సీని దాటడం, పాషాణంలాంటి సీట్లపై రైలు ప్రయాణాలు ఇబ్బంది కలిగించాయి. కాని ప్రయాణాలలో నేను నేర్చుకున్న అంశాలతో పోల్చినపుడు ఈ ఇబ్బందులు పరిగణలోకి తీసకోనవసరం లేదు.

విద్యార్థుల ప్రయాణపు ఖర్చులు ప్రభుత్వమే భరించాలి. అయితే ఎటువంటి ప్రయాణాలు చేయాలన్నది ప్రభుత్వమే నిర్ణయించాలి. విదేశాలలో విద్యా విధానంపై అధ్యయనం చేయడానికి వీలుగా ఈ ప్రయాణాలన నిర్దేశిస్తే అంత ప్రయోజనం ఉండదు. ఈ విధంగా నిర్దేశిస్తే విద్యార్థుల దృష్టి తరగతి గదికే పరిమితమవుతుంది. స్వీడన్, హంగేరీలలోని స్కూళ్లు బ్రిటన్‌లోని స్కూళ్ల కన్నా బాగా వెనుకబడి ఉన్నాయి. విద్యార్థులకు కొంత సొమ్ము చెల్లించి విదేశాలలో తిరిగి రావడానికి అవకాశం కల్పించాలి. టీచర్లు, స్కూళ్లను మినహాయించి ఇతర ప్రదేశాలు చూడవలసిందిగా ఆదేశించాలి. తిరిగి వచ్చిన తరువాత రిపోర్టు ఇవ్వాల్సిన అవసరం కూడా ఉండకూడదు.

కొద్దిమంది ఎలా వెళ్లారో అదే స్థితిలో తిరిగి వస్తారు. కాని ఎక్కువమంది తమ దృక్పథాన్ని విశాలం చేసుకొని వస్తారు. వారు తిరిగి వచ్చిన తరువాత దేశంలోని కొన్ని అంశాలపై ఫిర్యాదు చేసే అవకాశం మాత్రం ఉంటుంది.

ఉపాధ్యాయుల మార్పిడి విషయంలో కొంత ప్రగతిని మనం చూడవచ్చు. ప్రత్యేకించి వలస దేశాల నుంచి బ్రిటన్‌కు జరిగే టీచర్ల మార్పిడిలో ఈ ప్రగతి కనిపిస్తుంది. ఒక స్కూలు నుంచి మరొక స్కూలు వెళ్ళే కుచించుకుపోయిన లక్ష్యంతో తిరగుతున్నప్పటికీ ఈ టీచర్ల మార్పిడిలో టీచర్ల ఆలోచనలు అభివృద్ధిచెందే అవకాశం ఉంది. వలసదేశాల నుంచి ఇంగ్లాండ్‌కు వచ్చిన టీచర్లు నాకు చెప్పిందేమంటే– దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాలోని స్కూళ్లను ఇంగ్లాండ్ స్కూళ్లతో పోల్చినపుడు ఇంగ్లాండ్ స్కూళ్ళు జైళ్ల మాదిరిగా ఉన్నాయని వారు తెలిపారు. ఇంగ్లాండ్ స్కూళ్ల నుంచి తాము కొత్తగా నేర్చుకున్నదేమీ లేదని వారు చెప్పారు.

కొద్ది రోజులపాటు స్కూళ్ల చుట్టూ తిరిగినందువల్ల ప్రయోజనమేమీ ఉండదని నేను స్పష్టం చేస్తున్నాను. సమ్మర్‌హిల్ వంటిస్కూళ్లను ఒక్కరోజు సందర్శించినంత మాత్రాన ఏమీ తెలియదు. ఇటువంటి స్కూళ్ల గురించి వివరాలు తెలియాలంటే నెల రోజులు లేదా రెండు నెలలపాటు స్కూల్లో నివసించినపుడు మాత్రమే సాధ్యపడుతుంది. "నేను స్వయంగా స్కూలు ఏర్పాటు చేయదలచుకున్నాను. కొత్త ఆలోచనల కోసం నేను ప్రగతికాముక స్కూళ్లలో పర్యటిస్తున్నాను" అని కొంతమంది టీచర్లు చెబుతుంటారు. "ఇది పొరపాటు. స్కూలు ఎలా నడపాలనే విషయంలో సొంత ఆలోచనలు లేకుండా కొత్తగా స్కూలు ప్రారంబించడమెందుకు? మీరు రెండు సంవత్సరాల పాటు స్కూలు నడపండి. నువ్వు కోరుకున్న విధంగా విజయం సాధించడం లేదనుకుంటే, అప్పుడు ఇతర స్కూళ్లు సందర్శించండి" అని జవాబిస్తుంటాను.

నా టీచర్ ట్రెయినింగ్ కాలేజీలో రాజకీయాలు ప్రధానమైన సబ్జెక్ట్‌గా ఉంటుంది. పార్టీ రాజకీయాలు కాదు. పౌరసత్వం అంటే బాగుంటుంది. ఈ కాలేజీలో టీచర్లు పక్షపాత ధోరణితో ఉంటారు. ఇరు పక్షాలను తాను చూడగలనని చెప్పే టీచర్ నుంచి నేర్చుకునేదేమీ ఉండదు. నాకాలేజీలో పాత విధానాలను సమర్థించే లెక్చరర్ ఒకవైపు, కారల్ మార్క్స్‌ను సమర్థించే లెక్చరర్ మరోవైపు ఉంటారు. విద్యార్థులు తమకు ఇష్టమైన దానిని ఎంచుకోడానికి అవకాశం ఉంటుంది. పాత విధానాలు సమర్థించే లెక్చరర్ సాధారణ చరిత్ర పుస్తకాన్ని ఉపయోగిస్తాడు. ఎ.ఎల్.మోర్టన్ రాసిన 'పీపుల్స్ హిస్టరీ ఆఫ్ ఇంగ్లాండ్' పుస్తకాన్ని ఉపయోగిస్తాడు. ఇరు వర్గాలు ఉండే ట్రెయినింగ్ కాలేజ్ సజీవంగా ఉంటుంది.

పాత విధానాలను వ్యతిరేకించే లెక్చరర్ స్కూళ్ళు, టెక్స్ట్ పుస్తకాలను మించి ప్రపంచం ఏ విధంగా ఉందనేది విద్యార్థులకు తెలియజెప్పవలసి ఉంటుంది. అతను సమాజాన్ని విశ్లేషించి, విద్యావిధానంలో సంస్కరణలు సామాజిక మార్పుకు అనుగుణంగా ఎలా ఉండాలనేది ప్రస్తావించాలి. నేను ఈ టీచర్‌ను మార్క్స్‌ను సమర్థించే వాడని అన్నాను. కానీ దీనికి పరిమితులున్నాయి. మౌలికంగా మార్క్స్ ఆకలి ప్రవృత్తిని విశ్లేషించాడు అర్థశాస్త్రమంతటికీ ఆకలి ప్రవృత్తి ప్రధానమైనది. సెక్స్ ప్రవృత్తి గురించి మార్క్సిజం పట్టించుకోలేదు. విప్లవాత్మకమైన మన టీచర్ మనస్తత్వశాస్త్రం, మానవశాస్త్రం (Anthropology) దృక్పథం నుంచి సమాజాన్ని విశ్లేషించాలి. ఫ్రాయిడ్, యూంగ్, రైక్, మాలినోవ్‌స్కీ, హావ్‌లాక్ ఎల్లిస్, రివర్స్, ఎల్లియట్‌స్మిత్ తదితరుల రచనలను ఆయన అధ్యయనం చేయాలి. రాజకీయార్థిక శాస్త్రం, సెక్స్ ఆర్థికశాస్త్రం (Political and Sexual Economy) రెండూ కలిసి ముందుకు సాగాలి.



నేను ఊహిస్తున్న ఈ టీచర్ ట్రెయినింగ్ కాలేజీలో సైన్స్ ఎలా ఉండాలన్నది ఖచ్చితంగా చెప్పలేను. ప్రామాణిక గ్రంథాలు (classics) మాదిరిగానే సైన్స్ విషయంలో ఇబ్బంది ఎదురవుతుంది. లాటిన్, గ్రీకు భాషలు అధ్యయనం చేసే విద్యార్థి శ్రమతో కూడుకున్న గ్రామర్ అధ్యయనంతో సరిపెట్టుకుంటాడు. విర్జిల్ లేదా హోమర్ రచనల్లోని అందాన్ని ఆస్వాదించలేడు. అదేవిధంగా సైన్స్‌లో కూడా చాలా గ్రౌండ్ వర్క్ చేయాల్సి ఉంటుంది. బహు కొద్దిమంది మాత్రమే సైన్స్‌లో సృజనాత్మకతను అందుకోగలుగుతారు. ప్రతి ఒక్కరికీ జీవశాస్త్రంతో పరిచయం ఉండాలని నేనుకుంటున్నాను. అయితే ట్రెయినింగ్ కాలేజీలో ఇది ఎంత వరకు సాధ్యమవుతుందనేది సందేహాస్పదం. సైన్స్ పరిజ్ఞానం మంచిదే. కాని చరిత్ర, మనస్తత్వశాస్త్రం, మానవశాస్త్రం, ఆర్థిక శాస్త్రాల మాదిరిగా తప్పనిసరి అంశంకాదు. సృజనాత్మక కళలు బోధించే టీచర్‌కు సైన్స్ పరిజ్ఞానం అంత ముఖ్యం కాదు. నాకు సైంటిస్ట్‌గా ఎటువంటి శిక్షణలేదు. అందువల్ల నా అభిప్రాయం సమగ్రమైనది కాకపోవచ్చు. అందువల్ల నా టీచర్ ట్రెయినింగ్ కాలేజీలో సైన్స్ అనుబంధ అంశంగా ఉంటుంది.

సిలబస్‌లో ఆటలకు ప్రముఖమైన స్థానం ఉంటుంది. ఆర్గనైజ్‌డ్ గేమ్స్‌కు కూడా స్థానం ఉన్నప్పటికీ ఆటలంటే ఆర్గనైజ్‌డ్ గేమ్స్ కాదు. ఆటలంటే పిల్లలు కోరుకునే ఆటలు. భ్రమ (Phantasy) లతో కూడిన ఆటలు. బాల్యం అంటే ఆటలాడుకోవడమేనని (Childhood is Playhood) నేను ఇంతకు ముందే చెప్పాను. పిల్లల తెలివి తేటల గురించి తెలుసుకోవడం కన్నా వారి ఆటల గురించిన పరిజ్ఞానానికి ఎక్కువ ప్రాముఖ్యం ఉంటుంది. కొద్ది సంవత్సరాల క్రితం క్లాడ్‌వెల్‌కుక్ 'దిప్లేవే' అనే పుస్తకం రాశాడు. ఇంగ్లీషు బోధనకు ఆటలను ఉపయోగించుకోడాన్ని ఇందులో వివరించారు. దురదృష్టవశాత్తు ఈ అంశంపై తరువాత పరిశోధనలు జరగలేదు.

పిల్లల ఆటలను అర్థం చేసుకోలేని టీచర్, టీచరేకాదు. టీచర్ ఎల్లప్పుడూ పిల్లల ఆటలలో పాలుపంచుకోవలసిన అవసరం లేదు. పిల్లలపట్ల ఆటలతో కూడిన ధోరణితో వ్యవహరించడం ముఖ్యం. ఇందులో హాస్యంపాలు కూడా ఉండాలి. అయితే హాస్యం బోధించే అంశంకాదు. హాస్యం తెలియని వ్యక్తి కోపం తెచ్చుకుంటుంటాడు. అతని స్నేహితులకు హాస్యధోరణి ఉండదు. దురదృష్టవశాత్తు అతనే టీచర్.

ఎన్ని ట్రెయినింగ్ కాలేజీలు ఆటలకు అవసరమైన స్థానం కల్పిస్తున్నాయో నాకు తెలియదు. అయితే ఈ విషయంలో ఉపన్యాసాలు ఏ విధంగానూ ఉపయోగపడవు. ప్లేగ్రౌండ్‌లో ఇది ఆచరణ రూపంలో ఉండాలి. ఇటువంటి ఆటలతో చికిత్స ప్రయత్నాలు చేయడం సరైందికాదు. ఆరోగ్యవంతులై, స్వేచ్ఛ గలిగిన పిల్లలకు చికిత్స అవసరం

రాదు. వారు తమ ఊహలతో ఆడుకునే అవకాశం ఉంటే చాలు. ఈ సందర్భంలో అనేకమంది పెద్దలకు ప్రాణాంతకమైన కోరిక ఒకటి పుట్టుకువస్తుంది. ఈ ఆటలలో నీతిని చూపి, కార్యాచరణను బోధించాలనేదే (Pedagogic) ఈ కోరిక. పిల్లలు ఆడుకునే ముతాల ఆటల ఆధారంగా చికాగోలో ఎగుమతి, దిగుమతుల గురించి బోధించడానికి టీచర్ ట్రెయినింగ్ విద్యార్థి ఎవరైనా ప్రయత్నం చేయవచ్చు. బోధన అనేమాట ఉచ్చరిస్తేనే విద్యార్థిని నా కాలేజి నుంచి బహిష్కరిస్తాను. బోధన అనేది విద్యకు శాపం వంటిది.

నా స్నేహితుడు, కీర్తిశేషుడు నార్మన్ మక్‌మున్ 'ది పాత్ టు ఫ్రీడం ఇన్ ది స్కూల్' అనే పుస్తకం రాసాడు. ఆయన చాలా మంచివాడు. అతనంటే నా కెంతో ఇష్టం. కాని బోధనాశాస్త్రం పట్ల ఆయనకున్న అభిప్రాయాలను నేను ఆమోదించలేకపోయాను. చరిత్ర లేదా లెక్కలు బోధించడానికి ఆయన ఎల్లప్పుడూ కొత్త పరికరాలు తయారు చేసేవాడు. నేను మాంటిస్సోరి పరికరాలను ద్వేషించునట్టుగానే ఆయన తయారుచేసిన పరికరాలను కూడా ద్వేషించేవాడిని. స్కూల్‌లో పరికరాలు, పదార్థాలు, టూల్స్ మాత్రమే ఉండాలి. బొమ్మలకు సుదీర్ఘ లక్ష్యాలేవీ ఉండకూడదు. ఒకవేళ ఉన్నప్పటికీ బోధనాంశాలను పిల్లలు వెంటనే పసిగడతారు. అదే విధంగా ఏదైనా నీతి కథ చెబితే పిల్లలు వెంటనే గ్రహించగలరు.

పిల్లలు నేర్చుకోడానికి విముఖత చూపుతారని నేను చెప్పడం లేదు. సమ్మర్‌హిల్‌లో పిల్లలు అన్ని రకాలైన సమాచారం తెలుసుకోడానికి ఎంతో ఉత్సాహం చూపేవారు. కాని వారు కోరినపుడు మాత్రమే సమాచారం అందజేస్తాం. పిల్లలకు, మీకు, నాకు కూడా ఇష్టంలేనిదేమంటే మోసపూరితంగా సమాచారాన్ని నెత్తిన రుద్దడం. పరికరాలతో పక్కదారిన పిల్లలకు నేర్పే ప్రయత్నం చేస్తే వారు గర్హిస్తారు. కాని వారు నేర్చుకోవాలని కోరుకుంటునపుడు ఎంత క్లిష్టమైనదైనా తేలికగా నేర్చుకుంటారు.

ఆటే నిజమైనది. ఆస్కార్ వైల్డ్ చెప్పిన కళ వంటి ఆటలకు ఎటువంటి ప్రయోజనం ఉండదు. విద్యార్థులకు ఇవి బోధిస్తున్నప్పటికీ విద్యాపరంగా వీటి విలువచాలా స్వల్పం. మనం స్కూల్లో నేర్చుకొని ఆ తరువాత వెంటనే మరచిపోయే విషయాలను నేను తీవ్రంగా వ్యతిరేకిస్తాను. భాగహారాలు, చరిత్ర వంటి అంశాలను మన ఆలోచనల నుంచి వెంటనే తొలగిపోతాయి. ఇవి కూడా ప్రయోజనం కలిగిన అంశాలుగా భావిస్తారు. కాని వీటివల్ల ప్రయోజనమేమీ ఉండదు. అందువల్ల నేను వీటిని వ్యతిరేకిస్తాను. పిల్లలు వీటిని ద్వేషిస్తారు. అందువల్ల నేను కూడా వీటిని ద్వేషిస్తాను. ఆటలకు విలువ లేదని అంటున్నామంటే పెద్దలు పరిగణించే విలువలని అర్థం. కాని పిల్లవాడి ఆటల్లో ప్రపంచంలోని ప్రయోజనమంతా ఉండితీరుతుంది.



సగటు పెద్ద మనుషులు ఆటలవల్ల ప్రయోజనం ఉండదని భావిస్తారు. ఆటలను వృధా అని పరిగణిస్తూ రోజుకు ఆరుగంటలపాటు పిల్లలను ఆటలకు దూరంగా ఉంచుతున్నాం. నా ట్రెయినింగ్ కాలేజ్‌లో దీనికి భిన్నమైన అభిప్రాయం అమలులో ఉంటుంది. ప్రతి టర్మ్ ప్రారంభంలో ప్రిన్సిపాల్ ఒక ఉపన్యాసం ఇస్తాడు.

"విద్యలో ఆట ప్రధానమైన అంశం. స్కూలు బయట లోపల కూడా ఆట మైదానం మాదిరిగా ఉండాలి. పిల్లలను ఆటలాడకుండా కట్టడిచేస్తే ఆ సమయం వృధా అయినట్టే. పిల్లలు కోరుకున్న విధంగా ఆటలాడుకోడానికి అవకాశం కల్పించడమే జీవితంలో మీ పరమావధి. స్కూల్ సబ్జెక్టులు ఆటలకు అంతరాయం కల్పిస్తే, స్కూల్ సబ్జెక్టులు రద్దు చేయండి. ఈ విధంగా రద్దు చేస్తే పిల్లలు ఎంతగానో సంతోషిస్తారు."

కాని అప్పుడు నా ట్రెయినింగ్ కాలేజీకి బోర్డ్ ఆఫ్ ఎద్యుకేషన్ నుంచి ఎటువంటి గ్రాంటు లభించదు.

ఇటువంటి బీద ట్రెయినింగ్ కాలేజీలో విద్యాపరమైన చెత్త (Educational Bunk) అనే పేరుతో కొత్త సబ్జెక్ట్ ప్రవేశపెట్టవలసి ఉంటుంది. ఇందులో స్కూలు జీవితానికి సంబంధించి అనేక అంశాలుంటాయి. స్కూలు గణాంకాలకు సంబంధించి అంటే రిజిష్టర్లు, దరఖాస్తులు నింపడం తదితర అంశాలుంటాయి. నిర్బంధ విద్యా విధానంలో పిల్లవాడు స్కూలుకు వచ్చేనాటికి నేర్చుకునే విధానం తెలిసి ఉండాలి. ఇది సాధ్యమే కానీ తప్పనిసరిగా స్కూలుకు హాజరు కావాలన్న నిబంధనకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం కీడు చేస్తుంది. నేను ఒకప్పుడు పని చేసిన స్కూల్‌లో మిగిలినవాటికన్నా అటెండెన్స్‌కు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చేవారు. ఒక బాలిక పది సంవత్సరాల పాటు ఒకరోజు కూడా మానివేయకుండా స్కూలుకు హాజరైంది. ఆమెకు బహుమతి ఇచ్చారు. ఆమె హీరోయిన్ అయిపోయింది. ఆమె స్కూల్ నుంచి వెళ్ళి ఇళ్లలో పనిమనిషిగా కుదిరింది. అటెండెన్స్ పిచ్చి టీచర్‌కు తప్పుడు విలువలు అంటగడుతుంది. పిల్లలు ఎవరైనా క్లాసు మానేస్తే అతని కెరియర్ ప్రమాదంలో పడుతుందని టీచర్ అభిప్రాయపడతాడు. స్కూలు బోధనలో గొప్ప విలువలు ఉన్నాయని పిల్లలకు పొరపాటు అభిప్రాయం అంటగట్టడమవుతుంది. నా తండ్రి బోధించిన గ్రామీణ పాఠశాలలో కొంతమంది పిల్లలు క్రమం తప్పకుండా క్లాసులకు హాజరయ్యేవారు. కానీ కొంతమంది పనుల కారణంగా ఇంటివద్ద ఉండిపోయేవారు. నాకు గుర్తున్నంత వరకు హాజరయ్యే విద్యార్థుల మాదిరిగానే పనులు చేసేవారు కూడా జీవితంలో పైకి వచ్చారు. నా తండ్రి కూడా క్లాసులకు సరిగా హాజరయ్యే వారు కాదు. వృద్ధాప్యంలో ఆయన నాకీ విషయం చెప్పారు. స్కూలు రిజిష్టర్‌ను విద్యాపరమైన బైబిల్‌గా చిత్రించకుండా విద్యార్థులపై భారం పడకుండా మార్గం రూపొందించుకోవడం కష్టమేమీ కాదు.

విద్యాపరమైన చెత్తలో స్కూల్ అలవాట్లకు కూడా స్థానం ఉంటుంది. స్కూల్ రూమ్ వంటి కృత్రిమ ప్రదేశంలో అవాట్లు ప్రత్యేకంగా ఉండవు. అలవాట్లు అంతశ్చేతనమైనవి. వాటిని బోధించడం సాధ్యంకాదు. కొన్ని అలవాట్లు... బాహ్యాపరమైనవి చిలక మాదిరి శిక్షణ ఇస్తే అబ్బుతాయి. టీచర్ ట్రెయినింగ్ విద్యార్థికి ఈ అలవాట్లను క్లాస్ రూమ్ నుంచి తొలిగించవలసిందిగా సలహా ఇస్తాం. టీచర్లను 'సర్' అని 'మిస్' అని సంబోధించడం, లేచి నిలబడి మర్యాద ఇవ్వడం, 'ప్లీజ్' అనే మాటను నిజాయితీ లేకుండా ఉపయోగించడాన్ని వీటన్నిటినీ తొలగించవలసిందిగా సూచిస్తాం. 'ప్లీజ్ సర్', 'నోసర్' అంటూ ప్రశ్నలకు బదులిచ్చే కొంతమంది విద్యార్థులు మా స్కూల్లో ఉండేవారు. పిల్లలను పెద్దలతో సమానంగా చూడాలని టీచర్ ట్రెయినింగ్ విద్యార్థులకు చెబుతాం. పిల్లలు నీళ్లు తాగడానికి వెళ్లినపుడల్లా 'ప్లీజ్‌సర్' అని అడగవలసిన పనిలేదు. పిల్లలు ఇష్టమైతే క్లాసునుంచి వెళ్లిపోడానికి, వారు కోరుకుంటే వారాల తరబడి క్లాసుకు హాజరు కాకుండా ఉండడానికి స్కూల్‌రూమ్ అనుకూలంగా ఉండాలన్నది నా ఆదర్శం. అపుడు నా ట్రెయినింగ్ కాలేజ్‌కి ప్రభుత్వం గ్రాంట్‌లు నిలిపివేస్తుంది.

ఈ చాప్టర్‌లో నేను చెప్పదలచుకున్నదేమంటే టీచర్లకు మనుషులుగా అభివృద్ధి చెందడానికి అవసరమైన శిక్షణ ఇవ్వాలి.



# 11. టీచర్-పరీక్షలు

విద్యాపరమైన సభలలో తరచుగా పరీక్షల విషయం ప్రస్తావనకు వస్తుంటుంది. ఆ తరువాత జరిగే చర్చలలో కొంత అవగాహన చోటుచేసుకున్నప్పటికీ, ఎక్కువ భాగం అసంబద్ధంగా ఉంటుంది. ఈ సమస్యలో దాగిన అంశాలపై మాట్లాడటానికి ఆటంకాలున్నందువల్ల దీనిపై చర్చిండం క్లిష్టంగా ఉంటుంది. పరీక్షలను విజ్ఞానానికి పరీక్షగా పరిగణిస్తారు. కాని స్కూలు విద్యలో విజ్ఞానమొక్కటే ప్రధానమైన గీటురాయి కాదని ఎవరైనా భావిస్తే పరీక్షలపై చర్చించడానికి అవరోధం ఏర్పడుతుంది. మానసిక రుగ్మతలున్న టీచర్లు పరీక్షలను భూతద్దంలో చూస్తారు. పరీక్ష హాల్‌లో విజయం సాధించామని చెప్పుకునే టీచర్లు అధమస్థాయికి చెందినవారు.

పరీక్షల ద్వారా యువతపై వృద్ధాప్యం నియంత్రణ సాగిస్తుంది. మెట్రిక్ పరీక్షలు రాసేవారంతా పాత చట్టాలను ఆమోదిస్తున్నట్టే లెక్క. పాత చట్టాలను ఆమోదించకపోతే వారి కెరియర్‌కు ఏమాత్రం అవకాశంఉండదు. ఈ పరీక్ష, విద్యకు పట్టిన భూతం వంటిదిగా మనం పరిగణించాలి. అభ్యర్థులు ఐదు సబ్జెక్టలలో పాస్‌కావాలి. అవన్నీ ఒక్కసారే పాస్‌కావాలి. ఇది క్రూరమైన, అమానుషమైన నిబంధన. గణితంలో ఫెయిలైన విద్యార్థి కొద్ది నెలల తరువాత పరీక్ష రాస్తున్నపుడు మిగిలిన నాలుగు సబ్జెక్టలలో కూడా మళ్లీ పరీక్ష రాయాలనడంలో అర్థం లేదు. కొన్ని పరిమితులకు లోబడి సబ్జెక్టలు ఎంపిక చేసుకోడానికి అభ్యర్థికి అవకాశం ఉంటుంది. కొని సబ్జెక్టలలో తప్పని సరిగా పరీక్షలు రాయాలి. వీటిలో ఇంగ్లీషు కూడా ఒకటి. గణితంలో ప్రతిభ ఉండి, విద్యుచ్ఛక్తిపై విశేషమైన ఆసక్తి ఉన్న యువకుడు తప్పనిసరిగా షేక్షిఫియర్ నాటకాలు తదితర అంశాలు చదువుకోవాలి. లేనిపక్షంలో జీవితమనే సబ్జెక్ట్ చదువుకోడానికి అతనికి అవకాశమే ఉండదు. సమ్మర్‌హిల్‌లో చదువుకున్న ఒక విద్యార్థికి సబ్జెక్టల పట్ల ఆసక్తి ఉండేదికాదు. అతను ప్రతి సబ్జెక్టలో ఫెయిలయ్యేవాడు. కాని అతను ఈ రోజున రాయల్ ఎయిర్‌ఫోర్స్‌లో నిపుణుడైన ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. ఇక్కడ మాత్రం సైన్యం ధోరణిని ప్రశంసించవలసి వస్తున్నది. నైపుణ్యానికి సంబంధంలేని షేక్షిఫియర్ నాటకాలకు లేదా వరడ్స్‌వర్త్ పద్యాలకు సైన్యంలో ఏమాత్రం విలువలేదు.

అంతుబట్టని కొన్ని గీటురాళ్లతో సాధారణ ప్రజానీకం మెట్రిక్‌కు పట్టం కడుతున్నారు. అందువల్ల తమ ఆఫీస్‌లోను, కౌంటర్ల వద్ద పనిచేసేవారు తప్పనిసరిగా మెట్రిక్ పాసై ఉండాలని వ్యాపారస్తులు పట్టుపడుతున్నారు. లండన్‌లో పెద్ద స్టోర్ యజమాని తమ షాపులో పనిచేయడానికి మెట్రిక్ పాసైన వారు కావాలని పేపర్‌లో

ప్రకటన ఇచ్చాడు. ఒక అభ్యర్థిని ఆయన ఇంటర్వ్యూ చేశాడు.

"నువ్వు మెట్రిక్ పాసయ్యావా?" అని ఆయన అడిగాడు.

"నేను కేంబ్రిడ్జ్ బి.ఎ. పాసయ్యానని" ఆ అభ్యర్థి జవాబిచ్చాడు.

"నువ్వేమి పాసయితే నాకెందుకు, నువ్వు మెట్రిక్ పాసయ్యావా? లేదా?" అని ఆయన రెట్టించాడు. ఇటువంటి ధోరణి అర్థం లేనిది. కార్లు అమ్మడానికి లేదా లెటర్ టైప్ చెయ్యడానికి నేను మెట్రిక్ పాసయ్యానన్నది గీటురాయి కాదు. మెట్రిక్ పాసైనవారు కొంతకాలం అధ్యయనం చేశారన్నది మినహా ఆ పరీక్ష మరేమీ రుజువు చేయదు. ఇది మౌలికశక్తికి ఎన్నటికీ పరీక్ష కాలేదు. అంటే మౌలిక శక్తి దీనితోరాదు. మౌలికశక్తిని కోరేవారు లేరు. ఆశించేవారు లేరు. నా విద్యార్థులకు 'సెలవలు ఏ విధంగా గడిపింది' లేదా 'సైకిల్ తొక్కితే వచ్చే ప్రయోజనాల'పై వ్యాసం రాయ వలసిందిగా సూచిస్తుంటాను. వివాదాస్పదమైన సబ్జెక్ట్‌పై వ్యాసం రాయమంటే పరీక్షించేవారు ఆధునికంగా, తెలివిగా వ్యవహరిస్తున్నట్టు–వారు గ్రహిస్తారని భయం. వారు వ్యాసంలో హాస్యం లేకుండా రాయాలని కూడా వారికి తెలియచెబుతాను.

అయితే మెట్రిక్ లేదా హైస్కూల్ పరీక్షలు రద్దుచేస్తే పై చదువులకు లేదా యూనివర్సిటీలకు విద్యార్థులను ఎలా ఎంపిక చేస్తామనే ప్రశ్న ఎదురవుతుంది. ఈ పరీక్షలు రద్దు చేస్తే డాక్టర్ కావాలనుకునే విద్యార్థి పరిస్థితి ఏమిటి? శక్తి సామర్థ్యాన్ని, విజ్ఞానాన్ని పరీక్షించకుండా అతన్ని సమాజంలోకి వదిలిపెట్టడమేనా?ఇది చాలా ఇబ్బందికరమైన ప్రశ్న.

వైద్య విద్యను మనం పరిశీలిద్దాం. ఈ విద్యలో విద్యార్థి కెరియర్ అంతా, కష్టమైన పరీక్షలతో కూడుకొని ఉంటుంది. నేను చదువుకునే రోజుల్లో ఎడింబర్గ్ విశ్వవిద్యాలయంలో మెడికల్ స్టూడెంట్స్ మొదటి సంవత్సరంలో రసాయనశాస్త్రం, భౌతికశాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం అధ్యయనం ప్రారంభించేవారు. రెండో సంవత్సరంలో శరీరధర్మ శాస్త్రం, శరీర నిర్మాణశాస్త్రం అధ్యయనం చేస్తారు. వైద్యం, సర్జరీ నేర్చుకునే నాటికి ఈ సబ్జెక్టలన్నీ మరచిపోతామని ప్రతి డాక్టర్ అంగీకరిస్తాడు. ఈ పరీక్షలన్నీ కేవలం జ్ఞాపకశక్తికి పరీక్షలే! జ్ఞాపకశక్తి పెంచుకోవడం కోసం ప్రచురించిన చిన్న పుస్తకాలు పెద్ద ఎత్తున అమ్ముడు పోతాయి. వైద్యం చేయడంలో డాక్టర్లు నేర్చుకునే కొద్దిపాటి వృక్షశాస్త్రం, జంతుశాస్త్రంతో వారికి ఎటువంటి ఉపయోగం ఉండదు. పరీక్షల కోసం జ్ఞాపకం పెట్టుకొని ఆ తరువాత మరచిపోయిన అనేక విషయాలతో డాక్టర్లకు అవసరమే రాదు. ఒక వైద్య విద్యార్థి వృక్షశాస్త్రంలోను, శరీర నిర్మాణ శాస్త్రంలోను అత్యంత ప్రతిభ కనబరచినప్పటికీఅతను మంచి డాక్టరవుతాడన్న గ్యారంటీ ఏమీలేదు.



పరీక్షలు పదే పదే తప్పిన వారు ఆ తరువాత మంచి డాక్టర్లయ్యారని ఎడింబర్గ్‌లో ప్రతిభావంతుడైన ప్రొఫెసర్ ఒకసారి చెప్పారు. ఈ పరీక్షలు తప్పేవారు బిలియర్డ్స్ రూమ్‌లో మానవత్వాన్ని అధ్యయనం చేయడమే దీనికి కారణమని ఆయన అన్నారు. వైద్య విద్యార్థి తన కెరియర్‌లో రాసే చాలా పరీక్షలు ఉపయోగపడేవి కాదని సూచించడానికి నేను ప్రయత్నం చేస్తున్నాను. అయితే మనం ముఖ్యమైన పరీక్షలను ఏ విధంగా పరిగణిస్తాం? అనే ప్రశ్న తలెత్తుతుంది. మంత్రసాని పరీక్షలు పాస్ కాని డాక్టర్ సక్రమంగా ప్రసవించడానికి సహకరించగలడని మనం నమ్మగలమా? సర్జరీ పాస్ కాని వైద్యుడు ఏదైనా శస్త్ర చికిత్స చేయగలడని మనం నమ్మగలమా?

విద్యార్థులను పెద్ద ఎత్తున ఒకే క్లాసులో జమచేసే విద్యావ్యవస్థలో పరీక్షా విధానం మాత్రమే ఆచరణ యోగ్యమైనది. కాని విద్యార్థులు చిన్న చిన్న బృందాలుగా ప్రొఫెసర్‌తో కలిసి పనిచేస్తే పరీక్షల స్థానంలో ప్రొఫెసర్ అంచనాకు స్థానం కల్పించవచ్చు. అది పరీక్షకు సమానమవుతుంది. వ్యాపారంలో మనం పరీక్షలు నిర్వహించం. ఒక వ్యక్తికి సబ్జెక్ట్ తెలుసు అనుకున్నప్పుడు అతనికి ప్రమోషన్ ఇస్తారు. అదేవిధంగా లేత్ మిషన్ ఆపరేటర్‌ను డిజైన్‌రూమ్‌కు ప్రమోట్ చేసినపుడు అతనికి పరీక్ష పెట్టరు. అయితే ప్రొఫెసర్ వ్యక్తిగత విషయాలకు ప్రాముఖ్యం ఇచ్చి తనకు ఇష్టంలేని తనకు ఇష్టంలేని విద్యార్థికి అన్యాయం చేసే అవకాశం ఉందని ఈ పద్ధతికి అభ్యంతరం వ్యక్తమవుతున్నది. ఒక టీచర్ నుంచి మరో టీచర్‌కు మారడానికి స్వేచ్ఛ కల్పిస్తే ఈ ఇబ్బందిని అధిగమించవచ్చు.

పూర్తిగా కాకపోయినప్పటికీ కొంత మేరకైనా ఈ పద్ధతి స్కూళ్లలో అమలులో ఉంది. స్కూల్ ఫైనల్‌లో విద్యార్థికి సంబంధించి టీచర్ అంచనాను పరిగణలోకి తీసుకుంటున్నారు. ఇదొక ముందడుగు. ఇక్కడ సామర్థ్యం అనేది పరిమితులకు లోబడి ఉంటుందనేది గుర్తుంచుకోవాలి.

కాని మెట్రిక్ మాటేమిటి? నేను దాన్ని పూర్తిగా రద్దు చేస్తాను. రద్దు చేయడానికి వీలుగాని పక్షంలో ఎగ్జామినర్‌కు విద్యార్థికి మధ్య సంభాషణగా దాన్ని మార్పు చేస్తాను. ఒక విద్యార్థితో పది నిముషాలు మాట్లాడిన తరువాత అతను యూనివర్సిటీ పరీక్షలకు పనికివస్తాడో లేదో నేను ఖచ్చితంగా చెప్పగలను. ప్రస్తుతం అమలులో ఉన్నదానికన్నా ఇది దయతో కూడుకున్న విధానం. ఈ విధానంలో సమర్థత లేనివారిని వృత్తులలో చేరకుండా నిరోధించవచ్చు. ఈ విధానంలో డాక్టర్లు, టీచర్లకు ఎంతో ప్రయోజనం ఉంటుంది. అదే విధంగా సమర్థత లేనివారికి వేరే వృత్తిలో చేరవలసిందిగా సలహాలు లభించే అవకాశం కూడా ఉంది.

ఇండస్ట్రియల్ బోర్డ్ ఆఫ్ సైకాలజీ మాదిరిగా బోర్డ్ ఆఫ్ ఇన్వెస్టిగేటర్స్‌ను ఏర్పాటుచేసి పరీక్ష స్థానంలో దీన్ని ఉపయోగించుకోవడం అవసరం అనిపిస్తుంది. పరిమితమైన పద్ధతిలో ఈ బోర్డును ఉపయోగిస్తే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది. అలా కాకుండా భావావేశపరమైన, మేధాపరమైన, యాంత్రికపరమైన లక్షణాలన్నిటినీ ఈ బోర్డు అంచనా వేయగలగాలి. అయితే చార్లీ చాప్లిన్, ఎప్‌స్టీన్; బెర్నార్డ్‌షాలకు జీవితంలో తాము చేపట్టిన లక్ష్యాలు స్వీకరించడానికి బహుశా ఏ బోర్డు సలహా ఇచ్చి ఉండదు.

టీచర్ పరిధిని అతిక్రమించి ఈ చర్చ సాగుతున్నది. టీచర్‌కు స్కూలు పరీక్షలో ఆసక్తి ఉంటుంది. అయితే పరీక్షలను బేషరతుగా తొలగించాలని నేను కోరుతున్నాను. పిల్లలు కావాలని కోరుకుంటే పరీక్ష పెట్టవచ్చు. తమని తాము అంచనా వేసుకోడానికి వీలుగా పరీక్షలు నిర్వహించాలని చాలామంది విద్యార్థులు కోరుకుంటారు. పిల్లలు కోరుకున్నప్పుడు మాత్రమే పరీక్షలు నిర్వహించాలి. లేనిపక్షంలో అవి చేటు చేస్తాయి. నిజమైన ప్రయోజనాలను పక్కదారి పట్టిస్తాయి. పిల్లలు సాధించే అభివృద్ధితో టీచర్‌ను లేదా తల్లిదండ్రులను సంతృప్తిపరచాలనే వాతావరణం సరైందికాదు. నిష్ప్రయోజనమైనది. టీచర్‌గాని తల్లిదండ్రులుగాని పిల్లవాడి ప్రగతిని అంచనా వేయలేరు. బహుశా అర్థమెటిక్స్‌లో ప్రగతిని వారు అంచనా వేయగలరేమోకాని అది ప్రాముఖ్యం లేనిది.

పిల్లలపై పరీక్షలు సాధారణంగా చెడు ప్రభావమే చూపుతాయి. వీటివల్ల వెనుకబడిన పిల్లవాడిలో ఆత్మన్యూనతా భావం చోటు చేసుకుంటుంది. అతను జీవితంలో దాన్ని వదిలించుకోలేడు. తెలివైనవాడిగా గుర్తింపు పొందే పిల్లవాడిలో గర్వం చోటుచేసుకునే అవకాశం ఉంది. స్కూలు వెలుపల విశాలమైన ప్రపంచంలో మార్కులను బట్టి మనుష్యుల్ని అంచనా వెయ్యరు. పెద్దలకు పరీక్ష పెట్టాలనే ఆలోచన నాకు అప్పుడప్పుడు వస్తుంటుంది. తమ పిల్లలను సమ్మర్‌హిల్ చేర్చాలనుకుంటున్న తల్లిదండ్రులకు పరీక్ష పెట్టాలని కూడా నేను చాలాసార్లు ఆలోచించాను. మనం పెద్దలకు పరీక్ష పెడితే, చిన్న పిల్లలకు పరీక్షల బాధ తప్పించే అవకాశం ఉంది.

కొన్నిచోట్ల పరీక్షలు అవసరమవుతాయి. ఓపెన్ గోల్ఫ్ ఛాంపియన్‌షిప్‌ను మనం ఒక రకమైన పరీక్షగా పరిగణించవచ్చు. గోల్ఫ్‌కు విలువ ఉంటుంది. కాని గోల్ఫ్ ఛాంపియన్‌షిప్ కోసం పోటీపడేవారే స్వచ్ఛందంగా ఈ పరీక్షకు హాజరవుతారు. స్కూల్‌లో స్వచ్ఛందంగా పరీక్షలకు హాజరైతే నాకు అభ్యంతరం లేదు.కాని బలవంతంగా పరీక్షలు నిర్వహించడాన్ని నేను సహించలేను. స్కూల్ సబ్జెక్ట్‌లకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నదానికి అనుగుణంగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. కాని సబ్జెక్ట్‌లలో పరిజ్ఞానం ఆధారంగా మంచి టీచరెవరూ తన విద్యార్థుల ప్రతిభను నిర్ణయించరు. విద్యార్థుల వ్యక్తిత్వం, ప్రవర్తన



ఆధారంగా టీచర్ నిర్ణయం తీసుకుంటాడు. అయితే పరీక్షలతో ఈ లక్షణాలను నిర్ణయించడం సాధ్యంకాదు. పరీక్షలకు ఆదరణ ఎక్కువగా ఉండడానికి కారణమేమంటే అంతగా ప్రాముఖ్యంలేని విషయాలు కనుగొనడానికి ఇది తేలిక పద్ధతి. పరీక్షల ద్వారా పై తరగతి పంపడానికి అర్హతలున్న విద్యార్థులెవరో నిర్ణయిస్తాం. కాని ఎటువంటి పరీక్షలైనా సరే భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదిగే వారిని కనుగొనడానికి సహకరించలేవు. పరీక్షలలో ఉన్మాదానికి సివిల్ సర్వీస్ పరీక్షలొక ఉదాహరణ. ఇండియన్ పోలీస్ నియామకాల కోసం జరిగే పోటీ పరీక్షలో రాత ప్రతులను సరిగా చదవలేనివారిని పంజాబ్ పోలీస్‌స్టేషన్ నిర్వహణకు సమర్థులుగా నిర్ణయిస్తున్నారు. ఇంగ్లాండ్‌లో కార్యనిర్వహణాధికారుల పరిస్థితి మాత్రం మెరుగ్గానే ఉంటుంది. సివిల్ సర్వీసెస్‌లో పై తరగతి ఉద్యోగాలలో ఉదాహరణకు దౌత్య విభాగంలో నియామకాలు మాత్రం వ్యక్తిత్వం ఆధారంగా కొనసాగుతాయి. ఇక్కడ వ్యక్తిత్వం అంటే పాలకవర్గం పరిగణలోకి తీసుకునే వ్యక్తిత్వం అని గుర్తుంచుకోవాలి. అంటే పాత స్కూలు, టైలుకట్టుకునే రకమన్నమాట. ఉచ్చారణ తేడాలున్నప్పటికీ సివిల్ సర్వీస్‌లో పై ఉద్యోగాలు దక్కే అవకాశం లేదని జూనియర్ సివిల్ సర్వెంట్లు చాలామంది నాకు చెప్పారు.

చాలాకాలం వరకు పరీక్షలు రద్దయ్యే అవకాశం లేనందువల్ల, నేను ఆచరణాత్మకమైన ఒక ప్రతిపాదన చేస్తాను. అదేమంటే తన విద్యార్థులను మెట్రిక్ పరీక్షలకు పంపే టీచర్ కూడా ప్రతిసారీ పరీక్షలు రాయాలి. భయం గొలిపే ఈ పరీక్షల పట్ల టీచర్లు తాజా ధోరణి అలవరచుకోడానికి ఇది దోహదం చేస్తుంది. వ్యక్తిగతంగా నేను మెట్రిక్ పాస్ కాలేను. నేను ఇంగ్లీషు, గణితం, జర్మన్‌లో పాస్ కాగలుగుతాను. కాని మిగిలిన ఏ పరీక్షలోను పాస్‌కాలేను. గణితం టీచర్ మెట్రిక్ పరీక్షలలో గణితంతో సహా నాలుగు సబ్జెక్టలలో ఫెయిలైనట్టు తెలిస్తే విద్యార్థులపై ప్రభావం ఎలా ఉంటుంది? మనం కూడా మెట్రిక్ పరీక్షలకు హాజరు కావాలని సమ్మర్‌హిల్ టీచర్లకు నేను ప్రతిపాదించాను. వారిలో వ్యక్తమైన భయం చూసి నేను అంతగా ఆశ్చర్యపోలేదు.

యూనివర్సిటీలో శిక్షణ పొందిన టీచర్లు మిగిలిన వారికన్నా పరీక్షలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చే అవకాశం ఉంది. యూనివర్సిటీ కెరియర్‌లో ఎవరైనా సరే పరీక్షల మైలురాళ్లు దాటుతూ ప్రయాణం ప్రారంభిస్తారు. ప్రతి పరీక్షలో పాసైనపుడల్లా అభివృద్ధి సాధించినట్టు భావిస్తారు. యూనివర్శిటీలో చర్చలు, సంభాషణలు, తోటి విద్యార్థులతో వాద ప్రతివాదనలు ఇవన్నీ సామాజిక అంశాలుగా పరిగణలోకి వస్తాయి. ఇవి శాశ్వత విలువను కలిగి ఉంటాయి. కాని పరీక్షలు ఈ వాస్తవం గ్రహించే వీలు లేకుండా చేస్తాయి. కేవలం పరీక్ష పాస్ కావడమే ప్రధానమైనదిగా తయారవుతుంది.

జీవితంలో విజయం సాధించడానికి పరీక్షలు పాసు కావడానికి సంబంధం లేదనేది టీచర్లు గ్రహించాలి. యూనివర్సిటీ ప్రొఫెసర్లను మినహాయించి మిగిలిన వారెవరూ పరీక్షలు పాసైనందువల్ల ప్రతిభ సాధించామని చెప్పుకోరు. గొప్ప రచయితలు, కళాకారులు, మ్యూజిక్ కంపోజర్లు, దౌత్యవేత్తలు, నటీనటులు గొప్ప టీచర్లు సాధించిన ప్రతిభకు ఏ పరీక్షా ఉపయోగపడలేదనేది వాస్తవం. జీవితంలో ద్వితీయ స్థాయిలో ఉన్నవారిని ఎంపిక చేయడానికి పరీక్షలు ఉపయోగపడవచ్చు. కాని అవి అంతవరకే పరిమితం. జర్మనీలో అనేక పరీక్షలు పాసైన వారిని ఇంటి అలంకరణలు చేసే వ్యక్తి పాలించడం ఆధునిక నాగరికతలో విషాదభరితమైన సంఘటన. ఇంగ్లాండ్‌లో వేలాదిమంది యూనివర్సిటీ గ్రాడ్యుయేట్లకు మంచికి గాని చెడుకు గాని అధికారం ఏనాడూ లభించలేదు. పబ్లిక్ స్కూళ్లలో చదువుకున్న కులీన వర్గాలకు చెందిన అరడజను మంది ఇంగ్లాండ్‌లో పాలనా బాధ్యతలు నిర్వహిస్తుంటారు. పాలకవర్గ ప్రయోజనాలు కాపాడుతుంటారు.

పరీక్షల వెనుక లోతైన లక్ష్యం ఒకటుంది. ఆస్తులు లేని వర్గాలవారు జీవితంలో స్వల్ప విజయాలను, సాధించే ప్రయోజనాలను ఈ పరీక్షలు ఒక్కచోటుకు చేర్చుతాయి. ఈ పరీక్షలు బోధనా శాస్త్ర బాతులకు హంస ఈకలు తొడుగుతాయి. అవసరమైన విషయాల నుంచి ఇవి ప్రజల దృష్టిని మరల్చుతాయి. పాలితులకు రాచరికం ఔదార్యంతో ఇచ్చే గిల్ట్ మెడల్ వంటివి ఈ పరీక్షలు. ముత్యాలు, బంగారం కంటే పూసలనే అధికమైనవిగా భావించే ఆటవికులకు సామ్రాజ్యవాదులు అందించే ఆభరణాలు వంటివి ఈ పరీక్షలు. ప్రజలను అణిచిపెట్టడానికి పరీక్షలు తమపాత్ర తాము పోషిస్తాయి.

పరీక్షలకు మతపరమైన ప్రాముఖ్యం కూడా ఉంది. ఇది నైతిక విలువలకు సంబంధించినది. భగవంతుని సన్నిధానంలో చిట్టచివరి గొప్పదైన పరీక్ష జరుగుతుంది. ఈ పరీక్షలకు సంబంధించిన కల మృత్యువు, శిక్షలతో కూడుకొని ఉంటుంది. నైతిక విలువలున్న ఏ సమాజంలోనైనా సరే పరీక్షలు పాసు కావడమంటే అంతశ్చేతనంగా నైతికంగా ఉన్నత స్థాయికి ఎదగడమే. పాపాన్ని అధిగమించడమే. ఎవరైనా పరీక్షలో ఫెయిలైనపుడు అవమానంగా భావిస్తారు. కాని ఇది మేధోపరంగా ఫెయిలైనందుకు జనించే అవమానంకాదు. నైతిక పరీక్షలో ఫెయిలైనందువల్ల అది అవమానంగా భావిస్తారు. చిన్న చిన్న విద్యార్థులకు మానసిక విశ్లేషణ చేస్తున్నపుడు పరీక్షలలో పాసు కావడమనేది హస్తప్రయోగాన్ని అధిగమించడం కోసమేనని అనేకసార్లు రుజువైంది. ఇది ప్రమాదాన్ని సూచిస్తుంది. పరీక్షలు నిష్ప్రయోజనమే కాకుండా మనసును ధ్వంసం చేస్తూ నేరంచేస్తున్నామన్న భావనకు దోహదం చేస్తున్నాయని దీన్ని బట్టి స్పష్టమవుతుంది.

పరీక్షలు తెలివిగల వారిని ఎంపిక చేస్తాయనే వాదన వెనుక అంతశ్చేతనమైన



నైతిక విలువలు కూడా ఉన్నాయని నేను ఖచ్చితంగా చెప్పగలను. పిల్లలకు హేతుబద్ధతను తిరస్కరించి, నిర్హేతుక అంశాలను తెలుసుకోగల శక్తి ఉంటుంది. దేవుడంటే భయం చోటుచేసుకున్న పిల్లవాడిలో పరీక్షకు కూర్చునప్పుడు అంతశ్చేతనమైన భయాలు మేల్కొంటాయి. పరీక్షలలో ఫెయిలైన విద్యార్థి మానసిక మాంద్యానికి (depresion) లోనై ఆత్మహత్య చేసుకున్నట్టు మనం అప్పుడప్పుడు వార్తలు చదువుతుంటాం. ఇటువంటి కేసుల్లో పరీక్షలు చివరి తోపుతోస్తాయి. కాని నైతిక వైఫల్యం కారణంగా ఆత్మహత్యకు పాల్పడతారు. ఈ వైఫల్యం పరీక్షలలో వైఫల్యంతో ముడిపడుతుంది. సెక్స్‌లో ఫెయిలైన కారణంగా శిక్ష వేసుకుంటూ ఆత్మనాశనం చేసుకుంటారు. సెక్స్‌భావోద్రేకాలను అదుపుచేసుకోలేక ఆత్మహత్య చేసుకుంటారు.

తలలో ఉండే అంశాలపై కేంద్రీకరించి పరీక్షలు నిర్వహిస్తారు. మనసులో ఉండవలసినదాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. స్వల్పమైన చైతన్యానికి ప్రాముఖ్యం ఇస్తూ ప్రధానమైన అంతశ్చేతనాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. దీనిపై ప్రత్యేకంగా చాప్టర్ రాయవలసి ఉంటుంది.

# 12. స్కూల్లో తలలు, తలపులు

## Head and Heart in the School

క్లాసులో విద్యార్థులను రెండు రకాలుగా పరిగణించవచ్చు. వారిని తలలున్న గుంపుగా చూడడం. రెండోది వారిని తలపులున్న గుంపుగా చూడడం. సాధారణంగా టీచర్ తలలనే లెక్కగడతాడు. ఇది ఆయన తప్పుకాదు. వ్యవస్థకు తలలపట్ల మాత్రమే విశ్వాసం ఉంది. టీచర్ ఈ వ్యవస్థలోనే పని చేయాలి. మెడపైన ఉన్న శరీర భాగంతోనే ఆయనకు పని. తలపులకు సంబంధించిన పాఠ్యాంశాలను అంటే మతబోధను, రిజిష్టర్ తెరవకముందు జరిగే ఉదయం పిరియడ్‌లో పెడతారు. అంటే బోర్డ్ ఆఫ్ ఎడ్యుకుషన్ తలలకు సంబంధించిన పనికే ప్రాధాన్యం ఇస్తుంది. మతబోధ నిజమైన విద్యకాదని బోర్డు భావిస్తున్నట్టు స్పష్టమవుతున్నది.

తలలపట్ల మాత్రమే శ్రద్ధ చూపుతున్నారనేది నేను రుజువు చేయవలసిన అవసరంఉంది. బ్లాక్‌బోర్డ్‌లు, టెక్స్ట్ బుక్స్ ఇది రుజువు చేస్తూనే ఉన్నాయి. తలపులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని రుజువు చేయడం తప్పనిసరి. ఊహాజనితమైన ఒక ఉదాహరణ తీసుకుందాం. జాన్‌స్మిత్ అనే 14 సంవత్సరాల బాలుడొకరు డెస్క్ దగ్గర కూర్చున్నాడనుకుందాం. జాన్‌స్మిత్ గురించి ఏమి తెలుసని టీచర్‌ను అడుగుదాం. జవాబు కింది విధంగా ఉండే అవకాశం ఉంది.

“ఓహో స్మిత్? అతను చెడ్డవాడేమీకాదు. అయితే సోమరి లక్షణాలున్నాయి. శ్రద్ధ తక్కువ. పరిశుభ్రత ఉండదు. రాతపనిలో ఇది స్పష్టంగా తెలుస్తుంది. కాని భౌగోళిక శాస్త్రంలో అతనికి బాగా ఆసక్తి ఉంది. క్లాసులో అప్పుడప్పుడు ఇబ్బంది పెడుతుంటాడు. ఇతరుల శ్రద్ధాసక్తులను దారి మళ్లిస్తుంటాడు. చదవరిగా అతనేమీ ప్రతిభ చూపలేకపోతున్నాడు. అర్థమెటిక్స్ పరిజ్ఞానం అంతంతమాత్రమే. చదవడం భయంకరంగా ఉంటుంది. డ్రాయింగ్ ఫరవాలేదు. స్పెల్లింగ్‌ల్లో చాలా లోపాలుంటాయి”. కానీ ఇటువంటి జవాబుతో జాన్‌స్మిత్‌కు సంబంధించి ముఖ్యమైన విషయాలేవీ మనకు తెలియవు. క్రిందిప్రశ్నలకు సంబంధించి టీచర్ జవాబులు చెప్పలేదు.ఇంటి దగ్గర అతని జీవితం ఎలా ఉంటుంది? అతనికి అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు ఉంటే స్మిత్ వారితో ఏ విధంగా మెలగుతాడు? అతను తల్లి దండ్రులతో ఎలా ఉంటాడు? అతనికి ఉపన్యాసాలిస్తున్నారా? శిక్షిస్తున్నారా? వారు మతస్తులా? వారు పోట్లాడుకుంటారా? కుటుంబంలో వారికి ఇష్టమైన వారున్నారా? సెక్స్ గురించి స్మిత్‌కు ఏమి తెలుసు? అతను నేరం చేస్తున్నామన్న భావనతో హస్తప్రయోగం చేసుకుంటాడా?



అతని ఆశలు, పగటి కలల గురించి మీకేమైనా తెలుసా? అతనికి ఎటువంటి భయాలున్నాయి? జంతువులంటే భయమా? చీకటంటే భయమా? మృత్యువు అంటే భయమా? జీవితంపట్ల అతను నిజాయితీతో కూడిన ధోరణి అలవరచుకున్నాడా? లేదా అతను కపటిగా వ్యవహరిస్తున్నాడా? అతనికి వందపౌండ్లు (డబ్బు) ఇస్తే ఏమి చేస్తావని అడిగారా? అతను డాక్టర్‌కు ప్రాముఖ్యం ఇస్తాడా? లేక నెపోలియన్‌కు ప్రాముఖ్యం ఇస్తాడా? ఇటువంటి ప్రశ్నలువేసి అతని విలువలను పరీక్షించారా?

టీచరును నేను ఇంకా అనేక ప్రశ్నలు అడగగలను. మరింత లోతుగా ఈ ప్రశ్నలు సాగుతాయనేది వాస్తవం. అవి తలలకు కాకుండా తలపులకు సంబంధించి ఉంటాయనేది వాస్తవం. అవి జాన్‌పట్ల శ్రద్ధ చూపుతాయనేది మరింత వాస్తవం. క్లాస్‌రూమ్‌లో కూర్చునే జాన్‌ను కాకుండా వాస్తవంగా జాన్ ఎవరనేది ఈ ప్రశ్నలు తెలియజేస్తాయి.

స్కూల్లో ప్రతి పిల్లవాడికి సంబంధించి మౌలిక విషయాలన్నీ టీచర్‌కు తెలిసి ఉండాలని, ప్రతి స్కూలు ఈ విధంగా ఉండాలని నేను కోరుకుంటాను. అంటే ప్రతి పిల్లవాడి భావావేశపరమైన అంశాలపట్ల టీచర్‌కు భావావేశపరమైన ఆసక్తి ఉండాలని నేను కోరుకుంటాను. ఎవరి గురించి మాట్లాడుతున్నాం? ఎవరితో మాట్లాడుతున్నాం? అనే ప్రశ్నల మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది. అదే విధంగా క్లాసు ఎదుట ఉండడం, క్లాసులో ఉండడానికి మధ్య వ్యత్యాసం ఉంటుంది. అయితే టీచర్ డెస్క్ నుంచి ఈ వ్యత్యాసాలేమీ కనిపించవు.

విద్య అనేది ప్రధానంగా భావావేశానికి సంబంధించినదిగా ఉండాలి. భావావేశపరమైన అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తే ప్రాథమిక దశలో ఉన్న పిల్లల భావావేశాలు వార్తాపత్రికలలో వెలువడే స్వల్ప విషయాల చుట్టూ అల్లుకుపోతాయని నేను ఇంతకుముందే చెప్పాను. పిల్లల సంపూర్ణ వ్యక్తిత్వపు అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్న విషయం టీచర్లు గ్రహించాలి. అంటే తలలు, తలపులు, చైతన్యం, అంతశ్చేతనం, అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్నారన్నమాట.

పిల్లవాడితో ప్రతి టీచర్ ముఖాముఖి సంబంధం నెలకొల్పుకోడానికి అవకాశం కల్పించాలి. వారు ప్రత్యేకమైన గదిలో స్నేహితుల్లాగా ఎదురెదురుగా కూర్చోవాలి. అనేకమంది పిల్లలు తమ మనసులో విషయం చెప్పుకోడానికి ఎవరూ లేక దయనీయమైన పరిస్థితిలో ఉంటారు. ఇది విషాదం. పిల్లలు తల్లిదండ్రులతో మాట్లాడుకునే వీలుండదు. వారి మధ్య భావావేశపరమైన ఆటంకాలుంటాయి. పిల్లవాడికి టీచర్‌తో తన మనసులో విషయాలు చెప్పుకోలేకపోతే వారికి ఇక మార్గమే ఉండదు. టీచర్ భయపెట్టే అధికారి

కాదని నేను భావిస్తున్నాను. టీచర్లు అధికారాన్ని, ప్రతిష్ఠను తక్కువగా చూపితే పిల్లలకు భావావేశపరమైన ఇబ్బందులు తొలగించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఎదుట వ్యక్తిని "సర్" అని సంభోదిస్తూ తన మనసులో మాట చెప్పుకోడానికి పిల్లలకు అవకాశం ఉండదు.

టీచర్ సలహాదారు కూడా కాలేదు. గ్రహించడానికి, సానుభూతితో వినడానికి టీచర్ సిద్ధంగా ఉండాలి. అయితే టీచర్ మిగిలిన విషయాలు పట్టించుకోకూడదని నేను చెప్పడం లేదు. ఆటోమేటిక్ యంత్రంలో సత్తు నాణెంవేసి ఒక పెట్టి సిగరెట్లు దొంగతనం చేసినందువల్ల తన అంతరాత్మ క్షోభిస్తున్నదని జాన్‌స్మిత్‌నాకు చెప్పినపుడు, నేను చిరునవ్వు నవ్వి, నా జీవితంలో అటువంటి సంఘటనలను అతనికి చెప్పాలి. అతన్ని ఓదార్చడానికి కాదు. తాను తోటి దొంగతో మాట్లాడుతున్నానని, తనతోపాటు సమానస్థాయిలో ఉన్న వ్యక్తితో మాట్లాడుతున్నానని స్మిత్‌ను ఒప్పించడానికి ఈ విధంగా చేయాలి. ఇంటి పరిస్థితి సంతోషరహితంగా ఉన్నందువల్ల అతను దొంగతనానికి పాల్పడుతున్నట్టు గ్రహించి, ఇంటివద్ద పరిస్థితులను వివరించవలసిందిగా అతన్ని ప్రోత్సహిస్తాను. తన పట్ల ఎవరూ ప్రేమ చూపడంలేదని, తన పట్ల అన్యాయంగా ప్రవర్తిస్తున్నారని అతను వెల్లడిస్తాడు. ఈ పరిస్థితిలో ఎటువంటి నైతిక ధోరణి అనుసరించినా ప్రాణాంతకమవుతుంది. "జాన్ నీ సోదరుడిని ప్రేమించాలికదా!" అనకూడదు. ఒక వేళ ఈ విధంగా చెప్పినట్లైతే భావావేశపరంగా టీచర్‌పట్ల పిల్లవాడు ద్వేషం పెంచుకుంటాడు. అతను అభివృద్ధి చెందే అవకాశాలు మరింత తగ్గిపోతాయి.

మాట్లాడడం ద్వారా విలువలు బోధించడం సాధ్యంకాదని గ్రహించడం అవసరం. నైతిక విద్యకు సంబంధించి ఇది యథార్థం..."నీ చెల్లిని క్రరతో కొట్టినపుడు ఆమెకు నొప్పి పుడుతుంది కదా!"..."దొంగతనం చేయడం తప్పని నీకు తెలియదా?"... (అన్నిటికంటే దారుణమైనది) "పిల్లి మీసాలు పీకే చిన్న పిల్లలను దేవుడు ప్రేమించడు" ఇటువంటి వ్యాఖ్యలు పిల్లవాడికి నయం చేయకపోగా అతన్ని మరింత అవిధేయుడిగా మార్చుతాయి. అదే సమయంలో ఇటువంటి వ్యాఖ్యలకు ప్రభావం ఉండదని చెప్పడం లేదు. దురదృష్టవశాత్తు ఈ ప్రభావం అంతశ్చేతనంపై పడుతుంది. ఫలితంగా పిల్లవాడు జీవితాన్ని ద్వేషించే వ్యక్తిగా తయారవుతాడు. చట్టం నేరాలకు దారితీస్తే, పాపాలు చేయడానికి నైతికబోధన దోహదం చేస్తుంది.

నేను టీచర్‌ను పెద్ద కోరిక కోరుతున్నానా? నేను అలా అనుకోవడం లేదు. నేను కోరేదేమంటే-పిల్లవాడిని అర్థం చేసుకోవాలి. పిల్లల పక్షం ఉండాలి. ఎల్లప్పుడూ పిల్లల పక్షమే ఉండాలి. లక్షణాలకు తక్కువ ప్రాముఖ్యత ఇచ్చి, మూల కారణాలు వెతకాలని



నేను టీచర్‌ను కోరుతున్నాను. ఇది కఠినమైన, కష్టమైన పని. ఇందులో విజయాలుంటాయి, వైఫల్యాలు కూడా ఉంటాయి. ఎందుకంటే కొన్ని సందర్భాలలో మూల కారణం టీచర్‌కు అర్థంకాక పోవచ్చు.

సమ్మర్‌హిల్‌లో ఒక బాలిక సమస్యగా తయారైంది. ఆమె ద్వేషంతో దాడి చేసేది. వస్తువులు ధ్వంసం చేసేది. ఆమెకు ఏ విషయమూ నేర్చుకోవాలన్న కోరికలేదు. ఇతర బాలికల పని చెడగొడుతూ ఆనందం పొందేది. ఆమె ఇబ్బందేమిటో నాకు తెలుసు. ఆమె తల్లిదండ్రులు నిరంతరం పోట్లాడుకునే వారు. వారిద్దరి మధ్య ఆమె నలిగిపోయేది. నేను ఆమెకు ఏ విధమైన సహాయం చేయలేకపోయాను. నన్ను తన తండ్రితో పాటు గుర్తించినందువల్ల ఆమె నాతో మాట్లాడలేదు. ఇంతలో తల్లిదండ్రులు విడాకులు తీసుకునే రోజు వచ్చింది. హఠాత్తుగా ఆమెలో మార్పు వచ్చింది. ఆమె అందరికన్నా బుద్ధిమంతురాలైపోయింది. ఆమెలో దాడిచేసే స్వభావం, ద్వేషం మాయమయ్యాయి. ఆమె త్వరితంగా నేర్చుకోవడం ప్రారంభించింది. ఆమె ముఖంలో మబ్బులు కమ్మినట్టుండే లక్షణాలు మాయ మయ్యాయి. ప్రస్తుతం ఆమె లండన్‌లో పనిచేస్తూ, బాగానే ఉంది. ఆమె సమస్యలు స్కూలు వెలుపల ఉన్నాయి. ఈ స్కూలు వెలుపల సమస్యలు పరిష్కారం కాకపోతే ఆమె జీవితంలో ఫెయిలయ్యేది. ఆమె గురించి నాకు అన్ని విషయాలు తెలుసు. అయినప్పటికీ ఆమె జర్మన్‌భాష, అర్థమెటిక్స్ పరిజ్ఞానం గురించి ఎవరైనా అడిగితే నాకు ఏమీ తెలియదని చెప్పేవాడిని.

నేను సమ్మర్‌హిల్‌లో పిల్లల గురించి తెలుసుకున్న విధంగానే ప్రతి స్కూల్లో ప్రతి టీచర్ ప్రతి పిల్లవాడి గురించి తెలుసుకోవాలని నేను పట్టుబడతాను. సమ్మర్‌హిల్‌లో 75 మంది పిల్లలున్నారు. ప్రభుత్వ పాఠశాల క్లాసులో కూడా ఇంతమంది ఉండరు. అయితే సమ్మర్‌హిల్ పిల్లలంతా 24 గంటలూ స్కూల్లోనే ఉంటారు. అందువల్ల నిరంతరం నేను పిల్లల గోల భరించవలసి ఉంటుంది. నేను ఎంతగానో అలసిపోతాను. నేను మరొక విషయం కూడా అంగీకరించాలి. పాఠాలు చెప్పడం, ఎక్సర్‌సైజ్ బుక్‌లు దిద్దడం, నేను చేయను. విద్యలో లక్ష్యాలు మామూలుగా ఉంటే పిల్లలు చదవడం, రాయడం...వారి తలలకు సంబంధించిన పనితో నేను సతమతమవుతుండే వాడిని.

నేను చేస్తున్న ప్రతిపాదనను ప్రస్తుతం అనేకమంది టీచర్లు ప్రత్యేకించి యువటీచర్లు ఆమోదిస్తున్నారు. తలలపై మాత్రమే కేంద్రీకరించే విద్య నిరుపయోగమైనదని వారు గ్రహిస్తున్నారు. వారు సంస్కరణ స్కూళ్లవైపు మొగ్గు చూపుతున్నారు. వారిలో కొంతమంది నిరాశతో నా దగ్గరకు వచ్చి..."మేము ఏమీ చేయలేకపోతున్నాం. హెడ్‌మాస్టర్ మమ్మల్ని కదలనివ్వడు. నిబంధనల ప్రకారం మేము తలలవిద్యకే పరిమితమవుతున్నాం. క్లాసురూమ్ జైలులాగా తయారైంది" అని చెబుతున్నారు.

టీచింగ్ వృత్తిలో వామపక్ష ధోరణి కలిగిన సంఘటిత శక్తి అవసరం ఎంతైనా ఉంది. కొత్తతరం టీచర్లకు అధికారిక నేషనల్ యూనియన్ ఆఫ్ టీచర్స్ అంతగా ఉపయోగపడదు. ఇది పెద్దది. మితవాద ధోరణితో కూడుకొని కేవలం యూనియన్ నిర్మాణం, వేతనాలు, టీచింగ్ పద్ధతులపై శక్తియుక్తులన్నీ కేంద్రీకరిస్తున్నది. పిల్లల మనస్తత్వశాస్త్రాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నది. అది ప్రతిపాదిస్తున్న సంస్కరణలు కేవలం పైపై విషయాలకే పరిమిత మవుతున్నాయి. మౌలిక విషయాలను పట్టించుకోవడం లేదు. ప్రగతి కాముకులైన టీచర్లు న్యూఎడ్యుకేషన్ ఫెలోషిప్ సంస్థను ఏర్పాటుచేసుకున్నారు. ఈ సంస్థ చెప్పుకోదగిన కృషి చేస్తున్నది. అయితే ఈ సంస్థ ఇటీవల కాలంలో విప్లవాత్మక కార్యకలాపాలను విస్మరించి మర్యాదతో కూడిన ఉదారవాదంలోపడి కొట్టుకుపోతున్నది. నేను "మరీ విప్లవాత్మకంగా" వ్యవహరిస్తున్నందువల్ల ఆ సంస్థ నిర్వహించే సభలలో పాల్గొనడానికి నన్ను ఆహ్వానించడం లేదు. నాకేమీ ఇబ్బంది లేదు. సభలంటే నా కంతగా ఇష్టం ఉండదు. అయితే ఈ సంస్థలో ఎటువంటి ధోరణి కొనసాగుతున్నదీ నన్ను ఆహ్వానించకపోవడం తెలియజేస్తున్నది. నేషనల్ యూనియన్ ఆఫ్ టీచర్స్ స్థానిక శాఖల నుంచి నా ఉపన్యాసాలకు ఆహ్వానం వస్తుంటుంది. ఈ శాఖలు నా ఉపన్యాసాల పట్ల చూపే ఆసక్తి నాకెంతో సంతోషం కలిగిస్తున్నది. దేశవ్యాప్తంగా ఉన్న టీచర్ వృత్తిలో వామపక్ష ధోరణితో సంస్థ నిర్మాణం చేయడం అంతతేలిక కాదు. ప్రారంభంలో లెఫ్ట్ బుక్ క్లబ్ మాదిరి సంస్థను ఏర్పాటు చేసుకొని తరువాత దాన్ని విస్తరించుకోవడం మంచి పద్ధతి. పబ్లిషరెవరైనా నన్ను ఎడిటోరియల్ బోర్డులో చేర్చుకునే సాహసం చేస్తే వారికి నేను సంతోషంగా సహకరిస్తాను. ఎడిటోరియల్ బోర్డులో ఇతరులను చేర్చుకోవడంలో నాకు స్వేచ్ఛ ఉంటే కర్రీ ఆఫ్ డిర్టింగ్టన్ హాల్, డోరారస్సెల్, ఈథెల్ మన్నిలను నాకు తెలిసిన ఒకరిద్దరు యువ టీచర్లు, ఒకరిద్దరు సైకాలజిస్టులను బోర్డ్‌లో చేర్చుకుంటాను.

టీచింగ్ పద్ధతులు, సబ్జెక్ట్ గురించి ఈ బుక్ క్లబ్ అసలు పట్టించుకోదు. క్లబ్ నడిపే వారపత్రికలో సైకాలజీ, సోషియాలజీ, సెక్సాలజీ మాత్రమే చర్చిస్తాం. చదువరులు పంపిన ప్రశ్నలకు జవాబులివ్వడానికి పత్రికలో ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాం. పత్రికలో వ్యాసాలు రాయవలసిందిగా అందరికీ తెలియని చదువరులను ఆహ్వానిస్తాం. హాస్యం ఎక్కువగా ఉండాలని నేను బోర్డుకు సలహా ఇస్తాను. స్కూలు పిల్లల కవితలు, కథలకు పత్రికలో ప్రాధాన్యం ఇస్తాం. టెక్స్ట్‌బుక్‌లు, స్కూల్ పరకరాలకు సంబంధించిన వ్యాపార ప్రకటనలకు పత్రికలో స్థానం ఉండదు.

ఈ బుక్‌క్లబ్ క్రమం తప్పకుండా పిల్లల గురించి చౌక పుస్తకాలు ప్రచురించాలి. ఇవి సాధ్యమైనంత సులువుగా ఉండాలి. కాని చివర ఇచ్చే బిబ్లియోగ్రఫీలో లోతుగా



అధ్యయనం చేయడానికి వీలైన పుస్తకాల జాబితా చేర్చాలి. టీచర్ వృత్తిలో వారికి సభ్యత్వం పరిమితం చేయకుండా యువతను చేర్చుకోడానికి కృషి చేయాలి. క్లబ్‌కు రాజీలేని ధోరణి లక్ష్యంగా ఉండాలి. జీవితం, సెక్స్ గురించి నిజాయితీ, నిష్కల్మషమైన చర్చ జరగాలి. అయితే సెక్స్ గురించి బూతు ధోరణి (Promographic) చోటు చేసుకునే అవకాశం ఉంది. అందువల్ల దీని గురించి జాగ్రత్తగా చర్చించాలి.

క్లబ్‌లో అనారోగ్యపూరితమైన ధోరణి చోటుచేసుకోకుండా చూడాలి. అంటే అహంకారులను, మానసిక రోగులను (Neurotics) క్లబ్‌లో చేరకుండా నిరోధించాలి. ఏ సంస్థలోనైనా సెక్స్ గురించి చర్చ జరుగుతుంటే తగని వారిని ఆకర్షించే అవకాశం ఉంటుంది. అంతశ్చేతనంగా స్వలింగ సంపర్కం ఉన్నవారు, కంతలలోనుంచి చూసేవారు, ప్రదర్శకులు ఇటువంటి చర్చలకు ఆకర్షితులవుతారు. ఇటువంటి వారికిచోటులేకుండా ఖచ్చితమైన చర్యలు తీసుకోవాలి. మనం కూడా ప్రమాదం కలిగించే లక్షణాలు కలిగి ఉంటాం. ఇటువంటి క్లబ్ నా నియంత్రణలో ఉంటే విల్‌హెల్మ్‌రైక్ సైకాలజీకి అధిక ప్రాధాన్యం ఇస్తాను. వేరే వ్యక్తులు, ఫ్రాయిడ్ లేదా ఆడ్లర్ లేదా కృష్ణమూర్తి లేదా రుడాల్ఫ్ స్టీనర్‌కు ప్రాముఖ్యం ఇవ్వవచ్చు. విస్తృతమైన సిద్ధాంతాలు, విశ్వాసాల మధ్య వాస్తవం వెదకడానికి కృషి చేయాలి.

తలలపై కాకుండా తలపులపై ఇటువంటి సంస్థ దృష్టి కేంద్రీకరించాలి. విద్యను ఎక్కడ ఉండాలో అక్కడకే చేర్చాలి. అంటే పిల్లవాడి అంతశ్చేతనం దగ్గరకు చేర్చాలి. చాలాకాలంగా నిర్లక్ష్యానికి గురైన అంతశ్చేతనం గురించి తెలుసుకోడానికి టీచర్లకు అవకాశం ఏర్పడుతుంది. తద్వారా డెస్క్ స్కూళ్లలో చోటుచేసుకునే పరిస్థితిని అవగాహన చేసుకోడానికి వీలవుతుంది. కాని ఇది వామపక్ష రాజకీయంగా గుర్తింపు పొందదా? అవును ఈ అవకాశం ఉంది. విద్యలో మనస్తత్వ శాస్త్రం, సమాజంలో సోషలిజం సాగాలని ఇటువంటి సంస్థ కోరుకుంటుంది. పెట్టుబడిదారీ విధానంలో విస్తృత ప్రజానీకానికి ఉచితవిద్య అందుబాటులో ఉండదని సంస్థలోని సభ్యులంతా గ్రహించగలుగుతారు. పెట్టుబడిదారీ విధానానికి తక్షణ ప్రమాదం కానందువల్ల నా సమ్మర్‌హిల్ స్కూలుకు స్వేచ్ఛ ఉంటుంది. మధ్య తరగతివారు విద్యను కొనుక్కోగలిగే స్థితిలో ఉండడమే దీనికి కారణం. కార్మికులు పెట్టుబడిదారీ విధానాన్ని కూలదోసి, ఉత్పత్తి సాధనాలను తమ అధీనంలోకి తెచ్చుకునే వరకు ఉచిత ప్రభుత్వ విద్యలభించే అవకాశం లేదు. విద్యను తలపులకు ఆధారంగా మరల్చితే కుళ్లిపోయిన వ్యవస్థను కార్మికులు తొలగించే ప్రమాదముందని మన పాలకులకు స్పష్టంగా తెలుసు.

# 13. టీచర్-సమాజం

నా తండ్రి స్కాట్లండ్‌లోని ఒక గ్రామంలో స్కూల్ టీచర్. మా కుటుంబానికి సామాజిక స్థాయిలేదని నేను జీవితంలో చాలా తొందరగానే గ్రహించగలిగాను. నేను టీనేజ్‌లో ఉన్నపుడు దగ్గరలోని టౌన్‌లో పైస్థాయి సమాజంతో కలవడానికి వెర్రి ప్రయత్నం ఒకటి జరిగింది. కానీ ఆ ప్రయత్నం దారుణంగా విఫలమైంది. తయారీదారులు, లాయర్లు, దుకాణదారులు ఒక స్కూల్ మాస్టర్ కొడుకును తమతో సమానంగా భావించడానికి సిద్ధంగా లేరు. ఆ చిన్న టౌన్‌లో సమాజం ప్రధానంగా ఫైనాన్స్ ఆధారంగా ఏర్పడింది. నా తండ్రి 130 పౌండ్ల వార్షిక వేతనంతో కుటుంబంలో ఎనిమిది మందిని పోషించవలసి ఉంది. ఆయనకు సమాజంలో హోదా కల్పించడానికి ఎవరూ సిద్ధంగా లేరు. కొన్ని సంవత్సరాల తరువాత ఈ సమాజంలోని మహిళకు నన్ను "ప్రముఖ రచయిత" గా పరిచయం చేశారు. కాని "ఈయన స్కూల్ మాస్టర్ కొడుకు గదా!" అని ఆమె గొణుక్కోవడం నాకు వినిపించింది. స్కాంట్లండ్ ప్రజలు ఎవరి స్థానంలో వారిని ఉంచడంలో కళాత్మకంగా వ్యవహరిస్తారని అంగీకరించక తప్పదు.

యూనివర్శిటీ విద్యతో సామాజిక హోదా ఏమీ పెరగదని నేను జీవితంలో తొందరగానే గ్రహించగలిగాను. స్కాంట్లండ్‌లో ఎం.ఎ.లకు పెద్ద విలువేమీ లేదు. ఇంగ్లండ్‌లోని చిన్న టౌన్‌లలో యూనివర్శిటీ డిగ్రీకి విలువ లభించే అవకాశం ఉంది. కానీ సామాజిక ప్రతిష్ఠ ఏ మేరకు పెరుగుతుందనేది సందేహాస్పదమే.

"సామాజిక హోదా ఏమిటని" యువ టీచర్ గొంతు చించుకోవచ్చు. కాని ఇది ఆచరణలో ఉంది. చిన్న పట్టణాలు, పల్లెలున్న జిల్లాలలో ఇది వ్యాప్తిలోఉంది. లండన్‌లో పనిచేసే టీచర్ తన సామాజిక హోదాతో సంతృప్తి చెందవచ్చు. ఎవరి ముందు ఆయన ఆత్మ న్యూనుడుగా భావించవలసిన అవసరం లేదు. అతని జీవితం అందరిముందు పరచడానికి వీలులేదు. తాను ఎవరితో కావాలంటే వారితో సాన్నిహిత్యం పెంచుకోవచ్చు. ఆయనపై నిరంతరం సామాజిక హోదా రుద్దే ప్రయత్నం జరగదు. చిన్న టౌన్‌లో పనిచేసే టీచర్ కన్నా లండన్‌లో పనిచేసే టీచర్‌కు సామాజికంగా హోదా ఏమీ ఉండదు. తన వర్గం వారితో కలిసి పోడానికి కూడా ఆయనకు అవకాశం ఉండదు. స్థానిక ప్రజలు ఏర్పాటు చేసుకున్న సమాజంతో తన పరిస్థితిని నిరంతరం పోల్చుకోవలసి వస్తుంటుంది. అతనికి జీవితంలో స్వేచ్ఛ ఉండదు. అన్ని వేళలా ఆయన మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలి. లండన్‌లో బ్రహ్మచారి, లేదా బ్రహ్మచారి టీచర్ తమనెవరైనా చూస్తారనే భయం లేకుండా "పాపం" (వ్యభిచరించడం) చేయవచ్చు. కానీ గ్రామంలో టీచర్ బార్‌లో



పనిచేసే మహిళ (bar maid) వంక కూడా కన్నెత్తి చూడకూడదు. సామాజికంగా గ్రామంలో టీచర్ బార్‌మెయిడ్‌తో సమాన హోదాలో ఉంటాడు.

వర్గ విభేదాలను కొద్దిమంది అధిగమించగలుగుతారు. అయితే ఎవరూ ఈ విభేదాలకు పూర్తిగా దూరంగా ఉండలేరు. నాకు వర్గ విభేదాలు ఏమాత్రం పట్టవని నేనాలోచిస్తాను. కాని, నాకు తెలుసు నేను అరకదున్నే వారితో లేదా దుకాణంలో గుమస్తాలతో సన్నిహితంగా ఉండాలని కోరుకోను. వారికి నాకు సన్నిహితంగా ఉండే అంశాలు లేవనేది పాక్షిక కారణం. అదే విధంగా రిటైర్డ్ అడ్మిరల్స్, జనరల్స్‌తో సన్నిహితంగా ఉండడానికి నాకు తగిన కారణాలు లేవు. నేను చేస్తున్న పనికి వేతనం తీసుకుంటే సఫ్లాక్ కౌంటీ సమాజంలోకి నన్ను రానివ్వరు. తక్కువగా చూడడం అనేది మతం వంటిది. చిన్నప్పుడే అది నీకంటుకుంటే అది నిన్ను వదలదు. నువ్వు ఎన్నటికీ ఈ విషాదాన్ని వదిలించుకోలేవు.

మనది వర్గ సమాజం. ఇదే విధంగా సాగినంతకాలం టీచర్ తన సామాజిక హోదాను అధిగమించడం సాధ్యంకాదు. సంపదలన్నీ ధనికుల అధీనంలో ఉన్నంత కాలం గ్రామీణ స్కూల్‌మాస్టర్ ఆత్మగౌరవం పొందేమార్గం లేదు. స్థానిక ప్రముఖ మహిళలకు సమ్మర్‌హిల్ విద్యార్థి ఒకరు టోపీ తీసి గౌరవించలేదని ఫిర్యాదు చేసింది. ఇది నాకు బాధాభరితమైన జ్ఞాపకంగా మిగిలిపోయింది. ఆమెకు టోపీ తీసి గౌరవించాలని, స్కూల్లో పనిచేసే మహిళకు కూడా టోపీ తీసి గౌరవించాలని పిల్లలకు బోధించానని, వారి ప్రవర్తన నాకు విభ్రాంతి కలిగిస్తున్నదని వివరించడానికి నేను ఎంతగానో ప్రయత్నించాను. ధనబలం ఆధారంగా సామాజిక వర్గం ఏర్పడుతుంది. అయితే ధనం సంపాదించిన వారికి కూడా ఉన్నత సామాజిక వర్గపు హోదా లభించని ఉదాహరణలు కూడా ఉంటాయి. ఉదాహరణకు నా స్నేహితుడొకరు హోటల్‌లో వెయిటర్స్‌ను బూతులు తిట్టేవాడు. ఆయనకు ఉన్నత వర్గంలో స్థానం లభించలేదు. గ్రామంలో సేవకునికన్నా టీచర్ దగ్గర తక్కువ డబ్బు ఉంటుంది. ఈ హోదాకు పుట్టుకతో ఎటువంటి సంబంధం లేదు. హోదాలో ఉన్నవారిని కూడా సేవకుడు తన ఇంటికి అతిథులుగా ఆహ్వానించగలడు. టీచర్‌కు తక్కువ వేతనం లభిస్తున్నందువల్ల అతని సామాజిక హోదా కూడా తక్కువగానే ఉంటుంది. జీతం తక్కువ కావడంతో టీచర్ దుస్తులు, స్పోర్ట్స్ పరికరాలు, తదితర వస్తువులు నాసిరకాలను కొంటాడు. వీటన్నిటికంటే ముఖ్యమైనదేమంటే నాసిరకం దుస్తులతో తాను ఉన్నతుడుగా ఉన్నట్టు నటించవలసి వస్తుంది. అతని కొడుకు నిరుద్యోగి అయినప్పటికీ నిరుద్యోగ భృతికోసం కొడుకును పంపడం అతనికి తలవొంపుగా ఉంటుంది. కార్మిక వర్గానికి చెందినవారు ఎక్కువగా ఉన్న గ్రామంలో టీచర్ భార్యకు

సమాన హోదాలో ఉన్నవారు దొరకరు. అందువల్ల ఆమె ఒంటరి జీవితం గడపవలసి వస్తుంది. రెండు సామాజిక హోదాల మధ్య ఎటూగాని చోట టీచర్ ఉంటాడు. ఉన్నత సామాజిక వర్గంవైపు ఆయన మొగ్గు చూపుతాడు. టీచర్‌కు విద్యార్థులకు మధ్య సాగే సంబంధం సామాజిక వర్గాలకు సంబంధించినది కాదు. అయినప్పటికీ టీచర్ క్లాసులో ఉన్నత తరగతికి చెందినవాడు. విద్యార్థులు తక్కువస్థాయివారు. అందువల్ల టీచర్ ఉన్నత సామాజిక హోదా కోసం ఆరాటపడతాడు.

టీచర్‌కు తగినంత వేతనం లభించదని నేను సూచించాను. ఇది నిజమే. కాని మన వర్గపాలనలో టీచర్ వేతనం పెంచినందువల్ల చెడు ప్రభావం కూడా ఉంటుంది. టీచర్ ప్రయోజనాలన్నీ కార్మిక వర్గంతో ముడిపడి ఉంటాయి. కాని వేతనం పెరిగితే అతను ఈ వర్గం నుంచి మరింత దూరమవుతాడు. టీచర్‌కు వేతనం బాగా పెంచితే అతను కారు కొంటాడు. పదిమైళ్ళ దూరమైనా వెళ్లి ఖరీదైన గోల్ఫ్‌క్లబ్‌లో చేరతాడు. అతనికి గ్రామంతో సంబంధాలు మరింత తగ్గిపోతాయి. అయితే దక్షిణాఫ్రికాలో ఇటువంటి పరిస్థితి లేదు. అక్కడ కార్మిక వర్గమంటే ఆదివాసులే. వారికి సామాజిక హోదాతో సంబంధం ఉండదు. కాని ఇంగ్లాండ్‌లో టీచర్ వేతనం పెరిగితే ప్రతికూలమైన ప్రభావం ఉంటుంది. నిజానికి బంటూ ఆదివాసీలకు ధనికులైన బోయర్ భూస్వాములకు, గ్రామంలో సేవకునికి కమ్మరికి మధ్య వ్యత్యాసం తక్కువగా ఉంటుంది. అయితే ఒక తేడా ఉంది. కమ్మరి కొడుకు డబ్బు సంపాదించి సామాజిక హోదా పెంచుకోవచ్చు. కాని ఆదివాసీలు ఎట్టి పరిస్థితులలోని తెల్లజాతివారి స్థాయికి ఎదగలేరు.

అయినప్పటికీ గ్రామంలో టీచర్‌కు ఎక్కువ వేతనం చెల్లిస్తే ఇబ్బందులు ఎదురుకాక తప్పదు. టీచర్ వృత్తిలో వారికి అధిక వేతనం చెల్లిస్తే సమర్థులైన వారు వృత్తిలోకి వస్తారనే వాదనతో నేను అంగీకరించను. ఇది పొరపాటు అభిప్రాయం. వైద్య వృత్తిలో వారికి మతాధికారులకు ఎక్కువ వేతనం చెల్లిస్తారు. కాని టీచర్లకన్నా వీరు సమర్థులైన వారని చెప్పడానికి ఆస్కారం లేదు.

నుఫీల్డ్ జమిందారుకు, వెస్ట్ మినిస్టర్ ప్రభువుకు వచ్చే ఆదాయంతో పోల్చితే నాకొచ్చే ఆదాయం అతి స్వల్పం. కాని వారు నాకంటే ఉన్నతంగా ఉన్నారనే అభిప్రాయాన్ని నేనెన్నటికీ అంగీకరించను. అంతేకాకుండా వారు చేసే పని కన్నా నేను చేసే పని ముఖ్యమైనదని, కష్టమైనదని వాదిస్తాను. టీచర్లకు వేతనాలు పెంచాలని నేను కూడా డిమాండ్ చేస్తాను. అయితే వారు విలాసవంతమైన జీవితం కోసం నేనిది డిమాండ్ చేయను. వేతనమంటే అధికారం. అందువల్ల నేను అధిక వేతనం డిమాండ్ చేస్తాను. టీచర్లకు ఈ రోజున ఉన్న అధికారం కంటే ఎక్కువ అధికారం ఉండాలి. విద్య అంటే



ఏమిటో తెలిసిన వారుగా స్త్రీ, పురుషులైన టీచర్లు తమ పనిని తామే నిర్ణయించుకునే అధికారం ఉండాలి. టీచర్లకన్నా వైద్య వృత్తిలో, న్యాయవాద వృత్తిలో ఐక్యత ఎక్కువ. ఈ రెండు వృత్తుల వారు ట్రేడ్‌యూనియన్లు ఏర్పాటు చేసుకొని తమ హక్కులను, ప్రయోజనాలను కాపాడుకుంటున్నారు. అందువల్ల పిల్లవాడి మూర్ఖత్వం నయం చేయడం కన్నా ఆటలమ్మ నయం చేయడం అవసరమని పై సామాజిక హోదాను తెలియజేస్తున్నది.

ఇతర వృత్తులకన్నా టీచర్ వృత్తి ముఖ్యమైనదని చెప్పడంలో అతిశయోక్తి లేదు. సమాజానికి టీచర్ మూలస్తంభం వంటివాడు. అయితే అతని వృత్తికి తగిన గౌరవం మాత్రం లభించడంలేదు. ప్రభువులైన టీచర్లు ఎవరూ లేరు. అదే విధంగా నైట్‌గా ఎదిగిన టీచర్ కూడా ఎవరూ లేరు. ఆత్మగౌరవం ఉన్న టీచరెవరూ ఇటువంటి బిరుదులు కోరుకోరు. ఒకవేళ బిరుదు ఇచ్చినా తిరస్కరిస్తారు. టీచర్‌ను విలువైనవాడిగా పరిగణించినపుడే బిరుదు ఇస్తారు. విజయం సాధించిన కార్ల తయారీదారులు, వైన్ తయారీదార్లు ఉన్న ప్రపంచంలో గౌరవం ఎవరికి చెందాలో వారికే చెందుతుంది. సైన్యంపరంగా చెప్పాలంటే వ్యాపారవేత్తలు కమిషన్డ్ ఆఫీసర్లుగాను, టీచర్లు నాన్ కమిషన్డ్ ఆఫీసర్లుగానూ పరిగణలోకి వస్తారు.

పాలకవర్గం లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసే విధంగా స్కూళ్లను తయారు చేస్తున్నారని నేను ఇంతకుముందే చెప్పాను. అందువల్ల టీచర్లను కూడా ఈ విధంగా పరిగణిస్తున్నారు. సేవకులను, స్తోత్రం చేసేవారి తయారు చేస్తున్న ఈ వ్యవస్థను మార్చకూడదని పాలక వర్గాలు భావించడం సహజం. కానీ టీచింగ్ వృత్తిలో ఐక్యత ఉంటే వ్యవస్థను మార్చవచ్చు. తమను దోపిడి చేయడానికి, తమ పరిస్థితికి సంబంధించిన చైతన్యం ఉంటే, తమ యజమానులకు దౌర్భాగ్యమైన సేవలు చేస్తున్నట్టు గ్రహించితే వ్యవస్థను మార్చడం సాధ్యమవుతుంది. వృత్తిలోని యువజనులు వృద్ధుల పాలనను తిరస్కరించినపుడు, నేషనల్ యూనియన్ ఆఫ్ టీచర్చ్ కార్య వర్గానికి వృద్ధులను ఎన్నుకోడానికి తిరస్కరించినపుడు వ్యవస్థను మార్చే అవకాశం ఉంటుంది. నేషనల్ యూనియన్ ఆఫ్ టీచర్స్‌కు అధ్యక్ష హోదాలో ఉంటే యువజనులు ఎటువంటి ఉపన్యాసమివ్వాలనుకుంటారో నేను ఊహించగలను. నేను యువకుడిని కాను. నా అధ్యక్షోపన్యాసం క్రింది విధంగా ఉంటుంది.

సోదరీ సోదరులారా,

నా అధ్యక్షోపన్యాసానికి 'వాస్తవం' ను వస్తువుగా ఎంచుకున్నాను. విద్యలో ఎంత వాస్తవం ఉంది? అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. లేదా నేను అబద్ధంలో బతుకుతున్నానా? అని ప్రశ్నించుకోండి.

అవును మనం అబద్ధంలోనే బతుకుతున్నాం. భావితరం బాధ్యతలను మనం మోస్తున్నాం. కాని మనం వారికి మన తరంలోని అబద్ధాలనే అంటగడుతున్నాం. మనం కావాలని ఈ పని చెయ్యడం లేదు. మనం విద్య గురించి ఎన్నడూ లోతుగా ఆలోచించడం లేదు. అందువల్ల మనమీ పని చేస్తున్నాం. ముందుచూపు చూడడానికి మనకు శక్తి లేదు. మన ధోరణి పరిమితులలో కూరుకుపోయింది.

దీన్ని మరింత గట్టిగా పరిశీలిద్దాం. ఈ రోజున (1939లో) వివిధ దేశాలు పెద్ద ఎత్తున ఆయుధాలు సమీకరిస్తున్నాయి. ఏ క్షణంలోనైనా నిరాశ, బయోత్పాతం, బాధలతో కూడిన మంటలలో చిక్కుకోడానికి ప్రపంచం సిద్ధంగా ఉంది. ఈ రోజున స్కూళ్లలో కూర్చుంటున్న లక్షలాది మంది పిల్లలు ఈ యుద్ధంలో మరణించే అవకాశం ఉంది. యుద్ధం ముగిసిన తరువాత మిగిలిన పరిస్థితుల నుంచి నూతన నాగరికతను నిర్మించుకోవలసి వస్తుంది. ప్రస్తుతం ఉన్నదానికన్నా భిన్నమైన నాగరికతను నిర్మించుకోవలసి వస్తుంది. బహుశా అది విశ్వజనీన సమ సమాజమవుతుంది. ఫాసిజం పాత తరానికి చెందినది. అందువల్ల అది యుద్ధంలో విజయం సాధించలేదు. లాభాలు, వర్గ విభేదాలు సామ్రాజ్యవాద దాడులకు నూతన సమాజంలో అవకాశం ఉండదు. ఒక్క మాటలో చెప్పాలంటే చారిత్రక గమనం మారిపోతుంది.

యుద్ధంలో బతికి బట్టకట్టిన మన స్కూళ్లలోని విద్యార్థులు నూతన ప్రపంచాన్ని నిర్మిస్తారు. ఈ బాధ్యత నిర్వర్తించడానికి వారిని సంసిద్ధులుగా చేసేందుకు నువ్వేమైనా చేస్తున్నావా? నూతన జీవితం ప్రారంభించడానికి మన స్కూలు సబ్జెక్ట్స్ వారికే విధంగా సహకరిస్తాయి? ముందుగా ఎదురయ్యే దుర్భర పరిస్థితులు తట్టుకోడానికి స్కూలు పరీక్షలలో సాధించిన విజయాలు ఏ విధంగా దోహదం చేస్తాయి? నూతన ప్రపంచంలో సవ్యమైన పౌరులుగా తయారు కావడానికి అసమానతలు, ఇంట్లో పాఠాలు ఏ మేరకు సహకరిస్తాయి?

మనం వాస్తవంలో నమ్మకం ఉన్న టీచర్లమైతే మనందరం సమైక్యంగా నిలిచి, విద్యతో చెలగాటమాడుతున్న ఈ వ్యవస్థను కూలదోయాలి. విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దాలి. ప్రస్తుతం వారిని స్వేచ్ఛగా ఉండనిస్తే ఇది సాధ్యమవుతుంది. మా సమ్మర్‌హిల్ స్కూల్‌లో ఏడు సంవత్సరాల బాలుడొకరు దొంగతనాలు చేసేవాడు. అతను ప్రతి రోజూ ఏదో ఒక దొంగతనం చేయాలని, లేని పక్షంలో పాకెట్‌మనీ జరిమానా విధించాలని సమ్మర్‌హిల్ గవర్నమెంట్ చట్టం చేసింది. మానసికపరమైన అవగాహన ఉన్న సమ్మర్‌హిల్ పౌరులు ఈ విధమైన శిక్షలు వేస్తారు. కాని సాధారణంగా ఇటువంటి దొంగతనాలకు పాల్పడేవారికి బెత్తం దెబ్బలు, జైలు శిక్ష విధిస్తుంటారు. స్వేచ్ఛతో బతికే పిల్లలు నూతనోత్తేజంతో, నూతన సామాజిక ప్రవర్తనా సరళితో నూతన ప్రపంచంలో అడుగిడతారు.



మనం ఏమి బోధించాలి? ఏ విధంగా క్రమశిక్షణ అమలు చేయాలి? అనేది పాలక వర్గాలు శాసిస్తున్నపుడు నూతన ప్రపంచ నిర్మాణానికి ఈ రోజున పిల్లలకు ఎలా స్వేచ్ఛ ఇవ్వగలుగుతాం? మీకు స్వేచ్ఛ లేదని మీకు తెలుసు. సామ్రాజ్య దినోత్సవం... తప్పనిసరిగా జరుపుకోవాలన్న నిజం చూసినపుడు, నీకు ఏమాత్రం స్వేచ్ఛలేదని స్పష్టమవుతున్నది. సామ్రాజ్య దినోత్సవమంటే శతాబ్దాల తరబడి సాగిన సామ్రాజ్యవాద ఆధిపత్య దినోత్సవమే. అబిసీనియాలో ఇటలీ సాగించిన శతాబ్దాల దోపిడిని మనమంతా ఖండించాం. సామ్రాజ్యవాదం శతాబ్దాల తరబడి ఇటువంటి దోపిడినే కొనసాగించింది. భారతదేశంలో అర్థాకలితో అలమటిస్తున్న లక్షలాదిమంది బానిసలు, లక్షలాదిమంది ఆఫ్రికా ఆదివాసులు భూములు, స్వేచ్ఛ కోల్పోయిన సందర్భంగా సామ్రాజ్య దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఏమాత్రం నిజాయితీ ఉన్నా మనమొక అవాస్తవాన్ని సంబరంగా జరుపుకుంటునట్టు అంగీకరించక తప్పదు. కొద్దిమంది మాత్రమే ప్రయోజనం పొందుతూ దేశంలోను, విదేశాలలోను లక్షలాది మంది దోపిడికి గురవుతున్నప్పటికీ మనది గొప్పదేశం అని సంబరం చేసుకుంటున్నాం.ఇది అవాస్తవం. సామ్రాజ్యపు గొప్పలు చెప్పుకోవడం వెనుక దాగిన వాస్తవాన్ని పిల్లలు తెలుసుకునే విధంగా చేయడానికి కృషి చేయడం టీచర్ల తక్షణ కర్తవ్యం. పత్రికలు ఏమిరాస్తున్నాయనేది కాకుండా చరిత్ర పుస్తకాలలో చేర్చే వాస్తవాలను పిల్లలకు వివరించాలి. భిన్నాలు, తదితర పనికిమాలిన విషయాలతో మీకాలం వృధా చేసుకోవద్దు. సమాజం అంటే ఏమిటో, కనిపిస్తున్నదాని వెనుక దాగిన విషయాలేమిటో పిల్లలకు తెలియజెప్పాలి.

మీ పిల్లలంతా సినిమాలు చూస్తారు. స్కూలు కన్నా పిల్లలపై సినిమా ఎక్కువ ప్రభావం చూపుతుంది. సంతోషంతో కూడుకున్న భావావేశాలతోపాటు మిగిలిన విషయాలు తెలియజేస్తున్నందువల్ల అవి పిల్లలపై ఎక్కువ ప్రభావం చూపుతాయి. మందకొడిగా ఉండే క్లాస్‌రూమ్ అంతగా ప్రభావం చూపలేదు. మీరు స్కూల్లో సారంలేని సబ్జెక్టులు బోధిస్తుంటే పిల్లలు జీవితం గురించి బయటి ప్రపంచం నుంచి నేర్చుకుంటారు. కాని ఇది తప్పుడు పద్ధతిలో ఉంటుంది. మీరు బోధించే అర్థమెటిక్స్, హిస్టరీ పిల్లలకు జీవితపు విలువలు నేర్పించవు. సినిమాలు ఈ పని చేస్తాయి. కానీ ఇది విలువలను ధ్వంసం చేసేదిగా ఉంటుంది.

ఖచ్చితంగా చెప్పాలంటే బయటి ప్రపంచంలో జీవించడానికి పిల్లల్ని నువ్వు సన్నద్ధం చేస్తున్నావు. మార్కులు, బహుమతులు, పరీక్షలతో విద్యాబోధన పోటీలో నిలిచే విధంగా ప్రయత్నాలు చేస్తావు. పెట్టుబడిదారీ విధానంలో విధ్వంసభరితమైన పోటీ కోసం నువ్వు పిల్లల్ని తయారు చేస్తున్నావు.

పిల్లల్లో సెక్స్ సమస్యను అర్థం చేసుకోవడానికి నిరాకరిస్తూ వారిని బోధకుల, నైతికవాదుల దయాదాక్షిణ్యాలకు వదిలి వేస్తున్నావు. అందువల్ల వారు పెద్దవారైన తరువాత సినిమాల నుంచి సంక్రమించిన విలువతో ఒకవైపు, నిజ జీవితంలో ఉన్న విలువలతో మరోవైపు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతారు.

ఈ వ్యవస్థకు పూర్తిగా కాలం చెల్లిన విషయం మీరు గ్రహించలేరా? స్కూలు సబ్జెక్టులు నేటి జీవన విధానాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదు. విద్యార్థులు స్కూల్లో చదవడం నేర్చుకుంటారు. కానీ స్కూలు వదిలిన తరువాత వారిలో చదివే సామర్థ్యం ఉండదు. వారు లెక్కలు నేర్చుకుంటారు. కాని జీవితంలో తమ వేతనం మినహా వేరే లెక్కపెట్టుకునే అవసరమే వారికి ఉండదు. ఎన్నడూ చూడని దేశాల గురించి కూడా వారు తెలుసుకుంటారు. అదే విధంగా భాషలు కూడా నేర్చుకుంటారు. కాని వారికి జీవితంలో వీటి అవసరమే ఉండదు.

చుట్టూ జరుగుతున్న విషయాల గురించి వారికి ఎందుకు బోధించరు? పెద్ద ఎత్తున నిరుద్యోగం పెరిగిపోయిందని వారికి తెలియాలి. పరిశ్రమలంటే ఏమిటో, అత్యధిక జనాభా పేదలుగా ఎందుకున్నారో వారికి తెలియాలి. యుద్ధానికి కాలు దువ్వుతున్న వారి గురించి సామ్రాజ్యవాదం గురించి పిల్లలకు తెలియజెప్పాలి. కేవలం మంచి పౌరులుగా ఎదగాలని చెప్పినందువల్ల సరిపోదు. పిల్లలను చుట్టుకుని ఉండే క్రమశిక్షణ, భయాలు, నైరాశ్యం తదితర బంధనాలన్నింటినీ తొలగించాలి. చేతల ద్వారా మాత్రమే నేర్చుకోవడం సాధ్యమవుతుంది. అందువల్ల స్కూల్లో బహిరంగసభ ఏర్పాటుచేసి అందులో ప్రతి పిల్లవాడు భయంలేకుండా మాట్లాడేందుకు ప్రోత్సహించాలి. మంచి పౌరసత్వం గురించి వంద పాఠాలు చెప్పే కన్నా ఇటువంటి సభ ఒక్కటి ఏర్పాటు చేయడం మంచి ఫలితాలు ఇస్తుంది.

టీచర్ల పని చేయవలసింది స్కూల్లో కాదు. సమాజంలో. "మా పిల్లలు సంతోషంగా, స్వేచ్ఛగా ఉంటూ రోజంతా హడావుడిగా ఏదో ఒకటి చేస్తుంటారు. కాని వచ్చే సంవత్సరంలో వీరు డెస్క్ స్కూల్‌కి వెళతారు. వారు కొద్దికాలం స్వేచ్ఛగా ఉండి తరువాత భయంకరమైన డెస్క్‌వర్క్ క్రమశిక్షణలకులోను కావలసి ఉంటుంది. ఇది మా గుండెలు పిండేస్తున్నది" అని తరచుగా కిండర్‌గార్టెన్ టీచర్లు నాకు చెబుతుంటారు. కాని టీచర్లూ! మీరంతా ఈ పరిస్థితిలోనే ఉన్నారు. మీరు ఎంత విశ్వాసంతో, ఎంత స్వేచ్ఛతో బోధించినప్పటికీ మీ విద్యార్థులంతా భవిష్యత్తులో పారిశ్రామికీకరణ మిల్లులో నలిగి పోవలసిందే! మాంసం కోసం పందుల్ని పెంచే వ్యక్తి ఉన్న పరిస్థితిలోనే మీరు ఉన్నారు. కానీ పందుల్ని పెంచే వ్యక్తి చేసే పనిలో నిజాయితీ ఉంది. పందులకు శాస్త్రీయంగా తిండి పెడతారు. మీ పిల్లలకు ఉత్పాదకతలేని, అజీర్తిచేసే వస్తువులను ఇస్తారు.



విద్య అనేది 15 సంవత్సరాల వయసులో నిలిచిపోవాలని అంతశ్చేతనంగా మీరు అభిప్రాయపడతారు. మీ కృషి ఫలితాలను చూసుకునే అవకాశం మీకు ఉండదు. అయినప్పటికీ మీరిది గ్రహించడానికి తప్పనిసరిగా ప్రయత్నించాలి. పాత విద్యార్థులు ఎంతో ఆశగా ఆసక్తితో మళ్లీ స్కూలుకు వచ్చేందుకు అవకాశం ఉండాలి. అక్షరాలు, భాషలు బోధించడమే తమ పని అనుకునే సంకుచిత తత్వం లేనపుడే ఈ అవకాశం ఉంటుంది.

పరిస్థితులను మార్చుకోవాలని మీకు నేను చెప్పవలసిన అవసరం లేదు. మీ సామాజిక అంతరాత్మ ఇది నిర్ణయించాలి. ఏది ఏమైనప్పటికీ నేనొక సలహా మాత్రం ఇవ్వగలను. మీ విద్యార్థులలోను, ప్రపంచంలోను భావావేశాల జీవితానికి సంబంధించి మీ పాత్ర నిర్వహించడానికి అవకాశం ఇవ్వాలని మీరు డిమాండ్ చేయాలి. దేశభక్తితో ఆలోచిస్తే సరిపోదు. క్లాస్‌రూమ్‌లోని మేధాపరమైన శిక్షణ సరిపోదు. పిల్లల భావావేశాలు సినిమా లేదా మతం లేదా రేస్‌కోర్స్, ఫుట్‌బాల్ ఆకట్టుకోకముందే టీచర్లు ఆకట్టుకోగలగాలి. మూడు "ఆర్" లు (రీడింగ్, రైటింగ్, అర్థమెటిక్స్) బోధించండి. కాని ఎక్కువ కాలం భావావేశపరమైన సృజనాత్మక కార్యకలాపాలకు కేటాయించాలని డిమాండ్ చేయండి.

మీ పిల్లలు వారి నాటకాలు వారే రాసుకొని నటిస్తుంటే సినిమాలు చూసేటపుడు తమదైన పద్ధతిలో చూస్తారు. వారు సినిమాలు చూడడం మానేస్తారని మాత్రం నేను చెప్పను. నాటకాలు రాసే వాడిగా విమర్శనాత్మక దృష్టితో సినిమాలు చూస్తారు. వారికి ఫుట్‌బాల్ ఆడడానికి తగిన సమయం ఉండాలి. లేనిపక్షంలో వారు ఎదిగిన తరువాత వేలాదిమందిలో నిలబడి ఆటచూసి సరిపెట్టు కోవలసివస్తుంది.

పిల్లలకు సెక్స్‌పట్ల ద్వేషం పెంచితే, సెక్స్ అపీల్ సినిమా చూస్తున్నపుడు తమలోని సెక్స్‌పరమైన పరిస్థితిని గుర్తుకు తెచ్చుకుంటారు. అలా కాకుండా సెక్స్‌పట్ల సదవగాహన కలిగి ఉంటే అందమైన సినీనటిని తెరపై చూడాలన్న కాంక్షకు దూరంగా ఉండగలుగుతారు. విద్యార్థి స్కూలు జీవితం సంతోషంగా సృజనాత్మకతతో కూడుకొని ఉంటే ఆ తరువాత ఫ్యాక్టరీలో బానిస జీవితాన్ని ఆసక్తిగా కోరుకోడు. కాని ఆర్థిక కారణాల వల్ల బానిస జీవితం ఆమోదించక తప్పదు. భావావేశపరంగా స్వేచ్ఛగా ఉన్నందువల్ల తనవర్గం పరిస్థితి మెరుగు చేసుకోడానికి కృషి చేస్తాడు.

స్కూల్లో సృజనాత్మకతకు పెద్దపీట వేయాలని నువ్వు డిమాండ్ చేస్తే నిన్నుపాలించే శక్తుల నుంచి వ్యతిరేకత ఎదుర్కోవలసి వస్తుంది. కార్మికులకు ఏదైనా తెలిసినందువల్ల పాలక శక్తులు బెదరవు. కాని వారు ఎలా తయారవుతారనే భయం ఈ శక్తులకు ఉంటుంది. ఈ శక్తులను తక్కువ అంచనా వేసే పొరపాటు చెయ్యొద్దు. వారి తెలివి తేటలు

ఎక్కువ భాగం అంతశ్చేతనంగా ఉన్నప్పటికీ తెలివిగలవారు. అయితే కొన్ని సందర్భాలలో చాంబర్లిన్ వంటి వారికి కూడా దూరదృష్టి లేకుండా పోతుంది. ఏది ఏమైనప్పటికీ తమ వర్గం అధికారం కాపాడుకోవడం వారికి తెలుసు. ఇటలీ, జర్మనీలోని పెట్టుబడిదారి విధానానికి ప్రత్యామ్నాయ మేమంటే బోల్సివిజం. అధికారంలో ఉన్న వర్గాలు కమ్యూనిస్టు సమాజానికి బదులు పెట్టుబడిదారీ విధానంలో ఉండే వర్గ విభజనను కోరుకుంటున్నాయి. పెట్టుబడిదారుల మధ్య అవగాహనకు మ్యూనిచ్ ఒప్పందం చేసుకున్నారు. కానీ ఇతర పెట్టుదారులు ఎక్కువ వాటా ఆశించారు. అందువల్ల ఒప్పందం విఫలమైంది. ఈ రోజున (1939లో) రష్యాతో జతకట్టడానికి సంసిద్ధతలేదు. దీనివల్ల తీవ్రపరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. జర్మనీ ఓటమి పాలైతే సోషలిస్టు రిపబ్లిక్‌గా అవతరిస్తుంది. ఇతర పెట్టుబడిదారీ శక్తులు జర్మనీలో జోక్యం చేసుకోకుండా రష్యాసైన్యం కాపాడుతుంది.

మీరంతా ఐక్యంగా ఉండి, అధికారవర్గం దగ్గరకు వెళ్లి మీరు ఈ విధంగా చెప్పగలిగితే, “విద్యకు సంబంధించి మా పథకాలు రూపొందిస్తున్నాం. విద్యలో భావావేశాలకు ప్రధానపాత్ర కల్పించడానికి టైంటేబిల్‌ను సవరిస్తున్నాం.” మీ పాలకులకు దీని గురించి ఆలోచించవలసిన అవసరం కూడా లేదు. సహజాతం ఆధారంగా–మీ పథకం ప్రమాదకరమైందని వారు గ్రహించగలరు. చైతన్యయుతంగా చెప్పలేక పోయినప్పటికీ ప్రమాదాన్ని పసికట్టగలరు. ఈ అభ్యంతరాలు త్వరలోనే తార్కిక రూపం దాల్చుతాయి...ఏమిటీ! మామిల్లులలో పనిచేయడానికి మీ కళాకారులు, నృత్యాలు చేసేవారు, రచయితలు అవసరం లేదు. పది సంవత్సరాల పాటు బొమ్మలుగీస్తూ, నాటకాలలో పాల్గొన్న బాలిక సమర్థురాలైన టైపిస్టు కాగలుగుతుందా? ప్రస్తుత విద్యా విధానం లోపభూయిష్టమైనదో కాదో దేవుడికి ఎరుక. నాకు సరైన అప్రెంటీస్ దొరకడం కష్టమవుతుంది. కేవలం నృత్యాలు చేస్తూ, బొమ్మలు గీసేవారు మాకు అవసరం లేదు.... అంటారు.

అయితే రష్యాలో ఈ విధంగా జరిగింది. ప్రారంభంలో విద్యలో స్వేచ్ఛ, స్వయంపాలన, సృజనాత్మకత ప్రవేశపెట్టారు. క్రమంగా అది మార్పు చెందింది. ఇది బాగానే ఉంది. కాని మనం సోషలిస్టు నాగరికతను నిర్మించుకునే తొందరలో ఉన్నాం. మనకు నిపుణులైన కార్మికులు, ఇంజినీర్లు, టీచర్లు, డాక్టర్లు, మేనేజర్లు అవసరమవుతారు. పూర్తి స్వేచ్ఛను కల్పిస్తే ఈ క్రమం నెమ్మదిస్తుంది. అని రష్యా రాజ్యాంగ యంత్రం నచ్చజెప్పింది. రష్యాలో ఏర్పాటవుతున్న నూతన వ్యవస్థను చుట్టూ వున్న శత్రువుల నుంచి రక్షించుకోడానికి ఇది తప్పనిసరని రష్యామిత్ర వర్గాలు భావిస్తున్నాయి.

భావావేశాల ప్రాముఖ్యం గురించి మీలో కొంతమందికి సందేహ లుండవచ్చు.



నాపై నమ్మకం ఉంచండి. మీరు భావావేశాలకు తగిన విద్య అందిస్తే, మేధస్సు దానంతటదే అభివృద్ధి చెందుతుందని నా సుదీర్ఘ అనుభవంలో రుజువైంది. ఒక పిల్లవాడిలో హస్తప్రయోగంతో నేరం చేశానన్న భావం తొలగిస్తే అతను పాఠాలను ఆసక్తితో ఇష్ట పూర్వకంగా నేర్చుకుంటాడు. నేను ఈ ఉదాహరణ ఎందుకు చెబుతున్నానంటే–ఖచ్చితంగా చెప్పాలంటే భావావేశాలకు విద్యాబోధన సాధ్యంకాదు. అయితే భావావేశాలకు కట్టిపడేసి–వాటిని నేరం చేశామన్న భావం, ద్వేషాలుగా మార్చే బంధనాలను తొలగించే ప్రయత్నం చేయవచ్చు. భావావేశాలకు మార్గం చూపవచ్చు. భౌతిక పరమైన మానవత్వంతో వీటికి సంబంధం ఉండదు. ఒక బాలుడు వినాశంతో కూడిన భావావేశాలతో టీచర్‌ను ద్వేషించడంకంటే సృజనాత్మకతతో కూడిన భావావేశాలతో బొమ్మలు వేసుకోవడం మంచిది. స్కూళ్లన్నిటిలో భావావేశాల వ్యక్తీకరణకు అవసరమైన పరికరాలుంటే, టీచర్‌ను ద్వేషించే లక్షణం మాయమవుతుంది.

నీ పనితోపాటు నువ్వు సామాజిక స్వేచ్ఛ పొందే అవకాశం కూడా ఉండాలి. కాని ఇది పొరపాటు అభిప్రాయం. నీ పనిలో జీవనానికి అవసరమైన సృజనాత్మకత ఉంటే నీ సామాజిక స్వేచ్ఛను కూడా పొందగలుగుతావు. నీ పని హోదా పెరిగితే, నీ సామాజిక హోదాకూడా పెరుగుతుంది. మీరు బానిసలను తయారు చేస్తున్నంతకాలం మీరు కూడా బానిసలుగానే ఉంటారు.

ఇప్పుడు నేను యువజనులనుద్దేశించి మాట్లాడదలచుకున్నాను. దొంతరల వ్యవస్థను...పితృస్వామిక, మాతృస్వామిక వ్యవస్థలను ప్రపంచం చూసింది. ఈ రోజున పితృస్వామిక వ్యవస్థ ఎక్కువగా అమలులో ఉంది. అది ఆత్మహత్యకు సన్నద్ధమవుతున్నట్టుగా ఉంది. దీనిస్థానంలో యువజనుల పాలన ఏర్పాటు చేయడం సాధ్యం కాదా? 70 సంవత్సరాలు పైబడిన వృద్ధుడిని ప్రధానమంత్రిగా చేసి సమాజం సంతృప్తి చెందాలా? 40 సంవత్సరాల వ్యక్తి మంత్రివర్గంలో స్థానం పొందితే ఆశ్చర్యం వ్యక్తం కావడంలేదా? మీరు వృద్ధులవైపా, యువకులవైపా? ఈ ప్రశ్నను మీరు ఎదుర్కోవాలి. ఈ ప్రశ్న ఎదుర్కోవాలంటే వృద్ధులు తెలివైన వారని, యువకులు కాదనే వాదనను నిర్ద్వందంగా సవాలు చేయాలి. ఇది అబద్ధం. పచ్చి అబద్ధం. యువజనులు ముందుగా పనిలోదూకి తరువాత ఆలోచిస్తారని, వృద్ధులు ఆలోచించి తరువాత పనిచేస్తారనే నమ్మకంపై ఈ అభిప్రాయం ఆధారపడిఉంది. సాధారణంగా వృద్ధులు అసలు పనే చేయరు. కాని వయసుతో అనుభవం వస్తుందన్న నమ్మకం మాత్రం కొనసాగుతుంది.

లేడీ విండ్ మియర్స్ ఫాన్ నుంచి ఒక ఉదాహరణ:

**లార్డ్ డార్లింగ్టన్:** నువ్వు అనుభవజ్ఞుడిలా మాట్లాడుతున్నావు.

**సిసిల్‌గ్రాహం:** అవును

**లార్డ్ డార్లింగ్టన్:** నువ్వు చూస్తే యువకుడిలా ఉన్నావు.

**సిసిల్‌గ్రాహం:** ఇది చాలా పెద్ద పొరపాటు. అనుభవం అనేది జీవనానికి సంబంధించిన సహజాతం. నాకది ఉంది. టప్పీకి అదిలేదు. తాను చేసే పొరపాట్లకు టప్పీ అనుభవం అనిపేరు పెడుతున్నాడు. అంతే అంతకంటే ఏమీ లేదు.

ఆస్కార్‌వైల్డ్ నిరాశావాది. కాని కొన్ని సందర్భాలలో తనకు తెలిసిన దానికంటే ఎక్కువ వివరణ ఇచ్చాడు. అనుభవానికి వయసుతో సంబంధం లేదు... బార్సిలోనాలోని పిల్లల ముఖాలలోని చూస్తే ఇది తెలుస్తుంది. మిగిలిన పిల్లలకు భయానక పరిస్థితేమిటో తెలియదు. కాని బార్సిలోనా పిల్లలు వాటిని అనుభవించారు. లండన్‌లోని అట్టడుగు వర్గానికి చెందిన బాలుడు తన వయసుకు అరురెట్లు అనుభవం సంపాదిస్తాడు. వృద్ధతరం వారు యువతను ద్వేషిస్తారు. యువకులంటే భయపడతారు. యువతను లొంగదీసుకోడానికి అనుభవాన్ని ఉపయోగించుకుంటారు. "పిల్లలను చూడాలి. కాని వారు చెప్పేది వినకూడదు" అన్నది పితృస్వామిక వ్యవస్థ మూల సిద్ధాంతం. దురదృష్టవశాత్తు, స్కూళ్లలోను, విశ్వవిద్యాలయాల్లోను విద్యను కూడా వృద్ధతరం పర్యవేక్షిస్తున్నది. విద్యావ్యవస్థ కరడుగట్టుకు పోయింది. ఈ వ్యవస్థలో టీచర్‌మాత్రమే ప్రశ్నలు వేస్తాడు. తెలిసి కూడా చైనా రాజధాని ఏమిటని తనను ప్రశ్నించిన టీచర్‌ను చూసి ఆశ్చర్యపోయి ఇబ్బంది పడే బాలుడికి నా సానుభూతి ఎప్పుడూ ఉంటుంది. ఇటువంటి బాలుడు నాకు స్కూల్లో ఒక క్లీనర్ చెప్పిన మాటలు గుర్తుకు తెప్పిస్తున్నాడు. "బోర్డుమీద కా.సా.గు. కనుగొనండి." అనే మాటలు చూసి, "ఇది ఇంకా కనుక్కోలేదా? నా చిన్నప్పటి నుంచి ఇది బోర్డుపై ప్రత్యక్షమవుతూనే ఉంది." అని క్లీనర్ అన్నాడు. ఈ రెండు కథలు మన విద్యావిధానంపై సవిమర్శకు దోహదం చేస్తాయి. స్కూల్లో కథలను పోగుచేస్తే అవన్నీ మన విద్యావిధానాన్ని అభిశంసిస్తున్నట్టు తెలుస్తుంది.

టీచర్‌ను చూడాలి. వినకూడదు. సమాజంలో యువ టీచర్లు ఈ పరిస్థితిలో ఉన్నారు. సగానికి పైగా యువ టీచర్లను తమకు ఇష్టమైన రీతిలో బోధించడానికి వీలులేకుండా నిరోధిస్తున్నారు. ఎందుకు? మీ స్కూళ్లలో వృద్ధతరం పెత్తనం సాగుతున్నందువల్ల ఈ విధంగా జరుగుతున్నది. స్కూళ్లలో సిబ్బందికి స్వయంపాలన ఏర్పాటు చేయాలని యువటీచర్లు డిమాండ్ చేయాలని నేను కోరుకుంటున్నాను. నాకు కూడా వయసు మీద పడుతున్నది. నేను కూడా వృద్ధుడనయ్యానని అనుకోవలసిన పరిస్థితి ఏర్పడుతున్నది. కాని మా స్కూల్లో యువ టీచర్లు బోధించే తీరుకు నేనెన్నడూ అడ్డుపడలేదు. ప్రతి టర్మ్ ప్రారంభంలో వారు టైమ్‌టేబుల్ రూపొందిస్తున్నపుడు నేను ఆ



సమీపంలో కూడా ఉండను. టైమ్‌టేబుల్, టీచింగ్ పట్ల నాకు ఆసక్తి ఉండదు. అంతేకాకుండా ఈ పని చేయడం నాకంటే వారికే బాగా తెలుసని నేను భావిస్తాను. సమ్మర్‌హిల్ స్కూల్లో ఒక టీచర్‌ను నియమించడానికి లేదా తొలగించడానికి నాకు అధికారం ఉంది. నేను కూడా పెట్టుబడిదారీ వ్యక్తివాద సమాజంలోనే ఉన్నానన్నది ఈ సందర్భంగా గుర్తుంచుకోవాలి. ఒకసారి కొంతమంది సిబ్బంది స్కూల్‌ను అందరికీ సమాన హక్కు కల్పించే కో ఆపరేటివ్ స్కూల్‌గా మార్చాలని ప్రతిపాదించారు. స్పష్టమైన ప్రణాళిక రూపొందించి, స్కూల్‌స్థాపించానని అందువల్ల విధాన నిర్ణయం నేనే చేయాలని చెప్పి ఈ ప్రతిపాదనను తిరస్కరించాను.

నేను బోధించే విషయాలు ఆచరణలో పెట్టడంలేదని ఇక్కడ మీరు నాపట్ల సందేహం వెలిబుచ్చే అవకాశం ఉంది. స్వయం నిర్ణయాధికారం డిమాండ్ చేయవలసిందిగా మాకు చెబుతూ, మీ స్కూల్లో ముసలివాడి పాలన ఆమోదిస్తున్నారు. అని నన్ను తప్పు పట్టే అవకాశం ఉంది. ఈ విమర్శ న్యాయమైనదేనని నేను అంగీకరిస్తాను. ఇక్కడ ముసలివాడు అధికారం పట్టుకు వేలాడుతున్నాడని నేను ఆమోదిస్తాను. సమ్మర్‌హిల్ స్కూల్లో నేను పాలకవర్గాన్ని. అన్ని పాలక వర్గాల మాదిరిగానే నేను కూడా పూర్తి అధికారంచెలాయించాలని కోరుకుంటాను.

నియంతృత్వ ప్రభుత్వాలు తమ పాలనను సమర్థించుకున్న తీరులోనే, నా పరిస్థితిని సమర్థించుకోవడానికి కూడా నా కొక ఆధారం ఉంది. మీ స్కూళ్లకు నా స్కూలుకు మధ్య ఒక ముఖ్యమైన తేడా ఉంది. మీకు మార్గాంతరంలేదు. మీరు ప్రభుత్వానికి సేవ చేయడాన్ని బట్టి ప్రభుత్వ డిమాండ్ల మేరకు పనిచేయడాన్ని బట్టి జీవనాధారం ఉంటుంది. నా సిబ్బంది స్వేచ్ఛగా నావద్దకు వస్తారు. వారు స్వేచ్ఛలో పనిచేయాలని కోరుకుంటారు. వారి వేతనం ప్రభుత్వం వేతనం కన్నా చాలా తక్కువ ఉంటుంది. వారు నటించనవసరం లేదు. వారు తమ జీవనం తాము గడుపుకోడానికి అవకాశం ఉంటుంది. వారు చేతనైనంత మేర రాజకీయ కార్యకలాపాలు కూడా సాగించవచ్చు. తమ ఇష్టం వచ్చిన దుస్తులు వేసుకోవచ్చు. వారు ఇష్టం వచ్చిన తీరులో బోధించవచ్చు.

అన్నిటికన్నా ముఖ్యమైనదేమంటే వారు చేసే పనిపట్ల వారికి నమ్మకం ఉంటుంది. వారు ఆగ్రహం తెచ్చుకోవలసిన అవసరం రాదు. వారు నిజాయితీగా స్కూలు అనుసరించే మనస్తత్వ విధానాన్ని ఆమోదిస్తారు. స్కూలు స్వయంపాలన, ఇష్టమైతే క్లాసులకు హాజరు కావడం–ఇష్టం లేకపోతే మానుకోవడం,దొంగతనం లేదా జగడాలమారి స్వభావం లేదా ధ్వంసంచేసే స్వభావాలను మనస్తత్వ రీత్యా సరిదిద్దాలనే స్కూలు మౌలిక విధానాలను వారు ఆమోదిస్తారు.

స్కూలు కోఆపరేటివ్ పద్ధతిలో నడపాలన్న ప్రతిపాదన, సమసమాజంపట్ల చైతన్యం కలిగిన ప్రగతికాముల నుంచి వస్తుంది. సహజంగానే స్కూళ్లలో కమ్యూనిస్టు విద్యావిధానం అంటే సామాజిక బాధ్యత ఉండాలని వారు కోరుకుంటారు. వారి ఆలోచనలు సరైనవే, ఎందుకంటే భవిష్యత్తులో అంతా సహకార విధానమే అమలులోకి వస్తుంది. ఒకే వ్యక్తి నడిపే పద్ధతికి (one man show) కాలం చెల్లిపోతున్నది. మనస్ఫూర్తిగా చెప్పాలంటే సమ్మర్‌హిల్ అనేది వ్యక్తి నడుపుతున్న స్కూలు. స్కూలు ప్రోస్పెక్టస్ కావాలనుకునే తల్లిదండ్రులు నాకు జాబు రాస్తారు. వారు నా పుస్తకాలు చదువుతున్నందువల్ల ఈ విధంగా జరుగుతుంది. వారు స్కూలు సందర్శనకు వచ్చినపుడు నా గురించి అడుగుతారు. నాకు అన్ని వేళలా ఒక విమర్శ వినవస్తూనే ఉంది. "సమ్మర్‌హిల్ వంటి స్కూళ్లలో లోపమేమంటే అవి ఒక వ్యక్తి అభిప్రాయాలపై ఆధారపడి ఉంటాయి. ది లిటిల్ కామన్వెల్త్‌ను చూడండి అది పూర్తిగా హోమర్‌లేన్ వ్యక్తిత్వంపై ఆధారపడి ఉంది".

ఇలా ఉండకూడదు. మౌలికంగా ఆలోచించినపుడు ఇది నిజం కాదు. వ్యక్తిత్వాలు ముఖ్యమైనవే. ఎందుకంటే కొత్తబాటకు ఇవి మైలురాళ్ల వంటివి. ఉద్యమాన్ని వ్యక్తిత్వం నిర్మించలేదు. ఉద్యమానికి వ్యక్తిత్వం దోహదం చేస్తున్నది. నాజీజాన్ని హిట్లర్ స్థాపించలేదు. హిట్లర్‌ను నాజీజం రూపొందించింది. హోమర్‌లేన్, ఫ్రాయిడ్, స్టెకెల్, రైక్, ఇ.ఎఫ్.ఒనీల్, ఎడ్మండ్ హోమ్స్, మాక్‌మన్ తదితరులు సాగించిన ఉద్యమం నన్ను ప్రభావితం చేసి ఉండకపోతే నేను నా కృషి చేయగలిగే వాడినే కాదు. ప్రగతి కాముక సైన్యానికి వ్యక్తిత్వాలు వేగుచుక్కవంటివి. వేగుచుక్క వంటివారు మరణించినప్పటికీ సైన్యం ముందుకు సాగిపోతుంది. కొత్త వ్యక్తులు ముందుకు వస్తారు. 50 సంవత్సరాల తరువాత నా పేరు గాలిలో కలిసిపోతుందని నాకు తెలుసు. అప్పటికి విద్యా విధానం ఎంతో ముందుకు సాగిపోతుందని కూడా నాకు తెలుసు.

చిత్రకళా ప్రపంచంలో వ్యక్తి కీర్తి సాధారణంగా అతను చేసిన వినూత్న ప్రయోగాలపై ఆధారపడి ఉంటుంది. వాన్‌గోగ్, సిజాన్నే గొప్ప వారెందుకయ్యారంటే, వారు చిత్రకళలో నూతన పోకడలను ప్రవేశపెట్టారు. వారి గొప్పదనం చరిత్రాత్మకమైనదని, వ్యక్తిగతమైనది కాదనేది వాస్తవం. నాకు చిత్రకళలో ప్రవేశం పెద్దగా లేనందువల్ల వాన్‌గో వేసిన చిత్రాలలో ఏమి గొప్పతనం ఉందో నేను చెప్పలేను. అయినప్పటికీ చారిత్రకంగా అది ఎంతో ముఖ్యమైనదని నాకు తెలుసు.

ప్రజల అంతశ్చేతనం నుంచి ఉద్యమాలు జనిస్తాయని నా అభిప్రాయం. అందువల్ల యూరోపులో వచ్చే ఉద్యమాలు ఒకే సమయంలో అమెరికాలో కూడా వస్తుంటాయి. గతంలో ఇవి వ్యక్తులకు పరిమితమై ఉండేవి. కాని భవిష్యత్తులో ఇవిప్రజా సమూహ



మంతటికి వర్తించే విధంగా ఉంటాయి. గతంలో ఈ రెండు ధోరణులు అంటే వ్యక్తులు, ప్రజా సమూహాలు ఉద్యమంలో ఒకేసారి కలగా పులగంగా వ్యక్తమయ్యేవి. ఉదాహరణకు ఎలిజిబెత్ హయాంలో బృందాలుగా ఉన్న రచయితలు కొత్తగా వచ్చిన పరిణామాలను ప్రతిబింబిస్తూ నాటకాలు రాశారు. కాని షేక్స్‌ఫియర్ అనే వ్యక్తి గొప్ప ప్రతిభావంతుడుగా ముందుకు వచ్చాడు. కాని అతనొక్కడే ఉద్యమాన్ని నిర్మించలేదు. షేక్స్‌ఫియర్ లేని పక్షంలో బెన్‌జాన్‌సన్స్, మార్లోవ్స్ ఆ కృషి చేసి ఉండేవారు.

ప్రస్తుత ప్రపంచ వాతావరణంలో మనం వ్యక్తిత్వాలను ఎక్కువగా అంచనావేసే అవకాశం ఎక్కువ. ఛాంబర్లిన్, హిట్లర్, ముసోలిని, రూజ్‌వెల్ట్‌ల ఉపన్యాసాల కోసం ప్రపంచం ఊపిరి తీసుకోకుండా ఎదురు చూస్తున్నది. ప్రపంచం అంతం కావడంపై లేదా కొనసాగడంపై వారికి అధికారం ఉన్నట్టుగా కనిపిస్తుంది. అయినప్పటికీ వారు సామూహిక శక్తుల కీలుబొమ్మలు, బాకాలు. వారు ఆ పరిస్థితులను నియంత్రించరు. పరిస్థితులే వారిని నియంత్రిస్తాయి. నిజమే వారిలో ఒకరు రక్తపాతంతో కూడిన యుద్ధాన్ని ఏక్షణంలోనైనా ప్రారంభించవచ్చు. కానీ ఒక జాతీయ నాయకుడు మరణించినప్పటికీ ఆ దేశం విధానం చివరికంటా అమలవుతుంది.

అదే విధంగా విద్యలో కూడా జరుగుతుంది. ప్రగతికాముక ఉద్యమం సాగుతూనే ఉంటుంది. నీల్‌వంటి వారు నాయకులుకారు. వారికి ఉద్యమం నాయకత్వం వహిస్తుంది. అదే విధంగా విద్యకు సంబంధించిన చాందసవాదులకు కూడా ఉద్యమమే నాయకత్వం వహిస్తుంది. ఈ పోరాటం కేవలం సమ్మర్‌హిల్‌కు ఒక పబ్లిక్ స్కూల్‌కు మధ్య పోరాటం కాదు. అది చలనంలో ఉన్న శక్తికి, నిశ్చలంగా ఉన్న శక్తికి మధ్య పోరాటం. ప్రగతికి సంప్రదాయానికి మధ్య పోరాటం. యువజనులైన టీచర్లు విద్యలో కొనసాగే సంప్రదాయాలను వ్యతిరేకిస్తూ, నూతన ప్రపంచం వైపు దృష్టి సారిస్తున్నారు.

కాని నాయకుడికోసం ఎదురుచూసే క్రమంలో జాగ్రత్త వహించండి. వెనుకబడిన శక్తులు నాయకుడిని అనుసరిస్తాయి. ఏది ఏమైనప్పటికీ ఇవి లక్ష్యాన్ని చేరుకోలేవు. నాయకుడికి సంబంధించి విషాదమేమంటే ఆయన లక్ష్యాలను ప్రజా సమూహం కోరిక ఎప్పుడూ వ్యతిరేకిస్తుంది. ఏసుక్రీస్తు చెప్పిన పుణ్యభూమిని చేరుకోవడం కష్టం. అందువల్ల క్రైస్తవులు తేలికగా చేరుకోగల క్రైస్తవ చర్చిని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాని చర్చి క్రీస్తు చెప్పినదానికి భిన్నంగా ఆదర్శాలు, ఇంక్విజిషన్ (ఘోర చిత్రహింసలు), పోరాటపటిమ, వ్యాపార లక్షణాలు పెంపొందించుకుంది.

ప్రగతికి అంతు అంటూ ఉండదు. "చివరకు చేరుకోవడం కంటే ప్రయాణం కొనసాగించడమే మంచిది." అని స్టీవెన్సన్ చెప్పిన మాటలు ఎంతో అద్భుతమైనవి.

ఆస్కార్‌వైల్డ్ ఇదే మాటలను వేరే విధంగా చెప్పాడు. "ఈ ప్రపంచంలో రెండు విషాదాలు మాత్రమే ఉన్నాయి. ఒకటి కోరుకున్నది పొందలేకపోవడం. రెండోది కోరుకున్నది పొందడం. రెండోది తీవ్రమైన, నిజమైన విషాదం."

ఆదర్శాలు నిశ్చలమైనవి. అందువల్ల అవి ప్రమాద భరితమైనవి. కొన్ని సందర్భాలలో నేను ఇవన్నీ వదిలిపెట్టి హెన్రీ కాటన్‌లాగా గోల్ఫ్ ఆడుకోవాలని లేదా పాల్‌రాబ్సన్‌లాగా పాటలు పాడాలని అనుకుంటాను. ఏ మనిషి చివరిదాకా పోలేదు. అయితే ఎటువంటి లక్ష్యం లేకుండానే ప్రయాణం ప్రారంభించాలా? లేదు. తదుపరి మైలురాయిని మనం లక్ష్యంగా నిర్ణయించుకోవాలి. నువ్వు నడిచి వెళుతున్నపుడు నాలుగు మైళ్లు దూరం వరకు కేవలం రోడ్డుమాత్రమే కనిపిస్తుంటే నీలో చోటు చేసుకునే నిరాశ జ్ఞాపకం ఉందా? సమీపంలోని పచ్చని ప్రదేశాన్ని చూడడం మనసుకు ఆహ్లాదం కలుగుతుంది. నేను కారులో స్కాట్లండ్ వెళుతున్నపుడు మైలురాళ్లు చూడను. నేను త్వరలోనే గమ్యస్థానం చేరుకుంటున్నట్టు ఊహిస్తాను. నువ్వు పర్వత శిఖరం మాత్రమే చూస్తుంటే దారి పక్క ఉన్న ప్రదేశాలను చూడలేవు.

ఇది ఇంగ్లాండ్ కమ్యూనిస్టుపార్టీ అనుసరిస్తున్న తెలివైన విధానం. మన విద్యామంత్రి పాక్సటన్ చాండ్‌విక్ కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు. కాని కౌన్సిల్ మీటింగ్‌లలో ఆయన కమ్యూనిస్టు ప్రచారం చెయ్యడు. స్థానిక పరిస్థితులు, గృహాలు, స్కూలు పిల్లల భోజనం తదితర అంశాలపై ఆయన దృష్టి కేంద్రీకరిస్తాడు. ఇదే తీరులో విద్యకు సంబంధించినవి కూడా ఉంటాయి. ప్రస్తుతం అన్ని స్కూళ్లను ఫ్రీస్కూళ్లు చేయాలని, పిల్లలకు ఆడుకోడానికి లేదా నేర్చుకోడానికి స్వేచ్ఛ కల్పించాలని డిమాండ్ చేయడం సముచితం కాదు.

తల్లిదండ్రులకు మీ అభిప్రాయాలను తెలిపి, వాటిని ఆమోదింప జేయడానికి యువటీచర్ల ఉద్యమం కృషి చేయాలి. అవకాశం దొరికినపుడల్లా వారిని కలుసుకొని మీ అభిప్రాయాలను వివరించాలి. పిల్లల మనస్తత్వశాస్త్రం గురించి వారికి అర్థమయ్యేలా చెప్పాలి. పిల్లల స్వభావం గురించి లక్షలాదిమంది తల్లిదండ్రులు అజ్ఞానంలో ఉన్నారు. వారు విద్య గురించి ఎన్నడూ ఆలోచించలేదు. మతాన్ని లేదా వర్గ పాలనతో వచ్చే పేదరికాన్ని ఆమోదించినట్టుగానే విద్యను కూడా ఆమోదిస్తున్నారు. కొద్దికాలం క్రితం కార్మిక వర్గానికి చెందిన తల్లుల బృందంతో మాట్లాడాను. అవగాహన చేసుకోడానికి వారెంతో ఆసక్తి చూపారు. వారిలో కొంతమంది యథాలాపంగా తమ పిల్లలను కొట్టేవారు. ఇంట్లో క్రమశిక్షణ నెలకొల్ప డానికి వేరే మార్గాలున్నాయని చెప్పినపుడు వారు ఎంతగానో ఆశ్చర్యపోయారు.

ఆ తరువాత విద్యకు ఉన్న రాజకీయ స్వభావం గురించి వారిని చైతన్య వంతులను



చేయాలి. స్కూలు విద్య అసంపూర్తిగా ఉన్న విషయం వారికి తెలియదు. జీవితాన్ని ఎదుర్కోడానికి పిల్లలను సంసిద్ధం చేస్తున్నామని చెప్పుకొంటున్న విద్య ఏ విధంగా విఫలమవుతున్నదో వారికి వివరించాలి.

అదే సమయంలో వృత్తిలో స్వయం నిర్ణయాధికారం కోసం మీరు పోరాటం సాగించాలి. పోరాటానికి తొలిమెట్టుగా స్కూళ్లను తనిఖీ చేసే విధానానికి నిరసనగా ఉద్యమించాలి. న్యాయవాదులు, మతాధికారులు సక్రమంగా పనిచేస్తున్నారా? లేదా? అనేది ఎవరూ పర్యవేక్షించడం లేదు. టీచర్లను బస్ కండక్టర్లకు సమానంగా పరిగణిస్తున్నారు. ట్రామ్‌లో ప్రయాణిస్తున్నపుడు టికెట్ కోసం ఇన్‌స్పెక్టర్ అడిగినపుడల్లా మానవత్వాన్ని దిగజార్చుతున్నారన్న భావం కలుగుతుంది. టికెట్ తనిఖీ చేస్తున్నపుడు ఉద్యోగులు మోసం చేస్తున్నదీ లేనిదీ తెలుసుకోడానికి ప్రయత్నిస్తారు. తోటివారి పట్ల అపనమ్మకం వ్యక్తం చేయడానికి అత్యున్నతమైన ప్రతీకగా ఇన్‌స్పెక్టర్ వ్యవహరిస్తాడు. స్కూలు ఇన్‌స్పెక్టర్ కూడా ఇదే విధంగా వ్యవహరిస్తాడనేది దాచిపెట్టినా దాగని సత్యం. స్కూలు ఇన్‌స్పెక్టర్‌కు ఇంతకు ముందున్న అధికారాలు ప్రస్తుతం లేవని నాకు తెలుసు. అతనికి పిల్లల మనస్తత్వశాస్త్రం, ఆర్థిక శాస్త్రం గురించి ఏమాత్రం తెలియకపోయినప్పటికీ అతని డిగ్రీలను బట్టి ఇన్‌స్పెక్టర్ పదవిలో నియమిస్తారు. బహుశా అతనికివిద్యాపరమైన సిద్ధాంతాల గురించి తెలిసి ఉండవచ్చు. కాని అటువంటి సిద్దాంతాలేమీ ఉండవని గ్రహించడానికి అతను అశక్తుడు. అతని జీవితంలో ఒక్క క్లాసు కూడా బోధించక పోవచ్చు. నేను యువకుడిగా ఉన్నపుడు స్కూలు ఇన్‌స్పెక్టర్లు సరాసరి ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుంచి వచ్చేవారు. వారికి ఒక్కరోజు కూడా బోధన అనుభవం ఉండేది కాదు. కాని ప్రస్తుతం పరిస్థితిలో మార్పులు వచ్చాయి. ఎన్నిమార్పులు వచ్చినప్పటికీ టీచర్లను తనిఖీ చేయడమనేది మొత్తం బోధనా వృత్తికే అవమానం. టీచర్ల తనిఖీ అనేది బోధనా వృత్తిని బస్‌కండక్టర్ల స్థాయికి దిగజార్చుతున్నది. కండక్టర్ల మాదిరిగానే టీచర్లు కూడా ఇన్‌స్పెక్టర్లకు భయపడే వాతావరణం మాత్రం తొలగిపోలేదు. ఇన్‌స్పెక్టర్ వచ్చాడనగానే టీచర్లంతా భయపడతారు. మతబోధన పొందిన టీచర్లు ఇన్‌స్పెక్టర్ అంటే దేవుడిని చూచినంతగా భయపడతారు.

స్కూలు విద్య తప్పుడు విధానంలో ఉందని చెప్పడానికి ఈ ఇన్‌స్పెక్టర్ల వ్యవస్థ స్పష్టమైన నిదర్శనం. ఒకక్లాసులో అర్థమెటిక్స్ పరిజ్ఞానం ఎంత ఉన్నదో పరీక్షించవచ్చు. కాని అది అంత ముఖ్యం కాదు. వ్యక్తిత్వాన్ని లేదా సంతోషాన్ని పరీక్షించడం సాధ్యం కాదు. ఇది ప్రముఖమైనది. ఉదాహరణకు: ఇన్‌స్పెక్టర్ మా స్కూలు తనిఖీకి వస్తే...మా స్కూల్‌ను బోర్డ్‌ఆఫ్ ఎడ్యుకేషన్ ఆమోదం పొందిన స్కూళ్ల జాబితాలో చేర్చడానికి ఇష్టపడరు.

స్పెల్లింగ్‌లు, భిన్నాలు, క్రమశిక్షణలకు సంబంధించి మాత్రమే ఇన్‌స్పెక్టర్ తనిఖీ చేయగలడు. నెలరోజుల క్రితం నా స్కూలు అడ్రస్ గురించి వాకబు చేసిన బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు ఒక టీచర్ ఏమని జవాబు రాశాడంటే..."ఈ స్కూలు డిపార్ట్‌మెంట్ జాబితాలో లేదు. ఈ స్కూలు గురించి మీకు ఎటువంటి సమాచారం ఇవ్వలేం." బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు సమ్మర్ హిల్ గురించి తెలియదని చెప్పడమంటే, నేను మోసం చేస్తున్నట్టుగా కనిపించవచ్చు. కాని బోర్డ్‌కు నా స్కూలు గురించి తెలియకపోవడమే మంచిదనిపిస్తుంది.

యువ టీచర్లూ ముందుకు సాగండి. మీ స్వేచ్ఛ కోసం, ఆత్మ గౌరవం కోసం పోరాడండి. మీరు స్కూల్ ఇన్‌స్పెక్టర్లను వదిలించుకోకపోతే మీరు బానిసలుగా, అల్పులుగా మిగిలిపోతారు. బోధనా పద్ధతులలో ప్రభుత్వ జోక్యాన్ని నిరోధించండి. క్లాసులో రూమ్‌లో ఎదురయ్యే మానసిక సమస్యల పరిష్కారానికి అవసరమైన సహాయం అందజేయ వలసిందిగా కోరండి. స్కూల్ సబ్జెక్ట్స్ ఏ విధంగా బోధించాలో చెప్పడానికి స్కూల్ ఇన్‌స్పెక్టర్ల అవసరం ఉండదు.

మరి మందగొడి టీచర్ మాటేమిటని సందేహం వ్యక్తమయ్యే అవకాశం ఉంది. గ్రామీణ పాఠశాలల్లో మంచి టీచర్ ఉండకపోవచ్చు. అతను క్రమశిక్షణకు సంబంధించి మందగొడి కావచ్చు. పాఠాలు చెప్పడంలో విసుగెత్తించవచ్చు. స్కూలు ఇన్‌స్పెక్టర్ల వ్యవస్థ లేకపోతే ఆ గ్రామంలోని పిల్లల అభివృద్ధి కుంటుపడవచ్చు. నేను ఒకసారి మూడు మైళ్ల దూరంలో ఉన్న రెండు స్కూళ్లను చూశాను. ఒక గ్రామంలో మంచి టీచర్, మరో గ్రామంలో చెడ్డ టీచర్ ఉండేవారు. ఆ రెండు స్కూళ్ల పిల్లల అభివృద్ధిలో తేడాలున్నట్టు నాకు ఎటువంటి ఆధారాలు లభించలేదు. అయినప్పటికీ చెడు టీచర్‌కన్నా మంచి టీచర్ ఉండడమే అవసరం. అయితే చెడు బోధనను సరిదిద్దడానికి ఇన్‌స్పెక్షన్ సరైన విధానం కాదు. టీచర్ల సమూహం యావత్తూ కలిసి రూపొందించే సామాజిక అంతరాత్మ ఈ పరిస్థితిని సరిదిద్ద గలుగుతుంది. ఇంకా చెప్పాలంటే విద్యలోని ఇతి వృత్తంలో విప్లవాత్మక మార్పు రావాలి. విద్యను సృజనాత్మకంగా రూపొందిస్తే సృజనాత్మకత కలిగిన స్త్రీ, పురుషులు ఈ వృత్తిలోకి ఆకర్షితులవుతారు. ఈ రోజున విద్యారంగం మందగొడులను మాత్రమే ఆకర్షిస్తున్నది. ఈ విద్యారంగంలో పని మందగొడులకు మాత్రమే తగినట్టుగా ఉంది.

విద్యలో కావలసిందేమంటే టీచర్ వ్యక్తిత్వం. స్కూళ్లలో మంచిగాని చెడుగాని జరగాలంటే టీచర్ల వ్యక్తిత్వమే ప్రధాన భూమిక పోషిస్తుంది. టీచర్ ప్రేమను లేదా ద్వేషం లేదా భయాన్ని పిల్లలకు సంక్రమింపజేయవచ్చు. కాని బోధనా వృత్తిని అల్పంగా పరిగణించినంత కాలం టీచర్ పిల్లలకు భయాన్ని మాత్రమే అంటగట్టగలిగే ప్రమాదం ఉంది. అథమస్థాయిలో ఉన్నవారు పైవారి గురించి భయపడుతుండడమే దీనికి కారణం.



హెడ్‌మాస్టర్, ఇన్‌స్పెక్టర్, స్థానికాధికారి వీరందరినుంచి టీచర్‌ను భయం వెన్నాడుతూనే ఉంటుంది. తమకన్నా అల్పులైన వారు అంటే పిల్లలపై టీచర్లు ఈ భయాన్ని రుద్దుతారు. పైవారి అధికారానికి లోబడినంతకాలం టీచర్లు తమ వ్యక్తిత్వం నుంచి పిల్లలకు మంచిని అందజేయలేరు. ప్రతి స్కూలుకు తప్పనిసరిగా ఉండవలసిన ఆదర్శమేమంటే-భయానికి చోటులేకుండా చేయడం. ఎందుకంటే భయం అనేది జీవితానికి ప్రమాదకరమైనశాపం. భయంలేని వ్యక్తిమాత్రమే భయానికి చోటు లేకుండా చేయగలుగుతాడు. అందువల్ల టీచర్ల జీవితంలోకి భయం ప్రవేశపెట్టే అన్నిరకాల శక్తులను టీచర్లు వృత్తిపరంగా ఎదుర్కోవాలి. ఇన్‌స్పెక్టర్‌కు వ్యతిరేకంగా సాగే టీచర్ల పోరాటంతో పాటు ఉద్యోగస్వామ్యానికి (bureaucracy) కి కూడా వ్యతిరేకంగా పోరాటం సాగించాలి. విద్యను ఉపాధ్యాయులే సంఘాలుగా ఏర్పడి నిర్వహించుకోవాలి. పాతతరం టీచర్ల భావాలకు వ్యతిరేకంగా ఓటు చేయాలి. పిల్లల తల్లిదండ్రులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేయడానికి సంఘం అవకాశం కల్పించాలి. వీరికి టీచర్లు తగిన మద్దతు ఇచ్చి, వారి ఆలోచనల్లో మార్పు తేవడానికి కృషిచేయాలి.

ఇంత సుదీర్ఘమైన అధ్యక్షోపన్యాసం తరువాత నాకు మళ్లీ అధ్యక్షోపన్యాసం ఇవ్వడానికి అవకాశం ఉండదని నా భయం. మానసిక రుగ్మతలున్న టీచర్ గురించి రాయడానికి ప్రయత్నిస్తూ నేను అతని గురించి పూర్తిగా మరచిపోయినట్టున్నాను. విస్తృతమైన విద్యావ్యవస్థలోని సమస్యలను ప్రస్తావించడంతో రుగ్మతలున్న టీచర్ సమస్య అంత ప్రాధాన్యం లేనిదిగా తయారైంది. స్కూళ్లలో రుగ్మతలు కొనసాగినంత కాలం రుగ్మతలున్న టీచర్లు కూడా తప్పనిసరిగా ఉంటారని తెలియజెప్పడానికి నేను ప్రయత్నించాను. అదే సమయంలో టీచర్ వృత్తిలో పనిచేస్తున్న నిజాయితీ పరులందరినీ నేను అభినందిస్తున్నాను. అయితే యువతరం టీచర్లు విద్యావ్యవస్థలోని లోపాలు, వ్యర్థమైన అంశాల గురించి అప్రమత్తంగా ఉంటున్నారు. చీకటిలో వెలుగును చూడడానికి ప్రయత్నిస్తున్నారు. పిల్లలకోసం తాము చేయవలసినదంతా చేయడానికి సన్నద్ధ మవుతున్నారు. వారికి అంతులేని ఇబ్బందులున్నాయి. తమను చుట్టుకొని ఉన్న సూత్రాలు, నమ్మకాలు పాతబడి పోయాయని వారు గుర్తించగలుగుతున్నారు. తాము వేసే ముందడుగులకు వృద్ధులు అడ్డం పడుతున్నారని కూడా వారు గ్రహించ గలుగుతున్నారు. వీటికంటే దారుణమేమంటే తాముచేస్తున్న కృషి ఫలితాలను పెట్టుబడిదారీ యంత్రంలో వృధా పోతున్నాయని కూడా వారికి తెలుస్తున్నది. ఏది ఏమైనప్పటికీ కూర్చొని రాబోయే సోషలిజం కోసం ఎదురుచూడడం పిచ్చివాళ్లు చేసేపని. కొత్తతరం టీచర్లు చేతులు ముడుచుకొని కూర్చోకుండా కృషి ప్రారంభించడం నాకు సంతోషంగా ఉంది. సమస్యలున్న సమాజం అన్ని సమస్యలకు కారణమని యువతరం స్పష్టంగా చూడగలుగుతున్నది.

# 14. స్వేచ్ఛ-భావి ప్రపంచం

టీచర్లను నూతనోద్యమంలో పాల్గొనవలసిందిగా కోరుతూ రూపొందిన రేఖామాత్రపు ప్రణాళికలో ఈ పుస్తకం ముగించాలని నేను కోరుకుంటున్నాను. ఈ పుస్తకం రాస్తున్నపుడు..."రాయడంతో సరిపోదు. ఏదైనా చేయలేనా?" అని నన్ను నేను ప్రశ్నించుకుంటూనే ఉన్నాను. అందువల్ల ఈ వేసవిలో (1939లో) ఈస్ట్ ఆంగ్లియన్ టీచర్స్‌ను సమ్మర్‌హిల్‌లో సభకు ఆహ్వానించాను. దాదాపు 60 మంది హాజరయ్యారు. విద్యలో తమ ప్రయోజనాలకు, కార్యకలాపాలకు పిల్లల మనస్తత్వ శాస్త్రాన్ని కేంద్ర బిందువుగా చేయడానికి టీచర్లు గ్రూపుగా ఏర్పడాలని వారికి సూచించాను. ఒక కమిటీ ఏర్పాటుచేసి, సమావేశాలు ఏర్పాటు చేయాలని కూడా భావించాం. ఇంతలో రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. నూతనోద్యమానికి ఆదిలోనే హంసపాదు పడింది. పెట్రోలు లేకుండా దూరప్రాంతపు టీచర్లు సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం కష్టమైంది. యుద్ధం కోసం పని చేయవలసి రావడంతో టీచర్లు ఇతర అంశాల గురించి ఆలోచించవలసిన పరిస్థితి ఏర్పడింది.

నేను ఏర్పాటు చేసిన చిన్న సమావేశం నాలో భిన్నమైన ఆలోచనలు మిగిల్చింది. టీచర్లకు మనస్తత్వ శాస్త్ర అధ్యయనం తప్పనిసరి చేయాలని కొద్దిమంది నిజంగానే కోరుకున్నారు. అయితే సమావేశానికి హాజరైన టీచర్లలో ఎక్కువమంది స్కూలు సబ్జెక్ట్‌లకు, క్రమశిక్షణకు మొగ్గు చూపారు. మరికొద్దిమంది ప్రస్తుతం స్కూల్లో పరిస్థితుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశం సాగుతున్నపుడు నేను తీవ్రమైన నిరాశావాదంలో కూరుకుపోయాను. కొంతమంది టీచర్లు నాకు అర్థంకాని భాషలో మాట్లాడుతున్నారని నాకనిపించింది. విద్యలో ప్రాముఖ్యంలేని విషయాల గురించి వారు పట్టుపడుతున్నారు. ఇంతలో ఒకాయన లేచి టీచింగ్ కూడా కార్లతయారీ మాదిరిగానే పెద్ద ఎత్తున ఉత్పత్తి చేసే ప్రక్రియ అని ప్రకటించాడు. నాలో కొత్త ఆలోచనలు రేకెత్తాయి. వారి ఆలోచనలు కర్మాగారం గోడలకు కన్వేయర్ బెల్ట్ (పిల్లలు) కు పరిమితమయ్యాయని, విషయాలను లోతుగా పరిశీలించే శక్తి కోల్పోయారని నాకనిపించింది. క్లాసు రూమ్ దాటి ఆలోచించలేక పోతున్నారని, కారు మెకానిక్ మాదిరిగానే తాము పని చేస్తామని అనుకుంటున్నట్టు నేను గ్రహించాను. అంతేకాదు. ఒక హెడ్‌మాస్టర్ చెప్పినట్టు..."మా కౌంటీలో ప్రమోషన్ పొందాలంటే ప్రగతికాని, కల్పనాశక్తి గాని చూపనవసరం లేదు. అన్నిటికి అవునని తలూపేవారికే ప్రమోషన్ వస్తుంది."

రుగ్మతలు కేవలం టీచర్‌కే కాదు, స్కూలుకు కూడా రుగ్మతలున్నాయని ఈ



సమావేశం తరువాత నాకు స్పష్టమైంది. స్కూలు భవనాలు టీచర్ ఆలోచనా దృక్పథాన్ని నాశనం చేస్తున్నాయి. విద్యార్థులు కూడా ఇదే పరిస్థితిలో పడుతున్నారు. సమావేశం ముగిసి, మామూలు విషయాలు మాట్లాడుకుంటున్నపుడు కూడా అనేకమంది టీచర్లు పదే పదే ఇన్‌స్పెక్షన్ గురించి ప్రస్తావించారు. వారిలో ఇన్‌స్పెక్టర్ పట్ల భయం స్పష్టంగా కనిపించింది. వారు మార్పు పట్ల తీవ్రమైన భయం వ్యక్తం చేశారు. ప్రస్తుత వ్యవస్థలో అధికారం పట్ల ఎటువంటి భయం చోటు చేసుకుంటున్నదో అదే భయం వారు వ్యక్తం చేశారు. నేను అంచనా వేసిన విధంగా తిరుగుబాటుదారులు లేనందువల్ల నేను అసంతృప్తికి గురికాలేదు. వారిలో ఎక్కువమంది పైపై సంస్కరణలు కోరుతున్నారు. కాని మౌలిక అంశాలను పట్టించుకోవడం లేదు. నాకు ఈ విధంగా అరవాలనిపించింది...."పిల్లల స్వభావం మౌలికమైనది. క్లాసులో విద్యార్థుల సంఖ్య గురించి సిలబస్ గురించి జరిగే చర్చకు అర్థం లేదు."

ప్రస్తుత ప్రపంచ యుద్ధ వాతావరణంలో మౌలిక అంశాల గురించి చర్చ మరింత దూరం జరిగి పోయింది. టీచర్లు యుద్ధం వల్ల వేరే ప్రాంతాలలో స్కూళ్లు నిర్వహిస్తున్నందువల్ల, పిల్లల మనస్తత్వశాస్త్రంపై దృష్టి కేంద్రీకరించడం సాధ్యంకాని వాతావరణం నెలకొంది. నేను కూడా పిల్లల మనస్తత్వ శాస్త్రం కంటే కూడా వారి భద్రతకు ప్రాధాన్యం ఇవ్వవలసిన పరిస్థితిలో పడ్డాను. ఈ రోజున టామీ ఎందుకు దొంగతనం చేస్తున్నాడన్నదానికంటే యుద్ధం నుంచి రక్షణకు ఏర్పాటుచేసిన షెల్టర్‌లు సరిగా ఉన్నాయా? లేదా? అనేది చూసుకోవలసిన అవసరం ఎక్కువగా ఉంది. అంటే యుద్ధం కారణంగా వ్యక్తి శ్రేయస్సు కన్నా, సామాజిక శ్రేయస్సుకు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వవలసి వస్తున్నది. ఈ పరిస్థితులలో విద్య గురించి ఆలోచించడం కూడా కష్టమవుతున్నది. ఈ యుద్ధం కారణంగా టీచర్లకు ప్రాముఖ్యం లేకపోవడమనేది నాకు మరింత స్పష్టంగా అర్థమైంది. ఈ యుద్ధానికి ఇంతకు ముందు జరిగిన మొదటి ప్రపంచ యుద్ధానికి మధ్య చాలా తేడా ఉంది. మొదటి ప్రపంచ యుద్ధంలో దేశ దురభిమానం (Jingoism) వంటి అంశాలు చోటు చేసుకున్నాయి. ఈ యుద్ధంలో హిట్లర్‌వాదం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తొందరలోనే ఇతర అంశాలపట్ల కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తారు. ఈ యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు రావడం ఖాయం. కమ్యూనిస్టులను ఓడించడానికి బయలుదేరిన జర్మనీ ఓటమిపాలు కావడం ఇంగ్లాండ్‌లో ఒక బలమైన పార్టీకి ఇష్టం లేదు. పైకి చూడడానికి ఈ యుద్ధం ప్రజాస్వామ్యానికి నాజీజానికి మధ్య జరుగుతున్నట్టు కనిపిస్తుంది. తరచిచూచినపుడు ఇది పాత వ్యవస్థకు ప్రజలకు మధ్య జరుగుతున్న యుద్ధం. పాత వ్యవస్థకు మద్ధతు ఇచ్చేవారే యుద్ధం నడిపిస్తున్నారు. సైన్యాధికారులలో, పౌర పాలనలో బోర్డు స్కూలు నుంచి వచ్చిన వారెవరూ లేరు. ఒక

పని యువకుడైన ప్లంబర్‌కు అప్పగించడంకంటే పాత వ్యవస్థను సమర్థించే స్కూల్‌నుంచి వచ్చిన వారికి అప్పగించడం మంచిదని మనం ఇంకా నమ్ముతున్నాం. వర్గం ఇంకా యుద్ధంతో ప్రభావితం కాలేదు. ఇది వర్గం సాగించే యుద్ధం. ధనం, అధికారం గుప్పెట్లో పెట్టుకున్న వర్గం వీలైనంత కాలం యుద్ధాన్ని కూడా తన గుప్పెట్లోనే ఉంచుకుంటుంది. శాంతి ఆలస్యమైనకొద్దీ పాలకవర్గంపై ద్వేషం పెరుగుతుంది. ఈ ద్వేషం తగినంతగా పెరిగితే విప్లవం వచ్చే అవకాశం ఉంది.

అందువల్ల టీచర్లు భవిష్యత్తును ఊహించి యుద్ధ ఫలితాలను అంచనా వేయాలని నా అభిప్రాయం. మనుషుల లక్ష్యాలను దెబ్బతీయకుండా ఆ మనుషులను హతమార్చడం సాధ్యం కాదు. పేలుడు శక్తి పెద్దదైతే అది ఆస్తులనే కాకుండా ఇతర అంశాలను కూడా ధ్వంసం చేస్తుంది.

స్వేచ్ఛగా పెరిగిన పిల్లలు నూతన నాగరికతలో బాగా ఇమిడి పోతారు. ఈ సందర్భంగా పొరపాటు అభిప్రాయాలు వ్యక్తంచేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఈరోజు నాకొక స్నేహితురాలి నుంచి జాబు వచ్చింది. ఆమెకు వామపక్ష భావాలు లేవు. “యుద్ధంలో ఖాళీ చేయించిన మురికివాడకు చెందిన ఒక తల్లిని పిల్లలను మాతోపాటు ఉంచారు. ఆమె నిజంగా భయంకరమైనది. తన గదిని పందులదొడ్డి మాదిరిగా చేసింది. తన పిల్లలకు ఏ విధంగా తిండి పెట్టాలో ఆమెకు తెలియదు. ఏమాత్రం తగని వ్యక్తి. నువ్వేమో ప్రజలు నిర్వహించుకునే ప్రపంచం గురించి మాట్లాడుతున్నావు.” నా స్నేహితురాలు తెలివైనది. అయితే ఆమెకు ముందుగా ఏర్పడిన అభిప్రాయాల కారణంగా మురికివాడకు చెందిన తల్లిపట్ల సరైన అవగాహన లేకుండా పోయింది. ఆ తల్లి సొంత ఇంట్లో తగిన ఆదాయంతో పెరిగితే ఆమెకు కూడా పరిశుభ్రత, ఆహారం గురించి సరైన ఆలోచనలే ఉండేవని నా స్నేహితురాలు గ్రహించలేకపోయింది. పరిసరాలే అన్నీ నిర్ణయించలేవు. కానీ పరిస్థితులలో ఎక్కువ భాగం ఇవే ఉంటాయి. కానీ మనలో చాలామందికి పేదల పట్ల దురభిప్రాయమే ఉంటున్నది.

కానీ భవిష్యత్తులో మురికివాడలతో పాటు మురికివాడల ధోరణి కూడా అదృశ్యమవుతుంది. ప్రజల అవసరాలు తీరుతుంటే వారు అక్రమాలకు పాల్పడనవసరం లేదు. ఇది చాలా ప్రాథమిక విషయం. కానీ ఎక్కువమంది మానవ నైజంలో మార్పు ఉండదని వాదిస్తుంటారు.

వాస్తవమేమంటే మానవనైజం అంటే ఏమిటో ఎవరికీ తెలియదు. కొన్ని పరిస్థితులలో అది చాలా క్రూరంగా ఉంటుంది. మరికొన్ని పరిస్థితులలో ఎంతో దయతో కూడుకొని ఉంటుంది. మత్స్యకారుల గ్రామం గురించి నేనొక కథ విన్నాను. ఆ గ్రామం తీవ్రమైన బాంబుదాడికి గురైంది. బాంబులు వేసిన వారిలో ఇద్దరు సముద్రంలో దొరికారు.



ఒకరు తనను తానే తుపాకితో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రెండో వ్యక్తిని మత్స్యకారులు కమ్మరి దుకాణానికి లాక్కువెళ్లి కాల్చిన ఇనుప చువ్వలతో వాతలు పెట్టి దారుణంగా చంపారు. నేను ఇది వాస్తవమేనని నమ్ముతున్నాను. మరి ఇక్కడ మానవత్వం ఏమైంది? సాధారణంగా మత్స్యకారులు శాంతస్వభావంతో దయకలిగి ఉంటారు. కాని తమ ఇళ్లు, కుటుంబాలు నాశనం కావడం చూసి అనాగరికులుగా మారిపోయారు. మనం ఇటువంటి పని చేయబోమని అనుకుంటాం. పైలెట్లు పై అధికారుల ఆదేశాల మేరకు బాంబులు వేశారని మనం గ్రహించగలుగుతాం. అయితే ఇటువంటి పరిస్థితులు ఎదురైతే మనం ఏ విధంగా ప్రవర్తిస్తామన్నది ఎవరూ చెప్పలేరు.

ఈ ఉదాహరణలను బట్టి నేను చెప్పదలచుకున్న దేమంటే...మత్స్యకారుల మానవ నైజం క్రూరమైనదని, మురికివాడ తల్లి మురికిగా ఉంటుందని అది వారి మానవ నైజమని చెప్పడం హేతుబద్ధంగానే కనిపిస్తుంది. లేదా స్కూల్‌కు సంబంధించిన ఒక ఉదాహరణను బట్టి మనం మానవ నైజాన్ని మరింత స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. మా స్కూల్లో మానవ నైజం ఉదారంగానూ దయతోను కూడుకొని ఉన్నట్టుగా కనిపిస్తుంది. ఒక శిక్షణా నౌకలో పిల్లలు వ్యక్తం చేసిన క్రూరత్వం చూసి అది వారి సహజ మానవ నైజమని భావించవలసి వస్తుంది. భయంతోను, క్రమశిక్షణతోను పెరిగినందువల్ల పిల్లలు క్రూరంగా ఉన్నారని చెప్పవచ్చు.కాని వారు స్వేచ్ఛగా పెరిగితే వారిలో సంతోషం మంచితనం వెల్లివిరుస్తాయి.

మన పరిసరాలన్నీ పెద్ద ఎత్తున మార్పులకు లోనవుతున్నందువల్ల దీనిపై చర్చ అవసరం. రష్యన్లు పోలెండ్‌లో సోవియట్లు ఏర్పాటు చేస్తున్నారని రాత్రి రేడియో ప్రకటిస్తుంది. దోపిడికి గురవుతున్న కార్మికులు, రైతులపై ఈ చర్య ఎటువంటి ప్రభావం చూపుతుందనేది ఎవరూ చెప్పలేరు. ఏది ఏమైనప్పటికీ ఒకేసారి పరిస్థితులన్నీ పెద్ద ఎత్తున మార్పుకు లోనవుతాయి. భూస్వాములను, అధికారులను, రాచరికానికి చెందిన వారిని పెద్ద సంఖ్యలో హతమార్చడం వల్ల పోలిష్ వారి మానవనైజం క్రూరమైనదిగా కనిపిస్తుంది. కాని తరువాత వారు నూతన నాగరికతను నిర్మించడం ప్రారంభిస్తారు.

టీచర్ చేసే పని చాలా క్లిష్టమైనది. అతను భవిష్యత్తును తెలుసుకోలేడు. కానీ యథాతథ పరిస్థితులు అలాగే కొనసాగుతాయనే భావనతో విద్యాబోధన సాగిస్తే పిల్లలు నూతన ప్రపంచంలో ఇమడలేరు. వేగంగా మార్పు చెందుతున్న ప్రపంచంలో స్కూల్ బెంచ్‌లు, సబ్జెక్ట్‌లకు పరిమితమై విధేయత, క్రమశిక్షణ అమలు చేయడం సరైందికాదు. దీనికి ఒకే ఒక మార్గం ఉంది. స్వేచ్ఛ అనేది ప్రతి స్కూల్లో అమలు కావాలి. ఎందువల్లనంటే నూతన ప్రపంచం మరింత స్వేచ్ఛ కోరే అవకాశం ఉంది. స్వేచ్ఛ కలిగిన పిల్లలు మాత్రమే నూతన ప్రపంచాన్ని నిర్మించగలుగుతారు.

స్వేచ్ఛ గురించి మాట్లాడడం అంత తేలిక కాదు. స్వేచ్ఛ అంటే ఏమిటి? అని ప్రజలు కేకలు పెడతారు. బెర్లిన్‌లో అంతర్జాతీయ కార్మిక గీతం ఆలపించడానికి నాకు స్వేచ్ఛ ఉండదు. అదేవిధంగా మాస్కోలో నాజీల పాటలు పాడలేం. ఇంగ్లాండ్‌లో నా ఇష్టం వచ్చినట్టు స్కూలు నడుపుకోడానికి నాకు స్వేచ్ఛ ఉంది. కాని బహిరంగంగా దైవ దూషణ చేయడానికి లేదా సెక్స్ కథలు చెప్పడానికి నాకు స్వేచ్ఛ ఉండదు. అదేవిధంగా నగ్నంగా బజారులో తిరగడానికి కూడా నాకు స్వేచ్ఛ ఉండదు. బెర్లిన్‌లో ఎర్రజెండాపై పాటల పాడాలనుకునేవాడు పిచ్చివాడు. అదేవిధంగా ఆక్స్‌ఫర్డ్ వీధిలో అశ్లీలం మాట్లాడడం కూడా పిచ్చిపనే. స్వేచ్ఛ అనేది అంతరాత్మకు సంబంధించినది. మనం ఎవరికీ స్వేచ్ఛ ప్రసాదించలేం. ప్రజలు తమంత తాముగా ఉండడానికి మనం వదిలి పెట్టవచ్చు. అంటే స్వేచ్ఛ లేకుండా చేసే బాహ్యమైన అంశాలను తొలగించవచ్చు. కానీ ప్రజలు తమస్వేచ్ఛ తామే పొందగలగాలి. అంతరాత్మలో బానిసలైన వారు ఎన్నటికి స్వేచ్ఛ పొందలేరు. బాహ్య విషయాలలో ఎన్ని మార్పులు చేసినా ప్రయోజనం ఉండదు.

అంతరాత్మలో స్వేచ్ఛ కలిగిన తరం పిల్లలను తయారు చేయడం టీచర్ల బాధ్యత. దేని నుంచి స్వేచ్ఛ? భయం, ద్వేషం నుంచి. బాహ్య విషయాలలో మనం జోక్యం చేసుకోలేం. మనం ఎక్కడున్నామో తెలుసుకోలేం. మనం ఎక్కడున్నామో తెలుసుకోవడం కష్టమవుతుంది. రిబ్బెన్‌ట్రాప్ రెండోసారి మాస్కో సందర్శిస్తున్నాడని పోలెండ్ విభజన ఒప్పందం కుదిరిందని, రష్యా, జర్మనీల మధ్య ఆర్థిక ఒప్పందం కుదిరిందని రాత్రి రేడియోలో వార్త వెలువడింది. ఇంగ్లాండ్‌లో అనేకమంది మాదిరిగానే నేను కూడా ఆశ్చర్యపోయాను. ఇబ్బందిపడ్డాను.దీని అర్థమేమిటో నాకు తెలియదు. ఫాసిజాన్ని నిలవరించడానికే రష్యా ఈ విధంగా చేసిందని నా కమ్యూనిస్టు మిత్రులు అన్నారు. కానీ బ్రిటీష్, ఫ్రెంచ్ సామ్రాజ్యవాదాన్ని, పెట్టుబడిదారీ విధానాన్ని ఓడించడానికి ప్రయత్నంలో భాగంగా రష్యా ఈ విధంగా చేసి ఉండవచ్చు. బాహ్య పరిస్థితుల గురించి మనకు ఎప్పుడూ పూర్తి పరిజ్ఞానం లభించదు. బహుశా మనం పక్షపాతంతో ఒకే లక్ష్యం కోసం ఒక పక్షాన్నే సమర్థించవచ్చు. అయితే పక్షపాతం అనేది నిజమైన స్వేచ్ఛను ప్రతిబింబించదు. ఉదాహరణకు మహిళలకు ఓటుహక్కుపై పక్షపాతంతో కూడిన లక్ష్యసాధనకు ప్రయత్నించవచ్చు. కాని మహిళలకు ఓటుహక్కు రాగానే ఈ పక్షపాతానికి మనుగడ ఉండదు. వర్గరహిత సమాజం కోసం కమ్యూనిస్టులంతా ఏకమవుతారు. కాని ఈ లక్ష్యం సాధించిన తరువాత కమ్యూనిస్టులు అన్ని విషయాలలో ఒకే తీరులో ఆలోచిస్తారని ఎవరూ అనుకోరు. ప్రతిపక్షం లేనిచోట అభివృద్ధికి అవకాశం ఉండదు.

అంతరాత్మకు ఈ పరిస్థితిని అన్వయించినపుడు అది స్పష్టంగా ఉండదు. ప్రతిపక్షం బాహ్యమైన క్రమశిక్షణ తెచ్చినపుడు అది మృత్యువుకు దారి తీస్తుంది. కాని



అభివృద్ధికి కాదు. తరతరాల నుంచి విద్యావ్యవస్థ ఈ పరిస్థితిలోనే కూరుకుపోయింది. బాహ్యమైన క్రమశిక్షణ అంతరాత్మ అభివృద్ధికి దోహదం చేస్తుందని భావిస్తున్నారు. అదే విధంగా అంతశ్చేతనంలోని భావాలను తెలుసుకోకుండా చైతన్యయుతంగా చర్చికి వెళ్లి ప్రార్థనలు చేస్తున్నారు. ఇది మతం రూపంలో దాపురించిన శాపం, బాహ్యమైన నమ్మకాలు, నీతులు, చట్టాల ద్వారా ఉత్పన్నమయ్యే వత్తిడిలను తొలగించడమే అభివృద్ధి. అభివృద్ధి సాధించడమంటే భయాన్ని అధిగమించడమే. బాహ్యమైన ఒత్తిడులన్నీ చివరి ఆయుధంగా భయాన్నే ఉపయోగిస్తాయి.

భయాన్ని తొలగించడం టీచర్ల బాధ్యత. ఎందుకంటే భయం, స్వేచ్ఛ రెండూ కలిసి ఉండవు. ఇది చాలా ముఖ్యమైనది. అందువల్ల దీన్ని మరింత స్పష్టంగా వివరిస్తాను. ఒక పిల్లవాడిలో మానసిక రుగ్మతతో కూడిన భయాలను తొలగిస్తే జీవితంలో భయంతో కూడిన పరిస్థితులలో కూడా మామూలుగా వ్యవహరించ గలుగుతాడు. మరింత స్పష్టంగా చెప్పాలంటే పన్ను పీకించుకోవలసి వచ్చినపుడు అతను బాధ భరించడానికి సంసిద్ధుడవుతాడు. కాని భయపడడు. హస్తప్రయోగం చేసుకుంటే శిక్షలు వేస్తామని భయపెట్టిన పిల్లవాడి అంతశ్చేతనంలో మానసిక రుగ్మతతో కూడిన భయం చోటుచేసుకుంటుంది. పన్ను పీకడం మర్మావయవం పీకడంగా తోస్తుంది. పంటి డాక్టర్ మర్మావయం పీకే తల్లి లేదా తండ్రికి ప్రత్యామ్నాయమవుతాడు. పిల్లవాడు నానాయాగీ చేస్తాడు. ఇదేదో అస్పష్టమైన సిద్ధాంతంకాదు. పంటి డాక్టర్ అంటే భయపడే పిల్లలు అనేకమంది మర్మావయవం కత్తిరిస్తారేమోనన్న భయపడుతుంటారనేది నేను ప్రత్యక్షంగా చూశాను. ఆపరేషన్ చేయించుకోవలసి వచ్చిన పెద్దవాళ్లలో కూడా ఇటువంటి భయం ఉంటుందని గ్రహించాను.

విమానదాడి జరిగినపుడు ప్రతి ఒక్కరూ భయపడతారు. అయితే అంతశ్చేతనంలో భయాలు గూడు కట్టుకున్న వ్యక్తి విమానదాడి అనగానే తీవ్రమైన భయోత్పాతానికి లోనవుతాడు. లోపలి భయాలకు తోడు బాంబు భయం తోడైనందువల్ల ఈ విధంగా జరుగుతుంది. లోపలి భయాలు తక్కువగా ఉన్న అదృష్టవంతుడు కథా నాయకుడు కాగలుగుతాడు. యుద్ధ సమయంలోను, శాంతి సమయంలో ఇదే పరిస్థితి ఉంటుంది. లోపలి భయాలు ఎక్కువగా ఉన్న వ్యక్తి మృత్యువు అంటే భయపడినట్టుగానే జీవితమన్నా భయపడతాడు. గతంలో తండ్రి చేతిలో బాగా దెబ్బతిన్న పిల్లవాడికి నయం చేయడానికి నేను ప్రస్తుతం ప్రయత్నిస్తున్నాను. వైమానిక దాడిపట్ల అసాధారణమైన భయం వ్యక్తం చేస్తున్నాడు. ఏ రోజునైనా బాంబుదాడి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. బాంబుదాడి ప్రారంభం కాక పూర్వమే అతను జీవితం గురించి భయపడుతున్నాడు. చావుపట్ల కూడా అతనికి అంతే భయం ఉంది. జీవితంలో ఎటువంటి పని చేయడానికైనా

సరే భయపడేవాడు. నిరంతరం నేనిది చేయవచ్చా? అది చేయవచ్చా? అని ప్రశ్నించేవాడు. తనపట్ల తండ్రి ఏర్పరచుకున్న అభిప్రాయాలనే అంతశ్చేతనంగా అతను కూడా ఆమోదిస్తున్నాడు. అతను ఎందుకూ పనికిరాని వాడని తండ్రి అభిప్రాయం. జీవించడానికీ భయపడేవాడు. చావుకూ భయపడేవాడు. సమ్మర్‌హిల్ లోని స్వేచ్ఛతో ఏమి చేయాలో అతనికి పాలుపోలేదు. లోపలి భయాలు అతనిలోని సృజనాత్మక శక్తులను ధ్వంసం చేశాయి. అందువల్ల స్వేచ్ఛను ఉపయోగించు కోలేకపోయాడు. భయానికి బానిసయ్యాడు.

పిల్లలందరినీ తండ్రులు దెబ్బలు కొట్టారనడం వాస్తవం కాదు. నేనిచ్చిన ఉదాహరణ తీవ్రమైన పరిస్థితి తెలియజేస్తుంది. అయినప్పటికీ అనేకమంది పిల్లల విషయంలో ఇదే విధంగా జరుగుతున్నది. లోపలి భయాలు ఏదో ఒకరోజున బాహ్యమైన భయాలుగా రూపొందే అవకాశం ఉన్నపుడే పిల్లవాడు టీచర్‌కు గౌరవం ఇస్తాడని నేను వాదిస్తాను. అదే విధంగా దేవుడు, మృత్యువు అంటే లోపలి భయాలు ఏర్పడకుండా పిల్లలకు మతబోధ చేయడం కూడా సాధ్యం కాదని నేను స్పష్టం చేస్తున్నాను. పిల్లలపై సెక్స్‌పరమైన ఒత్తిడి సాగినపుడు తప్పని సరిగా వారిలో లక్షలాది లోపలి భయాలు చోటుచేసుకుంటాయి.

టీచర్లు విశాలమైన దృష్టి అలవరచుకోవాలి. హిట్లర్ వంటి వారు కనుమరుగై పోతారు. వారు చరిత్రలో మచ్చలుగా మిగిలిపోతారు. ఈ రోజున బ్రిటన్ ప్రధానమంత్రి ఏమి ఆలోచిస్తున్నాడు? లేదా ఏమి చేస్తున్నాడనేది? నాగరికతకు, జీవితానికి చాలా తక్కువ ప్రాముఖ్యం కలిగి ఉంటుంది. ఈ రోజున నాగరికత విపరీతమైన వేగంతో మార్పు చెందుతున్నది. రేపు మనం ప్రజాస్వామ్యయుతమైన భారతదేశాన్ని చూడవచ్చు. అదేవిధంగా చైనాను గొప్పదేశంగా చూడవచ్చు. రేపు సామ్రాజ్యవాదం కుప్పకూలి పోవచ్చు. ఈ రోజున రష్యా హఠాత్తుగా అగ్రరాజ్యంగా ముందుకు వచ్చింది. టీచర్లమైన మనం ఇసుక రేణువుల మాదిరిగా ఈ పరిణామాలను చూస్తున్నాం. బృహత్తరమైన ఈ శక్తులు మన అదుపులో లేవు. ఇవి మనకు అర్థం కావడం కూడా కష్టం. ప్రస్తుతానికి మెట్రిక్యులేషన్ పరీక్షలో ఫలితాలు సాధించడమే గొప్ప లక్ష్యంగా ఉన్నట్టు తోస్తుంది. ఎందుకంటే మెట్రిక్యులేషన్ పాసైన వారికి సైన్యంలోను, వైమానిక దళంలోను నియామకం లభించే అవకాశం ఉంది.

అయితే యుద్ధంలో పని చేయడానికి మెట్రిక్యులేషన్ పాసైనవారు కావలసి వస్తే యుద్ధం తరువాత పునర్నిర్మాణానికి ఎటువంటి విద్యార్థులు అవసరమవుతారు? అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. స్కూల్ అర్హతలకన్నా వ్యక్తిత్వం ముఖ్యమైనదని, తెలివితేటలకన్నా సాహసం ముఖ్యమైనదని, ఆదేశాలకు విధేయత చూపడం కన్నా స్ఫూర్తి అవసరమని ఈ ప్రశ్నకు జవాబు చెప్పుకోవాలి. యుద్ధం కారణంగా నెలకొన్న సంక్షోభంలో



మనం మెట్రిక్‌ను లక్ష్యంగా చేసుకోవడం విషాదభరితమైనది. ఎలిమెంటరీ, సెకండరీ పాఠశాలల్లో చదువుకున్న వేలాదిమంది విద్యార్థులున్నారు. వీరిలో నాయకత్వపు లక్షణాలు చూడడానికి దేశం సిద్ధంగా లేదు. వారు మామూలు సైనికులుగా మహా అయితే నాన్-కమిషన్డ్ ఆఫీసర్లుగా నియమితులవుతున్నారు. ప్రతిభ, సామర్థ్యం గుర్తించడానికి అవసరమైన గీటురాళ్లను ఇంగ్లాండ్ ఇప్పటి వరకు నిర్ధారించలేకపోవడం విషాదంతో కూడుకున్నది. విద్య అంటే స్కూల్లో చదువుకోవడమేనని, వ్యక్తిత్వ నిర్మాణమంటే క్రమశిక్షణేనని నమ్మడమే ఈ విషాదానికి కారణం. ఒక్క మాటలో చెప్పాలంటే మనం పొరపాటు అంశాలను నెత్తికెత్తు కుంటున్నాం. గీటురాళ్లు ఏర్పాటు చేసుకోవడంలో విఫలమయ్యామంటే దానికి వర్గ సమాజమే కారణం. పాలక వర్గానికి గీటురాళ్ల విషయంలో ఎటువంటి సందేహాలు లేవు. మంత్రులు, అధికారులు పబ్లిక్ స్కూళ్ల నుంచి, సేవకులు, పనివాళ్లు ప్రభుత్వ పాఠశాలల నుంచి వస్తారు. రేపటికి ఈ గీటురాయి పనికిరాదు. కొత్తగీటు రాళ్లు ఏర్పరచుకోవలసిందే.

అది స్కూల్ డెస్క్‌ల్లోను, స్కూలు నిర్వహించే కార్యకలాపాలలోను లభించదు. వ్యక్తిత్వంలో అది లభిస్తుంది. "వ్యక్తిత్వం రూపొందించడానికి జీవితాంతం ప్రయత్నిస్తూనే ఉన్నానని" కరడుగట్టిన టీచర్లు కేకలు పెడతారు. వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడం సాధ్యంకాదని చెప్పడం అర్థరహితం. దురదృష్టవశాత్తు వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దవచ్చు. ఉత్పత్తులు భారీ ఎత్తున చేసినట్టుగానే వ్యక్తిత్వాలను పెద్ద ఎత్తున తీర్చిదిద్దవచ్చునన్న ప్రాతిపదిక ఆధారంగా జాతీయ ప్రచార పద్ధతులను రూపొందిస్తున్నారు. క్రైస్తవ మతానికి చెంది 'సాల్వేషన్ ఆర్మీ' తన బ్రాస్ బ్యాండ్‌తో చాలాకాలం నుంచి ఈ విధానం అనుసరిస్తున్నది. ప్రచారానికి ప్రభావితం కావడమనేది మానవజాతికి దాపురించిన పెద్ద ప్రమాదం. నియంత్రిత ప్రతికార చర్య (conditioned reflex) అనేది చాలా ప్రమాదభరితమైనది.

అయితే ప్రచారం తాత్కాలిక విజయం సాధించినప్పటికీ అది అబద్ధాలను నిజాలుగా మార్చలేదన్న భావన కొంత స్వాంతన కలిగిస్తుంది. ప్రచారానికి వాస్తవం ఆధారభూతమైతే అది నిజమైన ప్రభావాన్ని చూపగలుగుతుంది. "పళ్లు ఎక్కువగా తినండి" అనే ప్రచార నినాదం పండ్ల వ్యాపారులకు లాభాలు తెచ్చిపెడుతుంది. అయితే పండ్లు నిజంగానే మేలు చేస్తాయి కనుక ఈ ప్రచారం విజయవంత మవుతుంది. వ్యక్తం చేయడానికి వీలైన భావావేశంపై ఎక్కుపెట్టిన ప్రచారం మాత్రమే విజయం సాధిస్తుంది. సహారా ఎడారిలో నివసించే వారికి స్కీయింగ్ గురించి ఉపన్యాసమివ్వడం మూర్ఖుడు చేసేపని. సామ్రాజ్యవాద ప్రతిష్ఠకు సంబంధించిన ప్రచారం భారతదేశంలో ప్రజలకు పట్టదు. ప్రచారం సాగిస్తే ప్రతికూల అంశాలకు ప్రాచుర్యం లభించే ప్రమాదం ఎప్పుడూ వెన్నాడుతూనే ఉంటుంది. ప్రచారంతో పెల్లుబికే భావావేశాలు స్థిరంగా ఒకే పక్షానికి

కట్టుబడి ఉండవు. అందువల్ల గోబెల్స్ ప్రచారం ఎల్లకాలం కావలసిన ఫలితాలనే ఇవ్వదు. ఇటలీలో బ్రౌన్‌షర్ట్స్ పేరుతో ముసోలిని ఏర్పాటు చేసిన బలగాలు రెడ్‌షర్ట్స్‌గా మారిపోతారు. యూదులకు, కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా భావావేశాలను ప్రేరేపించడం అనేది త్వరలోనే ప్రచారం చేసేవారిపై తిరగబడే అవకాశం ఉంది. ప్రజలు తమ నిజమైన శత్రువులను గుర్తించినపుడు ఇది జరుగుతుంది.

విద్యా వ్యవస్థలోని పద్ధతులకు ప్రచారాలకు మధ్య పోలికలున్న అంశాలేవీ లేవని చాలామంది తిరస్కరిస్తారు. మన స్కూళ్లలో భారీ ఎత్తున వస్తూత్పత్తి చేసినట్టు పిల్లలను తయారు చేయడం లేదని కూడా చాలామంది తిరస్కరిస్తారు. పిల్లలు విప్పారిన మనసులతో జీవితంలో ప్రవేశిస్తారని వారంటున్నారు. స్కూళ్లలో కమ్యూనిస్టులు లేదా నాజీల రాజకీయ విద్యకు అనేకమంది టీచర్లు వ్యతిరేకత చూపుతారు. కాని పిల్లలను జీవితానికి ప్రతికూలంగా తయారు చేయడాన్ని వారు గర్హించడం లేదు. నేను యుద్ధం కారణంగా స్వస్థలం నుంచి ఖాళీ చేయించిన 12 సంవత్సరాల బాలుడితో మాట్లాడాను. అతను నాపట్ల అతి మర్యాద చూపాడు. నేనంటే భయపడ్డాడు. (అతను మా తోటలో దొంగతనం చేస్తూ దొరికి పోయాడు). అతను నిజాయితీ లేకుండా తనను తాను సమర్థించుకునే పరిస్థితిలో ఉన్నాడు. అతని గురించి, అతని స్కూల్ గురించి మాటల్లోకి దింపాను. స్కూల్లో మాట్లాడితే బెత్తంతో కొడతారని చెప్పాడు. కాని అతను చెప్పినదాంట్లో నిజాయితీ లేదు. దీన్ని చూసి నేనేమీ ఆశ్చర్యపోలేదు. అతని ముసుగు వెనుక అవసరమైన విషయాలు, సంసిద్ధత, నిభిడీకృతమైన సృజనాత్మకత ఉన్నాయని నేను గ్రహించగలిగాను. చిన్న నాజీ మాదిరిగా అతను స్వేచ్ఛగా లేడు. అతను సంతోషంగా కూడా లేడు. నాజీ మాదిరిగా అతనికి ఆలంబన లేదు. అధికారంపై అస్పష్టమైన తిరుగుబాటు స్వభావం అతనిలో కనిపించింది. ఈ విధంగా కోట్లమంది పిల్లల జీవితాలకు ఆలంబన లేకుండా పోయింది. వారికి జీవితంలో అనుకూలమైన అంశాలేవీ కనపడడం లేదు. జీవితంలో వారికి ఆసరా అంటూ లేకుండా పోయింది. అతను జీవించడానికి లక్ష్యం ఏర్పాటు చేయాలని, జీవించడానికి ఆలంబన కల్పించాలని నేననడం లేదు.

అతను తనంత తానుగా లక్ష్యం ఎంచుకోడానికి వీలుగా విద్యావ్యవస్థ ఉండాలని నేను కోరుకుంటున్నాను. ఇది సాధ్యమే. కాని విద్యావిధానం ప్రస్తుతం ఉన్న తీరులోనే ఉంటే అది సాధ్యం కాదు. స్వేచ్ఛ కల్పించినపుడు ఇది సాధ్యమవుతుంది. స్వేచ్ఛ కలిగిన టీచర్లతో స్వేచ్ఛ కల్పించడం సాధ్యమవుతుంది. ఒక హెడ్మాస్టర్ మాస్కూలు సందర్శనకు వచ్చినపుడు ఒక పిల్లవాడు నన్ను "నీల్" అని సంభోదించడం విని గుండెలు బాదుకున్నాడు. అతనికిది ఊహకందనిది. పిల్లలు నన్ను పేరుతో సంబోధించడం కలలోమాట అని ఆయన చెప్పాడు. మా పిల్లవాడు స్వేచ్ఛగా ఉన్నాడు. ఆయన పిల్లవాడు



స్వేచ్ఛగా లేడు. మా పిల్లవాడికి నేనంటే భయం లేదు. ఆయన పిల్లవాడు ఆయనంటే భయపడుతున్నాడు. ఆయన పిల్లలతో ప్రతిష్ఠతో వ్యవహరిస్తాడు. నాకు అటువంటిదేమీ లేదు. విద్యలో ఇది మౌలికమైన సమస్య. స్వేచ్ఛ పట్ల నూతన దృక్పథంతో వ్యవహరించే నూతన తరం టీచర్లు ముందుకు వచ్చి, స్వేచ్ఛ ఒక్కటే సమస్యకు పరిష్కారమని తిరుగులేని నమ్మకంతో పనిచేసినపుడు పరిష్కారం లభిస్తుంది.

ప్రజాస్వామ్యం గురించి లేదా మరేదైనా తెలుసుకోవాలంటే అందులో పాల్గొనడం ద్వారా తెలుసుకోవాలి. 18 సంవత్సరాల నుంచి సమ్మర్‌హిల్‌లో ప్రజాస్వామ్యం సాగుతున్నది. మెజారిటీ నిబంధనలు ప్రకారం స్కూలు నడుస్తుంది. చట్టాలను మెజారిటీ ఓటుతో చేస్తారు. మైనారిటీ కూడా ఎల్లప్పుడు చట్టాలను ఆచరిస్తూనే ఉంది. స్కూల్ జనరల్ మీటింగ్ ఆమోదించిన నిబంధనలను అందరూ పాటించేవారు. చట్టాలు రద్దు చేయడానికి ప్రయత్నాలు జరిగేవి. అయితే చట్టాలు రద్దయ్యే వరకు పిల్లలుగాని, పెద్దలుగాని వాటిని అతిక్రమించే వారు కాదు. ఉద్యోగ స్వామ్యానికి (bureaucracy) చోటు లేనందువల్ల మా స్వయంపాలన ఘన విజయం సాధించింది. అధికారులకు వేతనం చెల్లించాలన్న ప్రతిపాదనలన్నీ వీగిపోయాయి. పదవులన్నిటిలోను స్వచ్ఛందంగా నియామకాలుండేవి. ఇప్పుడు యుద్ధం జరుగుతున్నందువల్ల తోటలో బలవంతంగా పనులు చేయించి ప్రతిఫలం చెల్లించాలని మెజారిటీ ఓటుతో నిబంధన చేశారు. మెజారిటీ ఆమోదించినందువల్ల ప్రతి విద్యార్థి తాను చేయగలిగినంత చేసేవాడు.

మా ప్రజాస్వామ్యం సులభమైనదని, స్వార్థ ప్రయోజనాలు, ఫైనాన్స్‌తో క్లిష్టం కాలేదని నాకు తెలుసు. పిల్లలకు ఆర్థిక శక్తిగాని బాధ్యతలుగాని లేని స్కూలు ప్రజాస్వామ్యం పరిమితమైనదేనని కూడా నాకు తెలుసు. అయితే వ్యక్తి స్వాతంత్ర్యమనేది, సామాజిక స్వాతంత్ర్యానికి అడ్డురాకూడదనేది గ్రహించడానికి ఈ చిన్న డెమోక్రసీలో స్ఫూర్తి లభిస్తుంది. గత శనివారం నాడు జనరల్ మీటింగ్‌లో నేను చేసిన ప్రతిపాదన, 12 సంవత్సరాల బాలుడు చేసిన ప్రతిపాదన ముందు ఓడిపోయింది. మీటింగ్‌లో పాల్గొన్న వారంతా ఆ బాలుడికే మద్దతు ఇచ్చారు. నా ప్రతిపాదన వీగిపోయింది.భయంలేని ప్రజాస్వామ్యంలో మాత్రమే ఈ విధంగా జరుగుతుంది. ఈ ప్రజాస్వామ్యంలో టీచర్లను పిల్లలు ఏ పేరుతో పిలిచినా పట్టించుకోరు.

భవిష్యత్తులో స్వేచ్ఛకోసం పిల్లలను తయారుచేయడానికి ప్రతి స్కూల్‌లోను స్వయంపాలన, స్వయం నిర్ణయాధికారం అమలు కావాలి. డేస్కూల్‌లో ఇది కష్టసాధ్యం. ఎందుకంటే ఇల్లు ప్రమేయం కూడా వస్తుంది. పిల్లలు పగలు స్వయం నిర్ణయాధికారంతోను, రాత్రిపూట ఇంటిలో క్రమశిక్షణతోను జీవించవలసి వస్తుంది. ప్రారంభంలో డే స్కూల్‌లో నేను చేసిన ప్రయోగాలలో ప్రతికూల ఫలితాలు వచ్చాయి. నాకు అప్పుడు అనుభవం

లేదు. ఈ రోజున నా ప్రజాస్వామ్య ప్రయోగానికి తల్లిదండ్రులనుంచి పూర్తిగా మద్ధతు లభిస్తున్నది.

పిల్లవాడంటే ఏమిటి? అతను స్కూల్ నుంచి ఏమి పొందాలని కోరుకుంటున్నాడు? అనే విషయాలు తెలుసుకోవాలంటే మామూలు స్కూల్ దృక్పథం నుంచి కూడా ఇటువంటి ప్రయోగం అవసరం. ఐదు సంవత్సరాల వయసు నుంచి పిల్లలు ఏమాత్రం విమర్శించకుండా స్కూల్‌ను ఆమోదించే స్థితిలో ఉండాలి. ఫలితంగా పిల్లలు ఏమి ఆలోచిస్తున్నారు? వారి భావనలు ఎలా ఉన్నాయనేది ఎవరికీ తెలియకుండా పోతున్నది. "స్కూలు గురించి పాఠాల గురించి మీరు ఏ విధంగా ఆలోచిస్తున్నారో తెలుసుకోవాలనుకుంటున్నాను. మీ ఇష్టం వచ్చినట్లు చెయ్యడానికి అవకాశం లభిస్తే మీరు అర్థమెటిక్స్, గ్రామర్ అంటే ఇష్టపడతారా?" అని ఏ టీచరైనా అడిగితే, తప్పుడు జవాబు లభిస్తుంది. టీచర్ ఏమి జవాబు కోరుకుంటున్నాడో పిల్లలు అదే జవాబిస్తారు. ఎక్కువ మంది పిల్లలు తమకు పాఠాలంటే ఇష్టమేనని అంటారు. నా దగ్గరకు వచ్చిన ప్రతి కొత్త పిల్లవాడు తనకు పాఠాలంటే ఇష్టమేనని చెబుతాడు. అయితే స్వేచ్ఛ లభించగానే వారాల తరబడి, కొన్నిసార్లు నెలల తరబడి పాఠాలకు దూరంగా ఉంటారు. పాఠాలంటే తనకు ఇష్టమేనని చెప్పినపుడు పిల్లలు కావాలని అబద్ధం చెప్పరు.

వివిధ రకాల ఒత్తిడిల కారణంగా పిల్లలు పాఠాలు తమకు ఇష్టమేనని భావించడం విషాదం. అయితే మా స్కూల్‌లో పిల్లలు తమకు పాఠాలు ఇష్టమని చెబితే వారు నిజంగానే పాఠాలంటే ఇష్టపడుతున్నారని అర్థం. అతను స్వేచ్ఛగా ఇష్టపడతాడు. నటించవలసిన అవసరం అతనికి లేదు. నిజమైన ప్రజాస్వామ్యంలో ఇది ప్రధానమైన అంశం. ఎట్టి పరిస్థితులలోను పిల్లలకు నటించవలసిన అవసరం ఉండదు. క్రమశిక్షణ అమలు చేసే స్కూళ్లలో పిల్లలు రోజంతా నటిస్తూనే ఉంటారు. పిల్లలు ఈ విధంగా నటించడాన్ని ఆత్మ గౌరవం ఉన్న టీచర్లెవరూ ఆమోదించరు. నిజమైన ప్రజాస్వామ్యం అమలులో లేకపోతే పిల్లలు తప్పనిసరిగా నటించవలసిన పరిస్థితిలో పడతారు.


బలవంతుడిదే రాజ్యం అన్న సిద్ధాంతానికి వ్యతిరేకంగా ఇంగ్లాండ్‌లో ప్రచారం కొనసాగుతున్నది. కాని మన స్కూళ్లలో నిజమైన స్వేచ్ఛ లేదు. అందువల్ల బలవంతునిదే రాజ్యం అన్న సిద్ధాంతమే అమలులో ఉంది. పిల్లవాడు 'సర్' అని అన్నపుడల్లా బలవంతుడిని సంభోదిస్తున్నట్టే లెక్క. శిక్ష అనుభవించిన బాలుడు నిరంతరం బలవంతునికి లోబడే ఉంటాడు. బలప్రయోగం అన్న ప్రక్రియను జీవితం నుంచి అంటే మనస్కూళ్లు, మన ప్రభుత్వం, మన వర్గ పాలనల నుంచి వెలివేయాలని నేను కోరుకుంటున్నాను.



సమ్మర్‌హిల్ స్కూల్ సంస్థాపకుడు ఎ.ఎస్.నీల్ తన రచనల ద్వారా అనుభవం ద్వారా పిల్లల పెంపకంలో సంచలనం రేకెత్తించారు. పిల్లల పెంపకం, విద్యపై ఆయన పలు పుస్తకాలు రాశారు. వాటిలో 'ది ప్రాబ్లమ్ టీచర్' ఒకటి. 'టీచర్లకు మానసిక రుగ్మతలుంటే...' అనే పేరుతో తెలుగులో ఈ పుస్తకాన్ని ముందుంచుతున్నాం.

టీచర్ మానసిక రుగ్మతకు లోనైనందువల్ల పిల్లలపై ఎటువంటి ప్రభావం ఉంటుంది? టీచర్ చుట్టూ ఉన్న పరిస్థితులు అతనిపై ఎటువంటి ప్రభావం చూపుతున్నాయి? విద్యావ్యవస్థ మొత్తంగా ఎటువంటి రుగ్మతలో చిక్కుకుంది? తదితర అంశాలను నీల్ ఈ పుస్తకంలో వివరించారు. పిల్లలు మనసులో భయం ప్రవేశపెట్టి తద్వారా విద్యాబోధన సాగించాలన్న అభిప్రాయాన్ని నీల్ పూర్తిగా వ్యతిరేకించారు. స్వేచ్ఛ కలిగిన పిల్లలకు నేర్చుకునే శక్తి ఎలా ఉంటుందో ఆయన అనుభవ పూర్వకంగా చూపించారు.

-డాక్టర్ సుంకర రామచంద్రరావు



శివరామయ్య పబ్లికేషన్స్